శ్రీకృష్ణశ్శరణంమమ

ఓగేటి ఇందిరాదేవి

ఓగేటి పబ్లికేషన్స్
3-6-470, పావనీ సత్యా కాంప్లెక్స్
6వ వీధి 103వ నెంబరు ప్లాటు,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 29.

శ్రీకృష్ణశ్శరణంమమ

- ఓగేటి ఇందిరాదేవి

ప్రథమ ముద్రణ : 2002

ప్రతులు: 1000

వెల: రూ. 90/-

ప్రతులకు

ఓగేటి ఇందిరాదేవి

3-6-470, పావనీ సత్యా కాంప్లెక్స్
6వ వీధి 103వ నెంబరు ప్లాటు,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 29.

విశాలాంధ్ర పబ్లికేషన్

సుల్తాన్‌బజార్, హైదరాబాద్.

నవోదయ పబ్లికేషన్

కోఠి, హైదరాబాదు

డి.టి.పి

శ్రీ దత్తసాయి గ్రాఫిక్స్

ఫోన్: 3399390

అంకితం

అంబామోహిని దేవతాత్రి భువనీ ఆనందసంధాయినీ
వాణి పల్లవపాణి వేణుమురళీగాన ప్రియాలోలినీ
కల్యాణి ఉడురాజ బింబవదనా ధూమ్రాక్షసంహారిణి
బిద్రూ పీపరదేవతాభగవతీ శ్రీరాజరాజేశ్వరి!

అఖిలాండేశ్వరి ఆదిపరాశక్తి కనకదుర్గా
స్వరూపిణి శ్రీచక్రసంచారిణి మమ్మేలు చల్లని మాతల్లి
శ్రీరాజరాజేశ్వరీ లలితాపరాభట్టారిక చరణములను

శరణు వేడుతూ ~~ఇందిరావ్యాపధారకు~~ సమర్పించుకుంటున్నాను పసిపిల్లల
తొక్కు పలుకులు కన్నతల్లి కెప్పుడూ ముద్దే కదా-

శ్రీకృష్ణశ్శరణంమమ

లీలానాటక సూత్రధారి, భారత భాగవత పారిజాతాపహరణాది కథా పాత్రధారి శ్రీకృష్ణ భగవానుడు సాక్షాత్మదనకోటి సౌందర్యభావుడు. ఆయన త్యాగానికి ఉదాహరణ. రాజనీతికి పరాకాష్ఠ. ఆయన కర్మయోగానికి ఆదర్శం - విజ్ఞానానికి అగ్రాసనం - బోధనలో జగద్గురువు. ఉత్తమ శిష్యుడు గొప్ప స్నేహితుడు. వినయమూర్తి అయిన పరమాత్మ. ఆయన మురళీనాద తరంగాలు ఎందరో కవులకు స్ఫూర్తిదాతలు - ఆయన కడగంటి చూపులు ఎందరో కళాకారులకు ప్రోత్సాహకాలు - ఆయన లలిత మందహాసం ఎందరో భక్తులకు జీవాధారం - ఆయన ఓడిస్తే మధురం. ఆయన నవ్వితే మధురం - ఆయన సర్వం మధురమయం-

మధురాధిపతే రఖిలం మధురం-

కృష్ణమూర్తి వేణునాదానికి కాళింది పులకరించి తన తరంగాలతో ఆయనను మౌనంగా కీర్తించింది కాదా?

మనిషిగా పుట్టి నేనెందుకు స్వామిని గురించి నవలా రూపంలో స్తుతించ కూడదు? అనుకున్నానుగానీ పన్నెండు రోజుల్లో తన కథ తానే నా చేత్తో వ్రాయించు కున్నాడా గోపాల చక్రవర్తి. అసలు నేను ఏ పుస్తకాలనైనా రిఫర్ చేశానా? కథా కథన పద్ధతిని ప్లాన్ చేశానా? లేదే- ఆరోగ్యం చేత అర్భకురాలినైన నా చేతకలం పట్టించి ప్రభువు తానే ఈ పుస్తకం వ్రాయించాడు. ఇప్పుడు కూడా ఉపేక్షిత ఆర్త వనితలని ఉద్ధరించవస్తాడా నా తండ్రి రావాల్సిన అవసర సమయమిది-

మహాకవులు పురుష సింహుల్ని వర్ణిస్తూ ముఖ్య స్త్రీలను కూడా వివరించటం తగ్గించారు. ద్వాపర యుగంలోని తన ఆర్తవనితా రక్షణ పరాయణత్వాన్ని నాకలంలోంచీ తనే చెప్పాడు. ఈ కలియుగానికెరుక పడాలని గాబోలు- నేను స్త్రీనని గాబోలు నవనీతచోరుడు నా చేత రాయించాడు దీన్ని ద్రౌపదిని, సుశీలని... ఎందరు స్త్రీలని

తను ఆదుకున్నాడో చెప్పించటానికి నేను పాత్రమనైనాను. పిచ్చి అడవి వెదురు కఱ్ఱకి బాధలూ, పరీక్షలూ, కన్నీళ్లూ అనే గాయాలు చేసి మోహన రాగాలు పలికించగలిగే మహాగాయకుడికి ఏది అసాధ్యం? ఈ యదు భూషణుడు, ఈ శిఖిపింఛమౌళి, ఆర్తుల పాలిట అభయ వరదాత, ఈ కర్మయోగి నాచేత ఈ పుస్తకం వ్రాయించు కున్నాడు గదా- నా భవబంధాలు నశింపజేసి శాశ్వతమైన పునరావృత్తి రహితమైన, మహర్షులకు సాధ్యమైన మోక్షస్థితి నాకు కల్పిస్తాడా? ఇంత చిన్న పుస్తకానికి ఎంత కోరిక కోరుతున్నాను- ఇంత ఆశించతగునా? ఈ నందగోకుల విహారికి రుక్మిణీ మనస్సాయికి కోపం వస్తే- ఉహూ- స్వామి కరుణాళువు. అందుకే ఇలా ప్రార్థిస్తుంటాను.

నీ పాద కమల సేవయు
నీపాదార్చకుల తోడినెయ్యము నితాం
తాపార భూతదయయును
తాపసమందార! నాకు దయసేయగదే

తిక్కనగారన్నట్లు డింభకుడిలా సాధ్యాసాధ్యాలు తెలుసుకోకుండా స్వామిని మోక్షం అడుగుతున్నాను. మంకుపట్టు పట్టే బిడ్డను విసుక్కోకుండా ఆయన నాభవ లతలు త్రుంపుతాడనే నమ్ముతున్నాను. జగన్నాథస్వామీ! నయనపథగామీ! భవతుమే- ఆసులో గొట్టంలాగా ఇంక ఈ కర్మబంధాల మధ్య, ఈర్ష్యాసూయల మధ్య నేను తిరగలేను. ప్రభూ! నాకు వేదాంతం, ధ్యానం, యోగం, దానం, ఉపవాసాది నిష్ఠలూ ఏవీ లేవు. ఏవీ తెలియదు. నాకు తెలిసినది ఒక్క నువ్వున్నావనే సంగతే నీరజాక్షా!

ఎందరో మహా కవులు నిన్ను మధుర మధురంగా సేవించి, అక్షరబద్ధం చేసి ధన్యులైనారు. మహాసింధువులాంటి వారి ముందు నేనొక బిందువును మాత్రమే- ఏం వ్రాయించుకున్నావో ఏమో నువ్వు నాకలాన, నా ఊహలో నిలిచి అప్పుడు స్పృహలో లేనాయె- మళ్లీ పుస్తకం ముద్రించుకున్న తరువాతే చదువుతాను. శంతన పుత్రుడిలాగా విదురుడిలాగా కుంతీదేవిలా, ద్రౌపదీదేవిలాగా నిన్ను మనసా ప్రార్థించుటయొక్కటే నాకు చేతనైనపని-

శరణా గతుండ భక్తుడ
పరమ పదవిఁ గోరెదను శుభంబుగ నన్నుం
బరికించి ఏది మేల

య్యిరవు దొరకొనంగ దలపవే కమలాక్షా - అన్న భీష్ముడిలాగా అంతా నీ యిష్టానికే వదిలేస్తున్నాను. కానీ ప్రార్థన మటుకు మానను. ఏడు వారాల నగలూ, మణిమాణిక్యములూ, కార్లూ, అనవసరపు బిరుదులూ, మహా భవనాలూ, వాటిద్వారా వచ్చే దురహంకారమూ ఇవ్వేవీ నాకు వద్దు లక్ష్మీశ్వరా! గ్రాసవాసో దైన్యంబులు బొరయకుండా మటుకు కాపాడు తండ్రీ! దేవకీ కుమారా! యశోదానందనా! ఈ 'శ్రీకృష్ణశ్శరణం మమ' చదివిన పాఠకులను కూడా సర్వదా కాపాడు కల్యాణ గుణగణా! తెలుగు ప్రజలు మళ్లీ మంచి తెలుగు పుస్తకాలు చదివి పరభాషా వ్యామోహాన్ని వదిలి స్వదేశీ సంస్కృతిని అవలంబించేటట్లు అనుగ్రహించు కరుణామయా!

ఇంక- బుద్ధియును ప్రాణమును నిన్నుబొరయజేయ
జాలు భక్తినాకొసగుము జలధి శయన
పూర్వకర్మఫలంబులు పొందుగాక
యవి ఋణంబులు గడతేరుటయా సుఖింతు
యోగీంద్ర చేతస్సరోహంస, భావనాతీత, కల్యాణ
నానాగుణ శ్రీ సముద్భాసుతాంగా మముం కేవలంబైన
కారుణ్యదృష్టిన్ కటాక్షించి వీక్షించు లక్ష్మీమనోవల్లభా!
దేవదేవా! నమస్తే నమస్తే నమః లలనాజనాపాంగ లలిత
సుమచాప! తలపులోపల మెలగు తత్త్వప్రదీప! మాకు చేరు వచిత్తరువు
లోని శ్రీనివాసుడా! వేణుగానలోలుడా నినుగన వేయి కన్నులు చాలునా?
అంతరాత్మలన్నీ నీకు అవగతమే కదా ఇంక భారమంతా నీదే స్వామీ
ఇందిరా మందిరా! భక్తసుందర హృదయారవిందా!-దయాసాంద్రా! నమోస్తు

కృతజ్ఞతలు

ప్రాణిక్ హీలింగ్ గురువుగారు డా. స్వర్ణమాలగారికి కృతజ్ఞతలు.

నాకు తోటికోడలేగాక రేకీ గురువుగారైన శ్రీమతి శకుంతలా శర్మగారికి మరీ మరీ కృతజ్ఞతలు - మానసిక వైద్యులు మధుసూదన్ జోషి గారికి మంత్ర శాస్త్రవేత్త (పెదగంజాం) శ్రీ వేమూరి నరసింహశాస్త్రిగారికీ, అద్దంకి కృష్ణమూర్తిగారికీ ముఖ్యంగా సికిందరాబాద్ రాంగోపాల్‌పేట్ డాక్టరు జగన్నాధరావుగారి సూచనల ననుసరించి మొదట్లోనూ తర్వాత స్వంతంగానూ వైద్యం (హోమియోపతి) చేస్తున్న శ్రీ మల్లికార్జునరావుగారికి పదే పదే కృతజ్ఞతలు. శ్రీ కృష్ణస్వామి గణేశన్‌గారి మార్గదర్శకత్వం నాకు శ్రీరామరక్ష.

సతతం నా మేలుకోరి ప్రోత్సహించే డా. అనంతలక్ష్మికీ, అహల్యకీ, సీతకీ, పద్మకీ, డా. రుక్మిణీదేవికీ, నీరజగారికి ఇంకెందరికో ఎందరికో మహానుభావులకి అందరికీ సహస్రాధిక వందనములు. నేను రచనలు ప్రారంభించి యాభై ఏళ్లయింది. స్వర్ణోత్సవ సందర్భంగా ఈ పుస్తకాలు వెలువరిస్తున్నాను. షేక్ మహమ్మద్ రఫీ(వార్త)గారికి కృతజ్ఞతలు. చి. శాంతిప్రియకీ, చి. శ్రీధర్‌కీ, ఆంధ్రవ్యాస శ్రీఎలూరిపాటి అనంతరామయ్య గారికి కూడా కృతజ్ఞతలు.

ఉట్టికి ఆరు చేర్లూ తెగి ఇంకొక చేరు సగం సగం తెగీ తెగకుండా వేళ్లాడుతున్నాను. ధైర్యం చేసి పుస్తకాలన్నీ ముద్రించుకుంటున్నాను. భారతీయ ఆంధ్ర సాహితీ సంప్రదాయ సంస్కృతులకు నేను సమర్పించే ఈ నీరాజనం మీకనులకూ కర్పూరకాంతి అని మీరు అంటే అనుకుంటే చాలు. ధన్యురాల్ని. కృతజ్ఞురాల్ని.

రచయిత్రి

ఓగేటి ఇందిరాదేవి

శ్రీకృష్ణశ్శరణం మమ

పాంచాలరాజు అంతఃపురం చాలా సందడిగా వుంది. అటూ ఇటూ కోలాహలంగా తిరుగుతున్న చెలికత్తెలు ఏదో ఆలోచిస్తున్న ద్రుపదరాజకన్యక చుట్టూ చేరారు.

"రాజకుమారీ! ఏమిటమ్మా ఆపరధ్యానం?" అని అడిగింది మంచారిక.

"నువ్వుండవే మందారీ! నీకసలు మతిలేదు. అమ్మాయిగారిది పరధ్యానంకాదు వరధ్యానం" అన్నది సునంద-

"పరధ్యానమూ కాదు వరధ్యానమూ కాదు ద్రౌపదీ దేవిది నరధ్యానం" అన్నది మంజుల.

"నరధ్యానమా? ఔనౌను పాండవమధ్యముడూ గాండీవధరుడూ, సేంద్రచాప శంపారుచి మేఘమో అన్నట్లు మెరయువాడూ, అసితోత్పలవర్ణుడూ అయిన అర్జున కుమారుడి ధ్యానం ఈ స్వయంవర సమయంలో సమంజసమేగదా" అన్నది మల్లిక.

"ష్! గోలచెయ్యకండి కృష్ణాకన్యక చారెడేసి కళ్ళల్లో నీలిమేఘాలు తారట్లాడు తుంటే కనిపించటంలేదూ - కాస్త మీ పరిహాసాలు ఆపండి" అని విసుక్కుంది మందారిక.

"ఆ కట్టివాడు సవ్యసాచి వచ్చి మన రాకుమారి విశాల నయనాల్లో తిష్ఠ వేశాడు గావును" అన్నది మంజుల.

"నోరుమూసుకుని అందరూ అవతలికి వెళ్ళండి స్వయంవరోత్సవానికి ఇంకా పూలమాలలు కావాలిట. మాటలు చాలించి ఆ మందిరంలో గంపలకొద్దీ పువ్వులున్నాయి. దండలుకట్టండి మీతోబాటు మరో రెండువందలమంది స్త్రీలనుకూడా తీసుకువెళ్ళండి" అని కోప్పడి అందర్నీ అక్కడ్నించి పంపించేసింది రాజకుమారి ముఖ్యపరిచారిక మందారిక.

తను మెల్లగా పాంచాలిని సమీపించింది. అనునయంగా ఆమె భుజంమీద చెయ్యివేసింది. ద్రౌపది కళ్ళనించీ రెండు కన్నీటి బొట్లు రాలాయి.

"సరే! ఇందాకటి నీలిమేఘాలకీ మాత్రం వర్షం తప్పనిసరే. కాబోయే పెళ్ళి కూతురు కలల్లో తేలిపోవాలిగాని ఇలా.." మందారిక మేలమాడబోయింది.

"కలలుకాదు మందారికా! మనసంతా కలవరంగా అయోమయంగా వుందే" ద్రౌపది గద్గదికంగా అన్నది. "అగ్నిలోనించి సముద్భవించిన యాజ్ఞసేనికింతబేలతనం పనికిరాదు. పార్థులు లక్కయింటి అగ్ని ప్రమాదం తప్పించుకుని మారువేషాలతో సంచరిస్తూ సుఖులై వున్నారని మనగూఢచారులు ఖచ్చితమైన సమాచారం అందించారుగా. రేపు స్వయంవరంలో మత్స్యయంత్రం ఎందుకు ఏర్పాటు చేశారనుకుంటున్నారు? పాండవుల్ని పట్టుకోవడానికే" అంది మందారిక.

మొహం చిట్లించింది యాజ్ఞసేని.

"పాండవులందరూ పడగొడతారా ఏం మత్స్యయంత్రాన్ని?" అన్నది.

"క్ష...క్షమించండమ్మా? ఏదో మాటవరసకన్నాను. మత్స్యయంత్రాన్ని పడగొట్టగలిగే మహావీరుడు ఫల్గుణకుమారుడొక్కడే అని ప్రపంచమంతటికీ తెలుసు తల్లీ! అప్పుడు ఆయన గారితో పాటు మిగిలిన పాండవులూ బయట పడతారులే అని అన్నానమ్మా అంతే అంతే..." గాభరాపడింది మందారిక.

"పోనీగాని...అర్జున కుమారుడికి నేను నచ్చుతానంటావా?" చిరుసిగ్గూ అలజడీ దోబూచులాడగా అడిగింది ద్రౌపది.

"యావద్భారతదేశంలో నీవంటి మహాసౌందర్యవతి లేదని చెప్తూంటే మళ్ళీ ఇదేమి అనుమానమమ్మా రాకుమారీ! అర్జునుడికి నువ్వు నచ్చకపోవటం అన్నమాటే అసమంజసంగా వుంది. ఒక్కరోజు ఓపికపట్టు. నీకే తెలుస్తుంది నా మాటలో నిజం. దా...నీ స్వయంవరమహోత్సవానికి ఎంత అద్భుతమైన ఏర్పాట్లు చేస్తున్నారో చూద్దాం పద మేడమీదనించి. నాన్నగారి సూచనల ప్రకారం కుల పురోహితుల్ని దగ్గరుంచుకొని

మీ అన్నగారు యువరాజు దృష్టద్యుమ్నులు చకచకా పనులు చేయించేస్తున్నారు. శిల్పులు తమ చాతుర్యమంతా వెల్లివిరిసేటట్లు మత్స్యయంత్రాన్ని అమరుస్తున్నారు. ఆ హడావుడి చూసి తీరవలసిందే కానీ చెప్పనలవికాదు" అన్నది మందారిక.

"ఛీ....పో...నాకు సిగ్గు" దోసిట్లో మొహందాచుకుంది కృష్ణ- మొహం వంచిందేమో వంకీలవాలుజడ మెలికలు తిరుగుతూ ముందుకు పడింది.

"అబ్బ ఈ జుట్టు చాలమ్మా! పార్థుణ్ణి మోహ ప్రలోభంలోకట్టివేసేందుకు! ఇంత అందమైన కేశవైభవం ఎక్కడా వుండదు. ఔనుగాని ఇప్పుడు నా దగ్గిర సిగ్గుపడుతున్నావుగాని రేపు వరమాల పట్టుకుని నుంచోవూ"

"నీ అల్లరికి అంతులేకుండా పోతున్నది మందారీ! నన్ను వర్ణించటంతప్ప నీకేం పనిలేదా ఇవ్వాళ. యావత్ భారతదేశంలోనే నా అంత సుందరిలేదనే అతిశయోక్తుల్ని ఎలా నమ్మను? విదర్భపురాధీశ్వరుడైన భీష్మక మహారాజు తనయ రుక్మిణీ దేవి దివ్య సౌందర్యం జగత్రసిద్ధంకదా! శమంతకమణిని సాధించుకుంటున్న సత్రాజిత్తు పుత్రిక సత్యభామ రూపసంపద పేరెన్నికగనలేదా? దేవకీ వసుదేవసంజాత శ్రీకృష్ణ బలరాముల గారాబు చెలియలు అయిన సుభద్ర ఆకార సంపద కూడా పొగడ దగిందేనుట. రాకుమారి భానుమతి అందచందాల్లో మేటి అంటారు" అన్నది పాంచాలి.

"ఆ రుక్మిణి అందం నీతో చాలితే చాలవచ్చునేమోగాని సత్యభామా సుభద్రా ఇంకా నాగ్నజితీ, లక్షణా, సుదంతా మొదలైన రాజకన్యలు చాకచక్యంలో మటుకేమితో పోలగలరనుకుంటున్నాను. అన్నట్టు రేపు స్వయంవర సమయంలో నువ్వు ధరించవలసిన వస్త్రాలు ఆభరణాలు, పుష్పాలు, సుగంధ ద్రవ్యాలు, వెరసి అన్ని అలంకారాలూ ఏరి పరిశీలించి సిద్ధంగా వుంచమన్నారు మహారాణిగారు. పొద్దున్నే నలుగుపెట్టి అభ్యంగస్నానం చేయించాలి తల్లీ నీకు. ఉప్పొంగే అలలలాంటి నీ కురులకు సాంబ్రాణి ధూపంతో తడియార్చటమే పెద్దపని తర్వాత చిక్కుతీసి కొత్తరకంగా నీ శిరోజాలు అమర్చాలి. ఆ పని గనక విజయవంతంగా ముగిసినా ఇంక మిగిలిన అలంకారాదులు

తెలికే. కాస్త ఆ సిగ్గు వదిలిపెట్టి స్వయంవరస్థలం చూద్దువుగానిరా'' అంటూ ద్రుపదరాజ పుత్రిక చెయ్యి పట్టుకుని భవనాగ్రభాగానికి తీసుకెళ్ళింది మందారిక.

సువిశాలమైన భూభాగాన్ని మిట్టపల్లాలూ, రాళ్ళూ రప్పలూ లేకుండా చదునుచేసి దట్టంగా కలయంపి చల్లారు. మధ్య మధ్యలో అందంగా రూపొందించిన స్తంభాలు. స్తంభాల పైభాగాన్ని కలుపుతూ పూల మాలలు చుడుతున్నారు. మధ్యలో మత్స్యయంత్రం అమరుస్తున్నారు. అక్కడి స్తంభాల నగిషీలు వర్ణింపనలవికావటల్లేదు. ఎడనెడ పన్నీరు చిలికించి వచ్చిన రాజకుమారులకు ప్రేక్షకులకు ఉల్లాసం కలిగించటానికి నియుక్తులైవున్నారు కొందరు పరిచారికలు. చుట్టూ గుండ్రంగా ఆసనాలు ఏర్పరిచారు. ద్రౌపది అన్న అయిన దుష్టద్యుమ్నుడూ మిగతా నలుగురు సోదరులూ కూడా పెద్ద ఎత్తున జరుగుతున్న ఏర్పాట్లను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. ద్రౌపదీ స్వయంవర వైభవాన్ని కలకాలమూ గాథలుగా చెప్పుకోవాలని వారి కోరిక.

"యాజ్ఞసేనీ! వరమాల ధరించి నువ్వు నిలవాల్సిన చోటు అల్లక్కడ. మహారాజా మహారాణీ నీకు కాస్త దగ్గిరగా ఇటువేపు ఉపవిష్టులవుతారు. ఆ పక్కన దుష్టద్యుమ్నులవారు'' అని వివరించి చెప్పింది సఖి మందారిక.

మంజుల వచ్చి "రాజకుమారిని కలుసుకోవటానికి రుక్మిణీ భానుమతీ అనే ఇద్దరు రాజకన్యలు వచ్చారు. ఎక్కడ కూర్చోపెట్టనూ?'' అని అడిగింది.

"ఇక్కడికే రమ్మను వారికి తగిన మర్యాదలు చేసి తీసుకురా మంజులా!'' అని ఆదేశించింది కృష్ణ.

కిలకిలలాడుతూ వచ్చారు ఆ కన్యలు- కృష్ణవర్ణంలో వుండి ఊహించలేనంత సౌందర్యంతో మెరిసిపోతున్న ద్రుపదరాజకన్యక వారికెంతో నచ్చింది.

సువర్ణ ఛాయలో సాత్వికత అంతా ముద్దకట్టినట్లున్న రుక్మిణీదేవి రూపాన్ని విస్ఫారిత నేత్రాలతో తిలకించింది కృష్ణ. మెత్తని పట్టుకుచ్చులాంటి తలకట్టు నుదుట మటుకు వంకీలు తిరిగి ఆ దేవి మేలిమి బంగరు స్వరూపానికి తగినట్లు తీర్చాడు బ్రహ్మ అనుకున్నారు ద్రౌపదీ మందారికా మనస్సుల్లోనే-

భానుమతి సౌందర్యం చురకత్తిలాంటిది- కృష్ణ నీలకాంతికీ రుక్మిణి హొరంగు రంగుకీ మధ్యగా ఆమె శరీరం లేత చామన ఛాయలో మెరుపు లీనుతున్నది. మరీ పెద్దవీ చిన్నవీ కాని కోలకళ్ళు, సూటిగా ఏర్పడిన నాసికా, పల్చని చెంపలు, చిన్న నోరు, సన్నగా సుడి తిరిగిన వత్తైన పొట్టి శిరోజాలూ, ఏదో వినూత్న ఆకర్షణ భానుమతిలో. భానుమతిని చూసి ముచ్చటపడటం రుక్మిణి యెడ గౌరవం కలగటంతో పదిక్షణాలకు తేరుకుంది ద్రౌపది. సాదరంగా వారినాహ్వానించి ఇద్దరి బుజాలమీద చేతులవేసి మంజుల అమర్చిన ఆసనాలపై కూర్చోబెట్టింది.

"ఇప్పుడే మీగురించి ప్రస్తావన వచ్చింది. మీరూ వచ్చారు. మీకు దీర్ఘాయుష్షు" అన్నది.

"ఔనా? దీర్ఘాయుష్షుదేనికిగాని మా గురించి ప్రస్తావన వచ్చిందా?" అని ఆశ్చర్యపోయారు వాళ్ళు. భానుమతీరుక్మిణీ కూడా పక్కపక్క మందిరాల్లోనే విడిది చేయటంవల్ల అర్ధఘడియకు ముందే మొదటిసారి కలుసుకుని పరిచయాలు చేసుకున్నారు. వారి తండ్రులు ద్రౌపదీ స్వయంవర సందర్భానార్థం వస్తూ కుమార్తెలను కూడా సరదాగా తీసుకువచ్చారు. అక్కడికి చాలా మంది రాజకుమారులు వస్తారు. పెళ్ళి కావలసిన తమ కుమార్తెలకు మంచి వరుళ్ళు దొరకవచ్చుననే ఊహ ప్రచ్ఛన్నంగా వుంది వారికి.

తండ్రులతో చెప్పి 'కాబోయే వధువును చూసి వస్తాం' అని బయల్దేరారు భానూ రుక్మిణీ.

అప్పుడే దుష్టద్యుమ్నుడితో మాట్లాడటానికి అటుగా వస్తున్న చేది దేశపు యువరాజు శిశుపాలుడు పచ్చగా మోహనాకారంతో మెరిసిపోతున్న ఒప్పులకుప్పను చూసి మనసు పారేసుకున్నాడు.

దుష్టద్యుమ్నుడు నవ్వి "బావుంది మిత్రమా! వచ్చిందేమో మా చెల్లెలి స్వయంవరానికా? ఇష్టపడిందేమో భీష్మక తనూజాతనా?" అని ఆటపట్టించాడు.

"అంటే ఆ మెరుపుతీగ భీష్మకుని రాగాలపట్టి రుక్మి రుక్మధర రుక్మబాహు రుక్మకేశ రుక్మనేత్రులను నేవురకుం ముద్దుల చెల్లెలైన రుక్మిణీదేవియా! ఈ స్వయం వరం కాగానే రుక్మిగారికి వర్తమానం పంపించాలి తనకి రుక్మిణి నిచ్చి వివాహం చెయ్యమని భీష్మకుడు పెద్దవాడైపోయినాడు. రాజ్యంపెత్తనమంతా రుక్మిదే. ఆహాఁ ఈ అన్నులమిన్న ఎన్నడు నా కన్నుల వెన్నె అవుతుందో" అనుకున్నాడు.

వంచిన తల ఎత్తకుండా ద్రౌపది అంతఃపురానికేతెంచిన ఆ కన్నె మిన్నలు శిశుపాలుడిని గమనించనేలేదు. రుక్మిణీ పాంచాలీ భానుమతీ మనసులు విప్పి మాట్లాడుకున్నారావేళ. ఎప్పుడూ బందీల్లాగా అంతఃపురంలో మగ్గుతుండే పుత్రికలని ఇట్లా బయటికి తీసుకొచ్చి ఇతర రాజకన్యలతో కలిసే అవకాశం కల్పించిన తండ్రులకి మనసులోనే కృతజ్ఞతలర్పించుకున్నారు రుక్మిణీ భానుమతీ.

ముగ్గరూ అభిరుచులు కలబోసుకున్నారు. రుక్మిణి వీణ వాయించింది. తను రచించిన కవిత్వం వినిపించింది.

భానుమతి రాజనీతి నేర్చుకున్నాననీ మీదు మిక్కిలి కరవాట విద్యలోనూ చిత్ర లేఖనంలోనూ ప్రావీణ్యం సంపాదించానని చెప్పింది.

నువ్వేం విద్యలు నేర్చుకున్నావని వాళ్ళిద్దరూ ద్రౌపది నడిగేరు.

ద్రౌపది సన్నగా సిగ్గు పడింది.

"ఏమిటమ్మాయి! కొంపదీసి ధనుర్విద్యగాని నేర్చుకోలేదు గదా" అని పరిహాసమాడింది రుక్మిణి.

"అరే మా చెలి ధనుర్విద్య నేర్చుకున్నదని మీకెట్లా తెలిసింది!" అన్నది మందారిక.

"స్వయంవర స్థలంలో మత్స్యయంత్రంచూసి" అన్నది భానుమతి.

"విపత్కర పరిస్థితులెదురైనప్పుడు స్త్రీలకు ఆత్మరక్షణకోసం కరవాట విద్య అక్కరకొస్తుందని నేర్చుకున్నానుగాని యుద్ధవిద్యలంటేనే ఎక్కువ యిష్టం నాకూనూ" అంది భానుమతి.

మరునాడు.

స్వయంవరంలో

సందర్శనోత్సాహంతో విచ్చేసిన బ్రాహ్మణ సమూహం మధ్యలోనించీ ఒక యువకుడు లేచి మత్స్యయంత్రాన్ని ఛేదించాడు.

ఇందరు క్షత్రియుల్ని కాదని కేవలం మత్స్యయంత్రాన్ని పడగొట్టాడని ఆ బీద బాపడికిచ్చి ద్రౌపది వివాహం చేస్తారా? మేము ఒప్పుకోం అన్నారు రాజులు ఆవేశంగా.

బ్రాహ్మలందరికీ కోపం వచ్చింది.

"అలాగేం మీ క్షాత్రమంతా మత్స్యయంత్రాన్ని పడగొట్టడంలో చూపిస్తే పోయేది గదా?" అన్నారు.

"ఆఁ మమ్మల్ని ఆక్షేపిస్తారా?" అంటూ పోట్లాటకి దిగారు రాజులు.

బ్రాహ్మలు తమ బుడ్డి చెంబుల్ని ఉత్తరీయాలకి బిగించి ఎదుర్కొన్నారు.

ఈ హడావుడిలో దూరంనించీ చూస్తున్న రుక్మిణికి లీలగా ఒక యువకుడు కనబడ్డాడు. అతనికి కిరీటానికి నెమలి పింఛం శోభనిస్తోంది.

అతడే నా కృష్ణుడు.చిన్న నాటినుండీ తన కలలచెలికాడు అనుకుంటూ సరిగ్గా మటుకు చూడలేకపోయింది. రుక్మిణి బ్రాహ్మలూ రాజుల సంఘర్షణలో ఎవరో ఒకరు అడ్డం వస్తూనే వున్నారు. ఆ నీల మేఘశ్యాముడు కనబడకుండాను.

భానుమతి దుర్యోధనుడిని చూసి ముగ్ధురాలైంది. ఓహో ఏం రాచఠీవి! ఎంత బలవంతుడు! ఇతడా మత్స్యయంత్రం జోలికెళ్ళకుండా తనకోసమే ఆగిపోయినా బావుండును. లేక ఓడిపోయినా సరే అనుకుంది.

ఇంతలో భటులు వచ్చి స్త్రీలనందర్నీ అంతఃపురాల్లోకి తీసుకెళ్ళిపోయారు.

... ...

కుంతి ఆందోళన అధికమైపోతోంది. దుర్యోధనుడు మాయోపాయంతో లక్కయింట్లో తమని వుంచి కాల్చేయదలిస్తే ఎలాగో బయటపడి బ్రాహ్మణ వేషాలతో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు తాము. మహావీరులైన తన పిల్లలకీ గతి పట్టించాడు దుర్యోధనుడు. హుఁ ఇప్పటికైనా పాండవులను గుర్తు పడితే బతక నియ్యడు. పొద్దుననగా భిక్షాటనకి వెళ్ళిన పిల్లలు సాయంకాలమైనా ఇంకా రాలేదంటే ఏదో జరిగి వుండాలి.

పాండు మహారాజు పట్టమహిషి కుంతీదేవి ఆ పూరింట్లో గోడకు చేరగిల బడింది నిస్సహాయంగా.

వాకిట్లో ఏదో కలకలం వెంటనే ధర్మరాజు లోపలికి వచ్చి 'అమ్మా వచ్చేశాం మంచి భిక్షతెచ్చాం' అన్నాడు "అలాగా నాయనా! మీ అయిదుగురూ పంచుకోండి" యధాప్రకారంగా అన్నదామె.

వాకిట్లో నిలబడివున్న యాజ్ఞసేనికి ఒళ్ళు జలదరించింది, ఇదేమిటి? ఈయన ఇట్లా అన్నాడు! ఆవిడ ఆ మాట అనటమేమిటి? అయోమయమై పోతోందామెకి మత్స్యయంత్రాన్ని ఒక బ్రాహ్మడు ఛేదించటమేమిటి? అని ఆశ్చర్యపోతోందామె.

"అమ్మా! పంచుకోవడానికి నిజం భిక్షకాదు ద్రౌపది" అన్నాడు భీముడు.

భీముడొక్కడికే హిడింబతో వివాహమైందిగాని మిలిగిన నలుగురూ అవివాహితులే అప్పటికి.

కుంతి గాభరాగా బయటికొచ్చింది.

ద్రౌపదిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంది. "ఏది ఏమైనా నా మాట వృథా కాదు కారాదు. మీ అయిదుగురూ ఈమెను పెళ్ళాడవలసిందే" అన్నది. ద్రౌపది అభిప్రాయం అడిగేదెవరక్కడ?

తర్వాత వేదవ్యాసుడు వచ్చాడు. ద్రౌపది పూర్వజన్మ కథలు చెప్పాడు.

అంటే అర్జునుడే తనను గెల్చుకున్నాడు. ఆ మాట ఒక్కటే ద్రౌపదికి ఆనందమైంది. ఇహ నిర్లిప్తంగా వుండిపోయింది.

శ్రీకృష్ణుడు కూడా వచ్చాడు. ద్రౌపదిని "చెల్లీ!" అని సంబోధించాడు.

ఆమె కన్నీళ్ళ మధ్య ఆయన అభయహస్తం కనిపించింది. పూర్వజన్మలో భర్త లభించక తపస్సు చేసిందా తను?

భగవంతుడు ప్రత్యక్షమై ఏం కావాలని అడిగితే పతి- పతి- పతి- పతి- పతి అని అయిదుసార్లు అన్నదా? అంటే మటుకు? అయిదుగురు భర్తల్ని అదీ తర్వాతి ఈ జన్మలో ఇచ్చాడా దేవుడు?

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోయింది యాజ్ఞసేని. ఇందుకా యజ్ఞగుండంలోనించీ జన్మించింది! తన తండ్రి ద్రుపదుడు అర్జునుడికి భార్య కాదగిన కుమార్తె కోసమూ, ద్రోణాచార్యులను జయించగల్గిన కుమారుడి కోసమూ కదా యజ్ఞం చేసింది. పవిత్రాతి పవిత్రమైన అగ్నినుంచీ ఆయా ప్రయోజనాల నిమిత్తం కదా తామిద్దరూ పుట్టారు! మరి ఇప్పుడిదంతా ఏమిటి? పెద్ద పెద్ద నెరిసిన గడ్డాలున్న ఈ మహర్షులు ఎంతగా సమర్థించినా తన అంతరంగం ఒప్పుకోవటం లేదే" అని తల్లడిల్లిపోయింది.

తోడుగా వచ్చిన మందారిక చేతనైనంత వరకూ ఓదార్చింది. ఆ పిల్లా చిన్నదేపాపం.

2

తర్వాత ద్రుపదుడు కూతుర్ని ఇంటికి తీసుకెళ్ళి పాండవ వివాహానికి ముహూర్తం పెట్టించాడు.

'వాళ్ళంటే పోనీ పరులు. తండ్రి అయినా తన ఉద్దేశం అడగలేదేమా' అని అన్నహారాలు మాని శోకిస్తున్నది ద్రుపదపుత్రిక.

అప్పుడు వచ్చాడు శ్రీకృష్ణుడు కన్యాంతఃపురానికి "అన్నా! దుఃఖార్తురాలైన పాంచాలిని పరామర్శించటానికి వచ్చావా అంటూ గోడు గోడున విలపించింది ద్రౌపది. అన్నా! ఈ పెళ్ళికి ముహూర్తమేమిటి? ముహూర్తమంటే క్షణమని కదా అర్థం. మొదట ధర్మజుడికి పెళ్ళి చేసి మళ్ళీ భీముడికీ తర్వాత పార్థుడికీ తర్వాత కవలలకూ నన్ను ధారపోస్తారా? పైగా ప్రతిసారీ నన్ను కన్యను చేస్తారా మంత్రాలతో? ఇదెట్లా కుదురుతుంది" అంటూ- అంతలో ద్రౌపది తల్లి వచ్చింది. తను కడుపు నకనక పోయినా వరమున కన్నబిడ్డ కృష్ణ ఆ పిల్లకింతకష్టమా? ఇంత పరీక్షా అని కుమిలిపోతున్నదామె కూడా.

"నాయనా! కృష్ణా! నీ మహిమలు కథలు కథలుగా చెప్పుకుంటుంటే విన్నాను. నువ్వు భగవంతుడివంటున్నారు ప్రజలు. ఈ పెళ్ళి ఏమిటి తండ్రీ! మొదట ధర్మజుడి భార్యగా ఒక సంవత్సరం వుండాలా నా చిట్టితల్లి. అప్పుడు మిగిలిన నలుగుర్నీ మరుదులుగా చూడాలా? భీముడి అంతఃపురంలో వున్నప్పుడు ధర్మరాజు బావగారూను మిలిగిన ముగ్గురూ మరుదులూనా? సహదేవుడింట వున్నప్పుడు నలుగరు పాండవులూ బావగార్లా? అలా అనే చేసుకోవాలా? ఎలా అనుకుంటారు? మనస్సనేది మన చెప్పుచేతుల్లో వుండి మనం అనేసుకోమన్నట్లు అనేసుకుంటుందా? పిల్లలు పుడితే, గర్భవతిగా వున్నప్పుడు ఎవరింటవుండాలి పసిపిల్లలున్నప్పుడు ఎక్కడుండాలి. ఇదొక పెద్ద విషమ సమస్య. ఆడది తప్ప అర్థం చేసుకోలేని సమస్య. ఎవ్వరితోనూ చెప్పుకోలేని మాటలన్నీ నీతో చెప్పుకుంటున్నాను తండ్రీ! మీ అమ్మదేవకి చిన్నప్పుడు నాకు బాగా తెలుసు. తన సహనం నీలోనూ వుందని విన్నాను. నన్ను అపార్థం చేసుకోకుండా విను. ఇప్పుడు ధర్మరాజు అంతఃపురంలో నివసించటం మొదలు పెడితే సహదేవుడి అంతఃపురానికి వెళ్ళాలంటే అయిదేళ్ళు పడుతుంది కదా. అన్యోన్యంగా వున్న అన్నదమ్ములు భార్య కారణంగా పరస్పరం ద్వేషించుకుంటుండే ప్రమాదం లేదా?

ఎలా చూసినా పాండవులు తమ పత్ని అయిన ద్రౌపది కోసం నాలుగు సంవత్సరాలు వేచి వుండ వలసిందే, పాపం. కాసేపు భార్యగా కాసేపు వదినగానో

మరదలిగానో అగ్నిసాక్షిగా వివాహమాడిన ద్రౌపదిని పాండవులు మటుకు ఎలా చూడగలరు? ఆ పుట్టబోయే పిల్లల విషయమే నాకు అంతుబట్టకుండా వుంది. ఆ పిల్లలు ఎన్ని అవమానాల్ని ఎదుర్కోవాలో నా బిడ్డ ఎన్ని అవమానాల్ని భరించాలో చివరికి ఇది ఎలా పరిణమిస్తుందో? నాయనా! గోపాలకృష్ణా! దేవకీ నందనా! పురుషుల ముందు మాట్లాడదగని అంశాలను నీ ముందు మాట్లాడాను. క్షమించు!"

ధారాపాతంగా కన్నీరు వర్షిస్తూ తన సందేహాలన్నీ కృష్ణుడి ముందు బయటపెట్టింది ద్రుపదుని భార్య.

"పిన్నమ్మా! సకల దేశమూ ద్రౌపదీ కల్యాణాన్ని గురించి కలవరపడుతున్నది. నీవలెనే భావిస్తున్నది. మా అమ్మ కుంతీ దేవి నీ స్నేహం గురించి ప్రస్తావించి ఇక్కడ మీరంతా ఎంత అతలాకుతలమై పోతున్నారోనని నన్ను పంపించింది.

ముందు మీకూ మా సోదరి ద్రౌపదికీ ఒక రహస్యం చెప్తాను. ఈ వివాహంవల్ల పాండవులూ ద్రౌపదీ చాలా సమస్యల్ని ఎదుర్కోవాల్సి రావచ్చు. ఈ విధి లిఖితాన్ని ఎవ్వరూ తప్పించలేరు. తప్పించుకోవాలని ద్రౌపదీ చూడకూడదు. అందుకే త్రికాలజ్ఞులూ శమదమాదినియమగరిష్ఠులూ లోకహితైషులూ అయిన వేదవ్యాసాది మహర్షులు కూడా ఈ వివాహాన్ని సమర్థిస్తున్నారు. విశ్వశ్రేయస్సు కోసం వారంతా ప్రోత్సహిస్తున్నారు. ద్వాపరం అంతం కావస్తున్నది మరి..." అన్నాడు కృష్ణుడు.

ద్రౌపదికీ, ఆమె తల్లికీ కృష్ణుడి మాటలు ఆశ్చర్యం కలిగించినై. ఒకానొక ధైర్యం వెన్నుతట్టినట్లైంది. ఇదా కృష్ణ భాషణంలోని మహత్తు! అది మత్తో గమ్మత్తో ఎదుటివారు వశులై పోవలసిందే" అనుకున్నారు. వారి దుఃఖం కొంత ఉపశమించిందని గమనించి లీలామానుష విగ్రహుడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

యాజ్ఞసేని ఫల్గుణుడి కోసమే జన్మించింది. ఆమె స్వయంవరంలో మత్స్య యంత్రాన్ని ఫల్గుణుడే ఛేదించాడు. తర్వాత వేరే కారణాలవల్ల పెద్దల నిర్ణయం మారింది. ఎలాగూ విధి నిబద్ధింపబడే వుందనుకోండి. భరతఖండంలోనే ద్రౌపదీ వివాహం విరుద్ధ సంఘటన.

"అమ్మాయి కృష్ణా! ధర్మరాజుకానీ భీమసేనుడు కానీ నకుల సహదేవులు కానీ ఎవరు నీ మందిరానికి వచ్చినా అర్జునుడిలాగే నీకు కనబడతారు. నీ అంత రంగంలో నువ్వు అక్షరాలా అర్జున ధర్మపత్నివే. అయిదుగురికి భార్యనైనానన్న మనఃక్లేశం నీకుండదు. ఉండకుండా నేను చూస్తాను ద్వాపరంలో జన్మించి ఈ భారం నెత్తికెత్తు కున్నానుగా మరి. నీ వల్లనా అవతార ప్రయోజనం నెరవేరబోతున్నది ఇదంతా స్త్రీ కారణంగానే జరగవలసివున్నది. అందుకు ప్రతి ఫలంగా నీకు నిరంతరం అర్జున సాన్నిహిత్యం ఒసగుతున్నాను. పాండవపట్ట మహిషివనే గౌరవం ఎలాగూ వుంటుంది. పాండవుల మధ్యగానీ నీకు జన్మించబోయే పిల్లల మధ్యగాని ఏ విధమైన స్పర్థవుండదు. ముఖ్యంగా నువ్వు ముత్తైదువగానే మహాప్రస్థానం చేస్తావు" అని అభయమిచ్చాడు వాసుదేవుడు.

"జగన్నాటక సూత్రధారీ! అన్నా శ్రీకృష్ణా! ధన్యురాల్ని. నువ్విచ్చిన వరాలతోపాటు ఇంకోవరం కోరుకోనా?" అని అడుగుతూ ఆయన పాదాలపై వ్రాలింది ద్రౌపది.

ఆమెను లేవనెత్తి 'తప్పకుండా కోరుకో సోదరీ!' అన్నాడు నందనందనుడు.

"ఇకనించీ నా జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వస్తాయో క్లిష్ట సమయాలు వస్తాయో? ఎన్ని అవమానాలు ఎదర్కోవలసి వస్తుందో అన్నా గోపాలదేవా! అలాంటి పరిస్థితులన్నిటా నువ్వే నన్ను కాపాడాలి" అంటూ మళ్ళీ చేతులు జోడించి ప్రార్థించింది యాజ్ఞసేని.

"అమ్మా! ఈ వరం నన్నడగాలా? అడగక్కర్లేదు. నాకు తెలుసు. నేను సర్వావస్థల్లోనూ నీ యోగక్షేమాలు వహిస్తాను. సరేనా?" అన్నాడు ~~కోకిలా~~ సుతుడు ఆర్ద్రంగా. "ఇంకో మాట ఇప్పుడు జరిగిన మన సంభాషణ యావత్తూ వేదవ్యాసుడికి సైతం తెలీకుండా చేశాను మన ముగ్గురికీ తప్ప ఇంకెవ్వరికీ తెలియకూడదు సుమా!" అని గట్టిగా హెచ్చరించి వెళ్ళిపోయాడు కృష్ణుడు అక్కడ్నించీ మళ్ళీ వెనక్కి వచ్చి పాండవులు వేరే స్త్రీలను కూడా పెళ్ళాడతారులే' 'అని చెప్పాడు.

అప్పుడు మ్రోగాయి ద్రౌపదీ కల్యాణ మంగళవాద్యాలు ఉత్సాహంగా

. . . .

అతనెంత అందగాడు. క్షణకాలంలో కనిపించి మాయమైనాడు. ఆ నెమలి పింఛంవల్ల గుర్తుపట్టి అదృష్టవంతురాలినైనాను. చిన్నప్పట్నించీ కృష్ణుడికి మీ అమ్మాయి నియ్యండి చూడ చక్కని ఈడూ జోడూ అవుతారు. అని తండ్రితో చాలామంది చెప్పారు. చూద్దాం, చూద్దాం అంటూ దాటవేస్తున్నారు తల్లీదండ్రీ. ఎందుకంటే పెద్దన్న రుక్మికి కృష్ణుడంటే ఇష్టం లేదు. అతని మాట వీళ్లు దాటలేరు.

ఇంతదాకావినుకలి ప్రేమ. ఇప్పుడు కనుకలిప్రేమ. ఒకక్షణం చూడనుకూడా చూసిందిగదా ప్చ్....

బిలబిల్లాడుతూ వచ్చారు చెలులు.

"రాజకుమారీ! ఏమిటి చెక్కిట చెయ్యి చేర్చి ఆలోచిస్తున్నారు? చేది దేశపు యువరాజు శిశుపాలుడితో తమ వివాహం నిశ్చయించారట అన్నగారు. ఈ మంగళవార్త వినపడిందా? మా రుక్మిణమ్మ పెళ్ళి కూతురాయేనే ...శిశు...

"ఛీ..నోరుముయ్యండి...పిచ్చిపాటలూ మీరూ ఇంకెప్పుడూ ఆ శిశుపాలుడి పేరు నా దగ్గర ఎత్తకండి. పొండి. నేనీ పెళ్ళి చేసుకోను" అని వాళ్ళమీద కోప్పడి ఏడుస్తూ వుండిపోయింది రుక్మిణి.

చెలికత్తెలు పరిగెత్తుకెళ్ళి రుక్మిణి ~~తల్లిని పిలుచు~~కొచ్చారు.

"నా బంగారు తల్లి రుక్మిణి ఏడవడమా? అల్లారుముద్దుగా చూసుకునే అమ్మానాన్నలం వున్నాము. నోట్లో మాట నోట్లో వుండంగానే నోరుతెరిచి అడగకుండానే చిన్నారి చెల్లెలి కోరికలు తీర్చే అయిదుగురు అన్నలున్నారు" అంటూ గబగబ తన మందిరందాటి కూతురి అంతఃపురానికొచ్చిందామె.

"అమ్మా! మహారాణీ! రుక్మిణీ దేవికి శిశుపాలుడితో పెళ్ళి యిష్టం లేనట్టుంది. తన మనసులో వేరే ఎవరో వున్నట్టున్నారు. అని విన్నవించారు చెలికత్తెలు.

"హుఁ ఆడపిల్లకి కోరుకున్న వాడిని పెళ్ళాడే స్వతంత్రం ఎలాగూలేదు. కనీసం నీకీ పెళ్ళి యిష్టమేనా?" అని అడిగే వాళ్ళేలేరు. ఒక్కగానొక్క ఆడపిల్ల జీవితాంతం బాధపడుతూ బతుకుతుందంటే...ఛీ....తల్లిదండ్రులం వుండి ఎందుకు? బంగారంలా మెరిసిపోతూ లక్ష్మీదేవిలా కళకళలాడే నా కన్నబిడ్డను ఆధూర్త శిశు పాలుడి చేతిలో పెట్టటానికి వాడికి మనసెలా ఒప్పిందో. అంటూ కుమార్తెని అక్కున జేర్చుకుంది మహారాణి.

"పిచ్చిపిల్లా! అయిన దానికీ కానిదానికీ అట్లా ఏడుస్తారుటే! ఇంతకీ నీ మన స్సును దోచినవాడెవరమ్మా! నాకు చెప్పు. ఆలోచిద్దాం. మనసులోమాట కన్నతల్లికి కూడా చెప్పని సున్నిత మనస్కురాలివైతివి. భావుకతతోపాటు బతకడానికి తెలివి తేటలుకూడా కావాలి" అని అనేక విధాలుగా బుజ్జగించాక కృష్ణుడి పేరు చెప్పింది రుక్మిణి.

"అనుకుంటూనే వున్నాలే. మంచివాణ్ణే నాకు అల్లుణ్ణి చేస్తున్నావు. అని ఉపాయం రుక్మిణి చెవిలో చెప్పి అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణుడిని కన్యాంతఃపురానికి రమ్మని కబురుపెట్టి ఎవరికీ అనుమానం రాకుండా తొందర తొందరగా తన మంది రానికి వెళ్ళిపోయింది మహారాణి.

అగ్నిద్యోతనుడు శ్రద్ధగా వింటున్నాడు. రుక్మిణి సిగ్గుని అదిమిపెట్టి కవితా ప్రవాహంలా చెప్తున్నది. చెలులెవ్వర్నీ ఆ మందిర ప్రాంతంలోకి కూడా రానివ్వలేదు.

"శ్రీయుత మూర్తి! నేను నీదాన్ని సింహం పాలిటి సొమ్ముని నక్క కోరుకున్నట్టు మత్తుడైన శిశుపాలుడు, ఉన్మత్తుడైన శిశుపాలుడు నన్ను ఎత్తుకెళ్తానంటున్నాడు. అతనికేం తెలుసు అద్భుతమైన నీ ప్రతాపం? పూర్వజన్మలోని నా పూజలు ఫలించి వసుదేవనందనుడు నా భర్త అగును గాక.

"ప్రాణేశ! నీ మంజు భాషలు వినలేని కర్ణరంధ్రంబుల కలిమి యేల? భువన మోహన నిన్నుబొడగానగాలేని చక్షురింద్రియముల సత్వమేల?"

ఏ నీ గుణములు కర్ణేంద్రియములు సోకదేహతాపంబులు తీరిపోవు ఏ నీ శుభాకార మీక్షింపఁ గన్నుల కఖిలార్థలాభంబు కలుగుచుండు. నట్టి నిన్ను చెట్టపట్టాలని నా మనసు ఉవ్విళ్ళూరుతున్నది. నీ మీద ఒట్టు. నువ్వు నన్ను వివాహం చేసుకోకపోతే బతకలేను. సిగ్గులేకుండా ఈ పిల్ల ఇలా అంటోందేమిటి? అనుకుంటా వేమో వేరే మార్గం లేదు. మా అన్ననెదిరించి నేను బయటికి రాలేను. నువ్వే వచ్చి నన్ను తీసుకెళ్ళిపో.

కావలి వారల కలబంధువులఁ జంపికాని నన్ను తేరాదని భావిస్తావేమో. అనవసరంగా నీ చేత హత్యలు చేయిస్తానా? మా వాళ్ళని చంపిస్తానా?

ఉపాయం కూడా నేనే చెప్తాను విను. నగరంబు వెలువడి నగజాతనకు మ్రొక్క పెండ్లికి మునుపుగ పెండ్లి కూతునెలమిమావారు పంపదురేను నట్లు పురము వెలువడి ఏ తెంచి భూతనాధు సతి గౌరీదేవికి మొక్కుసమయంలో వచ్చికొని పొమ్మ నన్ను నవార్య చరిత!

రుక్మిణి చెప్పడం ముగించి అగ్ని ద్యోతనుడి పాదాలపై పడింది. లే తల్లీ! కృష్ణుడిని కోరుకొన్న నువ్వు చాలా అదృష్టవంతురాలివి. నా ప్రయత్నం నేను చేస్తాను. ఆ దేవకీ తనయుడిని తీసుకొస్తాను. నువ్వు దిగులువడకమ్మా!'' అన్నాడాయన ఆదరంగా.

అప్పుడు వచ్చిపడింది సిగ్గు రుక్మిణీదేవికి. చేతుల్లో మొహం దాచుకుంది.

ముసి ముసిగా నవ్వాడా బ్రాహ్మడు.

"తల్లీ! ఈ సిగ్గంతా కల్యాణం కోసం దాచుకోవాలిమరి. నేను వెళ్ళి శ్రీకృష్ణ స్వామిని తీసుకొస్తానేం'' అన్నాడు.

దారి బత్తెం ఇచ్చింది రుక్మిణి.

బ్రాహ్మడు వెళ్ళి చాలాకాలమైంది. ఎంత కూరాడే అని గాభరా పడుతోంది రుక్మిణి.

"ఆ లోపలనేకతమున

నాలోలవిశాలనయనయగు రుక్మిణి తన్నాలోకలోచనుడు హరి

యాలోకము చేసి కదియడని శంకితయై" అనేక ఆలోచనలు చేస్తున్నది.

ముందు ఈ బ్రాహ్మణుడు వెళ్ళి ఆయన్ను కలిశాడా? దారిలో అలిసి ఆగిపోయాడా? ఇదంతా విని కృష్ణుడేం అనుకున్నాడో? ఈ పిల్లకు అదుపాజ్ఞలు లేవనుకున్నాడా? లేకపోతే వస్తున్నాడా?

అయ్యో! రేపే పెళ్ళి. గోవిందుడింకారాడేం? కనీసం ఏవిషయం చెప్పటానికి ఈ బ్రాహ్మడు అగ్నిద్యోతనుడు కూడారాలేదే? నా ప్రయత్నం ఫలిస్తుందో లేదో? బ్రహ్మ నా నుదుట ఏమని రాశాడో" అని అల్లాడిపోతున్నది. చెలికత్తెలొచ్చి అలంకారాలు చేస్తానంటే మండిపడుతున్నది.

మృగనాభియలదదు మృగరాజ మధ్యమ అలంకార మొప్పదు అందాల వనిత ఆ పిల్లధ్యాసంతా ఆ నల్లని వాడిమీదనే.

... ...

అక్కడ అగ్నిద్యోతనుడు గోవిందుడిని కలుసుకొని రుక్మిణీ వృత్తాంతం చెప్పాడు. ఆ కన్య మహాసౌందర్యాన్ని వర్ణించాడు.

శ్రీకృష్ణుడు చిన్నగా సిగ్గుపడ్డాడు. నేను రుక్మిణిని గురించి ఇదివరకే విన్నాను. ఆ కన్యనే చేపట్టాలని గాఢమైన కోరిక కలిగింది. రాత్రిళ్ళు నిద్రేపట్టుటలేదు" అంటూ బిడియపడ్డాడు.

అక్కడ ఆ చిన్నదాని సిగ్గూ ఇక్కడ ఈ చిన్నవాని సిగ్గూ నమనాభిరామంకాగా కృష్ణుడి భుజం తట్టి రుక్మిణిని దక్కించుకునే సమయం వచ్చేసింది "త్వరగా వదవయ్యా స్వామీ!' అన్నాడు ముద్దుగా అగ్నిద్యోతనుడు. అనుకున్నట్లుగానే అమ్మవారి గుడి దగ్గిర పూలచెండులా రుక్మిణిని ఎత్తుకొని రథంమీద కూచోబెట్టుకొని ఆఘమేఘాలమీద తిరిగి వెళ్ళసాగాడు కృష్ణుడు.

"మా సరివాడవా మాపాపగొని పోవ ఏపాటి గలవాడవేది వంశము? అని రోష వాక్యాలు పలుకుతూ రుక్మి కృష్ణుడి వెంట పడ్డాడు. ఆ హడావిడిలోనూ కన్నతల్లికి సజల నయనాలతో వీడ్కోలు చెప్పింది రుక్మిణి. కృతజ్ఞతలు వెల్లడించింది.

రుక్మికి గర్వభంగమైంది.

"మా అన్న నువ్వు ఈశ్వరుడవని తెలియక మహాపరాధం చేశాడు. నిజమే కాని స్వామీ! నా కోసం మా అన్నని రక్షించు" అని వేడుకొన్నది రుక్మిణి. ఇంతలో బలరాముడు కూడా వచ్చి "కృష్ణా! శాంతించు- అమ్మాయి మనసు నొప్పించవచ్చా? అంతా కర్మవశం అతణ్ణి విడిచిపెట్టు" అన్నాడు అతన్తోపాటు శిశుపాలుణ్ణి కూడా విడిచిపెట్టాడు రుక్మిణీకాంతుడు. బతికుంటే బలుసాకు తినొచ్చునని ఆనందించి శిశుపాలుడు పారిపోయాడు.

రుక్మిణీ కృష్ణుల వివాహం కృష్ణుడి ఇంట్లో జరిగింది. ఆ పెళ్ళికి పాండవులతో బాటు ద్రౌపది కూడా వెళ్ళింది. ధర్మరాజు సరసనే వున్నదప్పుడు. పాండవ ప్రథమ వంశాంకురం ప్రతివింధ్యుణ్ణి గర్భవాసాన మోస్తున్నదామె. అర్జునుడు అన్న పెళ్ళిలో చురుకుగా అటూ ఇటూ తిరిగి ఆడపడుచు పెత్తనం నిర్వర్తిస్తున్న సుభద్ర వేపు చాటుమాటుగా చూడటం ద్రౌపది గమనిస్తూనే వున్నది. తన ఎడబాటులో విజయుడికీ విలాసాలు తప్పవులే' అని ఎలాగో సరిపెట్టుకుంటూ నిట్టూర్చింది.

బలరామకృష్ణులు దుర్యోధనుడికి కూడా బావలేగనక ఆ పెళ్ళికి పదిమంది తమ్ముళ్ళను చెల్లెలు దుస్సలని తీసుకొని వచ్చాడు. దుర్యోధనుడురాకపోతే బావుండదని.

పాండవులకి వివాహమైంది. బలరాముడికి వివాహమైంది. ఇప్పుడు కృష్ణుడికీ ఆదిలక్ష్మిలాంటి అమ్మాయితో వివాహం అవుతున్నది. మరి తను వరించబోయే కన్య ఎలా వుంటుందో ఎక్కడుందో?" అనుకుంటూ మీసం మెలిపెట్టి చిన్నగా నవ్వుకున్నాడు దుర్యోధనుడు.

ఇంతలో ఒంటిమీద పన్నీటి జల్లుకురియటంతో ఉలిక్కిపడ్డాడు. చూస్తే ఒక ఎల జవ్వని ఒక చేత్తో పన్నీరుబుడ్డీ మరో చేత్తో గంధంగిన్నె పట్టుకుని నిలబడివుంది. “మీరా? మీరు సుయోధన కుమారులు కదూ!” అంటూ తత్తరపడింది.

“మేమ తెలుసా కన్యకా! నీకు?” ఉత్సాహంగా ఉల్లాసంగా అడిగాడు దుర్యోధనుడు.

ఆమె సిగ్గుగా తలవూపి కులికింది. అప్పుడు మరి కాస్త పన్నీరు అతనిమీద ఒలికింది.

“ఇదేమిటిది? ఇందాకట్నించీ ప్రేమామృతవర్షంలాగానూ ఒక్కరిమీదే పన్నీరంతా కుమ్మరిస్తున్నారు. ఇంతకీ మేమునచ్చామా?” దుర్యోధనుడి మాటల్లో చిలిపితనంతో పాటు దర్పమూ వుంది.

ఆ దర్పానికే ముందు దాసోహమంది భానుమతి కన్నె మనసు.

“సరే పన్నీరు మా వంతు మరి ఈ చందనం నా సఖివంతు” అంటూ గంధం గిన్నెలో నించీ తీసి ఆ కన్య చేతికీ ఎవరూ చూడకుండా అలవోకగా చెంపమీద రాశాడు ఆ యువకుడు.

“అయ్యో! ఎవరన్నా చూస్తే? పైగా ఇంతమందున్న పెళ్ళిలో? ప్రియసఖుడి చిలిపి చేష్టకు అతని ప్రథమ స్పర్శకూ పులకరించిపోతూ అన్నది భానుమతి.

“ఇప్పుడెవరు చూస్తారు? అంతా వధూవరులమీద అక్షింతలు వెయ్యటానికెళ్ళే తొందర్లో తోసుకుంటున్నారు” అన్నాడు దుర్యోధనుడు.

“అన్నయ్యా! ఆ కన్య అంతగా నీ మనసు దోచిందా? మనకు తగిన సంబంధమేనటలే” అన్నది దుస్సల.

“అమ్మదొంగా! నువ్వు వెనకాలే వున్నావా? అంటూ ఆశ్చర్యపోయి ‘ఎవరమ్మా ఆ యువతి! నీ వెరుగుదువా?” అని ఆశగా అడిగాడు దుర్యోధనుడు.

"పాపం ఎంత ఆశ! నేను చెప్పనోచ్" అన్నగార్ని ఏడిపించటం మొదలు పెట్టింది కౌరవులందరికీ ఒక్కగానొక్క చెల్లెలైన దుస్సల.

"సరే. చెప్పకు. ఇప్పుడేం మునిగిపోయిందిలే చెల్లీ! జయద్రధ రాజకుమారుడిని చూపించమని ఇందాకటినించీ అడుగుతున్నావు కదూ అతన్ని నీకు చూపించన్లే"

"పో అన్నయ్యా! ఇందాకటి పన్నీరు కన్య రాజకుమారి భానుమతి" బుంగమూతితో చెప్పింది దుస్సల అటూ ఇటూ చూస్తూ.

"భానుమతి! ఎంత చక్కగా వుంది ఆమె' అనుకున్నాడు దుర్యోధనుడు.

"దుస్సలా! జయద్రధుడు ఇందాక పెళ్ళిపందిట్లో కనబడ్డాడు గాని. మళ్ళీ విడిదికి వెళ్ళిపోయినట్లున్నాడు. ఈ పెళ్ళి వేడుకలు ముగిసేలోగా దూరంనించైనా సరే ఆ సైంధవ జయద్రధుడ్ని తప్పకుండా చూపిస్తాంలే" అని చెల్లెల్ని అనునయించాడు దుర్యోధనుడు.

రుక్మిణీ కృష్ణుల చేత తలుపు దగ్గిర పరస్పరం పేర్లు చెప్పించింది బలరాముడి వధువు రేవతి.

"నీ పిచ్చిగాని వాళ్ళిద్దరూ ఇదివరకే పేర్లతో పిల్చుకున్నారోయ్ భార్యామణీ!" అన్నాడు బలరాముడు నవ్వుతూ.

"పొన్లెండి. ఏదో మా స్త్రీలకి ఇదొక సరదా. అయినా ఇందాకట్నించీ ఇద్దరూ నోరేవిప్పట్లేదు. పేర్లు తెలియనట్టు" అన్నది రేవతి.

"నువ్వైనా చెప్పరా తమ్ముడూ" అన్నాడు బలరాముడు. "ఊహూఁ ముందు రుక్మిణిని చెప్పమనండి" అన్నాడు కృష్ణుడు మధురంగా నవ్వుతూ.

"శ్రీకృష్ణులవారి ఆజ్ఞని కాదనగలనా" అన్నది వధువు రుక్మిణి చిరునవ్వుని నొక్కిపెట్టి.

వసుదేవుడూ దేవకీ రోహిణీ... ఒకరేమిటి అంతా ఫక్కుమన్నారు వధూవరుల చమత్కారానికి.

పెళ్ళి పందిరంతా ఛలోక్తులతో నవ్వులతో నిండింది. 'కుడికాలు ముందుపెట్టి రావమ్మా కోడలు పిల్లా!'' అంటూ హాస్యాలాడుతూ హారతిచ్చారు రోహిణీ దేవకీ రేవతీ ద్రౌపదీ మొదలైన స్త్రీలు.

విశేషమేమిటంటే శ్రీకృష్ణుడి కల్యాణానికి శచీపురందరులు కూడా రావటం. దేవకీ వసుదేవులు ముందు జన్మలో అదితికశ్యపులు. ఇంద్రాదిదేవతల తర్వాత వారికి మహావిష్ణువు వామనుడై జన్మించాడు బలి చక్రవర్తి ప్రాభవాన్ని అరికట్టేందుకు. ఇంద్రుడి తమ్ముడు ఇంద్రావరజుడు, ఉపేంద్రుడు, విష్ణుదేవుడు, విష్ణువే కృష్ణుడు గనక ఇంద్రుడు ఆయనకు అన్నగారు. ఇంద్రాణి అయిన శచీదేవి వదినగారు. ఎప్పుడన్నా స్వర్గం నించీ భూలోకానికి వచ్చినప్పుడు "మధుకైటభారాతి! మరిది!" రమ్మనిపిల్చి హాస్యాలు ఆడుతూ పనులు చెప్తుంటుంది శచీదేవి.

రుక్మిణి తల్లిదండ్రులు రహస్యంగా పంపించిన వస్త్రాల్లోనించీ మంచి చీరా ఉత్తరీయమూ ఎంచి పెళ్ళికొడుకు పెద్ద వదినగారికి అంటే ఇంద్రాణికి బొట్టుపెట్టి పెట్టింది దేవకి. చక్కని కంఠహారమొకటి మెడలో వేసింది. అప్పటికప్పుడు ఆ బట్టలు కట్టుకొని అత్తగారికి నమస్కరించి మురిసిపోయింది శచి. ఇంద్రుడికీ కొత్తబట్టలు పెట్టాడు వసుదేవుడు శచీ దేవేంద్రులు వధూవరులకిచ్చిన కానుకల ధగధగలైతే చెప్పలేనంతగా వున్నాయి.

కుంతి ముందు రావద్దనుకుందిగాని తనకు పరమాప్తుడైన కృష్ణుడి పెళ్ళికి రాకుండా వుండలేకపోయింది. ఆవిడ దూర దూరంగా వుంటే రేవతి మాటి మాటికీ ఇవతలికి తీసుకొస్తోంది.

రేవతీ బలరాములకి కూడా బట్టలు పెట్టారు దేవకీ వసుదేవుడూ "అమ్మా! ఇందాకట్నించీ అర్జునుడు మన సుభద్రని చూడాలని తహతహలాడిపోతున్నాడు. "ద్రౌపదితో పెళ్ళయిందిగా తనకి. నా దగ్గిర గదా యుద్ధం నేర్చుకున్న ప్రియశిష్యుడు

దుర్యోధనుడు అవివాహితుడు. అతనికిచ్చి వివాహం చేద్దాం మన సుభద్రని. మళ్ళీ చెప్తున్నాను. రేవతీ! సుభద్రని అర్జునుడి ఛాయలకి వెళ్ళనివ్వద్దు. ఇద్దరమ్మలూ ఇక్కడే వున్నారా' అంటూ రోహిణీ దేవకీ వున్నవేపు చూసి "సుభద్ర అసలే పసిపిల్ల జాగ్రత్తమ్మా" అన్నాడు బలరాముడు.

ఆ మాటలు భానుమతి చెవుల్లో పడ్డాయి. ఆ పిల్ల నిర్విణ్ణురాలైంది. 'అయ్యో! తన ఆశాసౌధం నేలకూలిపోతున్నదా? తన హృదయేశ్వరుడైన కౌరవేశ్వరుడితో పాణిగ్రహణానికి నోచుకోదా?' అని విలవిలలాడిపోయింది.

కుచేలుడూ అతని భార్య సుశీలా ముగ్గరు పిల్లలతో కలిసి ఈ పెళ్ళికొచ్చారు. అక్కడందరూ ధనవంతులు రాజులు. జిగేల్మని మెరిసిపోతున్నారు. పెళ్ళికొడుకు నా చిన్నప్పటి స్నేహితుడండీ అని ఏ మొహం పెట్టుకొని నలుగురి లోకి వెళ్ళగలడు అని వెనకాలెక్కడో కూచున్నాడు.

కృష్ణుడు సాత్యకిని పిలిచి వాళ్ళని తీసుకెళ్ళి స్నానాదులు చేయించి మంచి బట్టలు కట్టనిచ్చి అలంకరించి పెళ్ళిమండపంలో ముఖ్యుల మధ్యన కూచోబెట్టుమని చెప్పాడు.

దంపతి తాంబూలాలు తీసుకోవటానికి రమ్మని యాదవ పురోహితుడు గర్గుడడు కేకేశాడు.

కుచేలుడినీ సుశీలనీ ముందు రమ్మనమని చెప్పమన్నాడు కృష్ణుడు. సిగ్గుపడుతూ వచ్చి కుచేలుడు తాంబూలం అందుకుని భార్యచేతిలో పెట్టాడు.

"నీ సిగ్గు చూస్తే నువ్వు తొందరగా ఇక్కడ్నించీ పారిపోవాలని చూస్తున్నట్లున్నావు మిత్రమా! రాత్రి బువ్వంబంతిలో భోంచేసి నాతో చిన్ననాటి ముచ్చట్లు మాట్లాడిరేపు వెళ్ళు కావలిస్తే అన్నాడు కృష్ణుడు ఆప్యాయంగా.

"కృష్ణా! నీ మంచితనానికి లోకం పట్టదు. అలాగే నీతో మాట్లాడివెళ్ళచ్చుగానీ మా చెల్లెలు చిరంజీవి సౌభాగ్యవతి నూతన వధువు అయిన రుక్మిణీ దేవితో భవదీయశౌర్యమే యుంకువజేసి రాక్షస వివాహమునన్గొని వచ్చిన కన్యాలలామతో

కాసిని మాటలు చెప్పి అలరించవా ఏం ఈ రేయి? బావుంది నీ వరస కృష్ణా! పురుషోత్తమా! అమ్మా! రుక్మిణీ! ఈ వేయిళ్ళ పూజారిని కావాలని కోరి వరించావా తల్లీ! ఎంత సేపూ లోకాలగోలే తప్ప నీ ముద్దుముచ్చట్లు ఏమన్నా పట్టించుకుంటాడా? కోరివచ్చావని ఆదరిస్తాడా? ఏమో అంతా నీ చేతుల్లో వుంది. పెళ్ళికొడుకే, పెళ్ళి పీటలమీద కూచున్నాడే అని లేదు. వచ్చిన ఆప్తులకూ బంధువులకీ సరిగ్గా మర్యాదలు జరిగాయో లేదో నన్న ఆరాటమే. ఒక్కటి మాత్రం నిజం తల్లీ! భక్తి శ్రద్ధలచేతమట్టుకు నీ స్వామి కట్టుబడకుండా వుండడు. ఈ మాట గుర్తుపెట్టుకో ఆదర్శ సహధర్మచారిణివై ఆచంద్రార్కం వర్థిల్లు! అన్నాడు కుచేలుడు రుక్మిణి సిగ్గుగా కుచేలుడి మాటలన్నీ విని తలపూపింది అలాగే అన్నట్లు.

"నాకు తెలీకడుగుతాను. ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు రుక్మిణి నీకంత దగ్గరైందా?" నవ్వాడు శ్రీకృష్ణమూర్తి.

ముద్దుగా రుక్మిణి బుజాలుపట్టి లేవనెత్తి దణ్ణం పెట్టమని సంజ్ఞ చేశాడు.

కుచేల దంపతులకు నూతన దంపతులు ప్రణమిల్లారు. సుశీల నూతన వస్త్రాలు ఇచ్చింది రుక్మిణికి ఆశీస్సులతోబాటు. అతిసామాన్యమైన ఆ నేత వస్త్రాలు ఎంతో నచ్చినై రుక్మిణికి. చెలికత్తెలకిచ్చి వాటిని భద్రంగా దాచమని చెప్పింది.

"కృష్ణా! ఈసారివచ్చినప్పుడు నీకు కానుకిస్తానేం" కన్నీటిని రెప్పలచాటున అప్పళించి జాలిగా అన్నాడు కుచేలుడు. కృష్ణుడికి తెలీదా ఏం? కుచేలుణ్ణి కౌగలించుకొని "అప్పుడు నువ్వు దాచుకున్నా నేనేలాక్కుంటాలేవోయ్" అన్నాడు పరిహాసంగా.

కానీ కృష్ణుడు ఊరికే ఏదీ మాట్లాడడు అని తర్వాత తెలుస్తుంది.

దంపతి తాంబూలం తీసుకోవటానికి అయిదుగురు భర్తలతో వచ్చింది ద్రౌపది. అయిదు తాంబూలాలూ ఆమె చేతిలో వుంచారు పాండవులు.

ఆ తర్వాత శచీ రేవతీ దేవకీ రోహిణీ ద్రౌపదీ సుభద్రా అంతా మంగళహారతి పాడారు.

మంగళం రుక్మిణీ రమణాయ శ్రీమతే
మంగళం రుక్మిణీ మూర్తయేతే
మంగళం శ్రీవత్స భూషాయ శార్ఙ్గిణే
మంగళం నందగోపాత్మజాయ. జయయయా జయ మంగళం

మహోత్సవ మంగళం.

కావిళ్ళేసుకొని వెన్న మీగడలూ పాలుపెరుగులూ తీసుకొచ్చారు గోపగోపికా సంఘాలు తమకిష్టప్పు పెళ్ళికి.

ఆ రాత్రి బోంబంతిలో ప్రకృతి సహజాలూ గోమాత ప్రసాదాలూ ప్రధాన అధరువులైనాయి. కొంత వెన్నకాచి ఘుమఘుమలాడే నెయ్యి వేశారు పాచక శ్రేణి. వెన్నపూస పళంగానే కొంత విస్తళ్ళలో వడ్డించారు. అద్భుతమైన పరమాన్నం చేశారు గోక్షీరంతో. బఱ్ఱపెరుగు కత్తితో కొయ్యాల్సినట్లుంది. వచ్చిన వాళ్ళంతా రాజులూ భోగలాలసులూనే; కాని ఈ రుచులు ఎరగరింతకుమునుపు. భగవంతుడి పెళ్ళి అనీ, క్షీరోదార్ణవసంభూత అయిన మహాలక్ష్మి వధువనీ, కామధేనువు ఈ సంభారాలన్నీ దివినుంచి భువికి పంపించిందా అనీ అనిపించి పరవశించిపోయారు అతిథులు.

సరిగా భోంచేయనివాళ్ళు ఇద్దరే. దుర్యోధనుడితో తన వివాహంకాదేమో అని భానుమతీ, దుర్యోదనుడితో తన వివాహం ఔవుతుందేమో అని సుభద్రా దిగులుతో సరిగా తినలేదు ఇద్దరు కన్యలూనూ.

అర్జునుడూ సుభద్రా సరిగ్గా ఒకర్నొకరు చూసుకోకుండా చూశాడు బలరాముడు.

వడ్డన దగ్గిరకొచ్చి బొబ్బట్లలో మరికాస్త నెయ్యి, పాలుపోస్తూ నన్ను గుర్తుపెట్టుకుంటారా లేకపోతే మరిచిపోయి...కళ్ళనీళ్ళు తిరిగాయి భానుమతికి

“ఊ..మర్చిపోయి...” దుర్యోధనుడు కవ్వించాడు సరదాగా.

“వేరే అమ్మాయిని...” అంటూ వాక్యం పూర్తిచెయ్యలేక అక్కడ్నించీ వెళ్ళిపోయింది చివాల్న భానుమతి.

"అదేమిటి రాజపుత్రీ! నువ్వు వడ్డనకు రావటమేమిటి? మేమమంతా లేమా? అసంఖ్యాక పరిజనం లేరా? ఊఁ పదముందు నువ్వెళ్ళి మా సుభద్ర పక్కన చోటుంది అక్కడ కూచో" అంటూ వచ్చి ఆమె చేతిలోని పాలగిన్నె, నేతి జారీ అందుకుంది రేవతి. ఒకసారి దుఃఖంతో మలినమైన ఆమె మొహాన్ని దుర్యోధనుడి ఆలోచననూ గమనించి 'ఓహో ఇదా సంగతి. ఇది బలరామదేవుడికి తెలియకుండా నిర్వర్తించాల్సిందే. లేకపోతే మూడు పసిమనసులు అల్లాడిపోతాయి అని చిరునవ్వు నవ్వుకుంది.

"ఏమిటమ్మా తోడికోడలా! ఏమిటీ నవ్వుకుంటున్నావు? నీ పెళ్ళి గుర్తుకొచ్చిందా? నేనూ ఓ చెయ్యి వెయ్యనా?" అంటూ వచ్చింది శచీదేవి.

"ఏమిటీ అమరావతి నేలే దేవేంద్రుడి ధర్మపత్ని వడ్డించటమా మా ఇంట? తప్పమ్మా? అక్కా! ఇందాక ఆ భానుమతీ కుమారినే తీసుకెళ్ళి కూచోబెట్టి వచ్చాను వడ్డన నుంచి. మంచి దానవేలే ఏరీ బావగారు ఆయనా నువ్వూ కలిసి భోజనాలకి కూచోండి మరి" అన్నది రేవతి.

"ఏమిటో ఆ భానుమతి ముఖం అట్లా వివర్ణమైవుందేం" అని అడిగింది శచీదేవి.

"అదేగా చెప్పవచ్చేది. కాస్త మీ దంపతులు కల్పించుకొని భానుమతీ దుర్యోదనుల కల్యాణం చేయించాలి సుమా!"

"తప్పకుండానూ. మరి ఆ తర్వాత సుభద్రార్జునులిద్దర్నీ కలపద్దూ? ఆ పెళ్ళికీ ఏర్పాట్లు చేసి నేనూ మావారూ వచ్చి దగ్గరుండి మహేంద్ర తనయుడి పెళ్ళి జరిపిస్తాం. మా అబ్బాయికి యేం కట్నకానులకలిస్తారో? కనుక్కోవాలి" శచీదేవి పరిహాసమాడింది.

"ఆఁ లాంఛనాలు కూడా అందవేమో. రెండో పెళ్ళి అబ్బాయికి. మా పిల్లనివ్వడమే గొప్ప. తమరే ఎదురు కట్నమివ్వాలి మళ్ళీ మాట్లాడితే" అని నవ్వింది రేవతి.

అందరూ భోజనం చేశారో లేదో మర్యాదలు సరిగ్గా అందాయో లేదో కను క్కోవడానికి నియమింపబడిన పరిచారికలు వచ్చి రోహిణికి ఏదో చెప్పారు.

ఆమె గబగబా ఉద్యానవనంవేపు వచ్చింది. అక్కడ కాగడాల వెల్తురు సగం సగం ప్రసరిస్తున్న మల్లెతీగల మండపం దగ్గిర ఇద్దరు యువతీ యువకులు అస్పష్టంగా కనపడుతున్నారు.

ఇంకా దగ్గిర కెళ్ళాక వాళ్ళిద్దర్నీ గుర్తుపట్టింది రోహిణి. వాళ్ళు దుస్సలా జయద్రధుడునూ. అక్కడున్న చంద్రకాంతమణి వేదికమీద ఇద్దరూ మాటాపలుకూ లేకుండా సందర్శానందమే సదానందమూ అన్న పద్ధతిలో ఒకర్నొకరు చూసుకుంటూ కూచున్నారు.

రోహిణి ముచ్చట పడింది వాళ్ళను చూసి.

"అమ్మాయి దుస్సలా! అబ్బాయి జయద్రధా!" మీ వివాహ విషయం మా అబ్బాయి బలరాముడిచేత మీ పెద్దవాళ్ళకు చెప్పించి ముహూర్తాలుంటే తొందర్లోనే పెట్టిస్తాను. మాఢమి దాటాక ఎలాగూ తప్పదు. అప్పుడు తీరిగ్గా ఒకరి కళ్ళల్లోకి ఒకరు సంవత్సరాల తరబడి చూసుకోవచ్చు. లేదా మీ యిష్టమొచ్చిన పద్ధతిలో ప్రేమ ప్రకటించుకోవచ్చు" అంటూ మధురంగా నవ్వింది.

ఆ పెద్ద ముత్తైదువ పరిహాసానికి మరింత తత్తర బిత్తరలాడారు వాళ్ళు పారిపోబోయారు అక్కడ్నించీ.

"ఆగండాగండి పిల్లలూ! ముందు భోజనాలకి రండి" అంటూ చనువుగా వాళ్ళ చేతులు పుచ్చుకొని తీసుకొచ్చింది రోహిణి. జయద్రధుడు కాస్త దుడుకు వాడని చెప్తుంటారు చాలామంది. కాని దుస్సల ముందూ రోహిణి ముందూ ఇంత బుద్ధిమంతుండుంటాడా రాకుమారుల్లో అన్నట్లున్నాడు.

రుక్మిణీ కృష్ణులకి ఎంగిలి హారతో ఏదో పడుతున్నట్లున్నారు. హారతీ! కృష్ణా! నీకు! జయ హారతీ కృష్ణా నీకు! రుక్మిణీ కృష్ణా! మంగళ హారతీ నీకు" అంటూ ఆడవాళ్ళ పాటలు వినిపిస్తున్నె రుక్మిణీదేవి చిటికెన వేలుపట్టుకొని మదనకోటి సుకుమార భావుడైన శ్రీకృష్ణుడు ఠీవిగానుంచున్నాడు.

మెరుగు చెంగటనున్న మేఘంబుకైవడినువిద చెంగట నుండు నొప్పుతున్నాడు

పేర్లు చెప్పించటాలూ పూలచెళ్ళాడించటాలూ అంతా సాకల్యంగా జరిగింది. రుక్మిణీ పరిణయం.

ఇక్కడంతా ఇలా సందడి సందడిగా వుంటే అక్కడ

3

ఒక రాజకన్య విలువిద్య నేర్చుకుంటున్నది. తెలుపూ మంచి గంధమూ కలిపి రంగరించినట్లు ఉన్నదా జవరాలి దేహచ్ఛాయ. ద్రౌపదీదేవి తలకట్టయితే అరచెయ్యంత వెడల్పు రుక్మిణీదేవి జుట్టు మెత్తని పట్టుకుచ్చు. వాళ్ళకేశ సంపదతో విలక్షణంగా పోటీపడుతున్నదీ అమ్మాయి కురుల సౌభాగ్యం. ద్రౌపది అంతగరుకుగానూ రుక్మిణి అంత మెత్తగానూ కాక మధ్యస్థంగా వున్నదామె జడ. అంత వెడల్పులేదు గాని కాలనాగులా మోకాళ్ళకిందికి జారి అతి సుందరమైన ఆ యువతి కాళ్ళమీద పడి ఆమె అందానికి దాసోహం అంటున్నది. చివర చక్కని జడగంటలు పెట్టుకుంది. బంగారు నాగరం, జడబిళ్ళా పెట్టుకుంది. తల్లో నాజూగ్గా మల్లెపూలు పెట్టుకుంది.

"రాకుమారీ!" అని హడావుడిగా పరిగెత్తుకొచ్చింది ముఖ్య చేటిక పరిమళ.

గిఱ్ఱున ఆదుర్దాగా ఇటు తిరిగింది రాకుమారి. ఆమె జడగంటలు రయ్యిన వెళ్ళి పరిమళ చెక్కిలిని ఢీకొట్టాయి.

"అబ్బా" అంటూ కందిపోయిన చెంపని పట్టుకొని వుండిపోయింది పరిమళ.

"అయ్యో! బాగా దెబ్బ తగిలిందా పరీ! అయినా నువ్వలా అరుస్తూ పరిగెత్తుకొచ్చేసరికి ఏమైందో అని ఇటు తిరిగేటప్పటికి......"

"ముందు ఆ జడగంటలూ, జడకుప్పెలూ మానేసి జడకుచ్చులు పెట్టుకోవాల్సిందేనమ్మా రాకుమారీ! లేకపోతే ఆ వచ్చే మానవుడేమైపోతాడు పాపం" అంటూ బుగ్గ రుద్దుకోసాగింది పరిమళ.

"ఏ మానవుడు? వాడేమైపోతాడు?" అమాయకంగా అడిగింది రాకుమారి.

ఏ మానవుడూ అంటే...అదేనమ్మా మీ తండ్రిగారి అల్లుడుగారు... ఇహేమైపోతాడూ అంటే తమరి ప్రతాపానికి అదే తమరి జడగంటల ప్రతాపానికి అతగాడి బుగ్గలు రెండూ బూరెల్లా వుబ్బిపోయి......"

"ఏయ్ పరీ! నీ రెండో బుగ్గ పనికూడా పట్టమంటావా? మరోసారి గిఱ్ఱున తిరిగేదా?" చిరుకోపంగా అడిగిందా కన్య.

"అదే...అదే నా భయం తల్లీ! జడతో కొడతా ... జడతో కొడతా" అంటూ భయపెట్టటం మీకు అలవాటు. రేపు మీ అత్తవారింట్లో.....అత్తగారి బుగ్గే వాస్తుందో లేక తోడికోడలి బుగ్గ....వామ్మో. అమ్మో తిరిగేస్తున్నారు తల్లీ! తిరక్కండమ్మా మీ పుణ్యమాయెను. మీ జనకులు సత్రాజిత్తు మహారాజుగారి తపస్సుకి మెచ్చి సూర్యభగవానుడు దినదినమూ బారువలకొద్దీ బంగారాన్ని ప్రసాదించే శమంతకమణి నిచ్చాడని చెప్దామని అరుస్తూ వచ్చి బుగ్గపోట్లు తిన్నాను. నా కెందుకమ్మా. నేపోతున్నా. మహారాణి గారు మిమ్మల్ని తొందరగా రమ్మన్నారు. నాన్నగారికి హారతివ్వాలిట. ఆనక మీ యిష్టం" అంటూ రెండు అరచేతులతోనూ బుగ్గల్ని కప్పుకొని పారిపోయింది పరిమళ.

అప్పటి దాకా విలువిద్యా పరిశ్రమ చేయిస్తున్న ఆచార్య హేతుమతి నవ్వి "పద పద సాత్రాజితీ! నాన్నగారు రాగానే నీ కోసమే చూస్తారు. ముద్దుల కూతురివాయె" అన్నది.

గురువుగారికీ ధనుస్సుకీ వినయంగా వందనంచేసింది సత్యభామ. పరిచారికలు గబగబా వచ్చి విల్లందుకున్నారు. ఇప్పుడు ఠీవిగా నడవసాగింది సాత్రాజితి. ఆమె వల్లెవాటు నేలమీద జీరాడుతుంటే కొందరు చెలులు పట్టుకున్నారు. అలిసి చెమటలు చిందిన ఆమె ముఖాన్ని కొందరమ్మాయిలు మెత్తని బట్టతో అద్దారు.

శమంతకమణిని పూజామందిరంలో పెట్టాడు సత్రాజిత్తు. ఆ తతంగమూ పూజా అంతా పూర్తయ్యాక ముద్దుల కుమార్తెతో పెద్ద భార్యతో సలాపాలాడుతూ భోజనానికి కూర్చున్నాడు. ఆయనకి చాలా మంది భార్యలు, కూతుళ్ళూనూ.

"రత్నం కోసం వెంపర్లాట పూర్తయింది. ఇకనైనా అమ్మాయి సత్యభామకి పతిరత్నాన్నీ మనకి జామాతృ రత్నాన్నీ వెతికే ఏర్పాటు ఏమైనా వుందా మహారాజా!" అని అడిగింది మహారాణి.

"అంటే నేను మణి అన్వేషణే తప్ప అల్లుడి అన్వేషణే చెయ్యటం లేదనా నీ ఉద్దేశం దేవీ! ఇప్పటికే మన చారులు దేశంలో వున్న రాజకుమారుల చిత్ర పటాలు సేకరించుకొని రావటానికి వెళ్ళారు. అన్నట్లు ఎల్లుండి నేను యదుకులమణి అయిన శ్రీ కృష్ణకుమారుడి దగ్గరికి వెళ్ళాలి. అతని అన్నగారు బలరామదేవునితోనూ తదితర పెద్దలతోనూ సంప్రదించాల్సిన పని వున్నది. ఆ ఏర్పాట్లు చూడు" అన్నాడు సత్రాజిత్తు.

"నాన్నగారూ! ఆచార్య హేతుమతిగారు అలవోకగా బాణాలు ప్రయోగించేవి చిత్ర పద్ధతి నేర్పిస్తున్నారు" సంతోషంగా చెప్పింది సత్యభామ.

తండ్రిగారికేమో రాజకీయ సమావేశాలూ కూతురుగారికేమో యుద్ధవిద్యలూనూ. నేనెంత మొత్తుకున్నప్పటికీ ఏం లాభం? ఈ లోపల ఆ రాజకుమారులకి పెళ్ళిళ్ళయిపోతాయో ఏమో అనుకుంది మహారాణి. కానీ భర్తవరాన్వేషణలో భాగంగానే కృష్ణుడ్ని చూడబోతున్నాడని ఆమె వూహించలేదు.

"ఊచిన కట్టువంపని పయోరుహలోచన మహారాణీ! మీ పుత్రిక. అంత సుకుమారి కఠిన ధనుర్విద్యాపారంగత. ఎవరు నోచివున్నారో ఈ నారీరత్నాన్ని చెట్టపట్టటానికి" దాది ముక్తమెటికలు విరుస్తూ మురిసిపోయింది.

"అదే ముక్తా! ఆశ్చర్యం. ఉత్తప్పుడు అటుపుల్ల తీసి ఇటు పెట్టలేదు. అంత బరువు విల్లు ఎట్లా పట్టుకుంటుందో ఎట్లా నారి సారిచేస్తుందో ఎట్లా ఎక్కు పెడుతుందో నా ఊహకి అందటల్లేదు" అన్నది రాణి.

"బొమ్మల పెళ్ళిళ్ళు చేద్దామంటే రారండీ అమ్మాయిగారు. అద్దం పిడిముట్టు కుంటే అలిసిపోతారు. ముత్యాలు గుచ్చలేరు. పూలమాల కట్టలేరు. చిలకకి పద్యాలు చెప్తే యువరాణిగారి బుగ్గలు ఎఱ్ఱబడిపోతై. బంగారు ఉయ్యాలలెక్కి వూగటానికి భయపడుతుంది. మరి ఈ విలువిద్యలో మటుకు మేటి? అయినింటి రాజకన్య. రేపు అత్తవారింట్లో ఈ విద్యను ప్రోత్సహిస్తారు. ప్రోత్సహించరు. ఎవర్ని గెలవటానికోమరి ఈ తాపత్రయం" అన్నది ముక్త.

ఇంతలో కుల పురోహితులొచ్చారు. ఆయనకి అర్ఘ్యపాద్యాది మర్యాదలు నెఱపి తనను వేధిస్తున్న సమస్యని బయట పెట్టింది రాణి.

"కుమారిక అభిలాష సాభిప్రాయమేనమ్మా! మహావీరుణ్ణి వివాహమై వీరనారి, వీరపత్ని వీరమాత అయి జగత్తున ఎనలేని ప్రశంసలనందుకొంటుంది. సత్యభామ దుష్టశిక్షణ చేసేటప్పుడు భర్తకి సహాయంచేసి భేష్ అనిపించుకుంటుంది. మనసులో భూదేవంత ఓర్పున్నా పైకి నెరజాణలా కనిపిస్తుంది. చెలికత్తెలతో తిరుగుతూ అల్లరి పిల్లలా కనిపిస్తుందికాని మనసు పరమమృదువు. కోపిష్ఠిపిల్లలా కనిపించే ఈ అమాయకురాలికి బహుయోగ్యుడైన పతి లభించటానికి గౌరీవ్రతం చేయించండమ్మా" అని చెప్పాడాయన.

... ...

భానుమతి కోరిక ఈడేరబోతున్న శుభతరుణం వచ్చింది. కురువృద్ధుడైన భీష్ములవారు కూడా భానుమతీ వివాహం దుర్యోధనుడితో జరిపించమన్నారు. కౌరవవంశాబ్ధి చంద్రుణ్ణి చెట్టపట్టిన తన అదృష్టానికి మురిసోయింది భానుమతి. నునుసిగ్గుతో వరుడి చిటికెన వేలుపట్టుకొని భీష్ముడికి ప్రణామం చేసింది చిరునవ్వుతూ.

"అమ్మాయీ! నీ కోరిక తీరిందా?" అని అడిగాడాయన.

దుర్యోధనుడు ఆశ్చర్యపోయినాడు. "ఓహో అదాసంగతి!" అని అడిగాడు తనకుల వధువుని కళ్ళతోనే. ఇంతవరకూ ఆ సంగతి తెలియలేదన్నమాట కౌరవేంద్ర కుమారులకి అన్నట్టుగా చూసిందామె. తాతగారి చాతచక్షుత్వానికి మరోసారి విస్మితుడైనాడు దుర్యోధనుడు.

ఆ తరువాత వెంట వెంటనే కౌరవ కుమారులందరికి పెళ్ళిళ్ళూ అయినాయి. దుస్సల మనసు తెలిసిన సుయోధనుడు తాతగారితో చెప్పాడు. చివరికి దుర్యోధనుడూ భీష్ముడూ ఆలోచించి సైంధవుడైన జయద్రధుడికి దుస్సలా కుమారినిచ్చి వివాహం జరిపించారు. ఎందరు అన్న చెల్లెలామె! ఆ వివాహ వైభవం వర్ణన కతీతం. ఆమె తప్ప కౌరవపాండవుల్లో పాండుసుతుల్లో కౌరవ సుతుల్లో ఆడపిల్ల అన్నమాటేదీ? అందరూ మగపిల్లలేనాయె.

... ...

శమంతకమణిని సాధించిన ఆనందం సత్రాజిత్తుని ఊపిరాడ నియ్యటంలేదు. అందరూ ఆయన్ని ప్రశంసిస్తున్నవారే. ద్వారకవారి సంగతే ఇంకా తెలియరాలేదు. మణిని తీసుకొని ద్వారకానగరానికి ప్రయాణమై వచ్చాడాయన అనుకున్నట్లుగా.

ఆ మణిని మెచ్చుకొని "మాకిస్తారా మహారాజా! ఈ రత్నాన్ని?" అన్నారు బలరామకృష్ణులు. "అదే మన్నమాట ఎంత శ్రమపడి దీన్ని సాధించాను. మీకెలా ఇస్తాను?" అన్నాడు సత్రాజిత్తు. ఆయన్ని సంతోషంగానే సాగనంపారు అన్నదమ్ము లిద్దరూ. తర్వాత కృష్ణుడికి మణి విషయమై అపనిందకులోనై దాన్ని వెతుక్కుంటూ వెళ్ళాల్సి వచ్చింది.

"సత్రాజిత్తుగారూ! ఊరికే సరదాగా అడిగాం. అంతేనండీ" అని నవ్వు కుంటూ నచ్చచెప్పారు అన్నదమ్ములిద్దరూ. వారిచ్చే ఆతిథ్య సత్కారాలన్నీ అందుకొని తన రాజ్యానికి వెళ్ళిపోయినాడు సత్రాజిత్తు.

ఒకసారి సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడనేవాడు అన్ననడిగి శమంతకమణిని ధరించి వేటకి వెళ్ళాడు. ఎర్రగా ధగధగ మెరిసిపోతున్న ఆమణిని చూసి ఒక సింహం మాంసఖండమేమో అనుకొని ప్రసేనుడిని సంహరించింది. సింహం ఆ మణిని తీసుకోవటం జాంబవంతుడు చూశాడు. అది మణి అని ఆయనకి తెలుసు. కానీ ఇదేదో అపూర్వంగా వుందే అనుకొని ఆ సింహాన్ని సంహరించి దాన్ని తీసుకెళ్ళి తన ప్రియపుత్రిక జాంబవతికిచ్చాడు.

వేటకెళ్ళిన తన తమ్ముడు ఎంతకీ తిరిగిరాకపోయే సరికి ఖంగారు పడ్డాడు సత్రాజిత్తు. ప్రసేనుడిని వెతుక్కుంటూ వెళ్తే జరిగిందంతా అర్థమైంది. కాని శమంతకమణి ఏమైనట్లు? తమ్ముడు హతమారిపోయినందుకు బాధతో పాటు శమంతకమణి ఏమైపోయిందోనన్న ఆదుర్దాకూడా తోడైంది సత్రాజిత్తుకు. ఆలోచించి చూస్తే ఆమణి మీద ఆశపడిన కృష్ణుడు గుర్తుకొచ్చాడు. చిన్నప్పుడు నవనీత చోరుడనే వారతన్ని ఇప్పుడు మణిని కూడా అపహరించాడన్నమాట అడిగితే ఇవ్వలేదని నా తమ్ముడిని చంపి మణిని కైవసం చేసుకున్నాడన్నమాట అనుకున్నాడు.

కృష్ణుడిదాకా ఈ వార్త పాకింది. "తమ్ముడూ! ఆ సత్రాజిత్తు ఎలాంటి అపవాదువేశాడో చూడు నీ మీద? అతని పనిపడతాను ఉండు" అని నాగలీ రోకలీ భుజాన వేసుకొని కోపోద్రిక్తుడై కదిలాడు బలరామదేవుడు. "అన్నయ్యా! ఆగు. ఆగు నీ దాకా ఎందుకు నేనుకనుక్కుంటాలే. ఈ మాత్రందానికి నువ్వెందుకు? శాంతించు" అని కృష్ణుడే అడవికి బయలుదేరాడు. ప్రసేనుడిని సింహం చంపితే మరి సింహాన్ని చంపిందెవరు? వాళ్ళే మణిని తీసుకెళ్ళి వుంటారు. అని వెతుక్కుంటూ జాంబవంతుడున్న గుహవరకూ వెళ్ళాడు కృష్ణుడు. పరివారాన్ని బయటే ఆగమని తనొక్కడూ లోపలికి వెళ్ళాడు. అంతకు ముందునాడు...

... ...

"నాన్నా! నాన్నా!" పరిగెత్తుకుంటూ తండ్రికి ఎదురువెళ్ళింది జాంబవతి.

"ఏమిటి తల్లీ! బెంగ పెట్టుకొని నేను బయటికెళ్ళినపుడు సరిగా భోజనం చెయ్యలేదట. దాది చెప్పింది. రేపు పెళ్ళై అత్తగారింటికెళ్ళినపుడు నేను తోడువస్తానా చెప్పు? అయినా నేనెంతకాలం వుంటానమ్మా. ఆ శ్రీరామచంద్ర ప్రభువు ఎప్పుడు దయతలుస్తాడో... అన్నాడు జాంబవంతుడు.

"నాన్నా! నేనొకటి అడుగుతాను. సమాధానం చెప్పు. నీకు మీ శ్రీరామచంద్ర ప్రభువు ఎక్కువ ఇష్టమా? నేనెక్కువ ఇష్టమా?'' జాంబవంతి కిలకిల నవ్వింది.

జాంబవంతుడు కూడా నవ్వుతూ అమ్మా! నీ కోసం ఏం తెచ్చానో చెప్పుకో చూద్దాం?'' అని ఎదురు ప్రశ్నవేశాడు.

"ఏమై వుంటుందబ్బా! పండో పుష్పమో...ఏమో నువ్వే చెప్పు'' అన్నది జాంబవతి.

ఆ తండ్రీ కూతుళ్ళ అనుబంధం ఎంత గాఢమో తెలిసిన దాది కూడా మురిపెంగా చూస్తూ నుంచున్నది. జాంబవతిని అరిచేతుల్లో పెట్టుకొని పెంచిందామె.

"అమ్మాయికి పెళ్ళికొడుకునుగాని తెచ్చారా అయ్యా!'' అన్నది కుతూహలంగా.

"ముందు ఆభరణాలు సమకూర్చిన తరువాత వరాన్వేషణ చేస్తే బావుంటుంది గదా దాదీ!'' అంటూ ఉత్తరీయపు కొంగు ముడివిప్పి ధగధగలాడే మణిని బయటికి తీశాడు. ఆ మణి వెదజల్లే కాంతులతో వాళ్ళున్న ఆ గుహ మిరిమిట్లు కొలిపేసింది.

"అబ్బ ఎంత మెరుస్తోందో ఇది? ఎక్కడిది నాన్నా?'' ఉత్సాహంగా అడిగింది జాంబవతి.

సింహం ఈ మణిని ఎత్తుకుపోతుంటే దాన్ని వధించి నీకోసం ఈ మణిని తెచ్చాను. ఎక్కడిదో సింహానికెలా దొరికిందో ఇది నాకూ తెలీదు. 'దీన్ని నువ్వు అలంకరించుకుంటే చూడాలని పించిందమ్మా!'' అన్నాడు ఆర్ద్రంగా జాంబవంతుడు.

దాది హారయుక్తమైన ఆ మణిని తెచ్చి జాంబవతి మెళ్ళో వేసింది.

ఫలహారంతోపాటు తేనె పిండిన ఒక పాత్రను తెచ్చి జాంబవంతుడికిచ్చింది.

తేనె తాగి అలిసిన శరీరాన్ని పక్కమీద చేర్చి నిద్రకుపక్రమించాడు జాంబవంతుడు.

"నాన్న ఈ మధ్య నీరసంగా వుంటున్నాడు కదూ దాదీ? ఏదన్నా ఔషదం తీసుకోమంటే వినిపించుకోడు" అని దిగులు పడింది జాంబవతి.

"కూతురి పెళ్ళి గురించి దిగులు పడుతున్నాడు ఆయన?" అని దాది కూడా అనుకుంది.

పాటపాడుతూ ఉయ్యాల ఊగుతోంది జాంబవతి ఆభరణం లభించిన ఆనందంతో.

గుహ లోపలికి ప్రవేశించిన కృష్ణుడు విస్మయ చకితుడై నిలబడిపోయినాడు.

... ...

జాంబవతీదేవి శమంతకమణి సహితంగా కనిపించింది. కన్యామణి అందం ముందు శమంతకమణి అందం తీసికట్టు అనిపించిందతనికి.

ఈ అందగాడెవరు? తమ గుహ లోపలికి ఎలా ప్రవేశించగలిగాడు? అని ఆశ్చర్యపోయింది. జాంబవతి.

అట్లా ఒకరినొకరు ఆరాధనగా చూసుకుంటున్నప్పుడు భల్లూకపతి జాంబవంతుడు వాళ్ళమధ్యకి దూకాడు.

"ఎవడవురానువ్వు?" అంటూ పోరాడసాగాడు. కృష్ణుడు చెప్పబోయే మాటల్ని వినిపించుకోకుండా.

జాంబవంతుని బలం క్షీణించింది. తనకి మరణం ఆసన్నమైందని గ్రహించాడు. శ్రీరాముడే ఈ కృష్ణుడిగా అవతరించాడని అర్థమైంది. అడవిలో అనాధగా ఏడుస్తూ దొరికిన పసికందుని తీసుకొచ్చి నేను పెంచి పెద్ద చేశాను. నేను వెళ్ళిపోతున్నాను.

శ్రీకృష్ణా! నా బిడ్డకిక నువ్వే నాథుడివి. సర్వస్వము నువ్వే జాగర్తగా చూసుకో ప్రభూ!" అంటూ జాంబవతీదేవిని కృష్ణుడి చేతిలో పెట్టాడు ఆ భల్లూకనాథుడు.

"నాన్నా! నాన్నా! అంటూ ఏడ్చింది జాంబవతి. తను సొంత కూతురు కాదా? దొరికిన పిల్లా? ఎంత ప్రేమగా పెంచుకున్నాడు. దాదిని నియమించాడు. తన కోసం ఈ మణిని తీసుకొచ్చి ప్రాణాలే కోల్పోయాడు. అయ్యో! పిచ్చినాన్నా. ఛీ ఈ పాడు మణి ఇంతటికీ కారణం అనుకొని విసిరేయబోయింది. నువ్వే మా నాన్నని చంపావు అని రోదించింది.

ఆ మణిని ఒడుపుగా పట్టుకున్నాడు కృష్ణుడు.

"జాంబవతీ! మనసుకి ధైర్యం చెప్పుకోవాలి నువ్వు. రామావతారంలో నా ప్రియానుచరుడు మోక్షం పొందాడు. ఇప్పటికే రెండు యుగాల పర్యంతం జీవించాడు నీ తండ్రి. ఈ మణి మీద ప్రలోభంతో నేను మీనాన్నని చంపలేదు. తనే నాతో ద్వంద్వ యుద్ధం కోరుకున్నాడు. నన్న నమ్ము" అని ఓదార్చి శమంతకమణి కథ చెప్పాడు. ఈ మణిని ఆ సత్రాజిత్తుగారికిచ్చేస్తే నా బాధ్యత తీరుతుంది" అని ఓదార్చాడామెను మళ్లీ-

జాంబవంతుడి అంత్యక్రియలు నిర్వర్తించి "దాదితో సహా ద్వారకకు వెళ్దాం పద" అన్నాడు.

"మీరు నాగరీకులు...రాజులు..నేను అడవి బిడ్డని...నాకు పట్నంలో అందులో అంతఃపురంలో ప్రవర్తించే పద్ధతులు తెలియవు. పైగా నేను మీకు తగను. నేను రూపలావణ్యవతిని కాను. మీ వూళ్ళో అందరూ నవ్వుతారేమో కూడా" అని బాధపడింది జాంబవతి.

"నువ్వు అందగత్తెవి కాదన్నదెవరు దేవీ! ఏదీ వాళ్ళని నా కళ్ళపెట్టుకొని చూడమను. నిసర్గసౌందర్యంతో సహజ సద్గుణాలతో ఎంతో చక్కగా వున్నావో తెలుసా నువ్వు. ఇంక నాగరీకపు పద్ధతులంటావా? అవ్వేవస్తాయి. పైగా నేర్పించే

టందుకు మా పరిచారికలుంటారు. నీ యిష్టానికి వ్యతిరేకంగా ఏం జరగదు సరేనా" అంటూ కృష్ణుడామెనులాలించాడు.

"నిజంగా? మరైతే నాకు ఎప్పట్నించో సంగీతం నేర్చుకోవాలని కోరిక. నేర్పిస్తారా?" ఆశగా అన్నది జాంబవతి.

"తప్పకుండా నారదమహర్షినే నీకు సంగీతం నేర్పమంటాను సరేనా?"

"ఆఁ నారదమహర్షి నాకు గురువౌతారా? మీరు ఎంత మంచివారు! స్వామీ మీకు సంగీతం వచ్చా?" అని అడిగింది జాంబవతి. పసిపిల్లలాగా ఆమె ఆనందించటం చూసి కృష్ణుడికొక ముద్దయింది.

మురళి పాటలు వచ్చులే" అన్నాడు అలవోకగా.

"అయితే మీరోపాట పాడండి" అని అడిగిందామె.

"ముందు నీ శిరోజాలు సవరించి కొత్తరకంగా అల్లుతాను" అన్నాడు కృష్ణుడు.

సిగ్గుపడింది జాంబవతి.

"మీకు జడలు వెయ్యటం వచ్చా?" అని

"చూడుమరి" అంటూ నాగరీకంగా ఆమె కురులు అల్లాడు కృష్ణుడు. దగ్గర్లోనే పైకి పాకుతున్న తీగపువ్వుల్ని కోసుకొచ్చి జడలో అమర్చాడు.

మధ్యమధ్యలో పాటపాట అంటూనే వుందామె.

తర్వాత ఆయన ఆమె ముద్దు చెల్లించాడు. ప్రకృతికి సంబంధించిన పాట పాడాడు. మురళి వాయిస్తూ. జంబవతి వివశురాలైపోయి విన్నది. నాకు పట్టిన ఈ అదృష్టం ఇంకెవరికి పట్టింది ఈమోహన మురళీగానం విన్నాక ఇంకే పాట బావుంటుంది. తన్మయురాలైపోయిందా అడవి బాలిక.

... ...

"రాజకుమారీ! సాత్రాజితీ! చిత్రశాలకి వెళదాము రావమ్మా! ఎవరో గొప్ప చిత్రకారుడట. గొప్ప గొప్ప చిత్రాలు గీసి నాన్నగారికి బహూకరించాడట" అంటూ వచ్చింది చెలికత్తె.

"చిత్రశాలకా? వద్దులే..." నిస్పృహగా చెప్పింది సత్యభామ. పినతండ్రి ప్రసేనుడు ఆమెని అల్లారుముద్దుగా చూసుకునేవాడు. అతని హఠాన్మరణం. అదీ వధించబడటం మిక్కిలి బాధకలిగిస్తోంది సాత్రాజితికి.

ఆమెని ఆ దుఃఖం నించీ మళ్ళించటానికి రకరకాల ఉపాయాలు పన్నుతున్నారు చెలికత్తెలు. అందులో భాగమే ఈ చిత్రశాల.

స్నేహితురాలు ఊరుకోలేదు. ఆ బొమ్మలు చూస్తే మనసుకి కాస్త ఊరట కలుగుతుంది సత్యభామాదేవీ. వెళ్దాంపద" అని బలవంతం చేసింది. అయిష్టంగానే ఒప్పుకుంది సత్య. అలంకారాదులు త్యజించి పినతండ్రిపోయిన బాధలోవున్న సత్యకి ఇద్దరమ్మాయిలు కలిసి జడవేశారు. శిరోజాలంకరణ చేశారు. అగరుబొట్టు పెట్టారు. కస్తూరితో కుంకుమపువ్వు పొడితో కణతలమీద మకరికా పత్రాలు దిద్దారు. పచ్చకర్పూరం మొదలైన శీతల సుగంధ వస్తువులతో సమ్మిళితమయిన నందివర్ధనం పువ్వులు, కాటుక దిద్దారు. ఇదేమిటోనమ్మా ఈ పిల్ల కళ్ళు పద్మపత్రాలకంటే పెద్దగా వున్నాయి. చెవులదాకా వున్నట్టున్నాయి చూడబోతే ఎవరు చెట్టబట్టబోతున్నారోగాని అతగాడు ఈ దేవి చూపులనించీ మటుకు తప్పించుకోలేడు అనుకుంటూ ముసి ముసిగా నవ్వుకున్నారు చెలులు.

"ఏమిటి? నవ్వులు. జడతో కొట్టమంటారా?" అంది సత్యభామా చిరాగ్గా.

"అమ్మో!" అని భయం నటిస్తూ దూరంగా పరిగెత్తింది పరిమళ.

"మమ్మల్ని కొట్టి ఏం లాభమమ్మా! ఈ జడదెబ్బలకెవడునోచుకున్నాడో పాపం. అతగాడికోసం అట్టేపెట్టు తల్లీ!" అన్నది.

"అలంకారం పూర్తయింది అద్దం చూసుకుంటావా రాజకుమారీ!" అంటూ అద్దం అందించబోయింది చిత్రలేఖ.

'ఊఁ వద్దులే నాకు చెయ్యినెప్పి" అన్నది సత్యభామ.

"సరేలే అయితే నిలువుటద్దంలో అందంచూసుకుందువుగాని లే" అన్నది చిత్రలేఖ.

అద్దంబుపిడిముట్ట నలయుపాణితలంబులు
సకల సుకుమారి మా సాత్రాజితీ కుమారి

అని కవిత్వం చెప్పిందొక సఖియ.

అమ్మాయిలందరితో కలిసి చిత్రశాలకి బయలుదేరింది సత్యభామ. నక్షత్రాల మధ్య రోహిణిలాగా.

చిత్రకారుడు శ్రీకృష్ణుడి జీవిత విశేషాల్ని చిత్రాలుగా వేశాడు. పూతనని చూసి భయపడింది సత్య. కంసుణ్ణిచూసి అదిరిపడింది.

"వికృతపు బొమ్మలు చూడలేదమ్మా మా సాత్రాజితి. కష్టాలకోర్వలేదు. చిలకకి పద్యాలు నేర్పించి అలిసిపోతుంది. రాయంచలకి నడకలు నేర్పి సొలసిపోతుంది. బంగారపు ఉయ్యాల లెక్కి ఊగడానికి భయం. బొమ్మలపెళ్ళిళ్ళు చేస్తే అలసట. మ్రాకుకి తీగని పాకించలేదు. మగవాళ్ళ ఎదట పడదు. ఈ తన్వి ఎలా మనుతుందో ఏమో? నాట్యం నేర్చుకోనంటుంది ఆభిజాత్య సమన్విరాలు ఎలాంటి భర్త దొరకాలి ఈమెకి. కాలు కసిగందకుండా ఏలుకోవాలి" అనుకున్నారు చెలులు.

"అందుకే గదా మహారాణిగారు అమ్మాయిగారి చేత వ్రతాలు చేయిస్తున్నారు. అట్లాంటి వరుడు ఆమెని వెతుక్కుంటూ రావాలనేగా" అన్నది పరిమళ.

"అట్లా సుకుమారంగా కనపిస్తుంది కానీ ధనుర్విద్యలో రాజకుమారి ఎంతటి నేర్పరి. గురువుగారు హేతు మతిగారు ఎంత మెచ్చుకుంటారు రాకుమారిని" అన్నది చిత్రలేఖ.

వాళ్ళ మాటలేవీ వినిపించటంలేదు సత్యభామకి. అసలు ఈ లోకపు స్పృహకూడా లేదు. వ్యత్యస్తపాదారవిందుడై, పీతాంబరధారియై వేణువుతో గోవుల్ని పరవసింపజేస్తున్న మోహన మూర్తి చిత్రం ఎదుటే నుంచుండిపోయింది ఎంత అందంగా వున్నాడీ అబ్బాయి. ఆడపిల్లలెవరేనా కళ్ళు తిప్పుకోగలరా ఇతని నించీ అనుకుంది.

ముందుగా చిత్రలేఖ చూసిందీ దృశ్యం.

"అదుగో అటు చూడండి. కుతూహలం తీరిపోతుంది మీకు" అన్నది పరిమళ.

సత్యని చూసి అంతా గువ్వకోలుగా నవ్వుకున్నారు. బావున్నాడు కదమ్మా ఈ నీల మోహనుడు. ఇతడు యాదవ వసుదేవుడిగారి కొడుకు. బలరాముడిగారి తమ్ముడు. దేవకీదేవి నోముల పంట. యశోదానందుల యింట పెరిగాడు. పరమ విశిష్టగుణశాలి. ఈ యనహృదయం నవనీతమేనట. క్రూరరాక్షసులని మటుకు బతకనీయడట. ఈ లోకసమ్మోహనమూర్తి వంశీ కృష్ణుడు నీకు నచ్చాడా రాకుమారీ!" అని ఆ పటంలో చిత్రితమై వున్నవాడి విశేషాలు వివరిస్తూ అడిగింది పరిమళ. అంతకుముందే కృష్ణుడు మణిని కాజెయ్యలేదనే వార్త తెలిసింది.

"ఛీ...పో..." అంటూ గిరుక్కున వెనక్కి తిరిగింది సత్యభామ.

"అమ్మో జడగంటలు" అంటూ బుగ్గలు పట్టుకొని దూరంగా పరిగెత్తింది పరిమళ.

అంతా ఒకటేనవ్వులు. సత్యభామ చెక్కిళ్ళనిండా ఎరుపులు. అప్పుడొచ్చింది వార్త. సత్రాజిత్తుగారు అమ్మాయిగార్ని వెంటనే రమ్మంటున్నారని.

చెలులవెంటనడిచి వస్తున్న మెరుపుతీగని అన్నుల మిన్నని చూశాడు కృష్ణుడు,. కాస్తంత అహంకారమూ సౌకుమార్యమూ ఆభిజాత్యమూ వున్నా మీదు మిక్కిలి సౌమనస్యమున్న భామామణిని చూశాడు కృష్ణుడు.

"చూడు చూడు సత్యా! అలా తలవంచుకోకు. అతణ్ణి గుర్తుపట్టావా? అని పరిమళ అంటే చూసింది.

"అరె చిత్రపటంలోని నీలమేఘశ్యాముడు ఎట్టఎదుటకి సాకారుడై ఎలా వచ్చాడు? పటంలో కంటే అందంగా వున్నాడే. అదేమిటా అల్లరి చూపులు. అమ్మో గొప్పమాయలో పడిపోతారు ఇతన్ని చూసిన ఆడపిల్లలు...అనుకుంది సత్య.

"అమ్మాయి సత్యా! వీరు ఎవరో తెలుసా? మధురా నగరాధిపతి ఉగ్రసేనుల వారి మనుమలు. వీర్ని నేను శమంతకమణి అపహరించారని అపనింద మోపి అవమానించాను. జాంబవంతుడి దగ్గిరుందిట ఈ మణి. ఇదుగో తీసుకొచ్చి యిచ్చే శారు. పశ్చాత్తాపంతో కుంగిపోతున్నానమ్మా. ధనం ఎంత చెడ్డది. ఆశ ఎంతకిదారి తీస్తుంది. అయ్యో ఎంత పొరపాటు చేశాను. దురాశ నించీ ధనవ్యామోహం నించీ విముక్తుడిని కావాలనుకుంటున్నాను. ఇకనైనా శమంతకమణిని శ్రీకృష్ణుడికే సమర్పిం చుకుంటున్నాను. ఇందుకు నీకుగాని నీమాతృదేవికిగాని అభ్యంతరం ఉండదు గదా" అన్నాడు సత్రాజిత్తు.

నాన్నగారు ఎంత మారారు. ఎంత సుహృద్భావం ప్రకటిస్తున్నారు! అని ఆనందించింది సత్య.

"ప్రభూ! మీరొకసారి ఇలారండి" మహారాణి పిలిచింది.

"ఏమిటి?" అంటూ వెళ్ళాడు సత్రాజిత్తు.

మహారాజు ఆంతరంగికులూ చెలికత్తెలూ కృష్ణుడికి పరిచర్యలు చేస్తూ ఛలోక్తులాడుతున్నారు.

"అబ్బాయిని చూశారా ఎంత బావున్నాడో. మనం వేసిన అపవాదుకి ఒక్క శమంతకమణిని మాత్రమే యిస్తే సరిపోతుందా?" అన్నది మహారాణి.

"మరి మరేం చేద్దామంటావు? మనుషుల్లో ఈ నీలమేఘపు రంగు ఎక్కడా చూళ్ళేదు అని కృష్ణుడిని జనం ప్రశంసిస్తూ వుంటారు. తామరరేకులలాంటి నయనాలు ఇట్టే ఆకర్షిస్తూ వుంటాయి" అన్నాడు సత్రాజిత్తు ఏదో ఆలోచిస్తూ.

"అదే గదా నేను చెప్తున్నది. అలాంటి వాడిని వదులుకుంటామా? మన సత్యభామకి ఇంతకంటే మంచి వరుడిని తేగలమా?" అన్నది మహారాణి.

"సత్యని ఇతనికి.... ఇద్దామంటావా? ఔను సుమా మంచి ఆలోచనే ధర్మపత్నీ! బాగా చెప్పావు .... కానీ.......

"మళ్ళీ కానీ ఏమిటి?"

"కృష్ణుడికి ఇదివరకే వివాహమైంది. రుక్మిణి అనే రాజకన్య కోరి వరించిందతన్ని. ఇప్పుడు జాంబవతిని కూడా....."ఆగాడు మహారాజు. అయినా అమ్మాయికి ఇష్టమో కాదో" అన్నాడు.

"అక్కడికి మీరేదో ఏకపత్నీ వ్రతులైనట్టు? పురుషుల సంగతి అందునా రాజపురుషుల సంగతి ఎరగమా?" అందామె.

"సత్య మొహం ఎలా వెలిగిపోతోందో చూడలేదా? అమ్మాయికి చాలా ఇష్టం అని తెలీటల్లా" సంతోషంగా శ్రీకృష్ణుడిని సమీపించారు ఆ భార్యాభర్తలు. శమంతక రత్నంతోపాటుగా మా పుత్రిక అయిన సత్యభామా కన్యారత్నాన్ని కూడా స్వీకరించమని కోరుతున్నాము అన్నారు.

"మీ కుమార్తెకిష్టమో కాదో అడిగారా? అయినా నాకు కన్యామణి చాలు. శమంతకమణి వద్దు" అన్నాడు కృష్ణుడు ఎల నవ్వుతో.

సత్యభామ సిగ్గుతో లోపలికి పారిపోయింది.ఆ మెకి బదులుగా పరిమళ చెప్పింది సత్యభామాదేవికి ఈ పెళ్ళి ఇష్టమే అని.

అతి తొందరలో మంచి ముహూర్తం చూసి సత్యాకృష్ణుల వివాహం జరిపించాడు సత్రాజిత్తు. జాంబవతీ నిశాచంద్రోదయమై సత్యభామా శుకీకేళింపంజరమై కృష్ణుడు విహరించాడు. భోజకన్యా సరిత్ రాజహంసమైనాడు.

... ...

ద్రౌపదీదేవిని కాన్పుకి పుట్టింటికి తీసుకువచ్చారు.

కుంతీదేవి ఎంతగానో సమర్థించుకొచ్చినా పంచపాండవుల రాజకార్యాలు సరిగ్గా సాగలేదు. బ్రాహ్మణ సంతర్పణలూ అరకొరగా అలాగే వున్నాయి.

ఈ లోపల ధర్మరాజు దేవిక అనే కన్యకను చూసి ఇష్టపడి స్వయంవరంలో గెలుచుకొని మరీ వివాహమాడేడు. ద్రౌపది ఏమనుకుంటుందో అని కుంతి ఎక్కువ జంకింది.

పెళ్ళైన మొదటి సంవత్సరంలో ధర్మరాజు ద్రౌపదికి ఆయుధగారంలోని వివిధా యుధాల్ని వివరంగా చూపిస్తుండగా బ్రాహ్మణుడి ఆవును కాపాడటానికి ఆయుధం కోసం అక్కడికి వచ్చిన అర్జునుడు నియమం ప్రకారం తీర్థయాత్రలకెళ్ళినపుడు.

4

అలిసిపోయి తలకింద చెయ్యి పెట్టుకొని నదీ తీరంలో వున్న చెట్టుకింద నిద్రపోతున్నాడు అర్జునుడు. సమీపంలోని అమ్మాయిల కిలకిలా రావాలు కూడా అతని నిద్రని భంగం చేయలేకపోయాయి.

చెలులతో సయ్యాటలాడుతూ అటుగా వచ్చిన నాగ కన్యక ఉలూచి నిద్రిస్తున్న ఆ అందగాణ్ణి చూసి విస్ఫారిత నేత్రాలతో నిలబడిపోయింది.

"ఇతడు పార్థుడా?" అనుకుంది. 'ఔనితడు పార్థుడే' అనుకుంది. ద్రౌపదీ స్వయంవర మహోత్సవానికి కిన్నర కింపురుష యక్షదేవతాదులందరితోపాటు వెళ్ళి తిలకించిందితణ్ణే. కాకపోతే అప్పుడు బ్రాహ్మణ యువకుడిలా వున్నాడు.

పోల్చుకోవటానికింత తటపటాయింపు అవసరమైంది. ఇప్పుడూ రాజ ఋషికి మల్లే వున్నాడే. ఈ విధంగా వేషాలు వెయ్యటం ఇతగాడికి సరదాగావున్ను. 'సేంద్ర చాప శంపారుచి మేఘమోయనగ పాండవ మధ్యముడైన ఈతడు బద్ధతూణీరుడై కవచకిరీట ధరుడై రాజీవితో తనకు కనపడదా అనుకుంటూ మళ్ళీ తేరిపార చూసింది ఎందుకైనా మంచిది ఇతడు ఇంకెవరో కాదు గదా అని. అతని చెవికి దగ్గరగా కంకణాల్ని మృదువుగా మ్రోగించింది. అతడు అటునించీ ఇటు తిరిగాడు. ఆ నిద్రలోనే.

అప్పుడు 'ఇంద్రోపలరోచిజూచి తలయూచి యులూచి రసోచితంబుగన్' సిగ్గు పడింది. ఆ జవరాలి పెదవులు అదరసాగాయి. పక్కనేవున్నమందారచెట్టు పువ్వులు పోటీకొచ్చేటట్లు ఆ కన్య చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి.

ఔను మరి. ఈ అందగాణ్ణి ద్రౌపదీ స్వయంవరంలో చూసినప్పట్నించీ ఆ పిల్ల ప్రేమలో పడిపోయింది. మనసా వాచా కర్మణా అతణ్ణే భర్తగా వరించిన ఆ నాగరాజ కుమారి ఈ విషయం బయటపెట్టటం ఎట్లాగా అని తికమక పడుతుండగా. వెదకబోయిన తీగ కలికి తగిలినట్లు కళ్ళముందే సాక్షాత్కరించాడు అదీ ఒంటరిగా అమ్మయ్య! భార్య పక్కన లేదు. సోదరులూ లేరు. దేవుడు నా మొఱ విన్నాడు. అని ఆనందించి అర్జునుణ్ణి ఆ నదిలోనించీ పాతాళలోకానికి తీసుకెళ్ళి పోయింది. అర్జునుడు కళ్ళు తెరచి యథావిధిగా అక్కడ అగ్నిహోత్రం వుంటే దాన్ని అర్చించాడు. ఎదురుగా ఒక అపరిచిత యువతి వున్నది.

అర్జునుడు చిరునవ్వు నవ్వి "ఎవరు తరుణీ మణీ నువ్వు? ఎందుకు నన్ని నాగలోకానికి తీసుకువచ్చావు?" అని అడిగాడు. సిగ్గుపడింది ఉలూచి.

"బావుందమ్మాయీ! నన్ను ఎత్తుకొచ్చిందీ నువ్వే. సిగ్గుపడేదీ నువ్వే" అంటూ మనోహరంగా నవ్వాడు పార్థుడు.

"ఈ నవ్వే ఈ నవ్వుని చూసే మనసు పారేసుకున్నాను. ధీరగంభీరమూర్తీ! పృథాకుమారా!" అన్నది ఉలూచి.

ఒక విధమైన ఎరుపురంగుతో మెరుపు లీనుతున్నదా యువతి. అత్యంత బిగువైన శరీరం. ద్రౌపదికంటే కాస్త పొడుగ్గా వుంది. చిన్న చిన్న కళ్ళు తేనేరంగులో తళుక్కుమంటున్నాయి. పల్చని తెల్లని వలువలు ధరించి వుందామె.

"నా నవ్వు నువ్వెప్పుడు చూశావు? నేను నీకు తెలుసా? నేను మటుకు నిన్నెప్పుడు చూడలేదే'' అన్నాడు అర్జునుడు.

అతని ఎగుభుజాల వంక లీలాగతితో చూసిందామె. "నిన్ను ఎప్పట్నించో గమనిస్తున్నాను. ద్రౌపదీ స్వయంవరంలో కూడా నిన్ను గుర్తుపట్టాను కౌంతేయా! త్రికరణ శుద్ధిగా నిన్ను వరిస్తున్నాను. నన్ను భార్యగా స్వీకరించు.

'తీయగ పంచదారవెనుదీయగ గ్రహింపుమా నను ద్వితీయగన్' అన్నదామె పైగా అతని పెదవులమీద ఆన పెట్టింది. నీ గుణములు నాగీ గీతములలో విన్నాను. నీకు వ్రత భంగంకాదు'' అని నిరూపించింది.

"రమణీ! నిన్ను ఈ క్షణమే భార్యగా స్వీకరిస్తున్నాను'' అని అర్జునుడు ఉలూచి పాణినిగ్రహించాడు.

నాగకన్యక ఉలూచి పాండురాజుకోడలైంది. ఆమె గర్భవాసాన ఇరావంతుడు జన్మించాడు పాండు పౌత్రుడై.

అర్జునుడు తమ రాజధాని ఇంద్రప్రస్థపురానికి వచ్చి పోతుండమని చెప్పాడు ఉలూచితో. తనుకూడా వీలైనప్పుడు నాగలోకానికి వస్తుంటానన్నాడు. వియోగాన్ని భరించలేక విలపిస్తున్న ఉలూచిని అక్కున చేర్చుకొని కన్నీరు తుడిచి సమాశ్వాసించి మళ్ళీ తన తీర్థయాత్ర ప్రారంభించాడు అర్జునుడు.

మణిపూరుపురం చేరుకున్నాడు. అంతకుముందర ఉలూచిని వీడ్కొని గంగా ద్వారంబునకు వచ్చి తోటి తీర్థయాత్రాపరులైన బ్రాహ్మణుల్ని కలుసుకున్నాడు అతడు. కళింగదేశం ప్రవేశించి పూర్వసముద్ర తీరంలో వెలసిన పురుషోత్తమ జగన్నాథ దేవరకి నమస్కరించి మహేంద్ర పర్వతం చూచి దక్షిణ గంగ అని పేరొం

దిన గోదావరీనదిని దర్శించాడు. భీమేశ్వరాన్ని శ్రీపర్వతమని పేరుపొందిన విజయపురిని చూశాడు. అనఘమై శిష్టాగ్రహార భూయిష్ఠమై యజ్ఞముల చేత పుణ్యసమృద్ధమైన వేగీదేశవైభవాన్ని కాంచాడు. ప్రయాణం కొనసాగించి కావేరీ సముద్ర సంగమాన్ని చూశాడు. బ్రాహ్మణులకి దానాలుచేసి కృతార్థుడైనాడు. అప్పటికి రాజధాని వదలి పదమూడు నెలలైంది. పదమూడవ నెలలో మణిపూరు పురం ప్రవేశించాడు.

ఆ పురాన్ని చిత్రవాహనుడనే రాజు పరిపాలిస్తున్నాడు. ఆయన ఏకైక కుమార్తె చిత్రాంగద. సమధిక రూపలావణ్య విశారద. వెడద కన్నులూ, సన్నని నడుమూ ఆమెకి పెట్టని సొమ్ములు. వత్తుగా మెత్తగా వున్న ఆమె కురులను చెలికత్తెలు విచిత్రంగా ముడిచుట్టారు. అందువల్ల ఆమె మరింత సోయగాలవెల్లువలా వుందావేళ.

"ప్చ్... ఆడపిల్లలం మాకే ముద్దొస్తున్నావివాళ యువరాణీ! ఇహ అతడే గనకవస్తే... వచ్చి నిన్ను చూస్తే...." చెలికత్తె మాలతి మేలమాడింది.

"అమ్మో! ఇహ ఆ తరువాత ఏం జరుగుతుందో చెప్పకే మాలతీ! అమ్మాయీ మణి బెదరిపోతోంది" అన్నది వసుమతి.

"నిజమే సుమా! కట్టినవి ఎరుపు రంగు మేలిమిపట్టుదకూలమూ రత్నాలు అద్దిన అంగదట్టమూ, కావిరంగుమల్లెవాటూ, మేలిముసుగూనూ... మందార వర్ణంలో మెరిసిపోతున్న దేవిగారి బుగ్గలు కూడా ఎర్రబడిపోయినై సుమా!" అన్నది మాలతి. అచ్చు ముద్దమందారంలా వుంది కదూ" అన్నది.

మాలతి బుగ్గ మీద పొడిచి "ఇకచాల్లే...మరీ శ్రుతిమించిపోతున్నారు ఇద్దరికిద్దరూ. ఏ మైందివాళ?" అన్నది చిత్రాంగద.

"ఏమవటమేమిటి?" అనుకున్నంత అయింది. వచ్చాడమ్మా వరుడు. వాకిలి దాకా వచ్చేశాడమ్మా వరుడు... వీరవరుడు అని పాడింది మాలతి.

పళ్ళెంలో వున్న పువ్వులు తీసి చెలికత్తెల మీదికి విసిరింది చిత్రాంగద.

"ఏమిటా ప్రేలాపన? నేను వేరే ఏ వరుణ్ణీ వరించనని చెప్పానుగా పాండవ మధ్యముడు ధనుర్విద్యావిశారదుడు. సుందరుడు అయిన నరవరుడు అర్జునుణ్ణి తప్ప మరొకర్ని నేను పెళ్ళాడేది లేదు" అన్నది చిత్రాంగద.

"ఏం నరవరుడో ఏమోనమ్మా! ఆయన మత్స్యయంత్రం పడగొట్టి పాంచాలిని చేపట్టాడు. తీర్థయాత్రాపరులైన బ్రాహ్మణులు చెప్పుకుంటుంటే విన్నాను ఈ మధ్యనే ఉలూచి అనే నాగకన్యక ఆయన్ని వరించిందట. ఇప్పుడు నువ్వు మూడవ భార్యవి అవుతావు. నీ తర్వాత కూడా ఫల్గుణుడు ఎవర్నీ వరించడని రూఢిలేదు. ఇందరితో భర్తని పంచుకుని ఏం సుఖపడతావమ్మా యువరాణీ!" అన్నది మాలతి.

సాలోచనగా చూసింది చిత్రాంగద.

"నువ్వన్నది నిజమే మాలతీ! భర్త తన ఒక్కదానికీ స్వంతంకావాలని ఏ స్త్రీ కోరుకోదు? కానీ ఇప్పటి పరిస్థితులెలా వున్నాయి. స్త్రీలకంటే పురుషులు తక్కువైనారు. ఒక్కొక్క పురుషుడికీ కనీసం ఇద్దరు ముగ్గురు భార్యలైనా వుంటున్నారు. రాజాధిరాజుల సంగతి ఇక చెప్పేందుకేముందు. ద్రౌపదీ స్వయంవరం కాకముందు నించీ కూడా నేను అర్జునుణ్ణి మనసా వలచాను. చారులూ, బ్రాహ్మణులూ, వార్తాహరులూ అందరూ అతని శౌర్యాన్నీ సౌందర్యాన్నీ పొగిడేవారే. అందుకే అమాయకంగా అతని మీద మనసు పడ్డాను. పెళ్ళిళ్ళు చేసుకున్నాడని తెలిసినా మక్కువ మరల్చుకోలేక పోతున్నాను. వేరే పురుషుణ్ణి నే వివాహమాడే ప్రసక్తేలేదు. ఇక నా అదృష్టం ఎలానన్నా వుండనీ" అన్నది.

నిట్టూర్చింది మాలతి.

"దేవి! నీ సంగతి నాకు తెలుసు. నీ మనసు నిండా అర్జునుడు నిండివున్నాడని ఎరగనా అమ్మా! పై వచ్చే యుగంలో నన్నా ఒకపురుషుడికి ఒకే భార్య అయితే బావుండు. ఏకపత్నీవ్రతులైన పురుషులకి వేయి వేల ప్రణామాలు చెయ్యదా స్త్రీ జాతి? మనమంతా ఇలా జరగాలనే కోరుకుందాం మనస్ఫూర్తిగా" అన్నది వసుమతి.

"బాగా అన్నావు సుమా వసుమతీ! కానీ ఒక్కడొక చిక్కుంది. చిత్రాంగదాదేవిగారి వంశంలో ఇంతవరకూ ఒక్కొక్కరే మగపిల్లలు పుడుతూ వంశంనిలుపుతున్నారు. ఈసారిమటుకు అదేం చిత్రమో మన చిత్రసేన మహారాజుగారికి అమ్మాయి అదే మన చిత్రాంగద పుట్టింది. చిత్రాంగద సంతానమే ఈ మణిపూరు రాజ్యానికి వారసులు. సంతానమంటే ఒక కుమారుడు కల్గుతాడని జ్యోతిష్కులు చెప్పారుగా. ఇల్లరికం వుండమంటే ఏ రాజుకుమారుడూ ఒప్పుకోడుగా. అందులో ఏకపత్నీవ్రతుడు కుదరడు. అర్జునుడు అంగీకరిస్తే ఆయనే మన చిత్రాంగదకి తగిన వరుడు" అన్నది మాలతి.

"ఏం ఎందుకంగీకరించడాయన? చేదుమేస్తాడటనా మన అందాల భరిణ చిత్రాంగదని చేసుకొని" కోపం వచ్చింది వసుమతికి. అంతలో రూపమతి పరిగెత్తు కొచ్చింది. అర్జునుడు మహారాజు దగ్గిరికి వచ్చాడు. ఆయన మన చిత్రాంగదగార్ని వివాహమాడాలనుకుంటున్నారని బ్రాహ్మణులు చెప్పారట. మన మహారాజుగారు చిత్రాంగదార్జునులకు పుట్టబోయే కుమారుడిని తనకి వంశకర్తగా యివ్వాలన్న విషయం చెప్పి అన్ని విషయాలూ వివరించారుట. అర్జునుడు ఒప్పుకున్నాడుట. అని శుభవార్త చేరవేసింది కన్యాంతఃపురానికి.

"చూచాయగా మాకూ ఈ వార్త తెలిసింది రూపమతీ అందుకే యువరాణిగార్ని ఈ వివాహానికి సుముఖం చేస్తున్నాం ఇందాకటినుంచి" అన్నారు మాలతీ వసుమతీ.

ముగ్గురూ చప్పట్లు కొడుతూ చిత్రాంగద చుట్టూ తిరుగుతూ "కల్యాణమే వైభోగమే మా యువరాణి పెళ్ళికూతురాయెనే. ఆనందమానందమాయెనే" అని పాడి ఆడారు.

మహారాణి వచ్చి సిగ్గులమొగ్గ అయిన కుమార్తె శిరస్సు మూర్కొన్నది "అమ్మాయీ! సవతులతో వుండాల్సిన పరిస్థితి నీకులేదు. నువ్విక్కడేగా వుంటావు. ఎప్పుడన్నా అదీ చుట్టపుచూపుగా ఏ ఉత్సవాలకో అత్తవారింటికి వెళ్ళొస్తావు. అదృష్టవంతురాలివి. నీ కలల రాకుమారుడు పార్థుడు చాలా అందంగా వున్నాడు.

రాజకార్యాలకు తీరిక చిక్కినప్పుడల్లా అల్లుడుగారు ఇక్క డికీ వస్తారు. రా ఒక్కసారి నిన్ను చూస్తాడుట అతడు'' అంటూ చిత్రాంగద చెయ్యిపుచ్చుకొని తీసుకొచ్చింది.

"కాస్త తల ఎత్తాలి యువరాణీ!'' అంటూ వెనకాలే వచ్చారు మాలతీ వసుమతీ రూపమతీ.

ఫల్గుణుడు అతి పల్చని మేలి ముసుగులోనించీ అంగజ రాజ్యలక్ష్మి పొడ సూపినదా?'' అన్నట్లున్న చంద్రవదనని చిత్రాంగదని చూశాడు. పాంచాలి నీ ఉలూచినీ కాసేపు మర్చిపోయాడు. మనసు మోహన వశమైపోయింది.

చిత్రాంగద కూడా మేలిముసుగులోనించీ కౌంతేయుడిని చూసింది. పరాక్రమనిధి, పురుష సింహుడు, సుందరోజ్వలుడు అర్జునుడినిచూసి ముగ్ధురాలైంది.

మహారాణి సంతుష్టాంతరంగురాలైంది.

"అర్జున కుమారా! మా కుమారి చిత్రాంగదతో కలిసి ఉద్యానవన విహారానికి వెళ్ళిరావయ్యా. ఈ లోపు కార్తాంతికుల్ని పిలిచి మీ మామగారు మీ వివాహానికి ముహూర్తాన్ని నిర్ణయిస్తారు'' అని చెప్పింది.

సిగ్గుతో తల మునకలౌతూ తడబడే నడకతో తలవంచుకొని కాబోయే భర్తని అనుసరించింది చిత్రాంగద.

"యువరాణీ! నువ్వు ముందు నడిచి నాకు దారి చూపించాలి'' అన్నాడు అర్జునుడు చిరునవ్వుతో.

"ముందు కాదు గాని మీతో సమానంగా నడుస్తాను పదండి'' అన్నది మెల్లిగా చిత్రాంగద.

"అరె కోయిల కూసిందేమిటి ఇప్పుడు అకాలంలో?'' అంటూ చుట్టూ చూశాడు అర్జునుడు.

"కోయిల కూత నేను వినలేదే" ఆశ్చర్యపోయింది చిత్రాంగద.

"నేను విన్నాగా. తరువాత తెలిసింది. అది నా ప్రేయసి కంఠస్వరం అని" అర్జునుడు ఓరగా చూశాడామె వేపు.

ఫక్కున నవ్వింది చిత్రాంగద.

"అయ్యయ్యో ముత్యాలన్నీ ఎక్కడ రాలిపోతాయో" గాభరా నటించాడతడు.

మళ్ళీ నవ్వింది చిత్రాంగద. "పాండుకుమార మధ్యములు చతురులే" అన్నది.

... ...

ద్రౌపదీ ధర్మరాజూ అనురక్తులై విహరిస్తున్నారు. అది వాళ్ళ పెళ్ళయిన మొదటి సంవత్సరం. నియమం ప్రకారం ధర్మరాజు ఇంట్లో వున్నది ద్రౌపది. పగలు తన భర్త ధర్మరాజు అన్నస్పృహ వుండేదామెకి. కానీ రాత్రయితే అర్జునుడే తన సన్నిధానంలో వున్నట్లుంటుంది. గోపాలదేవుడి మాయవల్ల ఈ స్పృహ మర్చిపోవాలని కుటుంబ బాధ్యతలన్నీ తలకెత్తుకుందామె. ఆమెకి తెలియకుండా అంతఃపురంలో ఏమీ జరగదు. అత్తగారైన కుంతీ మహాదేవికి పరిచర్యచేస్తుంది. పాండవుల బాగోగులు శ్రద్ధగా చూస్తుంది. దినంలో ఎక్కువ భాగం పనితోనే గడుపుతుంది పాంచాలరాజ పుత్రిక. శ్రీమూర్తియై యజ్ఞకుండంలోనించీ ఉద్భవించిన యాజ్ఞసేని. ఆగర్భ శ్రీమంతురాలు. అయిదుగురు దృష్టద్యుమ్నాది సోదరుల ముద్దుల చెల్లెలు. సింహ పరాక్రములైన పాండు సుతుల ఇల్లాలు అయివుండి కూడా ఎప్పుడూ ఇంటిపని చేస్తూండే కృష్ణాదేవిని చూసి అందరూ గౌరవించేవారు. ఆదాయ వ్యయాలు, సేవకుల వేతనాలు, భోజన భాజనాలు, అతిథి పరిచర్యలకయ్యే ఖర్చులు అన్నీ పరిశీలించి నిద్రపోయే దామె. అన్నం తినేటప్పటికి ఆ కమలాక్షికి అర్ధరాత్రి అయ్యేదొక్కక్కప్పుడు.

ఒకనాడు కుంతీదేవి కాళ్ళు వత్తుతూ కూచుంది కృష్ణ. కుంతీకోడలి సద్బుద్ధికీ అవిరళకృషికీ ఎంతో సంతోషించింది. "అమ్మాయీ! నేను నీకు అన్యాయం చేశానేమో

అని బాధగా వుంటుంది. మిగిలిన రాణులూ రాజస్త్రీలూ సుఖభోగాల్లో వస్త్రాభరణ, సుగంధాదుల్లో మునిగి తేలే సుకుమారులు. వాళ్ళుఇంట్లో పని చెయ్యరు సరిగదా వాళ్ళకే చెలికత్తెలు అన్నీ అమర్చి పెట్టాలి. మరి నువ్వు పాపం ఇంత ఇంటినీ నిభాయించుకొని అతిథిసేవా వృద్ధసేవా నిర్వర్తించి ఎంతో కష్టపడుతున్నావు తల్లీ. అయిదుగురు భర్తలకి నిన్ను భార్యగా నిర్దేశించాను ఆనాడు అసంకల్పితంగా నేను చేసిన పనికి ప్రాయశ్చిత్తంగా నీకొక వరం ఇస్తున్నాను పాంచాలీ! నిన్ను అర్జునుడొక్కడికీ భార్యని చేయకపోతినే అన్న దుగ్ధనశించటానికి ఈ మాత్రం చేస్తాను. ఈ నవఖండ మండిత మహీతల మేలుచు నీ పతులు పరాక్రమంతో రాజసూయం మొదలైన యజ్ఞాలు నిర్వర్తించగలరు భవిష్యత్తులో. వాళ్ళకి దైవ వశాత్తూ వేరే భార్యలు వచ్చినా పాండవుల పక్కన పీటలమీద నువ్వే కూర్చొనగలవు పాండుపుత్ర పట్టమహిషివి మట్టుకు నువ్వొక్కదానివే. యజ్ఞఫలం, పుణ్యఫలం, యజ్ఞానంతర అవబృథస్నాన ఫలం నీకు లభిస్తాయి. పాండవుల ఇతర భార్యలు కేవలం బంధువులతో సమానం. యజ్ఞాదులు చేసేటప్పుడు నీ భర్తలకి మానుగపత్ని నీవగుమువానితధర్మవిధానయుక్తితోన్ ఇందీవరలోచనా! ద్రౌపదీ కుమారీ! నువ్వు నాకు ఎంత సంతోషం కలిగిస్తున్నావో నీ బిడ్డలూ, మనమలూ నీకంత సంతోషం కలిగిస్తారు తల్లీ!'' అని వాగ్దానం చేసింది కుంతి.

ద్రుపద రాజపుత్రిక కళ్ళవెంట నీళ్ళు సుళ్ళు తిరిగి అత్తగారి పాదాలను తడిపాయి. లేచి కోడలిని అక్కున చేర్చుకున్నది కుంతి.

"అమ్మా కృష్ణా! నువ్వు దుఃఖిస్తే నేనూ దుఃఖించవలసొస్తుంది. ఒక్కొక్కస్త్రీకి ఒక్కో కష్టం. నా కడుపులో దాచుకున్న ఒక మహా బాధ ఎవరితో చెప్పుకోను. అది నాతోపాటు రగిలిపోవలసిందే'' అన్నది కుంతీదేవి చెక్కిళ్ళునించీ కన్నీరు ప్రవహించింది.

కర్ణుడు, సూర్యపుత్రుడు ఆవిడ మనసులో మెదులుతున్నాడు. ఆవిడ పేగు చుమ్మలు చుట్టుకుని పోతున్నది.

కుమారాస్త్ర విద్యాప్రదర్శననాడు మొదటగా తన కన్నకొడుకుని గుర్తుపట్టిందామె! తన మొట్టమొదటి బిడ్డ. సూర్యదేవుడి వరప్రసాదం. తనకావరం ఇచ్చిన దుర్వాస మహర్షిమీద మళ్ళీ కోపం వచ్చిందామెకి. కానీ ఆ వరం ఇవ్వకపోతే ఈ ధర్మజభీమ అర్జున నకుల సహదేవులు ఎక్కణ్ణించి వచ్చేవారు. భర్త అనుమతితో కనటంవల్ల వీళ్ళు పంచపాండవులైనారు. భర్త లేకుండానే కన్యగా వున్నప్పుడే చిన్నతనంవల్ల సూర్యమంత్రం జపిస్తే ఆయన ప్రత్యక్షమై వద్దన్నాసరే తనకి కొడుకునిచ్చి వెళ్ళిపోయాడు. సహజకవచకుండలోద్భాసితుడై, సూర్యసమప్రకాశుడై వెలిగే తన కడుపు పంటని నిష్కారణంగా, గుండెరాయిచేసుకొని నీళ్ళల్లో వదిలి పెట్టింది తను. అలాగే పంచపాండవుల్నీ కన్నది. వాళ్ళు రాజపుత్రులైనారు. వాళ్ళ అన్నయ్య దిక్కులేనివాడిగా అనాథగా సూతుడికి దొరకటం వల్ల హీనకులజుడై సూతపుత్రుడిగా బతుకుతున్నాడు. ఆ రాధ ఎంత పుణ్యాత్మురాలు. తన సొంత బిడ్డగా పెంచింది కర్ణుడిని. నిజమే. కర్ణుడు కౌంతేయుడు కాడు రాధేయుడే. కళ్ళు తెరవని పసిగుడ్డుని నిర్దాక్షిణ్యంగా నదిలో వదిలేసిన తను రాయిగుండె తల్లి. కానీ రాధ మనసు వెన్నపూస. దొరికిన బిడ్డని ప్రాణప్రదంగా పెంచిపెద్దచేసి వీరాధి వీరుడుగా మలిచింది. పెళ్ళి చేసింది. రాధ లేకపోతే తన బిడ్డ ఏమైపోయేవాడో. రాధ కాళ్ళు కన్నీళ్ళతో కడగాలి. కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం అయిన తరువాత దేవాలయంలో రాధ కనపడింది. భావసమ్మేళనంతో తను స్పృహతప్పి పడిపోతే ఆమె తన మొహంమీద చన్నీళ్ళు చల్లి తెలివి తెప్పించింది. అప్పుడు రాధ పరిచయమై క్రమంగా స్నేహంగా మారింది. ఒకసారి ఒక చక్కని అమ్మాయిని తనతో తీసుకొచ్చింది రాధ. ఆ పిల్ల తన కోడలనీ కర్ణుడి భార్య అనీ చెప్పింది. ఆ అమ్మాయి తనకి ప్రణామం చేసింది. ఆనందం ఒకకంటాపైకి చెప్పుకోవటానికి లేదే అన్న దుఃఖం ఒక కంటా నీళ్ళుగా చిమ్మాయి. పరిచారికలచేత అనర్ఘ రత్నాభరణాలనీ విలువైన వస్త్రాలనీ ఆ కోడలికి బహూకరించమని పంపించింది. కానీ అంతా రహస్యమే.

రాధకూడా కోడల్ని తీసుకొని భయపడుతూనే వస్తుంది. శత్రువుల ఇంటికి ఎందుకు వెళుతున్నారని కర్ణుడో దుర్యోధనుడో కోప్పడతారేమోనని. కర్ణ దుర్యోధను

లిద్దరూ ప్రాణమిత్రులాయె. తనకు అంగరాజ్యం ఇచ్చి ఆదరించాడని వల్లమాలిన కృతజ్ఞత కర్ణుడికి దుర్యోధనుడంటే.

ఏమిటో స్త్రీ అంటే ఎప్పుడైనా ఎందుకైనా పురుషుడికి భయపడుతూనే వుండాలేమో. చిన్నప్పుడూ అణిగి మణిగి వుండాలి. పెళ్ళయ్యాక ఇంకా అణిగిమణిగి వుండాలి. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక ఇంకా ఇంకా అదుపాజ్ఞల్లో వుండాలి. ప్చ్... తనుకూడా శత్రువైన కర్ణుడి తల్లినీ భార్యనీ ఎందుకు రానిస్తున్నావమ్మా' అని పాండవులు విసుక్కుంటారేమో అని భయపడుతూనే వుంటుంది.

మునులైన రాజులైనా పురుషుల ఆలోచనా సరళి ఒకటే తండ్రి అయినా భర్త అయినా కొడుకులైనా స్త్రీ ఒద్దికగా వుండకపోతే భరించలేరు. ధర్మశాస్త్రాలు రాసిన పురుషులే తనకీ తన బిడ్డకీ దూరం చేశారు. గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది అప్పుడప్పుడు కర్ణుడు నా బిడ్డే అని. ఈ పురుష దాష్టీకం నశించాలని. కానీ బొత్తిగా నోరుపెగలదు.

పెద్ద పెద్ద గడ్డాలున్న ఈ ఋషులు వస్తుంటారే వాళ్ళకి తన కర్ణుడి విషయం తెలీదా? అంతెందుకు మహాత్ముడు సాత్యవతేయుడు వ్యాసుడు త్రికాలవేది ఆయనకి తెలీదా? తను చెప్పటానికి ఎట్లాగు లేదు. ఏదైతే అదే అవుతుందని పెద్దలంతా ఎందుకు చెప్పరు? చూడ బోతేవీళ్ళంతా ఏదో ప్రణాళిక పన్నుతున్నట్టు తోస్తోంది. శ్రీకృష్ణమూర్తికి తెలిసేవుంటుంది. కానీ నోరువిప్పటల్లేదు. తనంతట తను ఆ చిన్న పిల్లవాడితో ఏమని చెప్తుంది. చెప్పవలసిన తరుణం ఆ సన్నమైతే అతను ఊరుకోడు. మరి ఎందుకు మౌనం వహిస్తున్నాడో. ఇలాంటి అనేకములైన ఆలోచనలతో కుంతి దుఃఖం ఆగలేదు.

అత్తగారు దుఃఖించటం చూసి ద్రౌపది ఆయోమయంలో పడిపోయింది. పుట్టిల్లు వదిలి వచ్చిన దుఃఖం అయిదుగురు భర్తలకి భార్యకావడం, అందుకు కొందరు ఆక్షేపించడం అత్తగారి ఆప్యాయత అవ్వన్నీ తనకన్నీళ్ళై ప్రవహించాయి. కానీ అత్తగారు కుంతీ మహాదేవి ఇట్లా బాధపడుతున్నదేమిటి ఏమిటోగాని ఆమె కడుపులో గొప్ప బాధేవున్నది అనుకుంది. తనని తను ఓదార్చుకుని అత్తగార్ని ఓదార్చింది.

"ఊరుకోండి అత్తయ్యా! ఎందుకు అంత బాధపడుతున్నారు. నా వల్ల ఏదన్నా తప్పు జరిగిందా?'' అని ఆందోళనగా అడిగింది.

నీవల్లకాదమ్మా... నావల్లే తప్పు జరిగింది'' అనుకుంది కుంతి మనసులో.

పైకి నవ్వి కోడలి శిరసుమూర్కొని "ఏం లేదమ్మా! చిన్న పిల్లవి. నువ్వు గాభరాపడతావు అని అని చూడకుండా కన్నీరు పెట్టుకున్నాను. ఇన్నాళ్ళకి ఈ ఇంట్లో ఆడపిల్ల నడయాడుతుంటే ఎంత అందంగా వుందో తెలుసా కృష్ణా! అందుకే ఆడతోడు కావాలంటారు మన ఇళ్ళల్లో దుస్సల తప్ప ఆడపిల్ల ఏది? పోనీ నువ్వైనా కూతుర్ని కంటావా! మనవరాలితో ముద్దూ ముచ్చట్లాడుకుంటూ శేషజీవితాన్ని హాయిగా గడిపేస్తాను'' అన్నది పైకి, కడుపులో దుఃఖం అలాగే అదిమిపట్టి.

కృష్ణ సిగ్గు పడింది.

"అయ్యో పిల్లా! ఎంత సిగ్గో. అయినా ఏదో సరదా పడ్డానుగాని ఆడపిల్ల పుట్టకపోయినా బాధపడను ఎందుకో తెలుసా తల్లీ! ప్రతి స్త్రీ మనసూ వేదనలమయమే. ఆమెకి రకరకాల కష్టాలు! సరేగాని ఇట్లారా!'' అంటూ కోడలి చెయ్యిపట్టుకొని ధనాగారంలోకి తీసుకుపోయింది.

ఒక భోషాణం తీసి అపురూపమైన కంఠాభరణం బయటికి తీసింది.

"అమ్మాయీ ద్రౌపదీ! ఇది మీ మామగారు పాండుమహారాజుగారు నాకు బహూకరించారు. ఇప్పుడు నాకు పెద్ద కోడలిస్థానంలో వున్నావు. ఈ హారంతోపాటు ఈ పాండువంశం గౌరవ ప్రతిష్ఠలు కూడా నీ చేతిలో పెడుతున్నాను'' అంటూ ఆ హారం కోడలి మెడలో వేసింది. ద్రౌపది సొగసు రెట్టింపైంది.

"ఏమిటీ అత్తా కోడలూ ధనాగారంలో ముచ్చట్లాడుకుంటున్నారు? మామీద ఏమన్నానా?'' ధర్మరాజు నవ్వుతూ లోపలికి వచ్చాడు.

"ఔను కుమారా! ముఖ్యంగా నీ మీదే చెప్పుకుంటున్నాం. నువ్వేమిటి? శయనాగారానికి ఇంత ఆలస్యంగా వస్తున్నావు?

"జూదవ్యసనం తగ్గించుకోవాలి ధర్మజా! కొత్త కోడలు కుల వధువు ద్రౌపది నీ కోసం ఎదురు చూస్తుంటుందని మర్చిపోవద్దు" అని చెప్పి కొడుకూ కోడల్ని దిష్టి తగులుతుందేమో అని భయపడుతూనే ఓరకంట మనసునిండా చూసుకొని వెళ్ళిపోయింది కుంతీదేవి.

ద్రౌపదిని చూసి నవ్వి ఆమె చెయ్యి అందుకొని నడిచాడు యుధిష్ఠిరుడు.

"ఏమిటి పాంచాల రాజపుత్రిక మెరిసిపోతున్నదివ్వాళ. అత్తగారు మంచి బహుమానం ఇచ్చినట్టున్నారు" అని మేలమాడాడు.

"ఔను. ఈ కంఠహారంకంటే మంచి బహుమానం ఇచ్చారు అత్తగారు. ఈ కోడలి ఉత్తమగుణాలకి ఎంతో మెచ్చుకున్నారు. సంతానం పొందుతావని దీవించారు. అన్నదానంతో బ్రాహ్మణ సేవయెయ్యమన్నారు. గురు వృద్ధబాంధవాతుర విశిష్టజనుల నతిథి జనులను ఎప్పుడూ గౌరవించమన్నారు. పాండవ పట్టమహిషి నన్నారు. మీ పత్నీ స్థానం నాదేనన్నారు."

"అంతేనా ఇంకేమన్నా చెప్పారా మీ అత్తగారు"

"చెప్పారు"

దరహాసంతో బదులిచ్చింది కృష్ణ.

"ఏమని చెప్పారు. మా పెద్దబ్బాయి యుధిష్ఠిరుడు ఉత్త అమాయకుడు నీచేతిలో పెడుతున్నాను ఎలా చూసుకుంటావో అనా?"

"ఊహూ! కానే కాదు భూప్రజల మీద కరుణ చూపించు కమలనేత్రా!" అన్నారు.

"ఓస్ ఇంతేనా? ఇలాంటి మాటలు ఆవిడ ఎప్పుడూ చెప్తూనే వుంటారు. ఆవిడ చెప్పనవసరం లేకుండా తమరు ముందే నిర్వర్తిస్తారు.

ధర్మరాజు అలిగినట్లు మొహం పెడితే ద్రౌపది నవ్వింది.

... ...

భీమసేనుడు హిడంబాసురుని చెల్లెలయిన హిడంబను ఇదివరకే పరిగ్రహించాడు. హిడింబ అసలు పేరు కమల పాలిక.

పాండవులూ కుంతీ లక్కయింట్లో వుండేట్లు ఏర్పాటు చేశాడు దుర్యోధనుడు. ఎలాగైనా పాండవులని అంతం చెయ్యాలనే అతని తపన.

చిన్నప్పుడు అంటే పదకొండేళ్ళ వయసు వచ్చేదాకా దుర్యోధనుడూ అతని తమ్ములూ హస్తినాపురానికి యువరాజులు కాదు రారాజులు.

తండ్రి ధృతరాష్ట్రుడు పుట్టుకతో అంధుడు. తల్లి గాంధారి మూర్ఖ పాతివ్రత్య భావనతో తనకి పెళ్ళి అనుకున్నప్పటినుంచీ స్వయంకృత అంధురాలు. పిల్లలు కావాలని ఉబలాటపడిందేకాని వాళ్ళని సక్రమంగా పెంచాలంటే చక్కగా వున్న తన కళ్ళకి చూపు కూడా కావాలని తెలీదు. తెలీలేదు. కావాలని కళ్ళ బట్టకట్టుకున్న తల్లి పిల్లలు పెరిగి పెద్దయి సక్రమంగా ఎలా బట్ట కట్టగలరు? తల్లి దండ్రులిద్దరూ వేయి కళ్ళతో తమ పిల్లల్ని కనిపెట్టుకుని అవసరాన్నిబట్టి దండించినా మిగిలిన సమయమంతా వాళ్ళని లాలించి పెంచాలి. కాని పాపం దుర్యోధనాది కౌరవులకి ఇద్దరి కళ్ళుసరే ఒకళ్ల కళ్ళయినా మార్గదర్శకత్వం వహించలేదు. ఏవో దాదుల చేతిలో పెరిగారు. తల్లి దండ్రుల కమ్మని చూపుకి నోచుకోలేదు.

ఒక ఇల్లాలు తన పిల్లల్ని ప్రేమతో క్రమశిక్షణతో పెంచితే లోకానికి ఉపకారం చేసినట్టు. అదే సంఘవిద్రోహశక్తుల ఆటకట్టు. ప్రతి తల్లీ తన పిల్లల్ని ఉత్తమ పౌరులయ్యేట్టు ధర్మవర్తనులయ్యేటట్టు పెంచితే సంఘమంతా బాగుపడుతుంది. తద్వారా దేశమంతా బాగుపడుతుంది. సంఘవిద్రోహులూ, రాక్షసులూ, క్రూరులూ అనుకుంటున్న వాళ్ళు ఎక్కణ్ణించీ వచ్చారు. ఒక అమ్మ కడుపునించే. ఆ అమ్మ కడుపు చల్లగా వుండాలంటే బిడ్డల్ని బుద్ధిమంతుల్నిగా పెంచాలి. అందువల్ల మిగిలిన (తోటి) అమ్మల కడుపులు కూడా చల్లగా వుంటాయి. హత్యలూ, దొంగతనాలూ, దారుణాలూ, రాజ్యంమీది దురాశలూ ఇలాంటివన్నీ వుండవు.

గాంధారికి సహజంగానే తోడికోడళ్ళమీద స్పర్థ. కాస్త ఈర్ష్య, కాస్త అసూయ వున్నాయి. కుంతీదేవి అడవిలో వున్నా తనకంటే ముందు పిల్లల్ని కని కురువంశానికి యువరాజులు వీళ్ళే. అంటుందేమో అనే భయం ఒకటి వుంది. పాండురాజు కోరిక మేరకి యమధర్మరాజు వరప్రసాదంగా కుంతీదేవి గర్భవతి అయిందని విన్నది గాంధారి. తనకెందుకింకా పిల్లలు పుట్టలేదని చాలా బాధపడింది. ఆమె మొర దేవుడు విన్నాడేమో అన్నట్లుగా వ్యాసుడు దీవించగా గాంధారి కూడా మూడునెలల తేడాతో గర్భవతి అయింది. అపరిమితానందం పొందింది.

అక్కడవనంలో కుంతీ మహాదేవి అష్టమీతిథి అభిజిత్ లగ్నంలో గ్రహములన్నీ మిత్రములుగా వుండగా శాత్రవజైత్ర తేజమున సర్వదిశలనీ వెలిగిస్తూ అతిస్థిర ధర్మమూర్తి అయిన కుమారుడిని కన్నది. అతనికి యుధిష్ఠిరుడు అనే పేరు నిర్ణయించింది ఆకాశవాణి.

గాంధారి దుఃఖభరాయత్త చిత్త అయింది. ముందుగా తనకే గనక కుమారుడు పుడితే భరతవంశపు యువరాజు నిర్ద్వంద్వంగా అతడే అయివుండేవాడు. మధ్యలో ఈ యుధిష్ఠిరుడొకడు పుట్టుకొచ్చాడు. ఇతడే యువరాజని పాండురాజుతోపాటు ప్రజలూ పెద్దలూ కూడా నిర్ణయిస్తే ఏది గతి? తన బిడ్డలు పాండు పుత్రులసేవ చేసుకుంటూ బతకాలా? ఏదో కుంతీమాద్రి దేవులిద్దరితో కలిసి పాండురాజు వనాలకి విహారం కోసం వెళ్ళి అక్కడ కిందముడనే ఋషి శాపంవల్ల సంసార సుఖానికి నోచుకోకపోవటం వాళ్ళు ముగ్గురూ శతశృంగపర్వతంవద్ద నివాసం ఏర్పరచుకోవటం ఇదంతా తనకెంతో సంతోషం కలిగించింది. ఇక ఎలాగూ పాండురాజుకి పిల్లలు పుట్టరు తన పిల్లలే యువరాజులు అని మురిసిపోయింది. పైకి చెప్పడుగానీ ధృతరాష్ట్రుడికీ అదే ఆనందం.

తీరా చూస్తే ఇప్పుడా కుంతి యమధర్మరాజు ప్రసాదంవల్ల పండులాంటి కొడుకుని కనేసింది. ఆ మంత్రమేమిటో కుంతిఎలా సంపాదించిందో అని గాంధారికి ఎప్పుడూ అనుమానమే. ముందుముందు ఏం విపరీతపరిణామాలు

సంభవించకుండా తనుకూడా కొడుకుని కనేయాలి ఆక్షణం ఎప్పుడా అని ఎదురుచూస్తోంది గాంధారి. ఆమె ఎదురు చూస్తున్న కొద్దీ ప్రసవం ఆలస్యమవుతున్నది. ఏడాదిదాటింది. ఇదేం వింతగర్భమో అర్థంకావటల్లేదు అందరికీ.

పులిమీద పుట్రలాగా కుంతీదేవి వాయుదేవుడి ప్రసాదంంగా మళ్ళీ గర్భవతి అయిందనీ విన్నది గాంధారి అక్కడికీ కొంతకాలం ఓర్చుకుంది. అయినా పుత్రజననం కావటల్లేదు. భరించలేని వ్యథతో కడుపుమీద మోదుకుంది.

వేదవ్యాస మహర్షి పరిగెత్తుకొచ్చాడు. కిందపడిన పిండాన్ని చూసి గాంధారిని తిట్టాడు.

"ఏం స్త్రీవమ్మా నువ్వు? ఎందుకంత తొందర? కాస్త ఓర్పు పట్టలేవా? ఇంతకాలం ఈ గర్భం వుందంటే ఎంత మహర్జాతకుడు పుడతాడో అన్న వూహేలేదా తల్లీ! అంతేలే నీ కర్మా మాకర్మా ఇలావుంటే నీకు మంచి బుద్ధి ఎలా పుడుతుంది.

గర్భవతిగా వున్న స్త్రీ ప్రశాంత చిత్తంతో వుండాలి. ఆమె సదాలోచనలతో ఉదారహృదయంతో మంచి వాతావరణంలో వుండాలి. పుట్టబోయే పిల్లలమీద తల్లి ఆలోచనల ప్రభావం వుంటుంది. మేమొకటి తలిచాం. నువ్వొకటి చేశావు. అంతా తారుమారైపోయింది. విధిని తప్పించటం ఎవరి వశం. యువరాజుని కనాలని ఆత్రుతపడిపోయి అంతా పాడు చేశావు గాంధారీ!"సుబల పుత్రికా!

అని గాంధారికి ముక్క చివాట్లు పెట్టాడు కృష్ణద్వైపాయనుడైన వేదవ్యాసుడు. నేలమీద పతితమైన ఆ పిండాన్ని నూట ఒక్క ఖండాలుగా విభజించాడు. నూటొక్కనేతి కుండల్లో పెట్టాడు. శీతలజలంబులచేత తడుపుతూ వుండమన్నాడు. ఈ పని నన్నాసరిగ్గా చెయ్యి గాంధారీ. తొందరపడి ఘృతకుండాల్ని అయినా పగలగొట్టకుండా శ్రద్ధగా సంరక్షించుకో. పిల్లలు వాళ్ళే వస్తారు బయటికి" అని మహానుభావుడు ఆ వ్యాసుడు కురువంశాన్ని రక్షించటానికి తాపత్రయపడ్డాడు.

రాజపుత్రి గాంధారి ఒక్కతే కాక వైశ్యజాతికి చెందిన మరొక్క భార్యకూడా వున్నది ధృతరాష్ట్రుడికి. ఆమెకూడా గర్భవతిగా వున్నదప్పుడు.

శతశృంగంలో కుంతీదేవికి భీమసేనుడు జన్మించాడు. అతను పుట్టిన పదవనాడు దేవాలయానికి బయల్దేరారు పాండురాజూ, కుంతీ పిల్లవాడి నెత్తుకొని. పర్వతపు గుహలోనించీ ఒక పులి వాళ్ళమీదికి లంఘించింది. మూడు బాణాలేసి ఆ పులిని చంపేశాడు పాండురాజు. కుంతి స్పృహతప్పి పడిపోయింది. కుంతి చేతిలోవున్న భీమసేనుడు ఆ రాళ్ళమీద పడిపోయాడు. అతని బరువుకి కొండరాళ్ళు పిండి పిండి నుగ్గు నుగ్గు అయి రాతి పొడి మిగిలిందక్కడ.

ఆ బాలకుడి శక్తికి అందరూ ఆశ్చర్యపడ్డారు. 'పాండు కుమారులకితడే రక్ష' అని భీముడినెత్తుకొని పాండురాజు ముద్దులాడాడు.

"తండ్రిగారూ! తమ్ముడు కిందపడితే రాళ్ళన్నీ పొడిగా అయిపోయాయి కదా. మరి నన్ను కూడా ఎత్తుకోగలడా?" అని ముద్దు ముద్దుగా అడిగాడు యుధిష్ఠిరుడు.

"తప్పకుండా ఎత్తుకుంటాడు నాన్నా! ఇప్పుడు బుజ్జిబాబు కదా పెద్దయ్యాక ఎత్తుకుంటాడు" అన్నాడు పాండురాజు.

"ఇంకానయం నన్ను కూడా ఎత్తుకుంటాడనలేదు మహారాజా! దిష్టితగులుతుందో ఏమో పసిబిడ్డకి" అన్నది కుంతీదేవి ఆనందం ఆశ్చర్యం మిళితమవగా. లక్కయిల్లు తగలబెట్టి పారిపోతున్నప్పుడు నిజంగానే తల్లిని అన్నదమ్ముల్ని ఎత్తుకొని నడిచాడు భీముడు.

వెడల్పుగా ఇంతంత బుగ్గలతో తొనలుతేరిన ఒంటితో వయసుకి మించి కనపడుతున్నాడు ఉయ్యాల్లో పసిగుడ్డు. గట్టి గట్టి ఇనపగొలుసులతో ఉయ్యాల చేయించాడు ప్రత్యేకంగా పాండురాజు వాయుపుత్రుడికోసం. కుంతి పక్కనే వుండి గుమ్మడి పండులాంటి భీమసేనుడిని చూస్తూ గుటకలు మింగుతోంది మద్రరాజ పుత్రి పాండురాజు రెండవ భార్య మాద్రి. తనకిలాంటి సంతానం కనే భ్యాగం లేదే అని ఆమె లోలోపల కుమారిల్లి కుమిలిపోతుంటుంది.

"అక్కా! పసివాడికి దిష్టితీయిద్దాం ఎవరైనా ఋషిపత్నులచేత. ఈ నిసుగు కిందపడి రాళ్ళు విరగ్గొట్టాడని హస్తినాపురంలో గనక తెలిసిందా కష్టం. ఈ

విషయం దాచేద్దాం. ఇంకెవరికీ తెలియనివ్వద్దు తెలిసినవాళ్ళని చెప్పనియ్యద్దు'' అన్నది మాద్రి భీముడి బుగ్గలమీద మెల్లిగా నిమురుతూ.

"పిచ్చిదానా! నిప్పుని కొంగులో మూటగట్టుకోగలమా? ఇలాంటి వార్తని దాచ గలమా? కానీ అన్నింటికీ భగవంతుడే వున్నాడు" అన్నది కుంతి.

సరిగ్గా అప్పుడే యదువృష్ణి భోజాంధకకుకురువంశాలనించీ కొందరు పెద్దలు వచ్చారు. కుంతి వసుదేవుడికి చెల్లెలి వరస. ధర్మరాజుకీ భీముడికీ కానుకలిచ్చి వెళ్ళారు. వాళ్ళల్లో జ్యోతిశ్శాస్త్రవేత్తలు వున్నారు.యుధిష్ఠిర కుమారుడు సామ్రాజ్యాన్ని ఏలగలడనీ అతని ఇద్దరు భార్యలనీ, ఇద్దరు కుమారులు పుడతారనీ జోస్యం చెప్పారు.

"తండ్రిగారిలాగా ఇద్దరమ్మాయిల్ని పెళ్ళాడతాడన్నమాట'' అంటూ మాద్రి ధర్మరాజుని ఎత్తుకుంది.

"మరి భీమసేనుడి జాతకం?'' సందేహంగా అడిగింది కుంతీదేవి.

"బ్రహ్మాండమైన జాతకమమ్మా సింహపరాక్రముడీబాలుడు. అన్నగారికి గొప్పబాసటగా నిలుస్తాడు. సోదరులని ఎన్నో సమయాల్లో రక్షిస్తాడు. ఇతనికి ముగ్గురు భార్యలుంటారు'' అని చెప్పారు వాళ్ళు.

"బుజ్జితండ్రీ! నువ్వు ముగ్గురు అమ్మాయిల్ని పెళ్ళాడతావా? తండ్రిగారి కంటే ఒక ఆకు ఎక్కువే చదువుతావా?'' అంటూ భీముడిని ఇంకో చేత్తో ఎత్తుకో బోయింది మాద్రి.

"లాభంలేదు చెల్లీ! వీణ్ణి ఒక్కచేత్తో ఎత్తుకోలేవు. రెండు చేతులతో ఎత్తుకున్నా బరువు మొయ్యలేవు. దిన దినమూ వీడు బరువు పెరుగుతున్నాడు'' అని భీముడిని తను ఎత్తుకొని ముద్దుపెట్టుకుంది కుంతీదేవి.

"ఔనక్కా! సోదరులు అంటున్నారేమిటి వీళ్ళు? ధర్మరాజొక్కడేగదా....అని నసిగింది మాద్రి.

"మద్రరాజకుమారీ! ఇటురా నీతో మాట్లాడాలి" అని పిల్చాడు పాండురాజు. అప్పటికి మర్చిపోయి భర్త చెప్పిన పనులు చేసింది మాద్రి. కాని నిరంతరమూ ఆవిడ మనస్సులో తనకి పిల్లలు లేరే. భర్తకి కిందముడిచ్చిన శాపంవల్ల ఇంక పుట్టే అవకాశమే లేదే. పిల్లల్ని కనకపోయిన తరువాత ఇంక ఈ ఆడజన్మవృథా. అమ్మా! అనిపించు కోలేకపోయినాక ఈ జీవితం ఎందుకు?

అని దురపిల్లుతూనే వుంటుంది. పైగా ఇంత సౌందర్యమూ ఏం చేసుకోను? కట్టుకున్న భర్తకి ఇంత దూరంలో వుండాలి. కిందమ ఋషి దంపతులు లేడి రూపాలు ధరించి క్రీడిస్తూంటే పాండురాజు గురితప్పి వాళ్ళకి బాణం గుచ్చుకుంది. అన్యోన్యంగా వున్న తమ జంటను నిష్కారణంగా చంపుతున్నందుకు మానవ రూపం ధరించిన కిందమ ఋషి నువ్వు స్త్రీని కలిసిన మరుక్షణం చస్తావని శాపంపెట్టాడు పాండవరాజు.

నిర్ఘాంతపోయాడు పాండురాజు. కులసతులు గుణవతులు, మహాసౌందర్యవతులు అయిన పాండురాజు భార్యలు కుంతి, మాద్రి మొదలు నరికిన వృక్షాల్లా కూలిపోయారు. పైగా పాండు రాజుకి అప్పటికి పిల్లలు లేరు కూడాను. పిల్లలు లేకపోవడమనేది సామాన్య ప్రజలకి ఒకరకం బాధ. దానికి తోడు రాజులకి పిల్లలు లేకపోతే రాజ్యాన్ని దాయాదులు లాక్కోక తప్పదు అని మరో బాధ.

ఇటు సంసార సుఖమూలేదు, అటు కడుపున బుట్టిన బిడ్డలూ లేరు కుంతికీ మాద్రికీ పాండు రాజుకీ. భర్త చేసిన తప్పువల్ల ఎంత అనర్థం జరిగింది. కుంతి గొప్ప తెలివైనది. నీతిమతి దేవబ్రాహ్మణ అతిథిపూజా తత్పరురాలు. బీద సాదలని కనికరంతో ఆదరిస్తుంది. దాదాపు తపోజీవితమే గడుపుతూ ఇంద్రియ నిగ్రహం అవలంబించే ధైర్యవతి కుంతి. కానీ మద్రరాజు కుమార్తె జగన్మోహన రూపలావణ్యవతి కుంతికంటే చిన్నది. మాద్రిని గురించే కుంతి దిగులు. ఎప్పుడైనా మాద్రీదేవిని పాండురాజుగాని తొందరపడితే మొదటికే మోసం వస్తుంది. ఏదో ఇంత పసుపు కుంకుమలతో సుమంగళులుగా వున్న తమకి ప్రతి స్త్రీ కోరుకునే ఆ మాత్రం అదృష్టం కూడా చెయ్యి జారిపోతుంది. ఇక బతుకంతా అంధకారమే. భర్తృహీనంగా సంతానహీనంగా

రాజ్యహీనంగా బతుకువెళ్ళదీయాల్సి వస్తుంది. అని అనుక్షణమూ తను జాగ్రత్తగా వుంటుంది కుంతి. భర్త క్షేమం కోసం ఆయన ఆయుష్షు కోసం మాద్రిని కూడా దూరంగా వుంచుతుంది.

ఒకసారి మాద్రిని ఇవతలికి పిలిచి "నీకు సంతానం లేదని దిగులు పడుతున్నావు గదూ దేవీ! ఇందుకు కారణమైన నాకు ఎన్ని జన్మలెత్తినా పాపంపోతుందా? ఈ దౌర్భాగ్యుడిని దురదృష్టవంతుణ్ణి నువ్వూ కుంతీ క్షమించినా దేవుడు, భావి భారత ప్రజలు కూడా క్షమించరు" అని ఆమె చేతులు పట్టుకొని బతిమాలాడాడు పాండురాజు.

"ఇందుకా ప్రభూ! ఏ కాంతంలో క్షమాపణలు చెప్పటానికి పిలిచారా? సరే! సరే! చేతులు పట్టుకోవటం దాకా బాగానే వుంది ఇంకా ముందుకి వెళ్తున్నాయి. అరె చెప్తుంటే వినరేం ప్రభూ!" మాద్రికి భర్త స్పర్శకి ఆనందమూతన దుఃస్థితికి దుఃఖమూ ఒక్క పెట్టున ముంచుకొచ్చాయి. భర్తకి పనికిరాని తన మహాసౌందర్యం ఎందుకు? తొందరపాటే ఎప్పుడూ పాండు మహారాజుకి. ఎంత గుణవంతుడైతే ఏం ఆవేశం ఆపుకోలేడు. నిదానించమని చెప్పినా ఏం వినిపించుకోడు. భవిష్యత్తులో ఏం కానుందో మాద్రి దుఃఖం కట్టలు తెంచుకుంది.

హస్తినాపురం నించీ దూతలు వచ్చిరీలోపల. భీముడికి పాలిచ్చి నిద్రపుచ్చి "అమ్మో వీళ్ళిద్దరూ వీరి? ఇందాక ఏదో మాట్లాడాలని పాండురాజు మాద్రిని తీసు కెళ్ళాడు. పిల్లల అల్లరిమధ్య తనావిషయం పట్టించుకోలేదు. ఇంతలో ఈ దూతలు రాజధాని నించీ వచ్చారు. అమ్మో ఏం కొంపమునిగిపోతుందో" అని గబ గబా వచ్చింది కుంతి.

మాద్రిని కౌగిలించుకొని ఆమె వెక్కిళ్ళుపెడితే ఓదారుస్తున్న పాండురాజు కనపడ్డాడు.

"స్వామీ! మీ కోసం రాజధానినించీ దూతలు వచ్చారు. రండి మీరిద్దరూ" అని మాద్రి చెయ్యి పట్టుకొని గబగబ తీసుకొచ్చింది కుంతి. తనక్కడికి రాకపోతే ఇంకాసేపట్లో ఎంత అనర్థం జరిగుండేది. అమ్మో ఇవాళలేచిన వేళ మంచిది. లేకపోతే పాండురాజు ఈ పాటికి? ఆమె గుండె గుభిల్లుమంది.

కుంతి ఊరికే చులాగ్గా చెయ్యి పట్టుకున్నట్లు అనిపించినా ఆమె మనసులోని కోపం చేతిలోనించి ప్రవహించినట్లనిపించి ఉక్కిరి బిక్కిరైంది మాద్రి "అక్కా!" అని కుంతిని కావలించుకుని భోరుమంది. "ఊరుకో చెల్లీ! మనం ఏం చెయ్యగలం?" తప్పు. ఏడవకు మంచిదానివి కదూ" అంటూ తను కూడా కళ్ళు తుడుచుకొని చతుశ్శాలలోకి తీసుకెళ్ళింది కుంతి. తప్పుచేసినవాడిలా పాండురాజు కూడా వచ్చాడు బాధని గుండెలో అదిమిపెట్టి.

"మహాప్రభూ! తమ అన్నగారు కౌరవాధీశ్వరులు, హస్తినాపుర ప్రభువు ధృతరాష్ట్ర మహారాజులవారు తమకి ఆశీర్వచన పురస్సరంగా ఈ మాట చెప్పమన్నారు" అన్నారు దూతలు. "అన్నగారు కుశలమా? ఇంతకీ ఏమిటా వార్త?' ' కుతూహలంగా అడిగాడు పాండురాజు.

"శుభవార్త మహారాజా! ఇక్కడ మీకు భీమసేన కుమారుడు పుట్టిననాడే ఒక పూట తేడాగా గాంధారీ మహాదేవికీ ధృతరాష్ట్ర మహారాజులకీ ప్రథమ పుత్రుడు పుట్టాడు. అతనికి సుయోధనుడని నామకరణం చేశారు. మరునాడు రెండవ కుమారుడు పుట్టాడు అతనికి దుశ్శాసనుడని పేరుపెట్టారు. ధృతరాష్ట్ర మహారాజుగారి వైశ్యరాణికి యుయుత్సుడనే కుమారుడు పుట్టాడు. వ్యాసులవారు ఘృతభాండాల్లో వుంచిన పిండఖండాలు దినమునకొక కుమారుడిని ప్రసాదిస్తున్నాయి" అని విన్నవించారువాళ్ళు.

మాద్రి మనసు భగ్గుమంది. అయినా రాజపుత్రి కనక పైకి సంతోషం ప్రకటించింది. కుంతీదేవి సంతోషించింది.'అయితే మా అక్కగారూ బావగారూ శిశువుల కోలాహలంలో మునిగితేలు తున్నారన్నమాట. అంతఃపురమంతా ఎంత సందడిగావుందో. ఆపిల్లలెట్లా వున్నారు?'అని అడిగింది.

"సంపూర్ణ ఆరోగ్యవంతులై సర్వాంగ పరిపుష్టులైవున్నారు మహారాణీ! ఇంకమూడు నెలల్లో పిల్లలందరి నామకరణాలూ మహోత్సవంగా నిర్వహించదలిచారు

ధృతరాష్ట్ర మహారాజులు. మీరందరూ తప్పక రావాలి. ఈ మాట పదే పదే చెప్పి పంపారు రాజుగారూ రాణిగారూ'' దూతలు విన్నవించారు.

"వనవాస వృత్తిలో వున్నామే'' అన్నాడు పాండురాజు.

'ఈ సందర్భం వంశాభివృద్ధికి సంబంధించిన అతిముఖ్యమైనది కనక తమరంతా తప్పక నగరానికి రావచ్చని విదురాది సజ్జనులు కూడా సెలవిచ్చారు ప్రభూ!' అన్నారు దూతలు.

"ప్రయత్నిస్తాం రావడానికి'' అన్నాడు పాండురాజు.

"గాంధారి అక్కగారికి వందమంది కొడుకుల తరవాత ఒక అమ్మాయి కూడా పుడుతుందని వేదవ్యాసులు సెలవిచ్చారు కదూ. మగపిల్లలు సరే. అమ్మాయిని చూడటానికైనా మనం రాజధానికివెళ్ళాలి'' అని సరదాపడింది కుంతి. అక్కకి వంతపాడింది మాద్రి. పెద్దక్కగారికీ బావగారికీ నూట రెండు మంది పిల్లలన్నమాట. ఏం అదృష్టం'' అన్నది.

"వెళ్ళొచ్చాక దేవేంద్ర సముడైన సుతుడిని నాకు కని ఇవ్వాలి దేవీ కుంతీ'' అన్నాడు పాండురాజు.

విస్మయం పడిందామె. ఇంకా తృప్తిలేదా ఈయనకి? అని ఇంతలో చారులు వచ్చారు. ప్రభూ! సుయోధనుడిని దుర్యోధనుడిగా వ్యవహరిస్తున్నారు జనం. ఆ పిల్లవాడు పుట్టగానే నక్కలు అరిచాయి. సమస్త దుర్నిమిత్తములూ తోచాయి. ఇంటికీ రాజ్యానికే కాదు దేశానికే అరిష్టం జరుగుంది ఈ బాలుడివల్ల 'అని కార్తాంతికులు చెప్పారు'. ఇంత దుష్టఘడియలో ఘృతభాండం నించీ వెలువడ్డాడు కనుక ఇతన్ని బయటెక్కడైనా వదిలి వేయ్యటం శ్రేయష్కరం రాజ్యక్షేమకరం అని కురువృద్ధులూ భీష్మవిదుర ద్రోణాదులూ ధృతరాష్ట్రుడికి చెప్పారు. కానీ పుత్రవ్యామోహంవల్ల వాళ్ళ మాటలు వినిపించనట్లు ప్రవర్తించారు ధృతరాష్ట్ర మహారాజుగారు. పైగా ఆ బాలుణ్ణే భావి యువరాజు అని ఎక్కువ గారం చేస్తున్నారు ఆయనా, గాంధారి మహారాణీనూ'' అని సంగతులన్నీ చెప్పారు.

"ఔన్లే బిడ్డల్ని వదులుకోవటమంటే ఎంత కష్టం. లోక క్షేమం సంగతి దేవుడెరుగు. పాపం పెద్దక్క......"మాద్రి మాటల్ని మధ్యలో ఖండించింది. కుంతి. "సుయోధనుడి సంగతేమోగాని మాద్రీ! తర్వాత వచ్చే పరిణామాలను గురించి ఎప్పుడూ అప్రమత్తంగా వుండాల్సిందే. ఎలాగైనా నీకింకా చిన్నతనం పోలేదు. జాగర్త" అంది కుంతి.

ఏ విషయం గురించి అలా అందో అర్థమై తలవాల్చేసుకుంది మాద్రి.

"అలాగే అక్కా!" అంటూ తన శయనగారంలోకి పోయి తలుపులు మూసుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

'ఎలా ఈ బతుకు బతకటం. నిక్షేపంలాంటి జీవితం ఇలా అడవికాసిన వెన్నెలయింది. అడవిపాలయింది రాణీత్వం. పురుషులు చేసిన తప్పులకి స్త్రీలు బలైపోవలసిందేనా? అదే భార్యకి శాపం వుంటే భర్త హాయిగా ఆవిడ్ని వదిలేసి ఇంకోపెళ్ళి చేసుకోడా? మాద్రి ఆలోచనలు పరిపరి విధాలపోయినై. ఛ ఏమిటింత తప్పుగా ఆలోచిస్తున్నాను. నా మనసు మరీ పాడైపోతోంది, ఈ బతుకు ఇంత నిరర్థకంగా బతికేకంటే చావడం మంచిది' విరక్తిగా అనుకుంది మాద్రి.

"దేవేంద్ర వరప్రసాదంతో నాకు ఇంకొక్క కొడుకుని కని యివ్వవా కుంతీ!" అని పాండు రాజు మళ్ళీ బతిమిలాడాడు. నూటయిద్దరు సంతానాన్ని కన్నాడు అన్నగారు ధృతరాష్ట్రుడు. తనకి ముగ్గురు కుమారులన్నా లేకపోతే ఎలా అని పాండురాజు బాధ.

"కన్నమ్మకే వాపి తిన్నమ్మకేవాపి అని పెద్దవాళ్ళు ఊరికే సామెత చెప్పలేదు. గుమ్మడిపళ్ళలాంటి ఇద్దరు కొడుకులు చాలలేదా మహారాజా! మహేంద్ర ప్రసాదం తప్పదా?" చిరునవ్వుతో అడిగింది కుంతి. తన ఇద్దరు పిల్లల్నీ చూసినప్పుడల్లా అభాగ్యుడైన తనమొదటి బిడ్డ గుర్తు వస్తుంటాడామెకి. అయ్యో ఎక్కడున్నాడో ఎలావున్నాడో, అసలు వున్నాడో లేదో అని కుమిలిపోతూనే వుంటుంది.

"నీకు ఇంకో కొడుకు కూడా వున్నాడు మహారాజా! అతను సూర్యవరప్రసాది. శశ్వత్కుండలోద్భాసితుడు. సహజకవచంతో శోభిస్తూ వుంటాడు" అని చెప్పాలనిపిస్తుంది

భర్తకి. కానీ అమ్మో చెపితే ఇంకేమన్నా వుందీ? భర్త అనుమతితోనే వేరేవాళ్ళతో పిల్లల్ని కనాలిట. లేకపోతే మహాపాపమంట. ప్చ్ ఆ మొదటి బిడ్డకూడా ఈ ఇద్దరు బిడ్డలలాగే పుట్టాడు. ఈ భర్త అనుమతి అనే దొక్కటీ పెద్ద అడ్డమైంది.

భర్తకోరిక తీర్చింది కుంతి. పాండురాజుకూడా ఇంద్రుడిని గురించి తపస్సు చేశాడు. మొత్తానికి మఘవంతుడు మహేంద్రుడి అంశతో అర్జునుడు పుట్టాడు. ఉత్తరా ఫల్గుణీ నక్షత్రం మొదటి పాదంలో అర్జున జననం. అర్జునుడు అనేపేరు ఆకాశవాణి పెట్టిందే. నక్షత్రాన్నిబట్టి ఫల్గుణుడు అని కూడా అంటారు.

అక్కకి ముత్యాల్లాంటి ముగ్గురు కుమారులు తన కడుపుపండే ఉపాయమేలేదే. అని పాండురాజు దగ్గిర శోకించింది మాద్రి.

"ప్రియా! ఎప్పుడూ నీ విషయమే నేను ఆలోచిస్తుంటాను. అంత పట్టించుకోకుండా వదిలేశాననుకోకు. కుంతికి ముగ్గురు పిల్లలైనా లేకపోతే నీ సంగతి అడిగితే బావుండదు అని ఆగాను. ఆ మహాసాధ్వి నా మాట జవదాటదు. నీ యందు కూడా మిక్కిలి ప్రీతి తనకి. నీక్కూడా ఆ మంత్రం ఒక్కసారి కనటానికి ఉపదేశించమని కుంతిని ప్రాధేయపడతాను. ఆ దేవి నన్ను సంతానవంతుడ్ని చేసిన పరమోదారహృదయ. భరతవంశం నిలిపిన ఇల్లాలు. నిన్ను కూడా పుత్రవతిగా చూడాలని వుంది నాకు. పాండురాజు ధైర్యం చెప్పాడు మాద్రికి. కుంతిచేత ఆ మంత్రం మాద్రికి చెప్పించాడు.

"ఒక్కసారికే అన్నానుగాని ఒక్కళ్ళనే కనమన్నానా ఏం మాద్రీ! అశ్వినీ దేవతల్ని వరదానం చెయ్యమని ప్రార్థించు. నీకు కవలపిల్లలు పుడతారు. ఇద్దరు కొడుకులకి తల్లివైన మాద్రిగా నువ్వు నాకు నేత్రోత్సవం చెయ్యాలి సరేనా?" అని ఆనందంగా చెప్పాడు పాండురాజు.

అమందానందంతో అశ్వినీ దేవతలని ప్రార్థించింది మాద్రి మహాసౌందర్య వంతులూ నిత్య యౌవ్వనులూ ఆరోగ్య ప్రదులూ అయిన అశ్వినీదేవతలిద్దరి అంశతో నకుల సహదేవులు కవలలై పుట్టారు.

6

భీమార్జునుల మధ్య ఇంకో విశిష్ట బాలకుడు దేవకీ వసుదేవుల నోములపంట అయి అష్టమగర్భ భయంతో కంసుడికి దడపుట్టిస్తూ చెరసాలలో జన్మించాడు. అష్టమి తిథి, రోహిణీ నక్షత్రం అర్ధరాత్రివేళ భూభారం రూపుమాపటానికి దుష్టశిక్షణ శిష్టరక్షణ చేసి ధర్మాన్ని సంస్థాపించటానికి మహావిష్ణువు అంశతో జన్మించాడు. ఆయనని దేవకీ వసుదేవులు స్తుతించారు. స్వామి ఆగమనానికి ప్రకృతంతా పులకించిపోయింది. సుగంధ మారుతంవీచింది. దేవతలు ఆకాశ మార్గంలో శ్రీకృష్ణదేవుడికి స్తోత్రాలు అంజలులు పట్టారు. చెరసాల తలుపులు వాటంతట అవే తెరుచుకున్నాయి. వసుదేవుడి సంకెళ్ళు ఊడిపోయాయి. యమునా నది చీలి దారి యిచ్చింది. స్వామి బుజ్జి బుజ్జి పాదాలకు తన తరంగ హస్తాలతో ప్రణమిల్లి ఆయనతోపాటు తనూ కేరింతలు కొట్టింది. శ్రావణమాసమేమో విపరీతమైనవాన. జగదీశ్వరుడి బాల తనువు వానతాకిడికి ఎరగాకుండా ఆదిశేషుడు పడగవిప్పి గొడుగు పట్టాడు. సజ్జనుల మనుసులో ఆనందం అంబరాన్ని అంటింది. నందుని సతి యశోదాదేవి పక్కన కృష్ణుణ్ణి పడుకోబెట్టి ఆమెకు పుట్టిన ఆడపిల్ల యోగమాయ వైష్ణవిని తీసుకెళ్ళి దేవకీదేవి చేతికిచ్చాడు వసుదేవుడు. యధాప్రకారం చెరసాల తలుపులు మూసుపోయి వసుదేవుడు మళ్ళీ సంకెళ్ళతో బంధింపబడ్డాడు.

ఆనంద గోకులంలో అదొక ఆనందహేల. పూతనాది రాక్షసులని అనేకుల్ని సంహరిస్తున్నాడు కృష్ణుడు. వసుదేవుడి ఏడవభార్య రోహిణి గర్భాన ఇక్కడ దేవకీ కడుపులో పెరుగుతున్న పిండాన్ని ప్రవేశపెట్టడంవల్ల సంకర్షణుడై బలరాముడు జన్మించాడు. ఆదిశేషువు అంశతో శ్రీకృష్ణ లీలలతో ఘోషభూమి పులకరించిపోయింది. వేణుగానంతో పరవశించిపోయింది.

అన్న బలరాముడూ తమ్ముడు కృష్ణుడూ గోవుల్ని కాయడానికి వెళ్ళే వాళ్ళు తోటి గొల్లపిల్లలతో కలిసి. ఒక్కొక్క ఆవుకీ ఒక్కోపేరు పెట్టి పిలుస్తాడు కృష్ణుడు.

రాపూర్ణచంద్రిక! రా గౌతమీగంగ! రమ్మ భగీరధరాజ తనయ! రా సుధాజలరాశి! రా మేఘమాలికా! రమ్మ చింతామణీ! రమ్మ సురభి! రా మనోహారిణి!

రా సర్వమంగళా! రా భారతీదేవి! రా ధరిత్రి! రా శ్రీమహాలక్ష్మి! రా మందమారుతి! రమ్మా మందాకిని! రా శుభాంగి" అంటూ దూరంగా లేత గడ్డిమేయడానికి వెళ్ళిన ఆవుల్ని చక్కటి పేర్లు పెట్టి పిలుస్తాడు కృష్ణుడు తల్లి చద్దన్నంమూట కట్టిస్తే తోటి గొల్లపిల్లలతో కలిసి తింటాడు.

ఒక శారద రాత్రి యమునా నదీ తీరమంతా వెన్నెల వెల్లువ అయిన వేళ కృష్ణుడు మురళి వాయించాడు. ఆ మురళిగానానికి పులకితురాలైంది ఒక ఆవు. అప్పుడది తన దూడకి పాలిస్తున్నది. ఆ గానానికి పాలుధారలై కురిసాయి. ఒక చిన్న పాలచుక్క వెళ్ళి కృష్ణుడి శిరస్సు మీద పడింది. భగవంతుడికి క్షీరాభిషేకం చేసిన పుణ్యం వచ్చిందా గోవుకి. జన్మాంతరంలో ఆ గోవు సుశీల అనే బ్రాహ్మణ స్త్రీగా జన్మించింది. ఆమె భర్త, భార్యకి చద్దన్నం. తనకి వేడన్నం. రకరకాల పిండివంటలు భార్యచేత చేయించి డబ్బాలలో పెట్టి అటకమీద దాచుకునేవాడు. అన్నీ తనొక్కడే తినేవాడు.

ఒకనాడు వాళ్ళింటికి ఏడేళ్ళవటువు వచ్చాడు.

"అమ్మా! ఆకలిగావుంది. కాస్త అన్నం పెట్టవా?" అని అడిగాడు సుశీలని.

"అయ్యో! ఎంత పసిబిడ్డవు! నీకు గుప్పెడన్నం పెట్టలేనా? రా నాయనా! లోపలికి కాళ్ళూ చేతులూ కడుక్కొచ్చి విస్తరి ముందుకూచో! పీటేస్తున్నాను. కాస్త చద్దన్నం వుంది. పెట్టమంటావా మరి?" అని అడిగింది.

"పెట్టమ్మా!" అన్నాడు ఆ బిడ్డ శోషవచ్చినట్లు.

తన కోసం భర్త అట్టిపెట్టిన చద్దన్నం విస్తట్లో పెట్టింది. ఏదో ఊరగాయ కలుపుకునేందుకు వేసింది. చల్లపోసింది. ఆమె ఇటునించీ అటు తిరిగేలోపు ఆ కాస్త అన్నం మింగేశాడా పిల్లవాడు.

పైగా సిగ్గు పడ్డాడు.

"ఆకలి తీరలేదమ్మా!' అన్నాడు బిడియంగా.

"పోనీ మా ఆయన కోసం వండిన వేడన్నం పెడతా నుండు" అని పప్పూ, కూరా, వేడన్నం, పెరుగూ వడ్డించింది సుశీల భర్త తిడతాడేమో అని భయపడుతూనే.

ఆ వటువు మొత్తం అన్నాన్ని గుటుక్కున మింగేశాడు. బుగ్గన వేలేసుకుంది సుశీల.

"అమ్మా! ఇంకేమన్నా వున్నాయా ఇంట్లో" విస్తట్లో గీతలు గీస్తూ అడిగాడు బుడతడు.

"ఉన్నాయి నాయనా! అటకమీద చాలా పిండివంటలున్నాయి. ఉండు" అంటూ అతికష్టంమీద ఆ డబ్బాల్ని దింపి అవన్నీ వడ్డించిందామె. భర్తవచ్చి తిడతాడో కొడతాడో తెలీదు. అయినా ఈ బాలుడి ఆకలి తీర్చాల్సిందే అనుకుంది.

"ఏమిటో ఇవాళ తెగ ఆకలివేస్తోంది" లోపలికిపోయిన పొట్ట నిమురుకుంటూ గుక్కిళ్ళు మింగాడు పిల్లవాడు.

ఇతడు మానవమాత్రుడుకాడు. నన్ను పరీక్షించటానికి వచ్చిన దేవుడు నా భవబంధములూడ్చటానికి వచ్చిన నారాయణమూర్తి అని తెలుసుకుందామె. వండినవింకేమీలేవు. అన్నీ అయిపోయాయి.

"బాబూ! అటకపైన అప్పడాలూ వడియాలూ, కందిసున్నీ, ఊరమిరపకాయలూ గోంగూర, చింతకాయ, కొరివికారం, పచ్చళ్ళూ ఇలాంటివన్నీ వున్నాయి. తినగలవా? తింటావా మరి?" అని అడిగింది సుశీల.

"తినకపోతే ఎలాగమ్మా! ఆకలి దహించుకుపోతున్నది. ఏవైనాసరే వడ్డించు. ప్రాణం నిలవాలి కదా" అన్నాడా బాలుడు.

అవన్నీ అప్పచ్చులు తిన్నట్లు తినేశాడు. నిలువు గుడ్లేసుకొని చూస్తోంది సుశీల. ఇంక ఇంట్లో ఏం లేవు. ఇతను అడిగితే ఏం పెట్టాలో అర్థంకాలేదామెకి ఈ పొట్టి పిల్లవాడు మాయలాడై తనింటికి ఎందుకొచ్చాడో అర్థంకాలేదు.

చద్దన్నం కూడా తినలేదేమో ఆమెకి శోషవచ్చినట్లైంది. చీకట్లు కమ్మిన కళ్ళని తెరిచి విస్మయచకితురాలైంది. ఆమె ఆకలి మాయమైపోయింది.

"తల్లీ! సుశీలా! కిందటి జన్మలో నాకు క్షరాభిషేకం చేసావు. ఇప్పుడు ప్రతిఫలం యివ్వడానికి వచ్చాను. ఇహనించీ నీ భర్త గుణవంతుడవుతాడు. దానపరుడవుతాడు. నీకు పిల్లలు కలుగుతారు. నువ్వు నాకు వడ్డించిన వంటలన్నీ యధాస్థానంలోనే వుంటాయి చూడు! అన్నాడు దరహాసంతో.

జగన్మోహన రూపం ఆసాధ్వి ఇందాక కళ్ళముందు ప్రత్యక్షమైంది.

శతపత్రాక్షము శిఖ్యసఖ్యభృతి చంచన్మౌళి సన్నాము ఉన్నత నాసాము కుళంబు పూర్ణతర చంద్ర స్నిగ్ధ ముగ్ధాననంబు అతసీసూన సవర్ణ వర్ణమతిశాంతంబు అబ్జనాభంబు శ్రీశ్రితవక్షంబు మహామహంబు అయిన దివ్య సుందర జగన్మోహన స్వరూపం కళ్ళముందు సాక్షాత్కరించింది. స్వామి శిరమున ఊగే ఆ నెమలి పింఛంలో ఒక్కక్కొకింజల్కమైనా తను అయితే చాలు ప్రభువు పాదాలకి అలంకారమయ్యే అదృష్టానికి నోచుకున్న ఆ కడియానికి తాపించిన చిన్ని మువ్వ కాగల్గితేచాలు. అనుకుంటూ శ్రీకృష్ణ దేవుడిముందు మోకరిల్లింది సుశీల. లలిత శిరీషపుష్ప మృదులంబులైన నీ చరణతలాలు ఈ పేద బ్రాహ్మణ ఇంట మోపావా చిద్విలాసా! గుచ్చుకుంటాయి నాయనా? మా గరుకునేలలు. అంటూ స్వామిపాదాలకింద తన చేతులు పెట్టి తన చీర కొంగు పరిచింది.

"అమ్మా! నువ్వు నిజంగా సుశీలవే. విదురుడూ శబరి, కుబ్జ, నువ్వూ, దేవకీ యశోదా మీ అందరి ఆప్యాయతకీ నేను వినమ్రుడినవుతున్నాను'' అన్నాడు జగదాధారుడు.

"నువ్వు ఒక్క నిమిషం అలాకూచో. ఇందాక అన్నీ ఉత్తుత్తిగా తిన్నావు. చల్లచేసి కాస్త వెన్నపూసపెడతాను అదన్నా తినకపోతే నేను ఊరుకోను'' అంటూ వెన్నతీసి ఆ నవనీతం పెట్టిందామె. అన్నంలో గోంగూరపచ్చడి కలిపి వెన్నపూస నంచి ముద్దలు పెట్టింది.

అంతసేపూ చిద్విలాసంగా చూస్తున్నాడామె శ్రద్ధని ప్రభువు. నీకు అయిదుగురు అబ్బాయిలు పుడతారు. ఈ జన్మలో ఇక నీకు అంతా సుఖమే. కిందటి జన్మలో క్షీరాభిషేకం చేశావు. ఈ జన్మలో ఇన్ని రకాల ఆహారాలు పైగా ఈ వెన్నపూసా గోంగూర

పెట్టావు తల్లీ!" ఇంక తర్వాత నీకు జన్మలేదు. మోక్షమే. అదుగో మీ ఆయన వస్తున్నాడు ఎంత మంచివాడై వస్తున్నాడో చూడు" అన్నాడు కృష్ణుడు మూతుతుడుచుకుంటూ.

నీలంబు భక్తానుకూలంబు హరిదంత చేలంబు నవనీత చోరమాదిమూలంబు ధృతజగజ్జాలంబు శ్రీ లతావాలము అయిన తన మహా దివ్య స్వరూపం ఉపసంహరించి చిన్న వటువై పొట్ట నిమురుకుంటూ వెళ్ళిపోయాడు.

అటువంటి దివ్యవేణుగానానికి సంగీత ప్రియ అయిన జాంబవతి మురిసి పోవటంలో ఆశ్చర్యం ఏముంది?

శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసఃఫణీ. అన్నమాట నిజం. కృష్ణుడి మురళీవాదానికి ఆవులు కూడా పరవశించిపోయేవి మరి.

రుక్మిణీ జాంబవతీ సత్యాదేవులతో కూడి శ్రీకృష్ణుడు విహరిస్తున్నా ఆయన మనసు భక్త రక్షణ మీదే వుండేది.

రుక్మిణీ సత్యభామలు పరమానురాగంతో కృష్ణుణ్ణి సేవించారంటే ఎందుకు సేవించరు?

రుక్మిణీ కల్యాణానికి ముందు రేవతీదేవితో బలరాముడికి పెళ్ళిఅయింది. అదొక విచిత్రం. కొన్ని వేల ఏళ్ళ క్రితం రేవతి తండ్రి తన కూతురి అసమాన రూపలావణ్యానికి అబ్బురపడి ఈ కన్యని వివాహమాడగల ఉత్తమ వరుడెక్కడున్నాడు? అతనెవరు? అని సతమతమైపోయేవాడు. చివరికి తన వల్ల కాదని కూతుర్ని బ్రహ్మలోకానికి తీసుకువెళ్ళాడు. బ్రహ్మదేవుడిని ఈమెకి వరుడెవరు? అని అడిగాడు.

బ్రహ్మనవ్వి ఇది బ్రహ్మలోకం కదా. ఒక లిప్తకి వేల ఏళ్ళు మాకు గడిచినట్లు లెక్క. ఇప్పుడు భూలోకంలో మీ మనుష్యులెవరూ లేరు. యాదవ వంశంలో ఆదిశేషుడి అంశతో బలరాముడనే రాజకుమారుడు జన్మించాడు. అతని తమ్ముడే విష్ణ్వంశ సంభూతుడైన శ్రీ కృష్ణుడు. నీ కుమార్తెకు బలరాముడు తగిన భర్త. వెంటనే వెళ్ళి నీ పుత్రికను బలరాముడికిచ్చి పెళ్ళి చెయ్యి" అన్నాడు.

రేవతీ ఆమెజనకుడూ భూమి మీదకి వచ్చేసరికి లోకమంతా మారిపోయింది. అప్పటి రాజవంశాలు లేవు. ఆయా ప్రదేశాలు మారిపోయాయి. నదులు తమ ప్రవాహదిశని మళ్ళించుకున్నాయి.

బ్రహ్మమాట ప్రకారం నవయవ్వన సుందరీమణి అయిన తనూజాత రేవతిని బలరామదేవుడికిచ్చి వివాహం చేశాడు ఆమె తండ్రి. ముసలం అంటే రోకలి. ఆయుధంగా కలవాడు కనుక బలరాముణ్ణి ముసలీ! అన్నారు. (హలాన్నీ, ముసలాన్నీ కలిగిన వాడవటంచేత హలీముసలీ అన్నారు). ఆయనకి నాగలికూడా ఒక ఆయుధం. కర్షక వ్యవహారం అంటే పంటల సంగతి బలరాముడు చూసుకునేవాడు. గోపాలదేవుడు పాడి వ్యవహారం చూసేవాడు. పాడీపంటా ఇవే ప్రజలకప్పుడు ముఖ్యం. పైపై మెరుగులు కాదు.

రేవతి గనక భూలోకంలోనే వున్నట్లయితే ఆమె నిజంగా ముసలి అయివుండేది. కానీ బ్రహ్మవరంవల్ల కాలేదు. అది వేరే సంగతి. తెలుగు ముసలి అయిన రేవతి సంస్కృతం ముసలి అయిన బలరాముడిని వివాహమాడిందన్నమాట.

కొడుకూ కోడళ్ళనిచూసి రోహిణీ వసుదేవులు చాలా సంతోషించారు. రోహిణికి పుట్టిందే ఒక్క కొడుకు. అదీ భర్త చెరసాలలో వుండగా దేవకీ గర్భాన్ని సంకర్షణంచేసి అంటే ఇవతలికి తీసుకొచ్చి రోహిణీ గర్భంలో ప్రవేశపెట్టారు.

ఇక్కడ వ్రేపల్లెలో నందయశోదల యింట తలదాచుకున్న రోహిణీదేవికి ఎర్రగా అందంగా వున్న బలరాముడు పుట్టాడు. అమ్మంటే ప్రాణం అతనికి. రేవతి కూడా అత్తగార్ని చాలా గౌరవిస్తుంది.

రుక్మిణి కూడా పెద్దలని ఎంతో గౌరవిస్తుంది. తన భర్త మహాసుందరుడు ప్రతిభావవంతుడు, సుగుణమూర్తి శ్రీకృష్ణుడు సవతులందరిలో తననే బాగా ప్రేమిస్తాడని, తనే పట్టపు దేవిననీ ఆమెకి కించిద్గర్వం కలగటం ప్రారంభమైంది.

ఒకనాడు లోపలి మందిరంలో కృష్ణుడు సుఖాసీనుడై వున్నాడు. చెలికత్తె చేతిలోనించీ విసనకర్ర తీసుకొని రుక్మిణి ఆయనికి విసరసాగింది.

చిరునవ్వుతో ఆయన పరిహాసమాడాడు. 'పొరపాటు చేశావేమో రుక్మిణీ! మళ్ళీ ఆలోచించు. బలశౌర్యంబుల భోగమూర్తి కులరూప త్యాగసంపద్గుణంబుల కంటే దిక్పాలురకంటే నిను వరించిన శిశుపాలాదిరాజులు గొప్పవారు. మీ తల్లిదండ్రులూ అన్నగారూ నిన్ను శిశుపాలుడికిస్తానంటే అంగీకరించకుండా బలహీనులమూ సముద్రంలో నివసించే వాళ్ళమూ అయిన మమ్మల్ని గౌరవించే అవసరం నీకేముంది?

అందరిలాంటి వాళ్ళంకాదు. ఇతరులకు మా జాడతెలియదు. తరచుగా రాజపీఠములకు రాము. మాకీ సముద్రమే శరణం. మా దగ్గిర నిధులేం లేవు. ధనవంతులెవరూ మాకు చుట్టాలు కారు. మేము గూఢవర్తనులము. గొప్ప స్త్రీలు మా వంటి వార్ని ఎంచుకోరే. నువ్వే ఏదో పొరపాటుపడ్డావు. కయ్యానికైనా వియ్యానికైనా సమానస్థాయి కావాలిగదా. పోనీ ఇప్పటికైనా మించిపోయిందిలేదు. నీకిష్టమైన వాడిని చెందు. సాళ్వజరాసంధాదులూ శిశుపాలాదులూ నువ్వంటే మైమరచిపోతారు. ఏదో మీ అన్నగర్వాన్ని పోగొట్టాలని నిన్ను తీసుకొచ్చానుగాని నాకేం కామమోహాది గుణాలు లేవు. నీకు యిష్టమైనట్టుచెయ్యి. మా బలవంతంలేదు' అనేశాడు.

చెవుల్లో సూదులు గుచ్చినట్లు విలవిలలాడిపోయింది. రుక్మిణీదేవి. పెద్ద పులిగర్జనం విన్నలేడిపిల్లలాగా మతిపోయినట్టె చేష్టలు దక్కినేలమీదవాలిపోయిందా పుత్తడిబొమ్మ.

సంభ్రమంతో పాన్పుమీదనించి ఉరికాడు కిందికి కృష్ణుడు. సహధర్మచారిణిని ఎత్తుకొని మంచంమీద పడుకోబెట్టాడు. అయ్యో నా మాటలకి అంతనొచ్చుకున్నావా ప్రియా! అంటూ ఆమె కన్నీటిని పన్నీటితో తుడిచాడు. చందనం అలదాడు కర్పూరపు పలుకులు చెవుల దగ్గిర పెట్టి ఊదాడు. చిక్కుపడిపోయిన ఆమె ముత్యాలదండల్ని సరిచేశాడు. నుదుట తిలకంబు దిద్దాడు. ఆమె తీసేసిన ఆభరణాలన్నిట్నీ మళ్ళీ అలంకరించాడు. తామర పువ్వురేకులతో చేసిన విసన కర్రతో విసిరాడు. పమిట సద్దాడు. ఆమె మనసుకి సంతోషం కలిగించి సేద దీర్చాడు.

బిగియ కౌగిట చేర్చి నెమ్మొగము నిమిరాడు. రుక్మిణీ దేవి తలకట్టు అపూర్వంగా వుంటుంది. చీకటిని గెలిచి తుమ్మెద గుంపుని ధిక్కరించి మనుషులను మరులు

కొలిపేటట్లుంటుంది. ఆ జుట్టు చిక్కుదీర్చి అందంగా ముడిచి పువ్వులతో అలంకరించాడు మదన కోటి సుకుమారుడైన కృష్ణుడు.

"ఔను ప్రభూ! ఏం చేసినా ఏం అన్నా మీకు చెల్లుతుంది. నిన్నే ప్రేమిస్తున్నాను. నువ్వు లేనిది బతకలేను. నా పెళ్ళికి ముందు నువ్వొచ్చి నన్ను ఎత్తుకెళ్ళుస్వామీ!" అని నేను మొరపెట్టుకోవటం తప్పయింది. అనుకుంటూనే వున్నాలే నేనంటే నీకు లోకువని నా ఊహ నిజమైంది. నేనెవరి దగ్గిరకైనా వెళ్ళనా; ఎవర్ని అయినా ప్రేమించనా? ఏం మాటలు మాట్లాడావు దేవా! నువ్వు? నా ముందు మాట్లాడదగినవేనా? నీ కంటే ఈ సమస్త సృష్టిలో అధికుడుంటాడా నీరజనాభ! ఛ ఎంత మాట అన్నావు ప్రభూ!" అంటూ అక్కడ పుష్పాలతో కూర్చిన లీలాకందుకం వుంటే దాన్ని వేసి కృష్ణుడిని కొట్టింది రుక్మిణి.

"దేవీ! ప్రాణ ప్రియా! ఎప్పుడూ నువ్వుకోపగించుకోవటం చూడలేదు. ఇన్నిమాటలనకపోతే నీకు కోపంరాదు. అలిగిన నీ మోము ఎంత బావుందో తెలుసా? నిన్నిట్లా చూడాలని నీ మనసు స్పష్టంగా తెలుసుకోవాలని చెడ్డగా మాట్లాడాను. కావాలంటే నీకిష్టం వచ్చిన శిక్షవెయ్యి. నువ్వు పతివ్రతామణివి నిర్మల ధర్మవివేకశీలవు. పవిత్రమైన నీ భావం తెలిసీ తప్పుగా మాట్లాడాను. నా తప్పు క్షమించుమానినీ! ఇన్ని తప్పులు మాట్లాడాను కనక నీకు వరాలు ఇవ్వద్దా? కాస్త కొట్టడం ఆపెయ్యి. ఆ పువ్వుల చెండుమాటిమాటికీ పట్టుకోవటం వల్ల నీ చెయ్యి నెప్పి పుడుతుంది. సకల సంపద్విలసితంబు అయిన ద్వారకానగర దివ్య మందిరంబులందు నిజమైన సంసారిలాగా నీయందు మాత్రమే బద్ధానురాగుణ్ణి అయి చరిస్తాను. నీతో సమానురాలైన కాంత ఏ కాంతలందన్నా వున్నదా? నీ సద్గుణాలకి సంతోషిస్తూ వుంటాను. ఇవాళ్టి నీ అలకల కులుకులకు మరింత ప్రీతి కలిగింది రా! వనవిహారం చేద్దాం. అంటూ రమణీయోద్యానవనానికి తీసుకెళ్ళాడు కృష్ణుడు రుక్మిణిని.

రుక్మిణీదేవికి నెల తప్పింది. ఇంద్ర ప్రస్థపురానికి వచ్చారని విని సాత్యకితో కలిసి కృష్ణుడు పాండవులని చూడటానికి వెళ్ళాడు. పాంచాల తనూజ పద్మాక్షుడికి

మొక్కింది. ఆయన ధర్మజభీములకి నమస్కరించాడు. అర్జునుడిని ఆలింగనం చేసుకున్నాడు. నకుల సహదేవులు తనకు ప్రణమిల్లితే గుచ్చి యెత్తాడు కృష్ణుడు.

అత్తఅయిన కుంతీదేవికి నమస్కరించాడు.

"అత్తా ! కొడుకులు కోడలు చిత్తానందముగ పనులు చేసి నిన్ను సుఖపెడుతున్నారా?" అని ప్రేమగా అడిగాడు.

"నాయనా! కృష్ణా! ఆ దుర్యోధనుడు ఎన్ని అపకారాలు చేస్తున్నాడో నా పిల్లలకి విన్నావా? నాకూ ఈ పిల్లలకీ నువ్వే దిక్కు ఎప్పుడూ మా చిక్కులు తీరుస్తూనే వుంటావు" అని తమ బాధ్యతని మేనల్లుడి చేతికి అప్పజెప్పింది కన్నీళ్ళతో కుంతీదేవి.

వాళ్ళంతా ప్రార్థించిన మీదట హరి ఇంద్రప్రస్థంలో కొన్ని నెలలు ఉన్నాడు. అర్జునుడూ ఆయనా కలిసి వేటకి వెళ్ళారు. ఒకసారి దాహంవేసి యమున దగ్గిరికి వెళ్ళి శుచులై నీళ్ళు తాగారు. ఆ తీరంలో ఒక చక్కని చుక్క కనపడింది.

ఆ అమ్మాయి ఎవరో కనుక్కురమ్మని అర్జునుడిని పంపించాడు కృష్ణుడు.

"ఆమె పేరు కాళింది. సూర్యుని కూతురుట. విష్ణువు భర్తగా కావాలని తపస్సు చేస్తుంటే వేటకి వచ్చిన కృష్ణుడు నిన్ను వరిస్తాడని ఆమె తండ్రి వాగ్దానం చేశాడుట" అని పరిహాసాలాడుతూ మేనబావకి చెప్పాడు అర్జునుడు కనుక్కువచ్చిన సంగతులు.

"నువ్విప్పుడు నాకు పెళ్ళి చేస్తున్నావు గనక నేనూ నీకు పెళ్ళి చేస్తాన్లే" అన్నాడు కృష్ణుడు. విశ్వకర్మని పిలిపించి ఇంద్రప్రస్థపురానికి అలంకారంచేయించాడు ఆయన. మయుడు పార్థుడికి ఒక సభకట్టించి ఇచ్చాడు. ఆ సభే భారతానికి కీలకం. ఆ నీలవేణి కాళిందిని తీసుకొని తనపురానికి వెళ్ళి శుభలగ్నంలో పెళ్ళాడాడు.

హరికి మరొక మేనత్త రాజాధిదేవి. ఒక మేనత్త కుంతి. ఇంకొక మేనత్త సాత్వతి. రాజాధిదేవికి విందానువిందులనే కొడుకులూ మిత్రవింద అనే పుత్రికా వున్నారు. వాళ్ళది అవంతి. విందాను విందులు దుర్యోధనుడికి వశవర్తులు. తమ చెల్లెలు మిత్రవిందకి స్వయం వరం చాటించారు. తన వీరత్వం ఆ స్వయంవర సభలో ప్రకటించి సుందరి

అయిన మిత్రవిందని చేపట్టాడు కృష్ణుడు.

కోసల రాజకుమారి నాగ్నజితి మిక్కిలి గుణవతి. ఆ రాజకన్య మోహనాకారుడైన రాజీవాక్షుడు కృష్ణుణ్ణి వరించివున్నది మనసులో.

భయంకర పౌరుషవంతములైన ఎద్దులు ఏడింటిని అదుపులోకి తెచ్చినవాడికే కుమార్తెని ఇస్తానన్నాడు నగ్నజిత్తు.

పర్వతాకారాలైన ఆ ఏడు ఎద్దుల్నీ కట్టి ఈడ్చుకొచ్చాడు హరి. నగ్నజిత్తు మెచ్చుకుని నాగ్నజితినిచ్చి పెళ్లి చేశాడు. అమూల్యాలైన అనేకకానుకలను ఇచ్చాడు కృష్ణుడికి...

హరికి మేనమరదలి వరస అయ్యే మరొక కన్యాలలామ వున్నది. ఆమె పేరు భద్ర. ఆ భద్రని కృష్ణుడు పెళ్లాడాడు.

తరువాత రాజులని ఓడించి మద్రరాజకన్యక అయిన లక్షణని తీసుకొచ్చి కృష్ణుడు పెళ్లిచేసుకున్నాడు. ఆ లక్షణ పుణ్య లక్షణ.

... ...

అక్రూరుడూ కృతవర్మా కూడా బలరామకృష్ణులకి బంధువులే. శతధన్వుడనే పాటివాడు సత్రాజిత్తు శమంతకమణి మీద కన్ను వేసి వున్నాడు.

సత్యభామని అక్రూరుడికన్నా కృతవర్మకన్నా ఇస్తాననేవాడట సత్రాజిత్తు. 'కానీ కృష్ణుడికిచ్చి అధర్మం చేశాడు సత్రాజిత్తు. నువ్వు ఆ రాజుని ఏదో చేసి శమంతకమణిని తీసుకురా' అని శతధన్వుడిని రెచ్చగొట్టారు అక్రూరుడు, కృతవర్మా.

ఒకనాడు సత్రాజిత్తు నిద్రబోతున్నాడు ఆదమరిచి, కసాయివాడు పశువుని పట్టి చంపినట్లు నిద్రిస్తున్న సత్రాజిత్తుని చంపేశాడు శతధన్వుడు. సత్రాజిత్తు భార్యలంతా గొల్లుమన్నారు. సత్యభామకి సంగతి తెలిసి ఏడుస్తూ పరుగున వెళ్లింది. తండ్రి శవాన్ని తైలద్రోణిలో పెట్టించి అప్పుడు హస్తినాపురంలోవున్న కృష్ణుడి దగ్గిరికి

వెళ్లి చెప్పిందామె. చాలా బాధపడ్డారు బలరామకృష్ణులు. శతధన్వుణ్ణి చంపుతానని చెప్పి హరి ద్వారకానగరానికి వచ్చాడు.

శతధన్వుడికి అప్పుడు భయం వేసిందీ. ఎంత అంటే చెప్పలేము. ప్రాణం మీది తీపి చేత గడగడ వణికిపోయినాడు అతడు. ఇతరులకీ వాళ్ల ప్రాణం అంతే తీపి అని తెలియలేదు.

కృతవర్మని సహాయం అడిగాడు.

"అమ్మో! రామకృష్ణుల్ని ఎదిరించటమే... మన వల్లకాదు. కంసాదుల కంటె గొప్పవాళ్లమా మనం" అన్నాడు కృతవర్మ.

అక్రూరుడి దగ్గిరకి పరిగెత్తాడు శతధన్వుడు కాపాడమని. "శౌరికి ఎప్పుడూ మొక్కుతాముగాని విద్వేషం మావల్ల కాదు. ఆయన గొప్పతనం నాకు తెలుసు. చాల్లే ఇంక పో. నీ స్నేహానికి పదివేల నమస్కారాలు" అన్నాడు అక్రూరుడు. 'పోనీ ఈ మణినైనా నీ దగ్గిర అట్టే పెట్టుమ"ని ఇచ్చి శతధన్వుడు వందయోజనాలు పారిపోయాడు గుర్రమెక్కి.

వెనకాలే రామకృష్ణులూ వెళ్లారు.

సుదర్శన చక్రంతో శతధన్వుడి శిరస్సు ఖండించాడు కృష్ణుడు. అతని వస్త్రాలు వెతికితే మణి కనపడలేదు కృష్ణుడికి.

బలభద్రుడి దగ్గిరికివచ్చి 'శతధన్వుడి దగ్గిర మణి కనపడలేదనయ్యా! అనవసరంగా చంపామా?' అన్నాడు కృష్ణుడు.

'చాల్లే తమ్ముడూ! మీ మామగారు నిద్రపోతుంటే చంపిన నీచుడు వీడు. ఎవరికో దాచమని మణిని ఇచ్చి వుంటాడులే. వీడిని చంపకపోతేనే పాపం. నేను మిథిలా నగరానికి వెళ్లొస్తాను. నువ్వు మన నగరానికి వెళ్లు' అన్నాడు బలరాముడు.

కృష్ణుడు ద్వారకకి వెళ్లి విషయమంతా సత్యభామకి చెప్పి, ఆమె మీది ప్రేమతో సత్రాజిత్తుకి పరలోక క్రియలు చేయించాడు. సత్రాజిత్తుకి కొడుకులు లేరు. అల్లుడైన

కృష్ణుడే క్రియాకాండ నిర్వర్తించాడు. అక్రూరుడి దగ్గర శమంతకమణి వున్నది.

డబ్బు ఎంత పాపిష్టిది. సర్వనాశంకరమైన ధనం కోసం నరులు వెంపర్లాడటం మానరు కదా... అందరు మనుషులకీ ఉపయోగపడకుండా ఒక్కళ్లే ధనాన్ని దాచుకుంటే ఆకలితో అలమటించి అన్నమో రామచంద్రా అని ఏడిచే సామాన్యులకి అందకుండా ధనమంతా ఒక చోటే పోగు చేసుకుని కూచుంటే దొంగలు దోచుకునైనా పోతారు. విప్లవమైనా వచ్చి తీరుతుంది. ఎలా చూసినా అధిక ధనం తాత్కాలిక సంతోషాన్నివ్వచ్చుగాని దాచిన వాడి ప్రాణం భద్రంగా వుండదు. యుగాలనించీ ఈ సత్యం తెలిసినా అందరూ తెలీనట్లే వుండి ధనవంతులే మరింత ధనంకోసం తపిస్తుంటారు. చివరికి ఫలితమూ అలాగే వుంటుంది. కష్టార్జితమైన ధనం మటుకే మనిషి సరిగ్గా చక్కగా, అనుభవించగలడు.

శతధన్వుడు హతుడైనాడని విని భయపడి దూరదేశం వెళ్ళిపోయారు. అక్రూరుడు లేకపోవటం వల్ల ద్వారకలో వానలు లేక తాపంబులు మహోత్పాతంబులూ పుట్టాయి.

పెద్దలు అక్రూరుడిని పిలిపించి ప్రియంగా మాట్లాడాడు.

సత్రాజిత్తుకి మగపిల్లలు లేనందువల్ల ఆడపిల్లలే ఆస్తీ అప్పులూ పంచుకోవాలి గదా ! ముందు సత్రాజిత్తుగారి దుర్మరణానికి చాలా శాంతి చెయ్యాలి మా అన్న బలరాముడేమో శమంతకమణి నేను దాచేసుకున్నాననుకుంటున్నాడు - అందుకేనేమో ద్వారకకి నాతో కలిసిరాకుండా మిధిలానగరానికి వెళ్ళాడు.

ద్వారకకి రావటానికి పెద్దగా యిష్టపడడు గదా దుర్యోధనుడు - సరాసరి మిధిలా నగరానికి వెళ్ళి మా అన్నయ్య దగ్గిర లలిత గదా యుద్ధ కౌశలం నేర్చేసుకున్నాడు - చూశావా పాండవుల కెంత కష్టమో. దుర్యోధనుడు నేర్చుకున్న గదాయుద్ధం వల్ల అన్నిటికీ కారణం ఈ మణి - దాన్ని నువ్వే అట్టిపెట్టుకో. కానీ బంధువులందరికీ మాత్రం ఆ మణిని చూపించి అది ఇన్నాళ్ళూ నీ దగ్గిరే వున్నదని మాత్రం చెప్పు చాలు' అన్నాడు.

మణిని తీసుకొచ్చి యిచ్చాడు అక్రూరుడు- అందరికీ చూపించి మణిని మళ్ళీ అక్రూరుడికే మణినిచ్చేశాడు కృష్ణుడు.

... ...

చిత్రాంగదను వీడ్కొని తర్వాత తరుచుగా ఇంద్రప్రస్థానికి రమ్మని చెప్పి తనూ మణిపూరుకి వస్తుంటానని చెప్పి ఓదార్చి ద్వారకకి వచ్చాడు అర్జునుడు.

సుభద్రాకన్య సౌందర్యం అదొక సుకుమారం. ఆ పిల్ల బహు ముద్దరాలు. వసుదేవుడి తనయ, శ్రీకృష్ణ, బలరాముల గారాబు చెలియలు.

బలరాముడి దగ్గిర భీముడూ, దుర్యోధనుడూ గదా యుద్ధపు మెళకువలు నేర్చుకున్నారు. దుర్యోధనుడికిచ్చి సుభద్ర వివాహం జరిపించాలని బలరాముడి అభిలాష - శ్రీకృష్ణుడికేమో తన ప్రాణానికి ప్రాణమైన పార్థుడితో చెల్లెలి వివాహం జరగాలని పట్టుదల. కానీ అన్నగారి మనసు నొప్పించటం ఇష్టం లేదు. కథ ఇట్లా వుండగా అర్జునుడు తీర్థయాత్రలకి బయలుదేరాడు. కృష్ణుడు ఆ తీర్థయాత్రా విశేషాలన్నీ ఎప్పటికప్పుడు గమనిస్తూనే వున్నాడు.

ఉలూచినీ, చిత్రాంగదనీ ఫల్గుణుడు పరిణయమైనాడనీ తదుపరి ద్వారకకు పయనమైనాడనీ తెలుసుకుని దారిలోనే అతనిని కలుసుకుని విషయమంతా వివరించి కపట యతిలాగా ఉద్యానవనంలో ప్రవేశపెట్టాడు కృష్ణుడు, సుభద్రని అతని సేవకి నియోగించాడు. మనసు మాయ కాబోలు భద్రేభగమన సుభద్రని చూసి సవ్యసాచి ఆకర్షితుడైపోయి ఆ ఆకర్షణలో తలమునకలైపోయానాడు.

కృష్ణుడూ అర్జునుడూ ఒక రాత్రంతా కూచుని మాట్లాడుకున్నారు. పూర్వం వాళ్ళిద్దరూ నరనారాయణులనే స్నేహితులు, ఋషులు. రుక్మిణీ సత్యభామలతో వచ్చిన యతి ఫల్గుణుడని చెప్పాడు. బలరామన్నగారికి ఈ పెళ్లి ఇష్టం లేకపోవడం వల్ల అంతా రహస్యం.

తమ తోటలో విడిసిన రాజర్షికి భక్తిశ్రద్ధలతో సేవలు చేస్తోంది సుభద్ర. 'ఆహా

మా బావకెంత చక్కటి చెల్లెలుంది. కలువ రేకులవంటి కళ్లు అల్లార్చి ముగ్ధమోహనంగా చూస్తుంది. ఏదన్నా పని చెపితే అద్దాల చెక్కిళ్లపై చేతులు చేర్చుకుని వింటుంది ఏదన్నా చెపుతుంటే- మిసమిసలాడే పచ్చటి పసిమిరంగు ఆ పిల్లది. నల్లగా వత్తుగా ఆర్యోగంగా మోకాళ్లనంటే కేశాలు ఆమెకి తల్లిదండ్రులు పెట్టని సొమ్ములు. ఈ జవ్వని పలుకుదురు పరువంపు మల్లెమొగ్గల జతగాజనులు పల్కుదురు.

అరచందమామనేలిన నెన్నుదురు గలది. ఈవెలంది యొడల్ పైడిలో వెలంది, ఈ బిడారు మృగీమదశ్రీబిడారు అని సుభద్రా సౌందర్యాన్ని పదే పదే చూస్తుండేవాడు అర్జునుడు.

సుభద్ర మనసులో కోరికతో సతమతమవుతున్నది. చివరికి ధైర్య చేసి అడగనే అడిగింది.

'స్వామీ! మీరు ఎన్నో దేశాలు తిరుగుతుంటారుటగదా మా చిన్నన్న చెప్పాడు. మీ బావ అర్జునుడు కూడా ప్రస్తుతం తీర్థయాత్రలు చేస్తున్నాడుట. మీకెక్కడన్నా తారసపడ్డాడా?' అని సిగ్గుపడుతూనే అడిగింది.

'తరుణీ! అతను నాకు కనపడినా అసలు పేరు చెప్పడు అనిపిస్తోంది. మీబావ ఎలా వుంటాడో చెప్తే ఆ పోలికలు గలవాడు నాకు కనపడ్డాడేమో చెప్తాను' అన్నాడు చిరునవ్వుతో కపటయతి.

'మా బావ చాలా అందగాడు. మరే...' అని ఏదో చెప్పబోయింది సుభద్ర.

'ఏం అందం? మీ బావ నల్లగా వుంటాట్ట. కృష్ణ అంటారుటగా' అని రెచ్చగొట్టాడు పార్థుడు.

'నల్లగా వుంటే అందంగా వుండరా? మా బావ అందాన్ని భారతవర్షమంతా పొగుడుతుంటే మీరేమో...' కోపం వచ్చిందా పిల్లకి. ఆమె మూతి ముడుచుకుంటే బహు ముచ్చటైంది ఆ పురుష సింహుడికి.

'పోన్లే మీ బావే అందగాడు. ఎలా వుంటాడో చెప్పు మరీ' లాలనగా అడిగాడు నరుడు.

'ఎగు బుజమ్ములవాడు మృగరాజమధ్యంబు నడచి పుచ్చుకొను నెన్నడుమువాడు, కోదండ గుణకిణాంకమ్ములైన బాహువులు గలవాడు. వెన్నున మచ్చగల విభవమ్ము వాడు. విపుల వీరమూర్తి, గంభీర గుణంబు నెలవు సరస వాచా చతురుండు పరమ సాధుమూర్తి, అత్యంత క్లిష్టమైన మత్స్యయంత్రాన్ని భేదించినవాడు ద్రోణాచార్యులవారి ప్రియశిష్యుడు. మా అత్త కుంతీదేవికి ప్రియనందనుడు. కన్నె ద్రౌపదికి మానస చోరుడు. మా చిన్నన్నయ్యకి ప్రాణమిత్రుడు, నాకు... నాకు....'

సుభద్ర అలా చెప్తుంటే నరవరుడు పరవశించిపోయినాడు. భావోన్నతి చేత అతడి పెద్దకళ్లు చెమర్చాయి. ఈ అందాల బాలిక ఈ అతి ముద్దరాలు, మేన మరదలు ఎంత గాఢంగా తనని ప్రేమిస్తోంది. ఇంత ప్రేమకి ఎవరు దాసోహం అనరు? అతి మెత్తని మనసు. ముద్దు గొలిపే అమాయకత్వం అర్జునుడి మనస్సు దోచదో?' అనుకున్నాడు.

'అలాగా లలనామణీ! నీకు... నీకు... చెప్పు మాట పూర్తి చెయ్యి. మాకు వీనుల విందు చెయ్యి కోకిలకంఠీ' అని అడిగాడు యతి.

'నాకు సర్వస్వం మా బావ. సర్వజ్ఞులు మీకు తెలియనిదేముంటుంది?' చేతుల్లో మొహం కప్పుకుంది సుభద్ర.

'మీ బావకి వెన్నుమీద పుట్టుమచ్చ వుందా? నాకు తెలియదేమరి నీకెలా తెలిసింది బాలికామణీ!' సాలోచనగా అన్నాడు యతి.

సుభద్ర అదిరిపడింది. 'పొండి స్వామీ! అమాయకురాల్ని అనేగా నాతో పరిహాస మాడుతున్నారు' అంది.

'నిజమే బంగారూ! ఆ మచ్చ వుందేమో నాకు కనపడదుకదా నువ్వే చూడు' అంటూ వెనక్కి తిరిగాడు సవ్యసాచి కప్పుకున్న ఉత్తరీయం కిందకి జార్చి.

"ఇదేమిటి యతి ప్రవర్తన మొదటినించీ అనుమానంగానే వుంది. అన్నయ్యతో చెప్తే 'అలా కనిపిస్తాడు గాని చాలా గొప్పవాడమ్మా. ఆ యోగి యోగులు రకరకాలుగా

మనల్ని పరీక్షిస్తుంటారు. చివరికి మన భక్తిశ్రద్ధల చేత విశ్వాసం చేత మనమే గెల్చి ఈ సన్యాసుల ఆశీస్సులు తీసుకోవాలి. మా అమాయకపు చెల్లెలికి మంచి వరుడు రావాలి' అని చిన్నన్న వాసుదేవుడు మరీ మరీ చెప్పాడు. 'ఎవరు రావాలి? నరుడు రావాలా?' పక్కనే వున్న సత్యభామ వదిన నర్మగర్భంగా అడిగింది.

'పోనీ ఆ అర్జునుడన్నయ్యగార్ని తీసుకొచ్చి ద్వారకలోనే వుంచేసుకోరాదూ? పాపం వదలలేకపోతున్నట్టున్నారు బావగారిని' అన్నది రుక్మిణి వదిన.

'అదే మరి సత్యభామ నా ఉద్దేశం కనిపెట్టేసింది కానీ తమరికి అదేం అర్థమైనట్టు లేదు. కవిత్వం రాసేవాళ్లకి వేరే విషయాలు బుఱ్ఱకెక్కవనుకుంటాను' అన్నాడు కృష్ణుడు.

'ప్రభూ! అక్కకి అర్జునన్నయ్య సంగతి అర్థం కాలేదనుకుంటున్నారా, ఎంత మాట. మీ చిట్టి చెల్లెలు సుభద్రా కుమారినిచ్చి ఇల్లరికం తెచ్చుకోమని తన ఆంతర్యం - మీకే ఏం అర్థంకాలేదు' సత్యభామ పాపం నిష్కపటి ఉన్నదున్నట్లు అనేస్తుంది. ధనుర్విద్యా పారంగతురాలి లక్షణం అది ఏదన్నా సూటిగా చెప్పెయ్యటం.

అదంతా గుర్తొచ్చింది సుభద్రకి- మోహన చిరునవ్వు మొల్చింది. ప్రకృతిస్థురాలై యతివేపు చూసింది. వెనక్కి తిరిగాడేమో అతని వీపును చూసి ఆశ్చర్యపోయింది. శుభలక్షణలక్షితాలైన ఎగుబుజమ్ములపై నిత్యం ధనుస్సుని ధరించిన గుర్తు కాయలు కాసివున్నాయి. అమరేంద్ర వైభవం కలవాడనటానికి వీలుగా వీపుమీద కుంకుమబొట్టంత పుట్టుమచ్చ వుంది.

సుభద్ర గిర్రున వెనక్కి తిరిగి పారిపోబోయింది. ఆమె పెదవులు అదురుతున్నాయి. ఒక మధుర లజ్జ వెన్నుపూసనించీ ఒళ్లంతా పాకింది. ఆ లజ్జా ముగ్ధమోన సుకుమార మూర్తిని చూసి ఆగలేకపోయినాడు అర్జున కుమారుడు. వేగంగా పారిపోతున్న ఆ పిల్ల చెయ్యి పట్టిలాగి గాఢాలింగనం చేసుకున్నాడు.

'ప్రాణేశ్వరా! మీరా యతివేషంలో ఇన్నాళ్లూ ఇక్కడున్నది? అయ్యో వదలండి. మా వదినలిటువస్తారేమో' విడిపించుకుంటూ అంది సుభద్ర. 'వాళ్లెందుకు మన ఏకాంతానికి అంతరాయం కలిగిస్తారు. పైగా భర్త కౌగిలిలో కరుగుతుంటారుగాని'

'అన్నయ్యలు...' సిగ్గుగా అన్నది సుభద్ర.

'మీ చిన్నన్నయ్యకి తెలీదనుకుంటున్నావా దేవీ! ఆయనకి తెలీకుండా నేనిక్కడికి ఎలా రాగలననుకున్నావు' అంటూ ఇంకా అల్లరి చెయ్యబోయాడు సవ్యసాచి.

'అడుగో పెద్దన్నయ్య' అనేసింది గాభరాగా సుభద్ర. చటుక్కున ఆమెని వదిలేసి ఉత్తరీయం కప్పుకుని జపమాల తిప్పసాగాడు అర్జునుడు.

'దొంగ సన్యాసిగారూ! మా సుభద్రా కుమారి నామమేకదూ ఇప్పుడూ ఇన్నాళ్లూ మీరు జపిస్తున్నది' సుభద్ర ఆంతరంగిక సఖి వకుళ అడిగింది. ఇందాకట్నించీ పూలు కోసే నెపంతో ఆ చుట్టుపక్కలే తారాడుతోంది వకుళ.

బలరాముడి గొంతు బదులు ఎవరిదో స్త్రీ గొంతు వినిపిస్తోందే అని కళ్లు తెరిచాడు అర్జునుడు. సుభద్ర సిగ్గుతో కాస్త ప్రక్కగా నిలబడి వుంది వకుళా సహితురాలై.

మంచిశకునంబు లివిగొ నా మాట వినుము
కలికినిను రాజహంసంబు కాలుద్రొక్కె

చెలువ నిను రాజకీరంబు చెట్టవట్టె
కన్నె ఈలోన పెండ్లికాగలదు నీకు'

నిజంగా యతిలాగా సుభద్ర నుద్దేశించి జోస్యం చెప్పాడు. గాంధర్వ విధివిధానాన్ని ఇష్టపడ్డాడతను.

'పెద్దల్ని సంప్రదించి సలక్షణంగా వివాహం చేసుకోమని చెప్పవే వకుళా! ఈయనకి...' అంటూ చెరిగిపోయిన జుట్టు సవరించుకుని మెళ్లోని జిగినీ, నాను,

కాసులపేరు మొదలైన హారాల్ని చిక్కు తీసుకుని ముక్కెరని సద్దుకుని కన్యాంతఃపురానికి వెళ్లిపోయింది సుభద్ర- శరీరాన్ని అక్కడ చేర్చిందిగానీ మనసు మాత్రం అర్జునుడి దృఢ పరిష్వంగంలోనే వుంచేసింది.

ఆ పిల్ల ముక్కుకున్న అతి మూల్యమైన ముక్కెర గుచ్చుకుని తన చెంపమీద ముద్ర పడటంతో ఎక్కడ బలరాముడు నిజంగా వస్తాడో వచ్చి ఇదేమిటని అడుగుతాడో అని చెక్కిలి రుద్దుకుంటూ వుండి పోయాడు కుంతీసుతుడు. సుభద్రా సాహచర్యాన్ని ఆమె స్పర్శనీ భజిస్తూ తన్మయుడై ఉన్నాడు.

ఆ రాత్రి ఆ ప్రేయసీ ప్రియులిద్దరికీ నిద్రపట్టలేదు. బలరాముడికిష్టంలేని పనిచేస్తే సహించడు. అట్లాంటిది దుర్యోధనుడికిద్దామనుకుంటున్న సుభద్రని అర్జునుడికెట్లా ఇవ్వనిస్తాడు. ఆ నాగలి తీసుకెళ్లి పాండవ రాజధానిని పెళ్లగించి పారేస్తాడుగాని. హరి తప్ప ఆయన కోపాన్ని తగ్గించేవారు లేరు.

కృష్ణా కృష్ణా యటంచునా కీరవాణి
రామ రామాయటంచు నా రాజసుతుడు
అంతిపురమున ప్రమద వనాంతరమున
వేగునంతకువలవంత వేగునంత

తెల్లవార్లూ బాధపడ్డారు సుభద్రార్జునులు.

పొద్దున్నే వకుళవల్ల అంతా తెలుసుకున్నాడు వాసుదేవుడైన కృష్ణుడు.

ఇంక సుభద్రా కల్యాణం జరపాల్సిందే అని నిర్ణయించుకున్నాడు ఆయన. అంతర్వీపంలో రైవతక పర్వతం దగ్గిర ఉత్సవాలు జరుగుతున్నాయి. వెళదాం అన్నయ్యా! వదినను కూడా తీసుకురా సుమీ ఎప్పుడూ ఆవిడ్ని ఎక్కడికీ తీసుకురావు అని బలరాముడికి నచ్చచెప్పి అందరూ కలిసి యాత్రకి వెళ్లారు. బళ్లు బయల్దేరాయి. వరసగా... పాటలు పాడుకుంటూ పిట్టకథలూ సామెతలూ చెప్పుకుంటూ ప్రజలు ఆనందంగా బయల్దేరారు బళ్లల్లో.

వాళ్లటు వెళ్లగానే ద్వారకలో దేవకీ దేవి, రుక్మిణీదేవి పెళ్లి పెద్దలైనారు. ఉద్యానవనంలో పున్నాగ చెట్టుకీ మాధవీ లతకీ పెళ్లి అందరూ రండి అని పైకి అర్థంకాకుండా సత్యభామ మొదలైన స్త్రీలు పేరంటం పిలిచారు. పెళ్లికొడుక్కీ పెళ్లి కూతురికీ మంగళ స్నానాలు చేయించారు.

సుభద్ర నల్లని తెగ బారెడు నిద్దపు సోగ వెంట్రుకల్ని బాగా దువ్వి సాంబ్రాణి పొగవేసి వదులుగా కొప్పుపెడితే ఓహో మరి వేయి పెట్టినటులుండె... తామరసాక్షికెందునూ తలిదండ్రులు పెట్టని సొమ్ము పెద్ద జడకదా-

ముత్తైదువలు పాటలు పాడుతూ పెళ్లి సంభారాలు ఏర్పరుస్తున్నారు. ఐరేణి కుండలు తెచ్చారు. ముత్యాల బాసికాలూ, తలంబ్రాలల్లో మంచి ముత్యాలూ... బంగారు పళ్లాలూ పన్నీరు బుడ్లూ పసుమ కుంకుమ సుగంధాలూ పరిమళాల పువ్వులూ. ఓహో ఎన్నో సిద్ధమైనై.

అంతర్ద్వీపంనించీ కృష్ణాదులు ఒకరికి తెలియకుండా ఒకరు తప్పించుకొచ్చేశారు ద్వారకకి 'వాళ్లంతా ఈ పెళ్లి ఇష్టమైన వాళ్లే తనవేపు వాళ్లెవరూ లేకపోవటమేమిటి?' అని అర్జునుడు తండ్రి అయిన ఇంద్రుడిని తల్చుకున్నాడు. పరివారంతో అర్ధాంగితో ఇంద్రుడు వచ్చాడు. అచ్యుతుడూ ఇంద్రుడూ పరస్పరం సంభావించుకున్నారు. అమ్మయ్య... మగపెళ్లివారొచ్చారు. ఆలోటు కూడా తీరిపోయింది' అన్నాడు గోవిందుడు.

'మాకేమన్నా లోపం రానివ్వండి అప్పుడు చెప్తాం మీపని' అన్నాడు ఇంద్రుడు. పక్కనేవున్న జయంతుడు అంటే ఇంద్రుడి కొడుకు ఒకటే నవ్వు.

ఊర్వశితోటి దేవతా స్త్రీలతో కలిసి మునివేళ్లపై నుంచుని మరీ పార్థుడి సొగసు చూసి ముగ్ధురాలైంది. అంత సమ్మర్దం మరి. దేవకి ఇల్లు మగపెళ్లివారి విడిది. రుక్మిణి అంతఃపురం ఆడపెళ్లివారిల్లు.

సాత్యకి ఐరావతంమీద ఊరేగి వచ్చిన పెళ్లికొడుకును చెయ్యి పట్టిదింపాడు. అక్కడ పెళ్లికూతుర్ని చూసి దేవతాస్త్రీలు విస్తుపోయినారు. ఎప్పుడూ మనం

తిలోత్తమ చాలా అందమైందనుకుంటాం కదా- ఈ సుభద్ర ముందు మన తిలోత్తమ అందం తీసికట్టు అని గుసగుసలాడుకున్నారు.

ఈ దంపతులను చూడటానికి వెయ్యి కళ్లు కావాలని అందరూ అనుకుంటుంటే నవ్వుకున్నాడు ఇంద్రుడు. 'నాకు ఇదివరకే వెయ్యి కళ్లున్నాయి. కానీ సంతృప్తిగా లేదు. పదివేల కళ్లయినా వుంటే ఇంత చక్కని జంటని బాగా చూసేవాణ్ణి' అని. దేవకీ వసుదేవులు సుభద్రని అర్జునుడికి ధారపోశారు. మధ్యనున్న తెర తీసేశాక కురు వీరుడు సుభద్ర మెళ్లో మంగళసూత్రం కట్టాడు.

ఇక తలంబ్రాల ఘట్టం- నువ్వెక్కువ తలంబ్రాలు పొయ్యాలంటే నువ్వే ఎక్కువ తలంబ్రాలు పొయ్యాలని వధూవరులని వాళ్లవేపు వాళ్లు హెచ్చరించారు.

ఈ పెళ్లి ఇంత బాగా చెయ్యటం మీకే చేతనైందని ఇంద్రుడు కృష్ణుడిని అగ్గించాడు. పరమాప్తుల్ మీరు రాగా విజృంభణ వృత్తిన్ నెరవేరిందీ పెళ్లి అని గోవిందుడు ఇంద్రుడిని పొగిడాడు.

వియ్యంపు మర్యాద వెలయ కృష్ణుడూ ఇంద్రుడూ బువ్వంబంతిలో భోజనం చేశారు. కుంకుమ పువ్వూ కస్తూరీ కృష్ణుడు ఇంద్రుడికి పూశాడు. తాంబూలమిచ్చాడు. ఎన్నో మంచి పట్టుబట్టలు ఇంద్రుడికిస్తే ఇంద్రుడు వాటిని దాచమని జయంతుడికిచ్చాడు. శచీదేవి ఆ బట్టలూ వాళ్లిచ్చిన కానుకలూ అన్నీ పెట్టెల్లో సద్దుకుంటోంది. 'అమ్మా! నీకేం లేదా పోదా? ఇవన్నీ అంత ఇదిగా దాచుకుంటున్నావేమిటి?' అంటున్నాడు జయంతుడు. కాస్త సిగ్గుగా 'ఏమోరా! నాకూ తెలీటల్లేదు. మగపెళ్లి వారంటే అలాగే వుంటుందేమో' అంటోంది శచీదేవి.

అంతలో రుక్మిణి అక్కడకొచ్చింది. 'ఏవమ్మా! మీ మనుష్య లోకంలో వియ్యాలవారంటే పరమ లోభులుగా వుంటారా? నాకేమిటివ్వన్నీ దాచుకోవాలని బుద్ధిపుడుతోంది' అని అడిగింది శచి- అదితికి ముందు ఇంద్రుడు పుట్టాక విష్ణువు వామనుడై ఆవిడ కడుపున పుట్టాడు. అందుకని విష్ణువు అవతారమైన కృష్ణుణ్ణి ఉపేంద్రుడు అంటారు. శచీదేవి వదినెగారన్నమాట కృష్ణుడికి. రుక్మిణి, సత్యభామాదులు తోడికోడళ్లు అవుతారు.

'అంతేనక్కయ్యా! మగపిల్లవాడినికంటే మా లోకంలో ఘనం. ఇహ కొడుకు పెళ్లికి కట్నాలూ కానుకలూ వస్తువాహనాలూ ఎలా గుంజుతారో చెప్పలేము. ద్వాపర యుగంలోనే ఇలా వుంది పరిస్థితి. తర్వాత వచ్చే కలియుగంలో ఆడపిల్లల పరిస్థితి ఎంత ఘోరంగా వుంటుందో ఊహించలేము' అన్నది రుక్మిణి.

'అప్పుడు మీ శ్రీవారు అదేనమ్మా మా మరిదిగారు కల్కి అవతారం ఎత్తి కట్నాల కోసం ప్రాణాలు తీసే వియ్యపురాళ్లని, భర్తల్ని దునుమాడతాడన్న మాట. వియ్యంకుడి పాత్ర ఈ ఏడిపింపులో ఎక్కువ లేదనుకుంటా' అన్నది శచీదేవి.

'వియ్యపురాలిదే ఎప్పుడూ పెత్తనం మీరన్నట్టు. అక్కయ్యా! ఇదిగో కస్తూరి తీసుకోండి' అంటూ బంగారు గిన్నెలో కస్తూరి అందించింది రుక్మిణి.

ఆ కస్తూరిని దేవకీ దేవి మీద చిలకరించింది శచీదేవి. 'వదినగారూ!' అని దేవకీ దేవి పరిహాసం చేసింది. హాస్యాలాడింది శచీదేవి కూడా తీసిపోకుండా -

'మీరు మొదట్లో అత్తగారి వరస నాకు ఉపేంద్రుడికి తల్లిగనుక. ఇప్పుడు అర్జునుడు నాకు కొడుకు వరస. అర్జునుడికి సుభద్ర అత్త వరస ఈ విధంగా. అత్త వరస అయివుండి తనకన్నా చిన్నదై యుక్తవయో రూప లావణ్యాలున్న అమ్మాయిని పెళ్లాడితే ఆయుష్షు పెరుగుతుందంటారు. శుభం' అని కృష్ణుడి ఎనిమిది మంది పట్టమహిషులనూ ప్రియమార పలకరించింది ఇంద్రాణి అయిన శచి.

వెలగల కానుకలు పట్టు వస్త్రాలు, పువ్వులు, పసుపు, కుంకుమలు, సుగంధద్రవ్యాలు మొదలైనవి వియ్యపురాలైన శచికి అందించింది. దేవకి- నవ్వుతూ జయంతి అవన్నీ తమ (ఇంద్రుడి కూతురు) పెట్టెలో పెట్టి వచ్చింది.

పారిజాత వృక్ష సందర్భంలో పరిచయమైంది. ఇది వరకే సత్యభామ శచికి- సత్యభామ వచ్చి ప్రణామం చేసింది ఆమెకి.

'చెల్లెల లెస్సలా? పెరటి చెట్టుగ నాటిన పారిజాతం బాగా పూలు పూస్తోందా?

నా మనసంతా ఎప్పుడూ దానిమీదే వుంటుంది. నీకది ప్రాపు అయి వృద్ధినిస్తుంది చెల్లీ' అని వాళ్లని వీడుకొన్నది.

శచీ ఇంద్రుడూ కొత్త దంపతుల్ని ఆశీర్వదించి అనేకములైన కానులనిచ్చి స్వర్గరాజధాని అయిన అమరావతికి బయలుదేరారు. వాళ్లకి ఈ పెళ్లి ఈ విధానాలు ఇదంతా చాలా హృద్యంగా తోచింది. జయంతుడికో జయంతికో ఇలా పెళ్లి చేద్దామంటే దేవలోకంలో పద్ధతి ఇది కాదాయె. ఇలాంటి అనుభూతులు అక్కడుండవు అనుకున్నారు. ఊర్వశి అయితే అర్జునుడి మీదనించీ చూపు తిప్పుకోలేక బలవంతాన అమరావతికి బయలుదేరింది.

ఇంద్రుడి చెయ్యి పట్టుకుని కృష్ణుడూ శచి చెయ్యి పట్టుకుని రుక్మిణీ సత్యలూ సస్నేహంగా కొన్ని వాకిళ్లు గడచి వచ్చారు. ఇంక రావద్దు. పెళ్లి పనులతో అలిసిపోయివున్నారు. రావద్దింక' అని మగపెళ్లివారు వెళ్లిపోయారు.

భూలోకంలో ప్రతి పెళ్లీ ఇలాగే స్నేహపూరితంగా ఎక్కువ తక్కువలు లేకుండా పరస్పరాశ్రయంగా, ధనమే ప్రధానం కాకుండా హింస లేకుండా దెప్పి పొడుపులు లేకుండా వుండాలి. నూతన దంపతుల పరస్పరాన్యోన్యం వర్ధిల్లేటట్లు ఇట్లాగే పెళ్లిళ్లు జరగాలి అనుకున్నారు పరితృప్తులై పెద్దలు.

ద్రౌపదితో తన పెళ్లి గుర్తొచ్చింది అర్జునుడికి. ఉలూచీ, చిత్రాంగదల పెళ్లిళ్లు వేరే- తన తండ్రి పాండురాజు లేకపోవటంతో తల్లి కుంతీదేవి కూడా పెళ్లిమండపానికి రాలేదు. కొడుకుల పెళ్ళిళ్ళు దూరం నించే చూసిన దయనీయురాలామె. తన తల్లిదండ్రులుగా శచీపురందరులిలా రావడం తమ్ముడి స్థానంలో జయంతుడుండటం అర్జునుడికెంతో ఆనందం కలిగించింది. ఆడబడుచు లాంఛనాలిచ్చారు జయంతికి. తమకి ఒక్క చెల్లెలుంటే ఎంత బావుండేది అమ్మ అన్నట్లు- పెళ్ళిలో సందడంతా జయంతిదే. మంచి ఆడబిడ్డవల్ల ఎంత అందం వస్తుంది పెళ్లికి. శచీఇంద్రుడూ పీటలమీద కూచుని తనకీ సుభద్రకీ పెళ్లి చెయ్యటం తల్చుకుంటే అర్జునుడికెంతో ఆనందంగా వుంది. అర్థబలం ఒకటే చాలదు. అంగబలం కూడా వుండాలి అనుకున్నాడు.

కానీ సుభద్ర పుట్టిల్లు వదిలి రావాలంటే చాలా బాధపడుతోంది. అత్తవారింట్లో సకల భోగభాగ్యాలున్నా భర్తమీద తనకెంత మక్కువవున్నా ఆడపుటక పుట్టినదానికి పుట్టిల్లు వదలటం భయం. తల్లిదండ్రులు తనని గారాబంతో పెంచుతూ వదినెలూ, అన్నలూ ఎంతో మురిపెంగా చూస్తూ అక్కచెల్లెళ్లు ఆదరిస్తూ ఊరంత బలగం తనని మన్నిస్తూంటే... ఆదంతా- అలవాటైన ఈ పరిసరాలూ ఇల్లూ, ఊరూ వదిలి కొత్త యింటికి వెళ్లటానికి పెళ్లికూతురి ప్రాణం కొట్టుకుపోదూ మరి. అక్కడి వాతావరణంలో ఎలాంటిదో మనుషులెలాంటివారో ముఖ్యంగా అత్తగారూ, ఆడపడుచూ గయ్యాళులు కాకుండా వుండి భర్త ప్రేమగా చూసుకుంటే చాలు అని ఆలోచించని ఆడకూతురుండదు భూమిలో.

దేవకి మనసు లుంగలు చుట్టుకుపోతోంది. బిడ్డని వదలాలంటే. వకుళా వాళ్లంతా దూరంగా పోయి ఏడుస్తున్నారు. వాళ్లని 'ఏడవకండి శుభం కాదు ఏడవటం' అని కోప్పడి రుక్మిణీ మొదలైన అష్టమహిషులూ కన్నీరు దిగమింగుకుంటున్నారు.

కృష్ణుడు ఇల్లంతా అల్లరి చేస్తూ వదినెలని ఆటపట్టిస్తూ తిరిగే చిన్నారి చెల్లెల్ని వదలలేక అల్లాడిపోతున్నాడు. వసుదేవుడు తను ధైర్యం తెచ్చుకుంటూ కృష్ణుడినీ సాత్యకినీ ఏమిటర్రా జగదేక పరాక్రములైన మీకు ఈ బేలతనం? ఆడపిల్ల కాపరానికెళ్లక పుట్టింట్లో వుంటుందా? ఏమిటమ్మా సుభద్రా! ధైర్యం తెచ్చుకో అని గట్టిగా అన్నాడు వసుదేవుడు.

దేవకి కూడా వచ్చి 'వింతటే ఏమి? మేనత్త కుంతీదేవి అత్తగారు. కోరి వేడి పెళ్లాడారు మీరు. బావమరుదులు బహుబుద్ధిమంతులు. నీ భర్త లోకోత్తరుడు. ఇంత మంచి కాపరానికి ఆనందంగా వెళ్లాలి తల్లీ! ఏడవకూడదు. మేము మధ్య మధ్యలో చూడటానికి వస్తూనే వుంటాము. పురుడు పోసుకోవటానికి నువ్వు పుట్టింటి కెలాగూ వస్తావు' అని సుభద్రని కౌగలించుకుని జుట్టు సవరించి దీవించి అప్పగింతలు పెట్టింది అర్జునుడికి.

రథమెక్కించి నూతన దంపతుల్ని వీడ్కొలిపాడు కృష్ణుడు. 'ఏం మమ్మల్ని

మా పుట్టిళ్ల దగ్గిర్నించీ తీసుకొచ్చినపుడు తమరికింత బాధకలిగినట్లు లేదే' అని పరిహాసాలాడారు సత్యభామ మొదలైన వాళ్లు. రుక్మిణి మాట్లాడలేదు. ఎందుకంటే తానంత తాను కోరి అత్తవారింటికి వచ్చిందిగా.

రథం మీద వెళ్తున్న సుభద్రార్జునుల్ని చూసి కావలి వారికి అనుమానమొచ్చింది. అరె మన రాజపుత్రికని ఎత్తుకెళ్తున్నాడీ అర్జునుడు. బలరాముడికి తెలిస్తే సహించడు' అని యుద్ధానికి వచ్చారు.

'నాకు రథం నడపటం నేర్పించాడు మా చిన్నన్నయ్య. కొంత విలువిద్య నేర్పించింది మా వదినె సత్యభామ' అన్నది సుభద్ర నునుసిగ్గుగా.

'నీకెందుకు మరదలా యుద్ధశ్రమ. నన్నేమనుకున్నావు? రథం నడుపుతూ యుద్ధం చెయ్యలేనా? రెండు చేతులతో బాణాలు వేయలేనా? నా పేరు సవ్యసాచికాదా? అయినా అంత ముద్దరాలివి బాలికవి అనుకున్నాను. నీకీ విద్యలు వచ్చా? సరే నీ ముచ్చటెందుకు కాదనాలి? రథం తోలు' అని పగ్గాలు ముద్దుల భార్య చేతికిచ్చాడు ఫల్గుణుడు.

యాదవ వీరుల్ని జయించి ఇంద్రప్రస్థపురానికి వచ్చారు వధూవరులు. 'ముందు నువ్వు పాంచాలి దగ్గరకెళ్లి ప్రసన్నం చేసుకో సుభద్రా! ఆమె పరమ పతివ్రత. హఠాత్తుగా మనిద్దర్నీ చూస్తే శాపం పెడుతుందేమో కూడా' అని జంకాడు అర్జునుడు.

తర్వాత బలరాముడిని శాంతింపజేసి సుభద్రకి తోడుగా వకుళాది చెలికత్తెలనీ, అనర్ఘరత్నాభరణాలనీ ద్రౌపది కోసం కుంతికోసం సరిగంచు పట్టుచీరల్నీ పంపించాడు కృష్ణుడు.

తనెవరో తెలియకుండా గోపాల బాలికలాగ ఎడమ పైట వేసుకుని మేలి ముసుగు కప్పుకుని అన్నగారు పంపించిన పట్టుచీరల్ని ద్రౌపదీ దేవికి సమర్పించి ఆమె పాదాలకి ప్రణమిల్లింది తోటి సఖియలు వకుళాదులతో సహా సుభద్ర.

ఎవరో గొల్లభామ ఇంత వెలగల వస్త్రాలని తనకి సమర్పిస్తోందేమిటీ అనే అనుమానంతోటే సుభద్రని దీవించింది ద్రుపద పుత్రి.

'నీ భర్త వీరాధి వీరుడూ నీ కొడుకు శూరశిఖామణీ అవుతారు. అమ్మాయి! వీరపత్నివి. వీరమాతవు అని ప్రశస్తి పొందుతావు. ఇంతకీ నువ్వెవరివి?' అని అడిగింది.

సుభద్ర భయపడి ఏం చెప్పాలో తెలీక ఊరుకుంది. 'నీ సౌభాగ్యాన్ని పంచుకోవటానికి వచ్చానక్కా' అని ఎలా చెప్తుంది. వకుళ కల్పించుకుని 'ఈమె తమ చెల్లెలు సుభద్రాదేవి' అన్నది. వెనకాలే అర్జునుడు వచ్చి గొంకుగా నిలబడ్డాడు.

పాంచాలికి పరిస్థితి అర్థమయింది. 'కృష్ణదేవులవారి చెల్లెలు సుభద్రా ఈ అమ్మాయి? ఆమె భర్తా మీరు?' తెలియనట్లు అడిగింది అర్జునుడిని. కోపం వచ్చేస్తోందామెకి.

'అదికాదు ద్రుపద పుత్రీ! ఏం జరిగిందంటే... అర్జునుడు ఏదో చెప్పబోయినాడు. కాని నోరు పెగలటం లేదు.

అతని మాటలు వినిపించుకోకుండా... చెలికత్తెల్ని పిలిచి 'ఈ అమ్మాయికీ ఆమె చెలులకీ మంచి మందిరం ఇచ్చి వాళ్లకి కావలిసిన ఏర్పాట్లు చూడండి' అని ఆజ్ఞయిచ్చింది.

'రండి' అని సుభద్రనీ వకుళనీ మిగిలిన చెలుల్నీ తీసుకెళ్లారు ద్రౌపది చెలులు.

అర్జునుడు 'ద్రౌపదీ! కోప్పడకేం' అంటూ వచ్చాడు.

'చూడండీ! మీ వధువు వెనక వెళ్లండి' రూక్షంగా అన్నది ద్రౌపది.

'కోపం మానవా అయితే?'

'నాకెందుక్కోపం? మీరు తీర్థయాత్రకి వెళ్లి ఎన్నాళ్లయింది? ధర్మరాజుగారి వద్ద నా నివాసం వుండగా- తరువాత భీమసేనుల వారింట్లో వున్నాను. ఈ ఏడాది సమయం పూర్తవబోతోంది. ఇప్పుడా రావటం? వస్తూ కూడా సవతిని వెంటబెట్టుకొచ్చారా? నిజంగా మీ మగవాళ్లు కృష్ణసర్పాలే! మా మనోభావాలు మీకక్కర్లేదు. మా అనురాగాలు మీకక్కర్లేదు. మీ రాజ్యం అభివృద్ధి కోసమే పెళ్ళిళ్ళు మాతో అంతే. మీరెప్పుడొస్తారా

అని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటే... నా మాట మీకు గుర్తుంటుందని భ్రమపడటం నా వెర్రితనం. ఉలూచీ చిత్రాంగదా ఎప్పుడొస్తున్నారు?'.....

'పాంచాల రాజకన్యా' అంటూ దగ్గిరికి రాబోయినాడు అర్జునుడు ఆర్తిగా.

'దూరం జరగండి. ఇది భీమసేనుల వారి గృహం. పొరపాటు జరిగితే మళ్లీ మీరు తీర్థయాత్రలకి వెళ్లాల్సి వస్తుంది. మళ్లీ ఇంకో ముగ్గురు నలుగురు అమ్మాయిల్ని పెళ్లాడి తేవలసి వస్తుంది.'

పులుకుపులుక్కున చూశాడు అర్జునుడు.

'అదే ఉలూచీ, చిత్రాంగద, సుభద్రా లాంటి వాళ్లని. ఈ తీర్థయాత్రలు మీకు బాగానే వుంటాయి. ఇల్లాలికే బాధగానీ.'

అంతలో పరిచారికలు వచ్చి రాజమాత పిలుస్తున్నదని చెప్పి అర్జునుణ్ణి తీసుకెళ్లిపోయారు.

సుభద్ర మందిరాన్ని సద్దిస్తున్నది కుంతి హడావిడిగా. వచ్చిన అర్జునుణ్ణి గాఢాలింగనం చేసుకుంది' నాయనా! క్షేమంగా తిరిగి వచ్చావు దేవుడి దయవల్ల. అదేమిటి అలా వున్నావు పాంచాలి కృష్ణ ఏమన్నా అన్నదా? తన కోపం ఎంత తాటాకు మంట. సరే తప్పదు గదా. సుభద్ర మరీ భయపడుతోంది. నువ్వే ధైర్యం చెప్పాలి' అంటూ భోజనం పెట్టించి కొడుకూ కోడలికి పరిచారికలకీ. 'నాయనా! అర్జున కుమారా! ఎంత చిక్కిపోయినావు ఈ తీర్థయాత్రలు కాదుగాని' అంటూ అర్జునుడి వీపు నిమిరింది కుంతి.

సుభద్ర పెదవులపైన చిన్న చిరునవ్వు కదలాడింది. కుంతి దాన్ని గమనించింది. 'ఏమే మేనగోడలా! ఏమిటీ నవ్వుతున్నావు?' అని అడగనే అడిగింది.

కుంతి దగ్గిర సుభద్రకి కాస్త చనువే- అప్పుడప్పుడు కుంతి పుట్టింటికి వెళ్లివస్తూండటంతో-

'మీ అబ్బాయి తీర్థయాత్రల వల్ల చాలా కష్టమే వచ్చిందత్తయ్యా' మళ్లీ నవ్వింది సుభద్ర.

'అమ్మపిల్లా! పైకి నంగనాచిలాగా నోట్లో వేలుపెడితే కొరకలేనట్లుంటావుగాని- మనసులో స్వయంపాకం- అలవిమీరిన తెలివితేటలూనూ నిన్ను కట్టుకొచ్చాక కష్టం కాకేమిటీ నా కొడుక్కి? అయినా నీ పని ఇక్కడ కాదు.

అంతలో బిలబిలలాడుతూ కొందరు స్త్రీలు వచ్చారు. భోజనానంతరం వాళ్ళని పరిచయం చేసింది కుంతీదేవి. 'అర్జునా! ఈమె నీ పెద్ద వదిన దేవిక. స్వయంవరంలో ధర్మరాజుని వరించింది. ఇరుగో వీళ్లిద్దరూ భీముడి భార్యలు పెద్దావిడని నువ్వెరుగుదువు కదా! కమలపాలిక అదే హిడింబ. చూసి చాలా కాలం అయింది కదా అని చెప్తున్నాలే- భీముడి కొడుకు ఘటోత్కచుడు కూడా వచ్చాడు. వేట కెళ్లినట్లున్నాడు. ఇదుగో ఈ అమ్మాయి జలంధర. నువ్వు తీర్థయాత్రల కెళ్లిన రెండు నెలలకే భీముడీమెని వివాహమాడాడు.'

'వదినగార్లకి నమస్కారం' అంటూ అక్కడేవున్న సుభద్ర చెయ్యి పట్టుకుని వాళ్లకి నమస్కారం చేశాడు అర్జునుడు- వాళ్లు దీవించారు.

కుంతి చెప్పసాగింది.

'ఇదుగో నాయనా! ఈ రాజకన్య రేణుమతి చేదిరాజకన్య. నీ తమ్ముడు నకులుని అర్ధాంగి- ఈ చిన్నది విజయ. సహదేవకుమారుడి సహచారిణి . స్వయంవరంలో నీ చిన్న తమ్ముణ్ణి వరించింది.

సుభద్రార్జునులకి ఆ అమ్మాయిలిద్దరూ ప్రణామం చేశారు. అర్జునుడు తీర్థయాత్రలకి వెళ్లే నాటికి ద్రౌపది ఒక్కతే పాండవపత్ని. ఇప్పుడింత మందితో అంతఃపురం కళకళలాడిపోతోంది. కుంతి మహాదేవికి తొమ్మిదిమంది కోడళ్లు- ఆశ్చర్యమూ సంతోషమూ అర్జునుడికి. హిడింబ వదినతో కొంత పరిచయం వుండబట్టి

కుశల ప్రశ్నలు వేశాడు. ఆవిడ నవ్వింది. 'పదవయ్యా మరిదిగారూ! మా చెల్లెలు సుభద్ర ఇక్కడ మాతో మాట్లాడుతుంటే కోప్పడుతుంది పదవయ్యా గదిలోకి' అన్నది.

8

సుభద్ర గర్భవతి అయింది. తర్వాత్తర్వాత ఒక్కొక్క పాండవుని భార్యా గర్భవతి అయింది. ద్రుపద కుమారి పాండవ ధర్మపత్ని ధర్మరాజువల్ల గర్భవతి అయింది. కౌరవ పత్నుల్లో భానుమతి గర్భం ధరించింది. వరుసగా అందరికీ పెళ్లిళ్లూ తర్వాత పిల్లలూ, పాండవ కౌరవాంతఃపురాలు పిల్లల కేరితలతో నిండిపోయాయి. కర్ణుడికప్పటికిద్దరు మగపిల్లలు.

సుభద్రాదేవికి పాండవ వంశకర్త అయిన అభిమన్యుడు జన్మించాడు. ధర్మరాజుకీ దేవికకీ యౌధేయుడనే సుతుడు కలిగాడు. భీమసేనుడికీ జలంధరకీ సర్వగుడు అనే పిల్లవాడు పుట్టాడు. నకులుడికీ చేదిదేశరాజకన్య అయిన కరేణుమతికీ నిరమిత్రుడు పుట్టాడు. సహదేవుడికీ స్వయంవరలబ్ధ అయిన విజయకీ సుహోత్రుడు కలిగాడు. భీమసేనుడికీ కమలపాలికా నామధేయురాలైన హిడింబకీ ఘటోత్కచుడు వీళ్లందరికంటే ముందే ప్రభవించాడు. ఉలూచియనే నాగవనితకీ అర్జునుడికీ ఇరావంతుడు అనే బాలుడు కలిగాడు. చిత్రాంగదార్జునులకి తాతగారికి వంశకరుడైన బభ్రువాహనుడు జన్మించాడు.

హిడింబ, ఉలూచి, చిత్రాంగదలు అప్పుడప్పుడు పాండవాంతఃపురానికి పిల్లల్ని తీసుకువచ్చి కొన్నాళ్లుండి వెళ్లిపోయేవాళ్లు- భీముడు హిడింబ దగ్గరికీ, అర్జునుడు ఉలూచీ, చిత్రాంగదల దగ్గిరకీ వెళ్లి పిల్లల్ని చూసి వస్తూండేవాళ్లు.

దుర్యోధనుడి ధర్మపత్ని భానుమతికి లక్ష్మణ కుమారుడు జన్మించాడు. మిగిలిన కౌరవులకీ మగపిల్లలే-

కుంతీదేవికి పాపం ఆడపిల్లల సరదా తీరనే లేదు.

ద్రౌపదీదేవికి ధర్మరాజువల్ల ప్రతివింధ్యుడు, భీముడివల్ల శ్రుతసోముడు,

అర్జునుడివల్ల శ్రుతకీర్తి, నకులుడివల్ల శతానీకుడు, సహదేవుడివల్ల శ్రుతసేనుడు అనే పంచ ఉపపాండవులు సుపుత్రులై జన్మించారు. కొంత కాలం అంతా హాయిగా వున్నారు. విదురుడు చెప్పే మంచి మాటలు వింటూ మనవళ్లకి విద్యాబుద్ధులు చెప్పిస్తూ సత్కాలక్షేపం చేస్తోంది కుంతి-

అక్కడ ద్వారకలో-

సుభద్ర పెళ్లయ్యాక రుక్మిణీదేవి ప్రసవించి కొడుకుని కన్నది. చాలా చక్కగా వుండటంతో అంతా పిల్లవాడిని ప్రద్యుమ్నుడు అన్నారు. పిల్లవాడికి పాలిచ్చి తనుకూడా నిద్రపోయింది రుక్మిణి. ఆ పుట్టిన బాలకుడు శంబరాసురుడిని చంపుతాడని భవిష్యత్తు తెలియడం వల్ల తనని వీడు పెద్దవాడై చంపకుండా చిన్నప్పుడే వీణ్ణి చంపేస్తే పోతుందని అమ్మ పాలు తాగి నిద్రపోతున్న పసిగుడ్డు ప్రద్యుమ్నుడిని పురిట్లోనే ఎత్తుకెళ్లి సముద్రంలో పడేశాడు శంబరుడు. ఆ పిల్లవాడిని ఒక పెద్ద చేప మింగింది. కొందరు జాలరులు చాలా పెద్ద చేపవలలలో పడటంతో శంబరమహారాజుకి కానుకగా ఇచ్చారు- వంటవాళ్లు చేపని తరుగుతుంటే బిడ్డ బయటపడ్డాడు.

దక్షయజ్ఞంలో అవమానితురాలైన సతీదేవి యోగాగ్నిలో దగ్ధమవటంతో పరమ శివుడు కోపోద్రిక్తుడైనాడు. తన జట ఒకటి విసిరివేస్తే అందులోనించీ వీరభద్రుడు మహా భయంకరుడై జన్మించాడు. దక్షయజ్ఞాన్ని ఛిన్నాభిన్నం చేశాడు.

ఏమైతేనేమి మహేశ్వరుడి అర్ధాంగలక్ష్మి సతీదేవి తిరిగి రాదు కదా- ఆయన మహాతపశ్చర్యా నిమగ్నుడైనాడు. లోకాలు అల్లల్లాడిపోతున్నారు. సృష్టిస్థితి లయ కారకులు ముగ్గురూ సక్రమంగా ప్రపంచాలని పరిరక్షించాల్సిందేనాయె.

ఈ లోపల తారకాసురుడనే వాడు చెలరేగిపోయి ప్రజల్ని మిక్కిలి బాధ పెడుతున్నాడు. ఆ రాక్షసుడికి ఎవరి వల్లా నాశనం లేదనే వరాలున్నాయి. స్త్రీలూ పురుషులూ జంతువులూ వేటి చేతా మరణం లేదు అని విర్రవీగి లోకాలని పీడించసాగాడు తారకరాక్షసుడు. వీడిని చంపటమెట్లా అని దేవతులు తలలు బద్దలు కొట్టుకున్నాక తెలిసింది. బాలకుడి చేత ఛస్తాడు అని- అదీ సాధారణ బాలకుడు

కాదు శివుడి కొడుకైన పిల్లవాడే ఆ రాక్షసుడిని చంపగలడు.

మరి శివుడు తపస్సులో మునిగివున్నాడు. సతీదేవి లేదు. శివుడికి పిల్లవాడెట్లా పుడతాడు? అదొక ముఖ్య ప్రశ్న అయింది దేవతలకి.

హిమవంతుడి పుత్రిక హైమవతి. పార్వతి. పరమ పావన గుణ సముదయము గలది. శంకరుడూ హిమాలయ సానువుల్లోనే తపస్సు చేస్తుండటంతో ఆయన సేవకి గిరిజా కుమారి నిర్ణయింపబడింది. ఈశ్వరుడంటే ఆ కన్యకు ప్రాణం కానీ ఆయన కన్నెత్తి చూడకపోయె వీళ్లకిహ పెళ్లెట్లా అవుతుంది? అని మధనపడి ఇంద్రుడు మన్మధుడి సాయం అడిగాడు.

షాక్షాత్తు మహానుభావుడై నిష్ఠాగరిష్ఠుడైన దేవుడు శివుడు. ఆయనకి నేను మదన వికారం కలిగించలనా? అందరి దగ్గిరా నా ఆటలు సాగుతయ్యేమో గాని ఆ మూడు కళ్ల వేలుపు దగ్గిరా? ఉత్తది- శంకరుడి ముందు నా పప్పులుడకవు అని భయపడ్డాడు మన్మధుడు. 'మా ఆయన్ని వదిలేయండి బాబూ!' అని రతీదేవి కూడా ప్రాధేయపడింది. కాదు కూడదు నీ భర్త కొక్కడికే వలపు గలిగించే సామర్థ్యం వుంది. సృష్టి మొత్తం నీ భర్త అధీనంలోనే వుంది. దేవతలకీ సహాయం చెయ్యక తప్పదు అన్నారు దేవతలు.

అమరాధిపతి ఆజ్ఞాపించాక ఇంక అనుచరుడికి ధిక్కరించటానికేముంటుంది.

రతీదేవి ఎప్పటికంటే జగన్మోహనంగా అలంకరించుకుంది. అపురూప లావణ్యవతిగా రూపొందింది. మన్మధుడూ అంత చక్కగా రూపొందాడు. చెరకువిల్లు, పూలబాణాలు, చిలకరథం ఇలా తన ఆయుధ రథసామాగ్రిని అంతా సిద్ధం చేసుకున్నాడు. వసంతుడు సహాయుడై వచ్చాడు యథాప్రకారంగా.

పరమేశ్వరుడు తపస్సు చేసుకునే ప్రదేశంలో కాలంగాని కాలంలో వసంతకాలం వచ్చేసింది. ఓహ్- ఏం సంరంభమనీ- ప్రతి చెట్టుకీ గుత్తులు గుత్తులుగా పూలుపూశాయి. ఆ పూల ఘుమఘుమలకి ప్రకృతంతా పరవశించిపోతోంది. ఆ పూల మకరందాన్ని గ్రోలటానికి ఝుంకారం చేసుకుంటూ

వచ్చాయి తుమ్మెదలు కోకిలలు కొత్త చిగుళ్లని మెక్కి కూయదొడిగినై.

అలాంటి వాతావరణంలో పార్వతీదేవి శివుడి సేవ చేస్తున్నది. మన్మధుడు మంచి సమయం ఇదే అనుకుని ఇద్దరి మీదా పూలబాణాలు వేశాడు. మహాశివుడికి తపోభంగం అయింది. యెదలో ఏదో పులకరింత ఎట్ట ఎదుట నవమోహనాంగి, కన్యాలలామ పార్వతి. ఒక్కక్షణం ఆమె వదనాన్ని దగ్గిరకి తీసుకోబోయినాడు. ఆమె సిగ్గుతో కళ్లు వాల్చింది. వెంటనే శివుడికి అర్థమైంది ఇదేదో కుట్ర అని- నిశ్చలతపోబ్రహ్మచర్య దీక్షలో వున్న తనకీ కామవికారం కలగటమేమిటి? అంటూ చుట్టూ చూశాడు. విల్లమ్ములతో మన్మధుడు కనపడ్డాడు. తన మూడవ కన్ను తెరిచాడు. తక్షణం శివుడు ఉగ్రుడై- ఆ కంటినించీ వెలువడిన జ్వాలలకి మరుక్షణం భస్మసాత్కృతుడై బూడిద కుప్పగా మిగిలిపోయినాడు.

రతీదేవి పరమేశ్వరుడి పాదాలకి చుట్టుకున్నది వెంటనే తన కన్నీట ఆయన పాదాలు కడిగింది.

ప్రకృతిస్థుడయ్యాక 'ఏమిటమ్మా ఇది కాళ్లు వదులు. లే' అన్నాడు శంకరుడు.

'నాకు పతి దానం చెయ్యి ప్రభూ! ఆయన లేనిది నేను బతకలేను' అని విలపించి ప్రార్థించింది రతి-

మహేశ్వరుడి కొంకింత మనసు కరిగింది- సరేనమ్మా! నీ మగడికి రూపం వుండదు. నీకొక్కదానికే కనిపిస్తాడు రూపంతో. ప్రజల హృదయాల్లో అదృశ్య రూపంతో వుంటాడు. అంగజుడు భావజుడు అని పిలవబడతాడు. నీవు సుమంగళిగానే వుంటావు పాదాలు వదులు' అన్నాడాయన.

'మరో జన్మలోనైనా నా విభుడికి రూపం తెప్పించు సర్వేశ్వరా!' అని మరీ మరీ ప్రార్థించిందామె.

సరే- ద్వాపరయుగంలో హరి కృష్ణావతారం ధరిస్తాడు. ఏ అవతారంలోనైనా ఆయనకి నిత్యానపాయిని మహాలక్ష్మి రుక్మిణిగా జన్మించి కృష్ణుడి భార్య అవుతుంది. ఆ దంపతులకి నీ భర్త మన్మధుడు మొదటి బిడ్డగా పుడతాడు సరేనా?' చిరునవ్వుతో అడిగాడు కపర్ది.

'మహాప్రసాదం స్వామీ! లోకోత్తరులైన ఆ దంపతులకేనా భర్త జన్మించడం ముదావహం- మీరు వివాహం చేసుకుని కుమారస్వామి జన్మానికి కారణభూతులుకండి. తద్వారా తారకాసురుణ్ణి అంతమొందేట్లు చెయ్యండి. లోకాల్ని వర్ధిల్లనివ్వండి' అని పార్వతీ పరమేశ్వరులకి మొక్కింది రతి.

ద్వారకానగరంలో రుక్మిణీ దేవి కడుపు పండిన మాట వినేదాకా తపిస్తూనే వుంది రతి.

తన భర్త జగన్మోహనాకారంతో పసిబిడ్డడై రుక్మిణి పొత్తిళ్లలో వుండగా చూసి మురిసిపోయింది. మాయావతి అనే పేరుతో పురుటింటి చుట్టుపక్కలే వుంది. అర్ధరాత్రి శంబరాసురుడు వచ్చి పిల్లవాడి నెత్తుకుని వెళ్లి సముద్రంలో పారెయ్యటమూ చేప కడుపులో బిడ్డ దొరకటమూ అంతా గమనించింది.

'నాకు పిల్లలు లేరు. నేనే బాలుణ్ణి పెంచుతాను' అని తీసుకుంది మాయావతి రూపంలో వున్న రతి.

శీఘ్రంగా పెరిగి యువ వయస్కుడైనాడు ప్రద్యుమ్నుడు నువ్వు నాకు ప్రాణేశ్వరుడవని చెప్పింది మాయావతి.

'అదేమిటి? కన్నతల్లిలాగా పెంచావు కదా- అట్లాంటి మాటలెట్లా అంటున్నావు? తప్పు' అన్నాడు ప్రద్యుమ్నుడు.

'నేను తల్లిలా పెంచలేదు భార్యలా పెంచాను' అని తమ కథంతా చెప్పింది మాయావతి.

ప్రద్యుమ్నుడు ఆశ్చర్యపోయి 'అయితే ఇప్పుడేం చేద్దాం?' అన్నాడు.

'ముందు శంబరాసురుణ్ణి వధించు. నీ జన్మ పరమార్థమది' అని చెప్పిందామె.

ప్రద్యుమ్నుడు శంబరుడితో పోరి చంపేశాడు.

ఎందుకు భయపడి శంబరాశురుడు పసిగుడ్డుని ఎత్తుకెళ్లాడో దాని వల్లనే మరణించాడు. విధిని తప్పించుకోవటం ఎవరి వశం?

ప్రద్యుమ్నుడిని తీసుకుని మాయావతి ద్వారకకి వచ్చింది. 'ఇతడెవరో ఇంత అందంగా వున్నాడు. ఇతన్ని చూస్తే నాకు పాలు చేపుకు వస్తున్నాయేమిటి?' అని వితర్కించుకుంది రుక్మిణి.

వాళ్లిద్దరూ వచ్చి సంగతి చెప్తే కొడుకూ, కోడళ్లని చూసి పొంగిపోయింది రుక్మిణి. భీష్మక మహారాజు సుత అయి రుక్మి రుక్మధర, రుక్మబాహు, రుక్మకేశరు, రుక్మనేత్రులనే అయిదుగురు రాజకుమారుల ముద్దుల చెల్లెలై, సాక్షాత్తూ మహాలక్ష్మి అవతారమై, జనార్దన దేవుడి పట్టమహిషియై వర్ధిల్లే రుక్మిణీ దేవికి మొదటి బిడ్డ పురిట్లోనే దూరమైతే. మానవ మాత్రుల కర్మఫలాన్ని ఏమని చెప్పగలం? పాపం రుక్మిణి ఎంత అల్లాడిపోయిందో బిడ్డడి కోసం! కృష్ణుడెందుకు ఊరుకున్నాడో తెలియదు.

ప్రద్యుమ్నుడి తరువాత రుక్మిణికి తొమ్మిది మంది మగపిల్లలు పుట్టారు. ఆయన భార్యలందరికీ పదేసిమంది కొడుకులు పుట్టారు. విపరీతమైన జనభారం చేత భూదేవి గడగడ వణికింది.

నారదుడు వచ్చాడు ద్వారకకి ఒకసారి. పారిజాత పుష్పం తెచ్చి రుక్మిణికిచ్చి సత్యారుక్మిణుల మధ్య సవతులకయ్యాన్ని పెంచి వెళ్లాడు. సత్యభామ కోపగృహానికి వెళ్ళి అలిగి అన్నీ విసిరికొట్టింది. కృష్ణుడామెని శాంతింపజేసి ఆ అరాళకుంతలతో సహా స్వర్గానికి వెళ్లి కాపలావారితో చివరికి ఇంద్రుడితో కూడా యుద్ధం చేసి పారిజాతం చెట్టు పెళ్లగించుకొచ్చి సత్యభామ పెరట్లో నాటాడు. చెట్టు ఇక్కడున్నా పువ్వులన్నీ రుక్మిణీ దేవి పెరట్లోనే పడతాయట జనం చెప్పుకుంటారు.

... ...

ధర్మరాజుకి రాజసూయయాగం చెయ్యాలని సంకల్పం కలిగింది. దానికోసం అద్భుతమైన మయసభ నిర్మించి యిచ్చాడు మయుడు-

తమ్ముళ్లు నలుగురూ నాలుగు దిక్కుల రాజుల్నీ గెలిచి అపార ధనసంపదల్ని తీసుకువచ్చారు. పాండవులకే అంతా వెన్నుదన్ని నిలిచారు. పాండవుల భార్యల పుట్టింటి రాజ్యాలు ఎలాగూ యుధిష్ఠిరుడి పక్షానే వుంటాయి కదా- ముందే

తీర్థయాత్రల నెపంతో అర్జునుడు దేశపరిస్థితిని తెలుసుకున్నాడు. చాలా మంది రాజులతో స్నేహం చేసుకుని రాజసూయయాగానికి రంగం సిద్ధం చేశాడు. ఇదంతా రాజనీతిలో భాగమే. విరాటరాజు కూడా ధర్మరాజుకి ఎన్నో కానుకలు పంపించాడు.

ఒక లక్షమంది భోజనం చేస్తే ఒకసారి శంఖం మోగుతుంది. అట్లాంటిది ఆ గంట దినమంతా మోగుతూనే వుందంటే ఎందురు ఆహుతులు భోజనాలు చేసి వుంటారు. ఎంత బీదవాడు కానీ ఆ యుగంలో అర్చింపబడవలసిందే-

బంగారం, వెండి, రత్నాలు స్వీకరించడానికి కృపాచార్యుడిని, యజ్ఞం యధావిదిగా జరగాలంటే ఏం చెయ్యాలన్న విషయం మీద భీష్మ ద్రోణుల్నీ, సకల వస్తువులనీ ఉపయోగించటానికి విదురుణ్ణీ, నానా దేశాగత రాజులు తెచ్చి యిచ్చిన కానుకలను దాచటానికి దుర్యోధనుడినీ, భక్ష్య భోజ్యాది విషయాలు చూడటానికి దుశ్శాసనుడినీ నియోగించాడు ధర్మరాజు.

అనంత వేదమూర్తులైన పైలధౌమ్యులు హోతలుగా యాజ్ఞవల్క్యుండు అధ్వర్యుండుగా ద్వైపాయనుండు బ్రహ్మగా సుసాముండు ఉద్గాతగా నారదాది బ్రహ్మర్షులు, సదస్యులుగా భీష్మాది రాజర్షులు సహాయులుగా సర్వక్రియా సమగ్రంబై షడంగ సమృద్ధంబై, సంపూర్ణ దక్షిణా సనాధంబై సకల ధనధాన్య సమన్వితంబై, జగన్నాధ రక్షితంబై సకల జనానంద కరంబై రాజసూయయాగం అతి రమణీయంగా జరిగింది.

అష్టమహిషులు పరివేష్టించి రాగా సాత్యకి సహితుడై శ్రీకృష్ణమూర్తి వచ్చాడు యాగానికి. రేవతీయుతుడై బలరాముడు వచ్చాడు.

సుభద్రా ద్రౌపదీ జలంధరాది కుంతి కోడళ్లు వాళ్లని ప్రియమార ఎదుర్కొని విడుదుల్లో ప్రవేశపెట్టారు.

'ఏం మరదలా ఎలా వున్నావు?' అని రుక్మిణీ సత్యాదులు సుభద్ర యోగక్షేమాలు విచారించారు. అభిమన్యుడినెత్తుకుని ముద్దు చేశారు.

'ఎలా చూసినా నీళ్లు పల్లానికే పారుతాయంటారు. ఎవరి వాళ్లు వాళ్లకి ముద్దు' అంటూ నవ్వింది దేవిక.

'మరేనమ్మా పెద్ద వదినా! నువ్వు సరిగ్గా చెప్పావు సుమా- ధర్మరాజన్నయ్యగారి భార్యవుకదా అటు చూడు' అంటూ నవ్వు బిగబట్టింది లక్షణ.

దేవిక తల్లీతండ్రీ ఆమె కుమారుడు యౌధేయుణ్ణి ఎత్తుకుని ఎదురుపడ్డారు తమవంక చూసిన దేవికని 'అమ్మా! బావున్నావా?' అని అడిగారు. దేవికక్కూడా నవ్వొచ్చింది. లక్షణ తన మాటలు తనకే అప్పజెప్పిందే అని.

అభిమన్యుడు చిన్నత్తయ్యల దగ్గిర్నించీ పెద్దత్తయ్య రేవతి దగ్గిరకి పరిగెత్తాడు. 'అత్తయ్యా! శశి వచ్చిందా?' అంటూ.

అందాల శశిరేఖ బుంగమూతి పెట్టింది 'పో బావా! నీతో మాతలాడను నువ్వు మావూలులావతల్లేదుగా ఎప్పులూ' అంది అంతా ఫక్కుమన్నారు. ముగ్ధులైనారు.

అది మయసభ కదా జాగ్రత్తగా నడవాలి -

దేవకీదేవి, యశోదలని మెల్లిగా నడిపించుకొస్తున్నాడు కృష్ణుడు. 'అమ్మా!' అంటూ సుభద్ర ఇద్దర్నీ కౌగిలించుకుంది.

'అమ్మమ్మ!' అంటూ అభిమన్యుడు పరిగెత్తుకొచ్చి 'చూడు రేవతి అత్తయ్య వాళ్ల శశిరేఖ నాతో మాట్లాడనంటున్నది' అన్నాడు. ఆడపిల్లల్ని చూసి పరవశించిపోయే కుంతి ఆ పిల్లని ఎత్తుకుని ముద్దులాడింది. 'పోనీ మా అభిమన్యుణ్ణి పెళ్లి చేసుకో శశిరేఖా! ఎప్పుడూ నీ దగ్గిరే వుంటాడప్పుడు మా మనవడు' అన్నది ఆ పిల్ల బుగ్గలు పుణుకుతూ.

అంతలో విరాటరాజూ ఆయన రాణి సుధేష్ణా, ఇద్దరు రాజకుమారులూ, ఒక్కగానొక్క తనయ ఉత్తరా వచ్చారు.

వాళ్లని ఆహ్వానించటానికి కరేణుమతీ, విజయా ఎదురు వెళ్లారు. ఇంతంత బుగ్గలతో ముద్దులొలుకుతున్న పాప ఉత్తరని అసంకల్పితంగా దగ్గిరికి తీసుకున్నారు. విరాటుడి పెద్ద కొడుకు శంఖుడు ప్రతివింధ్యుడితోమాట్లాడుతున్నాడు. చిన్న కుమారుడు ఉత్తర కుమారుడు అభిమన్యు కుమారుడితో ఆటలాడుకోవటం చూసి ఉత్తరని దింపి 'పాపా! నువ్వెళ్లి మా అభిమన్యుడి దగ్గిర కూచో. అమ్మా నాన్నలకి

ఫలహారం పెట్టి వస్తాం' అన్నారు కరేణుమతీ, విజయా.

జలంధర పాల పాత్రలతో వచ్చింది. పిల్లలకిద్దామని. శశిరేఖ వచ్చి 'ఏయ్ ఉత్తలా! బావ పక్క నుంచీ లే' అంది దర్పంగా. 'నేను లేవను- ఈ అబ్బాయి మీ బావా? నాక్కూడా బావేనేమో. అత్తయ్యలిద్దరూ నన్ను ఇక్కడ కూచోమన్నారు. కావలిస్తే ఆ పక్కన కూచో' అంది మరింత దర్పంగా.

జలంధరకి చూడముచ్చటైంది. మురిసిపోతూ ద్రౌపదినీ, దేవికనీ, సుభద్రనీ పిలిచి ఆ దృశ్యం చూపించి వాళ్ల చెవిలో గుగుసలాడింది.

సుభద్రా, ద్రౌపదీ ఉత్తర చేరో బుగ్గ ముద్దుపెట్టుకున్నారు. దేవిక నవ్వుకుంటూ యశోదమ్మ పరిచర్యకి వెళ్లిపోయింది. ఆ వృద్ధ గోపవనితకి ఈ రాజులూ ఆతిధ్యాలూ వాళ్ల మహాభవనాలూ అన్నీ దిగ్భ్రమ కలిగిస్తున్నాయి. నడవాలంటే భయంగా వుంది. నేల మాసిపోతుందేమో అని గోడ పట్టుకుని నడుద్దామంటే గోడ మాసిపోతుందేమో అన్నట్లుంది. తనకీ నగర వైభవాలు ఏం తెలుసు? వ్రేపల్లే లోకం బలరామకృష్ణులే ప్రపంచం.

ఏమిటో కృష్ణుడు ఇంత గొప్పవాడని తనకి తెలియనే లేదు. అమ్మో! ఇంత గొప్పవాణ్ణి ఎంత బీదగా పెంచింది. చద్దన్నం పెట్టింది. తలకి సొమ్ములు పెట్టమంటే అవలీలగా అడవిలో దొరికే నెమలిపించం తెచ్చి చిన్న జడవేసి దాన్ని తురిమింది. వెదురు వేణువుని తెచ్చిచ్చి పాడుకోమంది. అన్నీ ప్రకృతి సంబంధ వస్తువులే ఇచ్చింది. పాలూ, పెరుగూ, వెన్నా, మీగడలే ప్రధాన ఆహారంగా బతికారు. తమతోపాటు రాజకుమారులైన బలరామకృష్ణులు. ప్చ్. ఆ పసితనపు లీలలే తనకి మిగిల్చాడు కన్నయ్య. నిత్యం ఒక లీలే ప్రదర్శించాడు తనముందు- ఎప్పుడూ రాక్షసుల్ని చంపి నవ్వుతూ ఇంటికొచ్చేవాడు.

యమునానది పక్కన బృందావనం వుందిగా అక్కడ వ్యత్యస్త పాదారవిందుడై మోహన వేణుగానం చేస్తూ వుంటే చేస్తున్న పని ఆపి గొల్ల యిల్లాళ్లంతా అటు పరిగెత్తే వాళ్లు. హుఁ వాళ్లే కాదూ చిన్నప్పుడు తనకి గోపాలకృష్ణుడి మీద నేరాలు

చెప్పి రోటికి కట్టేయించారు. అపచారం. అపచారం జరిగిపోయింది. కాళీయుడిని పారదోలాడన్నా తను మట్టి తింటున్నాడని నోరు చూపించమంటే బ్రహ్మాండాలు చూపించినా ఏమిటో అదంతా ఎప్పటికప్పుడు పరగడుపే. మతిమరుపే. అతి సాధారణ బాలుడిలా తమ ఇంట్లో ఆడిపాడి గోకులాన్ని కాపాడి చివరికి తన బతుకుని చీకటి చేసి మధురానగరానికి వెళ్లి పోయినాడే కన్నయ్య. అక్రూరుడొచ్చి వీళ్లు మీ పిల్లలు కారు దేవకీ, వసుదేవుల పిల్లలు అని చెప్పి వాళ్లని మధురకి తీసుకెళ్లిననాడే తను వట్టి శిలలా మిగిలిపోయింది. పరమాత్ముణ్ణి పెంచడం కోసమేనా తన జన్మ కృష్ణుడికోసం రోజూ చల్ల చేసి వెన్న తీసి ఇంత మీగడా, వెన్నా గిన్నెల్లో వేసుకుని కూచునేది. నందుడొచ్చి కోప్పడేవాడు. ఇంక తిండి తినవా? పిచ్చిదానా? వాళ్లు మన పిల్లలు కారే- పైగా ఆ నల్లవాడున్నాడు చూడు వాడు వట్టి దొంగ. మన నవనీతంతోపాటు మనసులు కూడా దోచుకుపోయినాడు. ఏం నవ్వేవాడిది. జగత్తుని మాయలో ముంచగలది. మనల్ని పిచ్చివాళ్లని, జీవచ్ఛవాలని చేసి ఎట్లా వెళ్లిపోయినాడే' అంటూ మొదట బింకం ప్రదర్శించినా తనతోపాటు ఏడ్చేసేవాడు.

'పోతే పోనీవే- ఇంత పెంచి పెద్ద చేశాం. మన బిడ్డ అనుకున్నాం. కాదని తేలింది పోనీ మధుర వెళ్లాక. కంసుడిని చంపి తల్లిదండ్రుల చెర విడిపించి తాతగారికి పట్టాభిషేకం చేసి, వెంటనే మన దగ్గరికి రావచ్చుగా రాదు. ఎందుకొస్తాడు. రాజభోగాలు రుచి చూసినవాడు నీ పిచ్చి వెన్నపూసా మీగడపెరుగూ చద్దన్నం తినడానికొస్తాడా? కంబళ్లు కప్పుకోగలడా. ఒకసారి పట్టుపీతాంబరాలు కట్టుకున్నవాడు? మధురనించీ ద్వారకకి వెళ్లాడు. ఎనిమిది పెళ్లిళ్లు చేసుకుని మనల్ని పిలవనే లేదే- అదేమిటంటే పూర్వజన్మ కర్మ విశేషం అంటాడు. పెంపకం యశోదదిట పెళ్లిళ్లు చూసి మురవటం దేవకమ్మదిట- ఏం తెలివి? అంటాడు నందుడు కళ్లనీళ్లతో, తెచ్చి పెట్టుకున్న కోపంతో-

తన కడుపున లేక లేక శిశువు కలిగింది. ఆడశిశువు. ఆ పిల్లా దేవకి ఒడిచేరి ఆకాశంలోకి కెగిరి కంసుణ్ణి భయపెట్టి మాయమైపోయింది.

అప్పుడప్పుడు వచ్చి తనప్పుడు కొత్తగా పెళ్లిచేసుకున్న పెళ్లాన్ని చూపించి వెళ్తాడుగానీ- ఏమిటో తన చిన్ని కృష్ణుడు కాడు ఇతడు. మేధావి, రాజనీతిపరుడు. పెద్ద ఆలోచనలు చేస్తుంటాడు. గొల్ల పిల్లలు కాదు యిప్పటి స్నేహితులు కొమ్ములు తిరిగిన వీరాధి వీరులు. పాండవులు మొదలైవాళ్లు వస్తూ వస్తూ తనకి నందుడికీ వ్రేపల్లెలో అందరికీ పట్టుబట్టలూ కానుకలు తెస్తారు పాపం. మాకెందుకవి? పూరిళ్లలో ఎక్కడ పెట్టుకుంటాం. అవి కట్టుకుని ఎక్కడికెళ్తాం. కన్నయ్య లేని యిల్లు ఊరు ఎలా చిన్న బోయిందో దేవుడు లేని దేవాలయంలాగా... యశోద నిమిషంలో గతం గుర్తుకు తెచ్చుకుంది.

'ఏమిటి అత్తయ్యా! గోడలూ నేలా చూసి ఆలోచిస్తున్నారు. రండి. నన్ను పట్టుకోండి. లోపలికెళదాం' అన్న మాటలతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది యశోద. రుక్మిణీదేవి ఆప్యాయంగా యశోద చెయ్యి పట్టుకుంది. 'ఊః మా అమ్మనింతసేపు నిలబెట్టి వుంచావా రుక్మిణీ!' అని కోప్పడుతూ వచ్చాడు కృష్ణుడు. ఈ లోపల మిగతా ఏడుగురు పట్టమహిషులూ గబగబా వచ్చి దేవకీ యశోదలకి ఆసరా ఇచ్చారు. ద్రౌపదీ దేవి కుంతీ, గాంధారీ, భానుమతీ, సుభద్రా, కోకిలాదేవి ఆదరంగా ఎదురు వెళ్లారు. అంతా పెద్దవాళ్లని మెల్లిగా చేయూత ఇచ్చి నడిపించుకుంటూ వచ్చారు. కుంతి తన మందిరాన్ని విడిదిగా ఇచ్చింది వాళ్లకి. వసుదేవుడినీ నందుణ్ణీ భీమార్జున నకుల సహదేవులూ కరేణుమతీ విజయా తీసుకువెళ్లి వాళ్ల కోసం కట్టించిన ప్రత్యేకమైన విడిదిలో బస చేయించారు.

కుంతీదేవికి యశోదా దేవకీ దేవులకూ చిన్నప్పటి స్నేహమంతా ఒక్కసారి ఉబికి వచ్చింది. వాళ్ళు పెళ్ళిళ్లయ్యాక ఎప్పుడూ కలుసుకోలేదు. దేవకి జీవితంలో చాలా భాగం చెరసాలలోనే గడిచిపోయింది.

ఉగ్రసేన మహారాజు ముద్దులపట్టి దేవకి వసుదేవుడిని చెట్టబట్టింది. కంసుడు వరసకి అన్న అయినా దేవకి అంటే చాలా ప్రేమగా వుండేవాడు. వసుదేవుడికి ఎనిమిదవ భార్య దేవకి, ఏడవ భార్య రోహిణి. ఆకాశవాణి దేవకి అష్టమగర్భం నిన్ను

సంహరించగలదు అని చెప్తే కాలనేమి అంశతో పుట్టిన కంసుడు భయపడి కొత్త పెళ్లికూతురైన దేవకిని చంపబోతే వసుదేవుడు అడ్డం వచ్చి పుట్టిన పిల్లల్ని నీకు తెచ్చి యిస్తాననటంతో వదిలివేశాడుగాని.

ప్రతిక్షణం భయంతో బతికింది దేవకి- గర్భం వచ్చినప్పుడల్లా భయమే- దినదినగండం నూరేళ్ళాయుష్షు అన్న విధమైంది. ఎప్పుడు కంసుడొస్తాడో పిల్లల్ని చంపేస్తాడో అని ప్రాణతల్లట-గుండె దిగులు.

అనుకున్నట్లుగానే ఆరుగురు పిల్లలు బంగారు తండ్రులు, మగపిల్లలు పుట్టారు. అరిచేతిలో పెట్టుకుని చూసుకుంది వాళ్ళని అమ్మయ్య కంసుడు వీళ్లని చంపడింక మహా అయితే అష్ట గర్భాన్ని చంపుతానంటాడేమోలే- అప్పటి సంగతి అప్పుడు చూసుకోవచ్చు. దేవుడే దిక్కు. అసలు ఎనిమిదవ కాన్పు జరిగితే కదా భయం అనుకుంది అమాయకంగా దేవకి. ఆ దేవకి ఒక మంచితనపు ముద్ద. ఇంకా రోహిణి తెలివైంది. కానీ ఆమెకి పిల్లలు లేరు. దేవకి పిల్లల్ని ఎంతో ప్రేమగా సాకేది.

కానీ ఏం బుద్ధి పుట్టిందో కంసుడికి తనింటికి పిలిచి మరీ ఆ పసిపిల్లలందర్నీ నిర్దాక్షిణ్యంగా చంపేశాడు. ఒక బిడ్డని ఏడుస్తుందా? ఇద్దరు బిడ్డలకని ఏడుస్తుందా? ఆరుగురు బిడ్డలు. రత్నాల్లాంటి పిల్లలు. ముక్కు పచ్చలారలేదు. పాలుగారుతున్నారు. నిజంగా కంసుడు అన్నయ్యా రాక్షసుడా? రాక్షసులైనా తనకేం అపకారం చెయ్యని పసిబిడ్డల్ని చంపుతారా? తొమ్మిది నెలలు మోసి ప్రసవ వేదన పడి కన్నబిడ్డలు. తన కడుపు పండించి పేగు చుట్టుకున్న పిల్లలు అయ్యో అని దేవకి కక్కటిల్లి ఏడుస్తుంటే భటులు వచ్చి తననీ భర్త వసుదేవుణ్ణీ చెరసాలలో పెట్టారు.

అప్పటికే మళ్లీ నెలతప్పిందేమో అని అనుమానంగా వుంది దేవకికి. చెరసాలలో ఒకనాడు కలో నిజమో తెలీని పరిస్థితుల్లో ఎవరో ఋషులు కనపడ్డారు దేవకీ వసుదేవులకి ఇప్పుడు దేవకి గర్భంలో వున్న పిల్లవాడిని తీసుకెళ్లి వ్రేపల్లెలో రోహిణి గర్భంలో ప్రవేశపెడుతున్నాము. ఈ విషయం రోహిణికీ నందయశోదలకీ

కూడా చెప్తాము. లేకపోతే రోహిణి శీలాన్ని అనుమానించే అవకాశం వుంది ప్రపంచానికి. ఆదిశేషువు అంశతో దేవకీ సప్తమ గర్భం రోహిణి యందు ఫలిస్తుంది. తరువాత దేవకీ దేవి అష్టమ గర్భం ధరిస్తుంది. ఆకాశవాణి జోస్యం నిజమవుతుంది. మీరు ఏం భయపడద్దు. మేమంతా కాపాడుతుంటాము. మీరిద్దరూ పూర్వజన్మల్లో అదితి, కశ్యపులు మళ్ళీ మహావిష్ణువుని కని బతుకు పండించుకుంటారు. స్వామి జననానికి మేమంతా ఈ చెరసాలని ఆవరించుకుని వుంటాము. దుష్టశిక్షకుడూ శిష్టరక్షకుడూ అయిన భగవంతుడు బాలుడై మీ కడుపున పడనున్నాడు. అని చెప్పి అంతర్ధానమైనారు. ఒకవేళ ఇదికలా అనుకుంటే భార్యాభర్తలిద్దరికీ ఎలా వస్తుంది. అక్కడ గోకులంలో కూడా ఈ సంగతి తెలిసింది. దేవకీ దేవికి గర్భం పోయిందని కంసుడు పంపించిన మంత్రసానులూ ఋజువు చేశారు. గోకులంలో రోహిణి హఠాత్తుగా నాలుగు నెలల గర్భవతి అయింది.

శ్రీకృష్ణుడంతటివాడు తమ కడుపున పుట్టినా ఆయన ఆటపాటలని బుడి బుడి నడకలనీ తొక్కు పలుకులనీ చూసుకునే యోగం లేదు కదా !

కృష్ణ బలరాములిద్దరూ అక్రూరుడితో కలిసి మధురానగరానికి వచ్చేదాకా చెరసాలే గతి. కంసుడిని చంపి అప్పుడు గదా తమనీ ఉగ్రసేనుడినీ విడిపించారు పిల్లలు. ఉగ్రసేనుడికి పట్టాభిషేకం జరిగాక అప్పుడూ స్వేచ్ఛ. ఏం జన్మ ఇది ఛీ పెళ్లయ్యేదాకా ఏం సుఖపడిందో అంతే- ఇప్పుడు వయసు దాటిపోయాక స్వేచ్ఛ. ఎప్పుడూ తన బిడ్డలు పోయిన మొదటి ఆరుగురూ గుర్తుకొచ్చి ఏడుస్తుంటే కిష్టయ్య వాళ్లని తెచ్చి చూపించాడు. అప్పుడు మనసు కాస్త తేలికైంది. కానీ కొడుకులైన బలరామకృష్ణులూ కోడళ్లూ ఇప్పుడు బాగా చూస్తారు. ఎంతో అభిమానం ప్రేమా గౌరవం వాళ్లకి తనంటే- వసుదేవుణ్ణి అడిగి గానీ ఏ పనీ చెయ్యరు బలరామకృష్ణులు. అయినా పాత జీవితం ఆ బాధలూ మర్చిపోలేక గుండెలో ముల్లులాగా గాయం మానక దేవకి తపన. సాక్షాత్తూ భగవంతుడిని కన్నా ఆడదానికి కష్టాలు తప్పవా? దేవకి భావోద్వేగం అర్థమైనట్లు

కుంతి ఆమె భుజం మీద ఓదార్పుగా చెయ్యి వేసింది. ద్రుపద మహారాజు భార్య కోకిలాదేవి 'దేవకీ! మొత్తానికి కూతుర్ని నీ మేనల్లుడైన పాండవ మధ్యముడికే ఇచ్చి పెళ్లి చేశావు. మనవడు పుట్టాడు' అన్నది దేవకి ధ్యాస మళ్లించటానికి.

'నువ్వు నీ కూతుర్ని పాండవులందరికీ పెళ్లిచేశావు. అయిదుగురు మనవల్ని కన్నావుగదా' అంది నవ్వుతూ దేవకి.

'హమ్మయ్య! దేవకి నవ్వింది' అంది కోకిల.

యశోద అభావంగా చూసింది.

రోహిణీ కుంతీ 'యశోదమ్మా! చూశావా! నీ కిష్టయ్య అయితే ఏం ఆయన బావలూ మరుదులూ అయితేనేం- రాజప్రాసాదాలు అన్నీ ఇట్లాగే వుంటాయి. ఇప్పుడు రాజసూయం కోసం పాండవ భవనాలు మరింత ఇదిగా అలంకరించారు. అంతఃపురాలే కాదు నగరాన్నీ శోభాయమానంగా అలంకరించార్లే! అని వివరించింది.

'ఎప్పుడూ కృష్ణుడు చెప్తుంటాడు తన చిన్నతనంలో నిన్నెంత ఇబ్బంది పెట్టేవాడో కదా కృష్ణుడు. యశోదా! నువ్వు అదృష్టవంతురాలివి' అంది కుంతి.

'ఆఁ రోటికి కట్టేశాగా పాపం చిన్న కన్నయ్యను' అని పశ్చాత్తాపపడింది యశోద.

' మంచి పని చేశారు' అంది నవ్వుతూ సత్యభామ - నువ్వూ కట్టేస్తావా ఏం కోడలా? అన్నదావిడ నవ్వుతూ.

'రోహిణి అక్క కూడా అదృష్టవంతురాలే' అన్నది దేవకి.

'బలరామకృష్ణుల ఆటపాటలు చూసి ఆనందించిన మాట నిజమే కాని నా జీవితంలో ఇంకేం ఉంది?' అంది రోహిణి నిర్వేదంగా.

'రామకృష్ణులతో గొడ్లు కాయించాం నేనూ యశోదా ఏం చెయ్యమంటావు?' అంది.

రోహిణి వసుదేవుడితో ఎక్కువ కాలం గడపనే లేదు. అంతలోనే ఆయన దేవకిని పెళ్లి చేసుకున్నాడు. దేవకితోటే ఎక్కువ కాలం గడిపాడు దైవ నిర్ణయమేమో-

ఆమెకి వరసగా పిల్లలు పుట్టారు. తను భర్తవుండీ అనాథలాగా యశోదానందుల ఇంట తలదాచుకోవాల్సి వచ్చింది. నందుడు వసుదేవుడి స్నేహితుడు - కంసుడు రోహిణికి కూడా అపకారం చేస్తాడేమో అని భయపడి నందయశోదల యింట గొల్లపల్లెలో అట్టేపెట్టి వెళ్లాడు వసుదేవుడు రహస్యంగా.

ఏం పాపఖర్మమో తన కడుపు పండలేదు. తను భర్త దగ్గిర వున్నదీ కొద్ది కాలమే దానికి తగినట్లు- మహర్షులు పూనుకుని దేవకి సప్తమ గర్భాన్ని తన బిడ్డగా కనే మహాదృష్టం ప్రసాదించారు. నిజంగా యశోదానందులు ఎంత మంచివాళ్లు! వాళ్లే గనక తనని కడుపులో పెట్టుకుని కాపాడకపోతే ఏమైపోయేదో? తల్లితోపాటు బలరామకుమారుణ్ణి కూడా ప్రాణంగా పెంచారు. బలరాముడూ కృష్ణుడూ కూడా ఎంతో అన్యోన్యంగా పెరిగారు. ఆదిశేషుడు తన బిడ్డ అయినాడన్న ఆనందం మాత్రం అప్పుడప్పుడు కలుగుతుంది. అంతే- వాసన లేని పువ్వులాగా తన జన్మ ఇలా మిగిలిపోయింది.

కుంతి మనస్సులో ఇంత మహావైభవంగా తన పిల్లలు రాజసూయం చేసుకుంటున్నారే- పాపం కర్ణుడిని పిలవనే లేదు సూతపుత్రుడని. నామకః ధర్మరాజు కృష్ణుడిచేత పిలిపించాడు. అంటే తనబిడ్డకి అంగరాజ్యం ఇచ్చి దుర్యోధనుడు ఆదరించాడు. అక్కడికది కొంత నయం. ఎవరి అండా లేకుండా తన శౌర్య ప్రతాపాలు కారణంగా అంగరాజ్యం సంపాదించుకున్నాడు కర్ణుడు. నిజానికి రాజసూయం కర్ణుడి చేతి మీదుగా జరగాలి. కానీ అయ్యో! అంత యోగ్యత తనకీ కర్ణుడికీ ఎక్కడుంది. తన కొడుకని తెలీకపోవటంతోనే గదా దుర్యోధనుడు కర్ణుడికి అంగరాజ్య ఇచ్చింది. ఏమిటో నకుల సహదేవుల్ని చూస్తే జాలేస్తుంది. తల్లీ తండ్రీ ఇద్దరూ లేరు గదా పాపం. పాండురాజు అత్యంత సుందరీమణి అయిన మాద్రిని చూసి మోహావేశం తెచ్చుకోవటం వల్ల ఇంత అనర్థం జరిగింది.

ఎట్లాగూ సంసార సుఖం లేదని తన మనస్సు భక్తివేపూ, బ్రాహ్మణ సమారాధనలోనూ నిమగ్నం చేసింది కుంతి. కానీ మద్రరాజపుత్రి చిన్నది. ఆ రోజు

బ్రాహ్మణులకి భోజనాలు పెట్టిస్తూ మాద్రీ రక్షణంలో ఏమరుపాటు పడింది కుంతి. అదే కొంపముంచింది. నిరంతరం మాద్రిని దూరంగా ఉంచకపోతే పాండురాజుకి ప్రమాదమేనాయె. బ్రాహ్మణ సమారాధన రోజు పాండురాజు తొందరపడ్డాడు. మాద్రి సౌందర్యానికి ప్రాణాలే అర్పించాడు. పాండు రాజు పోయేనాటికి ధర్మరాజుకి పదమూడేళ్లు, భీముడికి తొమ్మిది, అర్జునుడికి ఏడేళ్లు, మహా సౌందర్యవంతుడైన నకుల కుమారుడికి, సహదేవ కుమారుడికి అయిదు అయిదేళ్లు.

తండ్రి మరణించాడు సరే. అతనితోపాటు తనూ సహగమనం చేస్తానని మొండికేసింది మాద్రి. ఎంత చెప్పినా వినలేదు. తన కవలపిల్లల్ని పసివాళ్లని అక్క కుంతీదేవి చేతికప్పగించి తను కూడా భర్తతోపాటు అగ్నిలో దగ్ధమైంది మాద్రి. తనవల్లే పాండురాజు తొందరపడ్డాడు. అందుకే ఆయన మరణించాడు గనక తనూ బతకనని తేల్చి చెప్పింది మాద్రి. తను ఆమె పిల్లల్ని తన పిల్లలకంటే ఎక్కువగా శ్రద్ధగా పెంచింది. అయినా లోటు లోటే. ఒక పురుషుడి తొందరపాటుకి అతనితో సహా భార్యలిద్దరి జీవితాలూ అంధకారమయములైనాయి. చివరికి తనతోపాటు చిన్న భార్య కూడా ఆత్మార్పణం చేసుకుంది పాపం. ఆ మహాసౌందర్యం ఆ యవ్వనం అంతా బూడిదైపోయింది కదా!

కుంతికి దుఃఖం వచ్చింది.

'అయ్యో మాద్రీ! నువ్వు ఇవాళ వుండివుంటే నీ తనయుల వైభవాన్ని కళ్లారా చూసేదానివమ్మా. నకుల సహదేవులు ఎంత ఆనందంగా తమ వీరవిజయ గాధలు నీతో చెప్పుకునేవారో గదా- అక్కడికీ నీ పుత్రుల్ని నా పుత్రులకంటే ఎక్కువ ప్రేమగా పెంచాను చెల్లీ! తల్లీ తండ్రీ నేనే అయినాను. నా యధాశక్తిగా కష్టపడ్డాను. కానీ కన్నతల్లి బతికున్న తీరు రాదు కదమ్మా' అనుకుంది.

'ఇందాకట్నించీ మేమంతా బొమ్మల్లా నిలబడి మీవంకే చూస్తున్నాము. ఏమిటి అలా చిత్తరువుల్లా నిలబడి పోయినారు మీరంతా. ఏదో చిన్న నాటి ప్రాణస్నేహితురాళ్ళు కదా అని చాలా కాలం తర్వాత కలిసేట్లు చేశాము. మీరేమో ఒకరి కంటే ఒకరు

ఆలోచనల్లో పడి గంభీరంగా నిలబడిపోయారు. రండి... రండి... విడిది భవనంలో కూచుని మంచి మంచి మాటలు మాట్లాడుకోండి' అంది కాస్త గట్టిగా రేవతి. ద్రౌపదీ, సుభద్రా, కరేణుమతీ, విజయా, దేవికా, రుక్మిణి, సత్యభామా, లక్షణా, జలంధరా, హిడింబా, చిత్రాంగదా, ఉలూచీ అంతా రేవతి పక్కనే వున్నారు. ఈ వృద్ధ స్త్రీల వేపు ఆదుర్దాగా చూస్తూ వున్నారు.

'ఇదేమిటి వచ్చిన వాళ్లని పలకరించే దిక్కులేదు. మీరంతా ఇక్కడున్నారేమిటి? మరీ ఆడవాళ్లకి మతి వుండటం లేదు' భీముడు చిరాకుగా వచ్చాడు.

అందరూ ప్రకృతిస్థులైనారు. ఇంతలో అక్కడికి కృష్ణార్జునులు వచ్చారు. కృష్ణుడు యశోదమ్మని నడిపించుకుంటూ విడిదికి తీసుకెళ్లాడు. అర్జునుడూ సుభద్రా దేవకీ దేవినీ, రేవతీ బలరాములు ద్రౌపదీ రోహిణికి తోడుగానూ తీసుకుని వెళ్లారు.

కోకిలాదేవిని హిడింబ ఒక్కత్తీ తీసుకెళ్లిపోయింది. 'ఉండు కమలపాలికా అక్కా! నేను కూడా వస్తున్నానని' జలంధర అంటున్నా ఆగలేదు.

కుంతీదేవిని దేవికా కరేణుమతీ భీముడూ ఆసరా ఇచ్చి తీసుకువెళ్లారు లోపలికి.

ఇంతలో గాంధారీ, భానుమతీ వచ్చారని హెచ్చరికలు వినపడటంతో అందరూ అటు వెళ్లి మర్యాదలు చేశారు. గాంధారి తన పరిచయస్థురాళ్లున్న విడిది గృహంలోనే ఉంటానన్నది. ఆమె కోసం కేటాయించిన గృహం మరొక రాజుకివ్వమన్నారు. భానుమతిని ద్రౌపది తన గృహంలోకి తీసుకెళ్లింది ప్రియమార ఆలింగనం చేసుకుని. దుశ్శాసనుడి భార్యని చిత్రాంగద ఆహ్వానించింది. యుయుత్సుడి భార్యని మందారిక స్వాగతించింది. వికర్ణుడి రాణిని కరేణుమతి, దుస్సలాదేవిని విజయా, ఉలూచి ప్రేమగా లోపలికి తీసుకెళ్లారు. నూట ఆరుగురు కౌరవులూ పాండవులూ కలిపి. వాళ్లందరి ముద్దుల చెల్లెలు దుస్సల. రాజకార్యాల వత్తిడి వల్ల జయద్రథుడు రాలేకపోయినాడు. దుర్యోధనాదులంతా వచ్చారు.

ధృతరాష్ట్రుణ్ణి, శకునిని, పితామహుడైన భీష్ముణ్ణీ, ఆచార్యుడైన ద్రోణుణ్ణీ, బాహ్లికాది కురువృద్ధుల్నీ విదురాది సజ్జనుల్నీ, ధర్మరాజు, అర్జునుడు, ద్రౌపది. ఆమె

అన్నగార్లయిన దృష్టద్యుమ్నాదులు అయిదుగురూ ధౌమ్యుడూ ఆహ్వానించారు. సుగంధ జలాలతో వాళ్ల కాళ్లు కడిగారు. పూలమాలలు వేశారు. చందనం పూశారు. సరస సల్లాపాలతో వాళ్లందరికీ భోజనాలు విడుదులు ఏర్పాటు చేశారు. పాండవ పురోహితుడైన ధౌమ్యుడితో వెళ్లాడు ద్రోణాచార్యుడు.

'మరిదిగారూ! భోజన విషయాలు మీకు అప్పగించారు కదా మీ అన్నయ్య ధర్మజులు. ఇప్పుడా రావటం' అని దుశ్శాసనుడితో సరదాగా వేలమాడింది ద్రౌపది.

'ఎప్పుడొస్తేనేం? ముందు మీకేం కావాలో చెప్పండి వదినగారూ!' క్షణాల మీద వండించమని చెప్తాను. నాకు కేటాయించిన శాఖాధిపతిని ముందిటు పిలవండి దుశ్శాసనుడు కూడా సరదాగా అన్నాడు ద్రౌపదితో.

'నాక్కాదుగానీ మీ ఆవిడకేం కావాలో కనుక్కుని వండించండి చాలు' అన్నది ద్రౌపది.

'మహారాణీ! మీరిలా రావాలి. వేదవ్యాసులవారు తక్కిన మహర్షులూ విచ్చేశారు. ధర్మజుల వారు తమర్ని పిలుస్తున్నారు' అంటూ వచ్చిందింతలో మందారిక.

ద్రౌపది అక్కణ్ణించీ వెళ్లిపోయింది.

దుర్యోధనుడూ, దుశ్శాసనుడూ ఆ రాజసూయ వైభోగాన్ని చూసి ఆశ్చర్యపోయినారు.

గాంధారీ, దేవకీ, యశోదా, రోహిణీ, కుంతీ, కోకిలా అంతా కలిసి ఒక మందిరంలో వున్నారు. అర్ధరాత్రి దాకా మాట్లాడుకుంటూనే వున్నారు. పెళ్లికాకముందున్న పరిచయమే ఎక్కువ వాళ్లకి. పెళ్లిళ్లయ్యాక రాణి అనే నిర్బంధంలో వుండి సంసారమనే జంఝాటంలో పడి వాళ్ల స్నేహాలు మరుగున పడినై. ఏమే, ఒసే, ఔనే అనుకుంటూ అంతస్థులు మరిచి పోయి హాయిగా గడపగలిగారిప్పుడు.

ఇన్నాళ్లకి వాళ్లందరూ కలుసుకోగలిగారు. అందుకు కృష్ణుడూ, ద్రౌపదీ

తోడైనారు. ఎప్పుడూ రాని భీష్మకుని భార్యని కూడా తీసుకువచ్చారు వాళ్ళు. ఆవిడనీ వృద్ధ స్త్రీల మందిరంలోనే విడిది చేయించారు. తల్లిని చూసి ఉప్పొంగిపోయింది రుక్మిణి. తండ్రి భీష్మకుడు కూడా నకులుడింట్లో విడిది చేశాడని విని ఎంతో ఆనందించింది. పెళ్లయ్యాక ఇదేగా వాళ్లని చూడటం. తన అన్న రుక్మి పుట్టింటికి రానివ్వడు. అమ్మావాళ్లని తన అత్తింటికి రానివ్వడు. ఆయనకు ఇష్టం లేని పెళ్లి కదా రుక్మిణిది- అందుకని మొదటి రోజు రాని కర్ణుణ్ణి కూడా కృష్ణుడు మంచి మాటలాడి తీసుకుని వచ్చాడు. శకుని కూడా వచ్చాడు. బాహ్లికుడితో కలిసి జూదమాడదాం అని ద్రుపదుడితోనూ, విరటుడితోనూ మొదలెట్టాడు.

అంతఃపురమంతా ఆడవాళ్లు బిలబిల్లాడుతూనూ- గునగునలాడుతూ పిల్లలు - ఎల్లుండినించీ కదా ఉత్సవం అని ద్రౌపది ఆ రోజు పని వదిలేసింది. ఎన్నేళ్లకి ఆమెకి ఆటవిడుపు. గృహకృత్యాదుల్నించీ వెయ్యేసిమంది పరిచారికలున్నా ద్రౌపదికి పని తప్పేది కాదు.

ఈ వయసు వాళ్లంతా ఒక చోట చేరారు. ద్రౌపదీ, దుస్సలా, భానుమతీ, రుక్మిణీ. సత్యాది అష్టమహిషులూ పాండవుల ఇతర భార్యలూ ఓహో వాళ్లంతా కబుర్లే. అక్కా అని చెల్లీ అని వదినా అనీ ఒకటే మాటలు. బలరాముడూ, ద్రౌపది అన్నలూ, కృష్ణుడూ, అర్జునుడూ మిగిలిన పాండవులూ, దుర్యోధన, దుశ్శాసనాదులూ, సాత్యకీ వీళ్లంతా ఒక చోట చేరారు. బావా అన్నయ్యా తమ్ముడూ అంటూ సల్లాపాలు.

'కృష్ణా! కాసేపు మురళి వాయించు' అని అడిగారెవరో.

'వద్దులే నాయనా! ఇక్కడీయన వేణువు మొదలెడితే వాళ్ళు పరిగెత్తుకు వస్తారు. పాపం దూరం కదా' అన్నాడు దుర్యోధనుడు.

'ఎవరు వాళ్లు?'

'ఇంకెవరు? గోపికలు' అన్నాడు దుర్యోధనుడు.

అంతా నవ్వులు.

కృష్ణుడు కూడా దుర్యోధనుడి మీద హాస్యాలు సంధించాడు. 'బావా! అక్కడెక్కడో స్వయంవరం వుందిట. వెళ్తావా?' అని.

'అదేదో నువ్వే వెళ్ళవయ్యా - నవ మహిషులవుతారు' అన్నాడు దుర్యోధనుడు.

ఇక పిల్లలు-

ఉత్తరాదేవి చికాగ్గా మొహం పెట్టి 'ఏయ్ శశిరేఖా! నువ్వు అభిమన్యుడికి దూరంగా కూచో' అన్నది.

'ఎందుకమ్మా? అభి మా బావ తెలుసా?' అంది శశిరేఖ దర్పంగా. 'సరేలే నువ్వటు కూచో నేనిటు కూచుంటా మనిద్దరం కలిసి ఈ ఆటలో అభిమన్యుణ్ణి ఓడించాలి సుమా' అంది ఉత్తర.

'ఏమిటి మీ ఆడపిల్లలు నన్ను ఓడిస్తారా? చూద్దాం పందెం కాయండి' అన్నాడు అభిమన్యుడు అవలీలగా.

'ఏయ్ ఉత్తర కుమారా! నువ్విటురా మనం వేరే ఆట ఆడుకుందాం' అని లాక్కెళ్లాడు దుర్యోధనుడి కొడుకు లక్ష్మణకుమారుడు.

గునగునలాడుతూ పిల్లలు ఒకటే ఆటలు కళ్లకి పండగ్గా. దృష్టద్యుమ్నుడి కొడుకొచ్చి ఊరికే నుంచున్నాడు. 'బావా! మనమూ ఆడదాం పద' అంటూ ప్రతివింధ్యాది ఉప పాండవులు వేరే ఆడుకోసాగారు. కృష్ణుడి పిల్లలూ యౌధేయుడూ , సుహోత్రుడూ మొదలైన పాండవుల పిల్లలు ఒకచోట చేరారు. వాళ్లామధ్య అంతఃపురంలో చూసిన నాటకాన్ని గురించి చర్చించుకుంటున్నారు. మరీ పసిపిల్లలు తప్ప ఎవరూ నిద్రపోలేదా రాత్రి.

బలరాముడు ముద్దుగా విసుక్కున్నాడు. 'అబ్బ- ఈ ఆడవాళ్లు కలిస్తే ఒంటి మీద తెలివివుండదు గదా- మా ఆవిడెక్కడుందో' అని.

అదేనా వెతుకులాట కూడా ఇంతకీ ఏం కావాలి గురువుగారూ!' అన్నాడు దుర్యోధనుడు.

'కాస్త గొంతు తడిపి వెళ్లొచ్చు కదా- అసలే ఇందాకట్నించీ అందరితో మాట్లాడి అలిసిపోయినాను' అన్నాడు బలరాముడు.

'అన్నయ్యా! ధర్మరాజు బావ ఏమన్నా అనుకుంటాడు! నువ్వా అలవాటు మానుకోవా ఇంక?' మెల్లిగా అన్నను మందలించాడు కృష్ణుడు.

అంతలో వకుళాది సఖులు పానీయాలు నింపిన పాత్రలతో అక్కడికి వచ్చారు.

'బలరాములే కాదు. అందర్నీ మధుపాత్రలు తీసుకోమన్నారు ద్రౌపదీ దేవిగారు. యజ్ఞం మొదలయ్యాక ఇవ్వరట' అంటూ అందించారు.

'ఇదుగో అమ్మాయ్! మా బావకి ఇంకో పాత్ర కూడా కావాలిట ఇవ్వు' అని దుర్యోధనుడూ కృష్ణుడూ పరస్పరం హాస్యాలాడుకున్నారు. సహదేవుడూ, ధృష్టద్యుమ్నుడూ, సాత్యకీ, అంతా ఎకసక్కాలే.

వేదవ్యాసాది ఋషులు ధర్మశాస్త్రార్థం చేశారు. ఉపనిషత్తుల గురించీ న్యాయ వేదాంత తర్కాది శాస్త్రాలను గురించి ఆచార భేదాలని గురించీ మాట్లాడుకున్నారు.

నందుడూ వసుదేవుడూ, విదురుడూ, విరాటరాజూ ద్రుపదరాజూ కేకయాధిపతీ వీళ్లంతా ఒకచోట చేరారు.

బాహ్లికాది కురువృద్ధులు మాత్రం తొందరగా నిద్రపోయినారు. భీష్ములవారు మాత్రం రేపటి యజ్ఞానికి కావలసిన సంభారాలని సరిచూసుకుని అందర్నీ చూసి ఆనందంగా శయ్యపై మేనువాల్చాడు. ఈ భరత వంశం ఇలా రూపుదిద్దుకోవటం ఎంతో ఆనందం కలిగించిందా మహాత్ముడికి- తన తల్లిదండ్రులు గంగా శంతనుడూ ఆయన మదిలో మెదిలారు. కానీ ఆయన మదిలో భవిష్యత్తులో ఈ రాజకులం ఇలాగే స్నేహంగా వుంటుందో ఉండదో అని శంక మటుకు తొలిచేస్తూ వుంటుంది.

నగరమంతా ముగ్గులతో పూలమాలలతో ఘుమఘుమలతో మంగళవాద్యాలతో నిద్రలేచింది.

'అంతా వెళ్లేసరికే ద్రౌపదీ, ధర్మజుడూ పీటలమీద కూచున్నారు. ద్రౌపది పసిమి రంగుతో మిలమిలమెరిసే పట్టుచీర కట్టుకుంది. ఆకుపచ్చని అంగదట్టం నడుముకి చుట్టుకుంది. ఎర్రని మేలి ముసుగు వేసుకుంది. కిరీటం ధరించింది మహారాణీ చిహ్నంగా, నడుముకి వడ్డాణం చేతులకి నవరత్నాల వంకీలు మొదలుకొని సర్వాభరణాలనీ నీలోత్పలాంగి, పాంచాల రాజపుత్రి ధరించింది. తల్లో పూలు, మెడకి గంధం, కణతల దగ్గిర మకరికాపత్రాలు, పసుపురాసుకున్న చక్కని పాదాలు, అయిదుగురన్నలకి అనుగు చెల్లెలు, అయిదుగురు పాండవులకి పట్టమహిషి, అయిదుగురు పిల్లలకి తల్లియై శ్రీమూర్తియైన యాజ్ఞసేని మెరిసిపోతోంది. ధర్మరాజుతోపాటు ఆమె పీటలమీద కూచుంటే ఆమె పత్నీత్వం కన్నుల పండువుగావుంది.

దుర్యోధనాదులకే ఎంత అదిమి పట్టినా అసూయ దాగటంలేదు. భానుమతి మటుకు ఎర్రని చీర తెల్లని అంగదట్టమూ నీలిమేలి ముసుగూ వేసుకుని హడావుడిగా సంతోషంగా తిరుగుతోంది. రుక్మిణీదేవి నీలం రంగు పట్టువస్త్రం అంతరీయంగా కట్టుకుంది. ఆ వస్త్రానికి ముత్యాలు వేలాడుతున్నాయి. ఆకాశంలాగా- పసుప్పచ్చ ఉత్తరీయమూ తెల్లని మేలి ముసుగూ వేసుకుంది. తెల్లని అంగదట్టం బిగించింది. సత్యభామ ఆకుపచ్చని పల్చని వెలగల చీర ధరించింది. కుచ్చులు కుచ్చులుగా చిత్రంగా- ఎర్రని ఉత్తరీయం, గోధుమ రంగు అంగదట్టం ధరించింది. నల్లని నీలి ముసుగు వేసుకుంది. సుభద్ర కమల పుష్పాల రంగుగల మెత్తటి పట్టువస్త్రాలనే అంతరీయం ఉత్తరీయం అంగదట్ట, మేలిముసుగులు ధరించింది ఆమె నడుస్తుంటే కమల పుష్పం కదిలి వస్తున్నట్లుంది.

విడిదినిండా ఆభరణాల కుప్పలు వస్త్రాల గుట్టలు- ఇది బావుందని అది బావుందని కాదు ఇంకోటి బావుంటుందేమోనని స్త్రీలు మార్చి మార్చి పడేశారు. పరిచారికల దుంప తెగుతోంది అవన్నీ తీసి సర్దలేక.

లక్షమంది భోజనం చేస్తే ఒకసారి శంఖం మోగే ఏర్పాటు చేశారు. ఆ గంట ఆగకుండా మోగుతూనే వుంది. అంటే ఎన్ని లక్షల మంది భోజనాలు చేస్తున్నారో

లెక్కలేదు. ధనంజయుడు ఎంత ధనం సంపాదించుకొచ్చాడో రాజసూయానికి.

భోజనాలు కాంగానే బంధువులంతా ఎక్కడివాళ్లక్కడ నిద్రపోయినారు. వాచిపోయినట్టు అందరూ కలిసిన ఆనందంతో రాత్రంతా నిద్రే లేకపోయె. ఒకటే మాటలు- కానీ ద్రౌపదికి పనే సరిపోతున్నది. ఎవరికేం కావాలన్నా ఆమే యివ్వాలి. అందరు అధికారుల్నీ ఆమే విచారించాలి. ఆదేశాలివ్వాలి. ఇస్తినమ్మ వాయనం పుచ్చికుంటినమ్మ వాయనం. రాజులంతా కప్పాలు, కానుకలూ తీసుకొచ్చారు. మళ్లీ వాళ్లు వెళ్లేటప్పుడు మర్యాదలు చేసి ఘనమైన కానుకలిచ్చి పంపాలిగదా- పనంతా అయి అర్ధరాత్రి కాస్త భోజనం చేస్తోంది ద్రౌపది.

అగ్రాసన పూజ సమయం వచ్చింది.

'ఇందరు అతిరథ మహారథుల్లో రాజాధిరాజుల్లో అగ్రాసనానికి అర్హులెవరు తాతయ్యా!' భీష్మడినడిగాడు ధర్మరాజు.

'జనార్దనుడుండగా అదేం ప్రశ్న యుధిష్ఠిరా!' అన్నాడు భీష్ముడు- సహదేవుడు నీళ్లు పొయ్యగా ధర్మజుడు కాళ్లు కడిగి అర్ఘ్యమిచ్చాడు కృష్ణుడికి.

'అదేమిటి? జనార్ధనుడు అంత గొప్పవాడా?' అన్నాడు కోపంగా శిశుపాలుడు.

'కాదా మరి' ఆశ్చర్యపోయినాడు ధర్మరాజు.

ఆదిజుడైనబ్రహ్మ ఉదయంబున కాస్పదమైనవాఢు,వేదాది సమస్తవాఙ్మయములందు ప్రశంసితుడైన వాడు లోకాది త్రిలోక పూజ్యుడని ఆత్మ నెరింగి పితామహుండు దామోదరు జెప్పె పూజ్యుడని యుక్తమకాక ఇది ఏమి దోసమే?' అని అడిగాడు.

శిశుపాలుడు చెలరేగి పోయినాడు.

కృష్ణుణ్ణి అనరాని మాటలు అన్నాడు. భీష్ముణ్ణి కూడా నోటికొచ్చినట్లు తిట్టాడు. "వృద్ధుల బుద్ధులు సంచలించవే- నీకు పిల్లాపాపా లేరు. ఒక యాదవుణ్ణి పొగుడుతున్నావు. ఈతడు వృద్ధుడని పూజించావా అంటే వసుదేవుడి కంటే వృద్ధుడా? రాజని

పూజించావా? అంటే యాదవుల్ రాజులే అవని మీద? అని కృష్ణుణ్ణి ధర్మరాజుని కలిపి మళ్లీ తిట్టాడు.

'కృష్ణుడు జగదేక పూజ్యుడని ఎరుగుట వల్ల మా యజ్ఞంలో ఆయన్ని అగ్రాసన పూజితుణ్ణి చేశాము. ఎవరికి నచ్చలేదో వాళ్ల తలకాయ తొక్కుతాను. జాగ్రత్త' అని సహదేవుడు చరణం ఎత్తాడు. ఆకాశంలో నించీ సహదేవుడి మీద పూలవాన కురిసింది.

ఎందుకొచ్చిన గొడవ- అని భయపడి ధర్మజుడు శిశుపాలుడిని బతిమాలసాగాడు. ధర్మజుడిని భీష్ముడు మందలించాడు.

'దుర్నీతిపరుడు శిశుపాలుడు బాలుడితో సమానం వివేకంలో. అతనికి ధర్మం ఏం తెలుసు? ఈర్ష్య తప్ప? అతడు రాగకోపపరిభూత మనస్కుడు. అల్పరాజ్యలక్ష్మీ లలనాంధబుద్ధి. అనిమిత్తమహత్పరివాద శీలి' అన్నాడు భీష్ముడు.

మరింత కోపం వచ్చింది శుశుపాలుడికిప్పుడు. ఈ మాట మాట్లాడచ్చు. ఈ మాట మాట్లాడరాదు ఇది మహాసభ అన్న జ్ఞానం నశించింది శిశుపాలుడికి- అప్పుడతనన్న మాటలకి భీమసేనుడు ఆగలేకపోయినాడు. ఆ ప్రభంజన ప్రియ తనూజుడు భ్రుకుటి ముడివేసి పళ్లు పటపట కొరికి శిశుపాలుణ్ణి చంపబోయినాడు. భీష్ముడు అతన్ని వారించి శిశుపాలుడిని ఎవ్వరూ చంపలేరు. ఒక్క శ్రీకృష్ణదేవుడే అందుకు సమర్థుడు అన్నాడు.

. సాత్వతి కృష్ణుడికి మేనత్త- ఆమెకి శిశుపాలుడు నాలుగు భుజాలతో నుదుట కన్నుతో పుట్టిగాడిదలాగా ఏడవసాగాడు. అప్పుడు ఒక అశరీర భూతం ఇట్లా చెప్పింది. 'ఎవరు ఎత్తుకుంటే ఈ పిల్లవాడు సహజంగా అవుతాడో అతని చేతిలోనే ఇతడు మరణిస్తాడు' అని.

పాపం సాత్వతి- వచ్చిన అందరికీ తన కొడుకుని ఎత్తుకోమని ఇచ్చేది.

అత్తయ్యనీ ఆ పిల్లవాడినీ చూడాలని రామకృష్ణులు వచ్చారు. కృష్ణుడు ఆ పిల్లవాణ్ణి ఎత్తుకోగానే మిక్కిలి చేతులు మిక్కిలి కన్నులూ మాయమైపోయాయి.

అంటే కృష్ణమూర్తి చేతిలో తన కొడుకు మరణిస్తాడని తెలిసి సాత్వతి గుండె గుభిల్లుమంది. అయినా చేసేదేముంది. విధి నిర్ణయం. 'నాయనా కృష్ణా! నీ మేనమరిది నా బిడ్డ దుర్మార్గ ప్రవర్తనతో నిన్ను విసిగించవచ్చు. కరుణా నిపుణుడవై నీ మరిది చేసే వంద అపరాధాల్ని మన్నించవయ్యా' అని ప్రార్థించింది సాత్వతి.

లేకపోతే ఇంత అసహ్యంగా ఈ శిశుపాలుడు వాగుతుంటే నేనెందు కూరుకుంటాను? మదీయ మార్గణ నికాయ సముద్రంలో ముంచేసి వీణ్ణి చంపేసే వాడిని కదా కానీ ఇదీ సంగతి' అని భీముడికి వివరంగా చెప్పాడు భీష్ముడు.

కృష్ణుడు అమాయకంగా స్నేహంగా చూస్తున్నాడే తప్ప శిశుపాలుడు తననిట్లా తిడుతుంటే ఏం అనలేదు ఇందాకట్నించీ. అప్పుడు భీష్ముడితో తనతో యుద్ధానికి సిద్ధమై కారుకూతలు కూస్తున్న శివుపాలుణ్ణి చూసి చక్రధరుండు, జగన్నాధుండు, కేశవుండు నోరు విప్పాడు. అఖిల రాజులూ వినేటట్టు ఇట్లా అన్నాడు.

'ఈ శిశుపాలుడు ఇన్ని ధర్మ పన్నాలు చెప్తున్నాడు కదా- ఎన్ని ఘోరాలు చేశాడో ఎందు స్త్రీ బాలవృద్ధుల్ని పొట్టన బెట్టుకున్నాడో, మా ద్వారకాపురిని నేను లేకుండా చూసి ఎట్లా కాల్చాడో వివరాలు అనవసరం. మాతండ్రిగారు వసుదేవుడు అశ్వమేధయాగం చేస్తూంటే ఆ యాగాశ్వమును అపహరించి యజ్ఞానికి అడ్డం వచ్చాడు. వీడి పాపాల్లో కెల్లా మహాపాపం చెప్తున్నాను సదస్యులారా వినండి. బభ్రుడి భార్యని తీసుకొచ్చి తన భార్యగా చేసుకున్నాడు. ఈ పరదారాపహరణం భారత వర్షంలోనే కాదు సకల ప్రపంచంలోనూ నింద్యమే. పైగా వాగ్విషయములైన అపకారాలు అనేకం చేశాడు. మా అత్త సాత్వతి సాక్షి. ఇప్పుడు మీరందరూ వింటూండగా నాయందు అకారణంగా నిందలు మోపాడు. ఇప్పటికితని వంద తప్పులూ పూర్తయినాయి' అంటూ దనుజాంతకమైన సుదర్శన చక్రాన్ని ప్రయోగించాడు. శిశుపాలుడు పర్వతంలా నేలకూలాడు. జయజయ నినాదాలతో భూమి దద్దరిల్లింది. శిశుపాలుడి శవసంస్కారం చేసి కొడుకుకి రాజ్యాభిషేకం చేయించాడు కృష్ణుడు. ఇట్లు ప్రభూత భక్ష్యాన్న ధనదానసనాధంబయి జగన్నాధ రక్షితమై రాజసూయ మహాధ్వరం సమాప్తమైంది.

పై అంతస్థులోనించీ స్త్రీలు ఇదంతా చూశారు. అద్భుతం రసంతో- ద్రౌపది జగన్నాధ వాసుదేవ కరుణామయా శ్రీకృష్ణస్మరణం శరణం మమ అనుకుంది. సర్వస్య శరణాగతి చేసి -

కృష్ణుడు తన వాళ్లందరితో కలిసి ద్వారకకి ప్రయాణమైనాడు. 'కృష్ణా! నీవల్ల నా యజ్ఞం సంపూర్ణంగా నెరవేరింది. ద్వారకలోవున్నా నువ్వు కరుణతో మమ్మల్ని కాపాడుతుండాలి లోకాధార! దూరంగా వున్నా నువ్వు మాకు దగ్గిరే వున్నట్లు రక్షించు' అన్నాడు ధర్మరాజు.

కృష్ణుడు వెళ్తుంటే నడిచి కొంత దూరం వెళ్లి ఆయన్ని వదలలేక వదలక తప్పక- ఆ రథం వెళ్తున్న వేపే చూస్తూ పూర్తిగా కనుమరుగు అయిన తర్వాత దీనమతితో వెనక్కి తిరగారు పాండుసుతులు.

దుర్యోధనుడూ శకునీ మాత్రం కొన్నాళ్లుండి పాండవుల మర్యాద అందుకుని ఆయా సభలన్నీ పరిశీలించారు. మయసభ ప్రవేశించి దుర్యోధనుడు నానా అవస్థాపడ్డాడు. నీళ్లున్నచోట లేనట్టూ లేని చోట ఉన్నట్లూ తలుపున్న చోట లేనట్లూ అంతా అయోమయమైంది మయసభ దుర్యోధనుడికి.

చివరికి ఒక చోట జలాశయాన్ని చూసి స్థలం అనుకుని అడుగు వేసి నీళ్ళల్లో పడ్డాడు దుర్యోధనుడు.

మందారికా వకుళా చూసి పరుగున వెళ్లి ద్రౌపదితో చెప్పారు. 'అయ్యో- మంచి వస్త్రాలు తీసుకురండి' అని గబగబా వచ్చిందామె- ఏమైందేమైందని పాండవులు కూడా వచ్చారు. తడిసిన బట్టలతో వేరే గది అనుకుని తలుపులాగా చిత్రించిన గోడ లోపలికి వెళ్లబోయినాడు దుర్యోధనుడు గోడకు గుద్దుకున్నాడు.

ద్రౌపది వాత్సల్యంతో చిన్నగా మందహాసం చేసి 'అయ్యో! దుర్యోధన యువరాజా! ఎంత పని జరిగింది. దెబ్బలేంతగల్లేదు కదా- అయినా మరిదిగారు మా చెల్లెలు భానుమతీ ధ్యానం చేస్తూ చూసుకోకుండా నడిచి వుంటారు. అంతే

కదండీ ఇప్పుడే పంపిస్తానుండండి భానుమతిని మీరు పొడి బట్టలు కట్టుకోండి' అని నిర్మలంగా స్నేహ పిచ్ఛలంగా అన్నది. దెబ్బలేం తగల లేదు కదా' అని అడిగింది.

పాండవులు కూడా వచ్చి 'దుర్యోధనా! పరిచారకుల్ని పిలవచ్చు కదా- ఈ మయసభలో నడవటం కష్టం- కొత్తవాళ్లకైతే మరీనూ' అన్నారు. భీముడి మొహాన కాస్త చిరునవ్వు ఉదయించింది. 'వీరాధివీరా, ఇటు ఇటు నడిస్తే వేరే గది వస్తుంది' అన్నాడు.

అంతలో కొత్త బట్టలు తేనేతెచ్చారు మందారికా, మాలతీ, వకుళా, పరిమళ ద్రవ్యాలు కూడా తెచ్చారు దుర్యోధన అలంకరణార్థం.

ధర్మరాజు ప్రేమగా దుర్యోధనుడి కవన్నీ ఇచ్చి 'పోయి ధరించిరా' అన్నాడు చిరునవ్వుతో.

ఆ చిరునవ్వు దుర్యోధనుడు నీళ్లలో పడిన విషయం మరిచిపోవటానికి తామంతా అదేం చూడనట్టూ ఏమాత్రం లక్ష్య పెట్టనట్టు- దుర్యోధనుడు కూడా తేలిగ్గా ఈతీసుకోవాలనీ అలా ప్రవర్తించారు.

కానీ అభిమానధనుడైన దుర్యోధనుడికిదంతా తనని హేళన చెయ్యటానికే అనిపించింది. పిల్లవాడు పడితే తల్లి ఎట్లా ధైర్యం చెప్పటానికి చిరునవ్వు నవ్వుతుందో అతనికి తెలీదు. గాంధారికి కనక కళ్లుంటే తెలిసేది- పిల్లల మనస్తత్వాలు రూపొందడానికి తల్లిదండ్రులే కారణం. ముఖ్యంగా తల్లి పెంపకం, ఆమె దిద్దుబాటు కారణం.

తల్లిలాలన క్రమశిక్షణ ఎరగని దురదృష్టవంతుడైన కౌరవాగ్రజుడైన దుర్యోధనుడికి ఇదంతా తనని అవమానించటానికి పాండవులు పన్నిన కుట్ర అనిపించింది. వాళ్లు ఆప్యాయంగా పొడిబట్టలు ఇచ్చి కట్టుకుని రమ్మంటే తనని అవహేళన చెయ్యటానికే అలా చేశారనుకున్నాడు తప్ప మానవసామాన్యదృష్టితో ఆలోచించలేదు. తను చిన్నప్పుడు భీముణ్ణి ఎన్ని బాధలు పెట్టాడు. పదేసి మంది బాల భీముడిమీద పడటం

కొట్టటం, విషం పెట్టించటం, చివరికి ఏం చేతకాక నీళ్లల్లోకి తోయించటం గుర్తొచ్చింది. మనుషులంతా అలాగే స్వార్థంగా వుంటారని మాత్రమే తెలుసు. అహంకార మదోన్మత్తత చివరికి అథః పాతాళానికి నెట్టేస్తుందని తెలియదు.

తండ్రీ, మాద్రీ ఇద్దరూ చనిపోయిన తర్వాత శతశృంగం నించీ కుంతీదేవి పంచపాండవుల్ని తీసుకుని హస్తినాపురానికి వచ్చేసింది. అప్పటికి ధర్మరాజుకి పదమూడేళ్లు కవలలకి అయిదేళ్లు.

అప్పటిదాకా రారాజుగా పెరుగుతున్న అహంకారి పిల్లవాడు దుర్యోధనుడు. పాండవులు తనకి పోటీగా వచ్చారని అందరూ చెప్తే నిజమే అనుకున్నాడు. స్నేహం పాటించకపోగా వైరంపూని పాండవుల్ని చంపెయ్యాలనుకున్నాడు. భీముడే పాండవులకి బలం. ముందు వాణ్ణి చంపితే పాండవులు నలుగుర్నీ ఇట్టే చంపొచ్చునని ఆశపడ్డాడు. కానీ భీముణ్ణి బాధ పెట్టిన కొద్దీ అతనికి శక్తి ఎక్కువ కాసాగింది నదిలో పడేస్తే నాగాయుత బల సంపన్నుడై వచ్చాడు బయటికి-

ఆ కోపమంతా మనసులో పెట్టుకుని ఇప్పుడిలా వాళ్ల రాజ్యంలో పగదీర్చు కుంటున్నారనే దుర్యోధనుడి భావన. ద్రౌపదిపై మరీ కోపం. ముఖ్యంగా ఆమె స్వయంవరానికి వెళ్లి కర్ణుడూ తనూ కూడా భంగపడి ఓడిపోయి వచ్చారు. ఇప్పటికీ లోభకారకమే ఆమె సౌందర్యం- ఆమె అందుకు నవ్విందంటాడు. శకునీ కర్ణుడూ, దుశ్శాసనుడూ ఎంతో చెప్పి చూశారు వినడే- సరే మాయాజూదంలో పాండవుల్ని ఓడించి నీకిస్తాను. నువ్వేమన్నా చేసుకో అన్నాడు గాంధారి సోదరుడు శకుని దుర్యోధనుడికి దుష్టుడైన ఒక ఆప్తుడు కర్ణుడిక్కూడా పాండవులంటే ముఖ్యంగా అర్జునుడంటే స్పర్థ - కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం రోజునించీనే పడదు. దుశ్శాసనుడు అన్నకు సదా ఆజ్ఞానవర్తి. వీళ్లు దుష్ట చతుష్టయం.

పాండవుల్ని మాయాజూదానికి ఆహ్వానించాడు దుర్యోధనుడు హస్తినకి యుధిష్ఠిరుడికి జూదం అంత బాగా రాదు కానీ చాలా ఇష్టం వుంది. శకునితో ఆడలేక ఓడిపోయాడు. యాజ్ఞసేని అంటే వాళ్లకెంతమంటో చెప్పటానికి ఇదీ ఉదాహరణ.

ఉమ్మడి భార్యని పందెంలో ఒడ్డమన్నారు గాని వాళ్ళు దేవికనో హిడింబనో, సుభద్రనో కరేణుమతీ విజయల్నో జలంధరనో ఒడ్డమని అడగలేదు. వాళ్లంటే కులకాంతలు- ద్రౌపది అయిదుగుర్ని చేసుకుంది కనక ఇంకెంత మందినైనా చేసుకుంటుంది. పైగా ఆమె అసాధారణ సౌందర్యం, నేర్పు, ఓర్పు జగద్విదితం. స్వయంవరంలో మత్స్యయంత్రం కొట్టలేక తాము ఓడిపోవడం భరించలేక.... ఇలా ఎన్నో కారణాలు ఎంతో కసి మనస్సులో పెట్టుకుని ద్రౌపదిని ఒడ్డమని అడిగారు దుష్టచతుష్టయం వాళ్లు. ధర్మరాజు అని కీర్తించే యుధిష్ఠిరుడు వశీకృత చిత్తుడై ఉచితానుచితాలు ఆలోచించక విచక్షణలేక ద్రౌపదిని ఒడ్డాడు. మళ్లీ ఓడిపోయాడు.

'నన్ను చూసి మయసభలో నవ్వింది మీ ద్రౌపది. ఇప్పుడు చూడు ధర్మజా మీ భార్యగతి' అని వికటాట్టహాసం చేశాడు దుర్యోధనుడు, విదురుడిని అంతఃపురానికి వెళ్లి ద్రౌపదిని సభకి తీసుకురమ్మన్నాడు.

విదురుడు బాగా తిట్టాడు. అయోనిజ మహాసాధ్వి ద్రౌపదిని అవమానిస్తే సర్వనాశనం జరుగుతుందన్నాడు.

'ఊ... నువ్వెప్పుడూ పాండవపక్షపాతివేలే. నిన్ను పంపడం నాదే తప్పు' అని ప్రాతికామిని పిలిచి పాంచాల రాజపుత్రికని తీసుకురమ్మన్నాడు. ధృతరాష్ట్రుడు అదంతా ఏం తెలీనట్టే ఊరుకున్నాడు.

ప్రాతికామి వినయంగా వెళ్లి చెప్పాడు ద్రౌపదికి 'అమ్మా! మిమ్మల్ని సభకి రమ్మంటున్నారు మీ భర్తలు మీరు కౌరవులకి దాసులట' అని జూదం సంగతి చెప్పాడు.

'అలాగా- ధర్మరాజు నన్నోడి తన్నోడాడా? తనను ఓడి నన్ను ఓడిపోయాడా' చెప్పమని అడిగింది ద్రౌపది. ఒక దాసుడికి భార్యనోడే అధికారం లేదే. అయినా అయిదుగురు భర్తలకి భార్యని నన్ను తనొక్కడూ ఎట్లా ఒడ్డాడు? తమ్ముళ్లనీ ఒడ్డాడా? తమ్ముళ్ళూ, భార్యా, వస్తువులు కారే ఒడ్డడానికి- ఏ అధికారంతో మమ్మల్ని ఒడ్డాడు.

ధర్మరాజు- నీకు తెలుసా ప్రాతికామీ! తెలీకపోతే ఆ జూదగాణ్ణి అడిగిరా' అన్నది ద్రౌపది. ఏ యుగంలోనైనా ఎంత చెడ్డ జూదగాడైనా భార్యను పందెంగా ఒడ్డిన భర్త వున్నాడా? లేడు. ఉండడు. ధర్మరాజు చంద్రవంశం వాడు. ఇలా చేస్తాడా? సరే అడిగిరా' అంది కృష్ణ.

ప్రాతికామి తిరిగి వచ్చి సభలో ఈ ప్రశ్న అడిగాడు. ధర్మరాజు సమాధానం ఈయలేదు.

'నువ్వెళ్లి పాంచాలేంద్రసుతని తీసుకురా ప్రాతికామీ! ఈ సందేహాలెందుకు?' అన్నాడు దుర్యోధనుడు.

ప్రాతికామి అంతఃపురానికి వెళ్లి 'దేవీ! నీవడిగిన ప్రశ్నకి సభలో సమాధానం చెప్తారుట. నిన్ను రమ్మన్నారు' అన్నాడు.

కంఠగత దుఃఖంతో ద్రౌపది సభలోకి వచ్చింది. ఏకవస్త్రం ధరించి వున్నదామె. కన్నీళ్లు ధారలై కురుస్తున్నాయి పైన కప్పుకున్న వస్త్రం ఆ కన్నీటితో తడిసిపోతున్నది. పాండవ లక్ష్మిలాంటి పాంచాలిని ఆ స్థితిలో చూచి తడిసిపోతున్నది. పాండవలక్ష్మి లాంటి పాంచాలిని ఆ స్థితిలో చూచి పాండవులు తలలు వంచుకున్నారు. అది చూసి దుర్యోధనుడికి చాలా సంతోషమైంది. ద్రౌపది కురువృద్ధుల దగ్గిరకెళ్లి నిలబడింది.

దుర్యోధనుడు దుశ్శాసనుణ్ణి పిలిచాడు. ప్రాతికామికి వృకోదరుడైన భీముడంట్లు భయంగా నినువ్వెళ్లి ద్రౌపదినిక్కడికి తీసుకుని రమ్మన్నాడు.

కృష్ణాదేవి అతిభయంతో ధృతరాష్ట్రుడూ గాంధారీ కూచున్న దగ్గిరికి వెళ్లింది పరిగెత్తుకుని. గాంధారి కూడా నిమ్మకి నీరెత్తినట్టుకూచుంది. మాటా పలుకు లేకుండా. శత్రువై మిత్రువైనా సాటి స్త్రీ గౌరవాన్ని కాపాడవలసి వుండగా గాంధారి అలా నిర్భీతిగా వుందంటే ఆమె నిజంగా దుర్యోధనుడి కన్నతల్లి.

దుశ్శాసనుడు ఆమె దగ్గిరికి వచ్చాడు. నేను రజస్వలను ముట్టకుండుము. ఏకవస్త్రంతో వున్నాను. ఆ మహాసభ ఎదటికి రాలేదు అని బతిమిలాడింది ద్రౌపది.

మనుషుల్లోవున్న పరమ దుర్మార్గం ముద్దకట్టినట్లు దుశ్శాసనుడు 'నీవు ఏకవస్త్రవైతేనేమి విగత వస్త్రవైతేనేమి? నిన్ను సభలోపలికి లాక్కుపోవలసిందే' అని బలాత్కారంబున రాజసూయ పవిత్ర అవబృధ స్నానం చేసిన కృష్ణా మహారాణి జుట్టుపట్టి ఈడ్చుకొచ్చాడు సభలోకి-

ఊడిపోయి చిందరవందరైన కేశాలతో మొహం వెలవెలబోతుంటే ఆ మహాసభలో కోపలజ్జాపరవశ అయి- 'ఈ దుశ్శాసనుడు నన్నెందుకీడ్చుకొచ్చాడు? ఇందరు కురుముఖ్యులు, యోధానుయోధులు ఇక్కడున్నారే- ఈ భరత వంశము ఇవాళ అధర్మమై నింద్యమైంది' అన్నది యాజ్ఞసేని వీళ్లింతటితో వదిలేలాగా కనిపించలేదామెకి. 'కృష్ణా! జగద్రక్షకా! అన్నా! నువ్వే దిక్కు. శ్రీకృష్ణశ్మరణం మమ' అని మనసారా తలుచుకుంది కృష్ణుడిని. కాపాడవలసిన భర్తలు అదీ అయిదుగురు మహాబాహు బలసంపన్నులు రణ విద్యాపండితులూ ధర్మాత్ములూ తలలు వాంచివున్నారు. తనని వస్తువులాగా పందెంలో ఒడ్డింది చాలక- తన తండ్రి ద్రుపద మహారాజా, అయిదుగురు అన్నలూ పాంచాల దేశం వెళ్లారు. మొన్న మొన్ననే రాజసూయం అయిన తర్వాత తన అయిదుగురు పిల్లలూ పసివాళ్లు పుట్టింటివాళ్ల దూరంగా ఉన్నప్పుడు కట్టుకున్న వాళ్లు కసాయిలైనప్పుడు ఆడదానికి ఎవరు దిక్కు. జగన్నాధుడు దిక్కు. సర్వేశ్వరుడు ధర్మ ప్రవర్తకుడు రక్ష.

ఇట్లా భుజవీర్యసనాధలైన నాధులు గలిగియు అనాధయుంబోలె పాంచాల రాజపుత్రి భయార్త అయి ఆర్తజనశరణ్యుండైన జగన్నాధుని జనార్దనుని తలుచుకుంటూ కపట ద్యూత మధుమదోన్మత్తుండైన ధర్మపుత్రు నిమిత్తంబున కలిగిన ఈ పరిస్థితికి కళ్లతో నిప్పులు కక్కుతున్న పాంచాల పుత్రికని చూచి భరించలేక భీముడు ధర్మరాజుని నిందించాడు. 'ఏం పని చేశావన్నయ్యా? నీ చేతులు కాల్చినా పాపం లేదు' అన్నాడు అర్జునుడు భీముడిని శాంతింపజేశాడు.

వికర్ణుడు అందరి కంటె చిన్నవాడు బుద్ధిమంతుడు అతనికి కోపం వచ్చింది

బాధ కలిగింది.

'అందరూ వినండి. జూదం, వేట, తాగుడు, తిండిపిచ్చి అనేవి నాలుగు దుర్వ్యసనాలు. వాటికి చిక్కిన పురుషుడు చెప్పేది ఎవరూ ఆచరించనక్కరలేదు. జూదగాడై వ్యసనవర్తిఅయిపరాజితుండయిన ధర్మరాజు పాండవులకందరికీ సాధారణ ధనంబయిన పాంచాలిని పణంగా ఒడ్డాడు. కనక ద్రౌపది అధర్మవిజిత- ఆమె దాసికానేరదు. ఆ కోమలి ఏకవస్త్ర. ఆమె నిక్కడికి లాక్కురావడం భావ్యం కాదు' అని చక్కగా చెప్పాడు.

కర్ణుడు కల్పించుకుని ఇట్లా అన్నాడప్పుడు.

'ద్రౌపది అధర్మవిజిత అన్నావు కదా వికర్ణా! ధర్మరాజు తన సర్వస్వాన్నీ ఒడ్డి ఓడిపోయినాడు గదా- అందులోకి ఈ ద్రౌపది వస్తుంది సరే- ఏకవస్త్రని సభకి తీసుకుని రావటం ధర్మం కాదన్నావు. ఏ భార్యకైనా భర్త ఒక్కడే. దీనికి చాలా మంది భర్తలు గనుక దీన్ని బంధకి అనచ్చు. ఇట్లాంటి ఆడదాన్ని బట్టలు విప్పి తెచ్చినా తప్పులేదు.'

కర్ణుడి మాటలు ఎంతో నచ్చినై దుర్యోధనుడికి.

'అలాగే చేద్దాం కర్ణా! బాగా చెప్పావు' అన్నాడు.

ద్రౌపదికి తల బద్దలు కొట్టుకోవాలన్పించింది. తను అర్జునుడొక్కడికే భార్యగా తన తండ్రి యజ్ఞకుండం నించీ పరిగ్రహించాడు. తనుకూడా అర్జునుడిని ఒక్కణ్ణే మనసా భర్తగా తలచింది. అర్జునుడొక్కడే మత్స్యయంత్రాన్ని భేదించాడు. అర్జునుడొక్కడికే తను స్వయంవరమాల వేసింది. త్రికరణ శుద్ధిగా అతన్నే భర్తగా భావించింది. ఋషులంతా చేరి ఏవేవో కథలూ కారణాలూ వరాలూ చెప్పి అయిదుగురు భర్తలకి భార్యని చేశారు. ఎలాగో అర్థం కాక ఏం చెయ్యాలో తెలీక సతమతమై పోతుంటే జగన్నాధుడైన కృష్ణుడు రాత్రివేళ తనకి భర్తలంతా అర్జునుడి రూపంలోనే కనిపిస్తారని వరమీయబట్టి సరిపోయింది గాని లేకపోతే... ఇప్పుడా మాట

చెప్పినా ఎవరూ నమ్మరు సరికదా నవ్వుతారు. అయితే ఎంత కష్టమైనా రానీ వ్యాసులవారిక్కూడా ఈ మాట తెలియకూడదని చెప్పాడు గోవిందుడు. అందుకని పైకి చెప్పడానికి వీలులేదు. తనేదో చాలా మంది భర్తల కోసం తపించిపోయినట్లు ఈ కౌరవులు శీల విరహితురాలనని విమర్శిస్తుంటారు. వీళ్లకసలేం తెలుసని తన సంగతి- అని అల్లాడిపోయింది పాంచాల రాజతనూజ. కృష్ణుడొక్కడికే తెలుసు. ఆయనే కరుణాంతరంగుడై వచ్చి రక్షించాలి. ఇందరు ఋషులు ఇందరు కురువృద్ధులు, ఇందరు ఆచార్యులు, ఇందరు బంధువులు ఎవరూ రక్షించలేరు- ఎవరికీ ఈ ద్రౌపది చేసే తపస్సు తెలీదు. అయిదుగురు భర్తలు అయిదుగురు భర్తలు అంటారు మాట మాట్లాడితే. తనకి రాజ కార్య నిర్వహణా ఆదాయ వ్యయాలూ ఇవే సరిపోతాయి. అంత ఏకాంతం దొరికి భర్తలతో తనెంతకాలం గడిపింది గనుక?

ఒక లక్షమంది భోజనం చేస్తే దానంతట అదే మోగే శంఖం రాజసూయంలో ఆగకుండా మోగింది - మరి అంత వ్యవహారం నిర్వహించిందీ తనే గదా. తనేం సుఖపడిందో పరాత్పరుడికే తెలుసు- ఈ కౌరవుల రాణులు ఏమాత్రం బాధ్యతలు పంచుకున్నారుట- దుర్యోధనుడి కంఠం గట్టిగా వినపడటంతో క్షణంలో జరిగిన తన ఆలోచనలిన్నిటినీ అదిమేసింది పాంచాలి.

'పాండవుల బట్టలూ ఈ బంధకి బట్టలూ ఊడదీయండి' అని ఆజ్ఞ యిచ్చాడు దుర్యోధనుడు.

పాండవులు తమ ఉత్తరీయాలు తీసి ఇవతల పెట్టారు భయంతో.

ఒళ్లు తెలియక మదాంధుడైన దుశ్శాసనుడు ద్రౌపదీదేవి కట్టిన వస్త్రాన్ని లాగెయ్యసాగాడు ఏమాత్రం ధర్మం విషయంలో భయపడకుండా- ద్రౌపది తన సర్వమానావమానాలూ జనార్దనుడైన కృష్ణ పరమాత్మ కప్పగించి శ్రీకృష్ణశ్శరణం మమ అనుకుంటోంది.

దుశ్శాసనుడు ఆవిడ కట్టిన బట్ట విప్పుతున్నకొద్దీ ఇంకా పెద్ద బట్ట ఒంటికి చుట్టుకుంటున్నది. విప్పిన బట్టలు మూటగా అయి చిన్నగుట్టగా అయి చివరికి

పర్వతమంత అయినాయి. ఒకే రంగుది ఇంత చీర ద్రౌపది కెక్కడిదో. ఇదేం మాయో తెలీక మతిపోయి దుశ్శాసనుడు ఇక ఆమె బట్టలు విప్పటం మానేశాడు సిగ్గుతో.

సభ్యులందరి మొహాలూ ఆనందంతో వికసించాయి. ధర్మం రక్షింపబడింది. కౌరవుల మొహాలు కర్ణ శకునుల మొహాలు మాడిపోయాయి. అప్పుడైనా ద్రౌపదిని ఏదో మహాశక్తి రక్షిస్తోంది అని తెలుసుకోలేకపోయారు కౌరవులు- పొయ్యే కాలం వచ్చినవాడు మంచినీ చెడునీ గుర్తించలేడు.

ద్రౌపదీ దేవిపై ఆకాశం నించీ పుష్ప వర్షం కురిసింది. 'సాధు మహా పతివ్రతా! తపస్వినీ! సాధు సాధు' అని ప్రశంసా వాక్యాలు వినబడినై. అంత వరకూ గుండెలు చిక్కబట్టుకుని కొందరు గజ గజ లాడుతూ కొందరూ పైనున్న కిటికీలనించీ చూస్తున్న ధృతరాష్ట్రుని కోడళ్లు అమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నారు. ఆ మహాపతివ్రత ద్రుపద రాజసుతకి చేతులు జోడించారు. భానుమతి చెక్కిళ్లపై కన్నీరు ధారలు కట్టి ఎదను తడిపేస్తున్నది. ఏం పాపం చేసిందని కృష్ణాదేవి అక్కకి ఇంత అవమానం జరుగుతోంది. తామెవ్వరూ ఇవాళ జరిగే ఏ విషయంలోనూ కల్పించుకోకూడదని పొద్దున్నే దుర్యోధనుడు హెచ్చరిక చేశాడు. రాణి రాణి అంటారుగాని ఏం సుఖం రాణికి? మెత్తని పరుపులూ పట్టుబట్టలూ కోరిన భక్ష్య భోజ్యాలూ నృత్య గానాదులూ తప్ప ఎప్పుడు శత్రువులేం చేస్తారో తెలీదు. భర్తలు బతికుంటారో లేదో నిజానికి బతికున్నా అసంఖ్యాకంగా అంతఃపురం అంతా నిండివున్న ఏ భార్య దగ్గిరి కెళతాడో తెలీదు. కాలక్షేపంగా సవతి కలహాలూ వ్రతాలూ లాంటివి చేస్తుండటం. సాటి స్త్రీకింత అవమానం జరుగుతుంటే చూస్తూ ఊరుకునే తమ రాణీత్వం ఏం సాధించటానికి? ఛ... అని బాధపడుతోంది భానుమతి. దుశ్శాసనుడి భార్య వచ్చి 'అక్కా' అంటూ భానుమతిని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. 'ఊరుకో చెల్లీ ఊరుకో. పూర్వజన్మలో మనం ఏం పాపం చేశామో అనుభవించాలి కదా' అంటూ తనూ మళ్లీ ఏడ్చింది భానుమతి. ధృతరాష్ట్రుడి వైశ్య భార్య పరుగున వచ్చి వాళ్లని ఓదార్చింది. మా అత్తగారు గాంధారీదేవి ఇంత మహావమానం తోటి స్త్రీకి జరుగుతున్నా

మాట్లాడరేమిటి? ఇవాల్టితో నా మనసు విరిగి పోయింది' అన్నది భానుమతీదేవి.

అంత నిర్దయగా దుర్మార్గంగా నా భర్త దుశ్శాసనుడు ఎట్లా ఆ మహా పతివ్రత వస్త్రాన్ని లాగెయ్య గలిగాడు. ఒకటి కాదు వందలాది వస్త్రాలు కొండలాగా పేరుకుపోతున్నా ఆగలేదు. చివరికి స్పృహ తప్పే స్థితిలో చెమటలు పట్టి ఆపాడుగాని ఛీ ఏం వీరులూ ఏం భర్తలూ- దుశ్శాసనుని రాణి అసహ్యించుకుంది.

'మన మామగారు అంధులవటం వల్ల చినమామగారు పాండురాజుగార్నే రాజుని చేయాలన్నారుట కానీ పాండురాజుగారు నాకు రాజరికం వద్దు మా అన్నగార్ని రాజుని చెయ్యాల్సిందేనన్నారుట. పైగా చిన్నాయన దిగ్విజయాలు చేసి రాజులందర్నీ గెలిచి ఆ రాజ్యాన్నీ అన్నగారికే కట్టపెట్టాడుట. అదంతా ఇన్నాళ్లూ మనం కూడా అనుభవించాం. ఇప్పుడా రాజ్యం పాండవులెక్కడ లాక్కుంటారోనని భయం. చెయ్యరాని పనులు చేస్తున్నారు ఛీ... ఛీ...' కౌరవుల భార్యలు ఏకగ్రీవంగా ఛీ కొట్టారు భర్తలని -

'ఇహ మనగతి అధోగతే- ఈ పాపం ఊరికేపోదు- ఏ పాపం చెయ్యపోయినా మనమూ మన పిల్లలూ అనుభవించక తప్పదు. ఇందులో ఏ జన్మలోనిదో మన పాపం కూడా వుండే వుంటుంది' అని ఏడ్చారు.

'కృష్ణా! దేవాదిదేవా!' అనుకుంటూ చేతులు జోడించుకుని అక్కడినించీ లోపలకి వెళ్ళిపోయింది ద్రౌపది.

భీముడు ద్రుపదరాజ నందనకు దుశ్శాసనుడు చేసిన అవమానానికి భీకరకోపంతో ఇలా ప్రతిజ్ఞచేశాడు. కోపంతో రక్తాంతనయనుండగుచు నంతకాకారంబున దంతసందుష్టదారుణముఖుండయి ఎల్లవారును విననిట్లనియెను.

కురువృద్ధులూ, గురువృద్ధ బాంధవులూ అందరూ చూస్తుండగా ద్రౌపదిని ఇట్లా అవమానించిన ఖలుణ్ణి ఈ దుశ్శాసనుడిని లోక భీకర లీలతో వధియించి తద్విపుల వక్షశ్శైలరక్తౌఘనిర్ఝరమును ధృతరాష్ట్రుడికి తెలిసేటట్లు ఉగ్రాకృతితో ఆస్వాదిస్తాను'.

సభంతా కలకలమైపోయింది. వృద్ధరాజులుపేక్షిస్తున్నారు అని విదురుడు కల్పించుకుని చేతులెత్తి అందర్నీ చూసి ఇట్లా అన్నాడు. 'ద్రౌపది ప్రశ్నకి సమాధానం చెప్పండి ముందు.'

ద్రౌపది వేరే చీర కట్టుకుని సభలోకి వచ్చింది. దుశ్శాసనాకృష్టమై స్పర్శదూషితమైన ఆ చీరతో ఉండబుద్ధి కాలేదు. దుర్యోధనునిని భయం వల్ల సభ్యులెవ్వరూ మాట్లాడలేదు.

ద్రౌపది సకలక్షత్రియ సమక్షంబున పరిభవింపబడినందువల్ల దుఃఖిస్తూ మళ్ళీ సభలోకి వచ్చింది.

పాండవుల ధర్మపత్నినై గోవిందుని చెల్లెలినై ప్రశస్తిపడసిన నన్ను ఈ సభామధ్యంలో ఇంత అవమానం చేశారు. నేనేం తప్పు చేశానని - ఏ స్త్రీ, ఏ మనిషీ కూడా సహించలేని ఇంత అవమానం చేశారు? ప్రత్యక్షంగా నా తప్పు అణువంత లేకుండా కేవలం నన్ను అవమానించాలన్న తపన మీకెందుకు కలిగిందో ఏమో - ఏది ఏమైనా చరిత్రలో నల్లని అక్షరాలతో మీ దుశ్చర్య శాశ్వతంగా నిలిచి వుంటుంది. కానీ సత్యానికీ, ధర్మానికీ ఆపద సంభవించినపుడు సమర్థులైన వాళ్ళు ఆ ఆపద ఎడబాపి సత్య ధర్మాల్ని సంరక్షించాల్సిందే - అసమర్థుల కిక్కడ ప్రస్తావనలేదు. చివరికి ఎట్లాగూ సర్వేశ్వరుడు అన్ని విషయాలూ సరిచూసుకుంటాడు. ఎవరు కర్తవ్యం నిర్వహించారు? ఎవరు అలసత్వం వహించి కర్తవ్య పాలన చెయ్యకుండా వదిలేశారు. అని -

అదట్లా వుంచండి. నేను అడిగిన ప్రశ్నకు ఎవ్వరూ సమాధానం చెప్పటల్లేదేమిటి?

ఇంతకీ నేను దాసినా? స్వతంత్రురాలినా? మహానుభావులారా! మహా పురుషులారా! విధి విధానజ్ఞులారా! దయచేసి చెప్పండి' అని అడిగింది యాజ్ఞసేని.

భీష్మాచార్యుడు గొంతు విప్పాడప్పుడు.

'అమ్మా! నీ ప్రశ్నకు యుధిష్ఠిరుడు సమాధానం చెప్పాలి కాని మేమెవ్వరం చెప్పలేం. నువ్వు చెప్పినట్లు ధర్మసూక్ష్మత తెలుసుకోవటం చాలాకష్టం. నీ అవమానానికి

ఫలం చాలా తొందరగా ఈ కురుకుల దుర్మార్గులు తప్పకుండా అనుభవిస్తారు' అని ఖచ్చితంగా చెప్పాడు.

పోగాలము దాపురించినవారు పెద్దల మాట ఎందుకు వినిపించుకుంటారు?

కర్ణుడు కల్పించుకున్నాడీ సారి.

'తరుణీ! అయిదుగురు భర్తలెందుకులే గానీ ఒక్క భర్త చాల్లే - అదీ జూదంలో ఓడనివాడిని చూసి పెళ్ళాడు. ఈ సారి ' అంటూ పరిహాసం చేశాడు.

దుర్యోధనుడయితే ఏం మాట్లాడకుండా ఒక విలాస పూర్వకమైన మందహాసం చేశాడు. మందహాసం అనేకంటే వంకర నవ్వు అంటే బావుంటుంది.

ద్రౌపదీదేవి కళ్ళు లేడి కళ్ళల్లా బెదురుతున్నాయి. ఆ ముదిత అవమానభారం చేత వణుకుతోంది. అప్పటికప్పుడు మందారిక ఆమె తల చిక్కు తీసి గబగబా దువ్వి ముడివేసి పూలు పెట్టింది సుమంగళీ చిహ్నంగా.

అటువంటి ఉత్తమ స్త్రీని పిల్లలు గల తల్లిని, అందరిచేతా ప్రశంసించబడిన ఆ తన్విని తన తొడమీద ఎక్కమని సంజ్ఞ చేశాడు కౌరవరాజు దుర్యోధనుడు.

అదిచూసి భీముడు యముడిలాగా రాజులందరూ వినేటట్లు నిర్దయుడై ఇట్లా పలికాడు. ఈ ద్రౌపదీ అవమాన పర్వం భావి భారత రణాభిసూచనమైంది ఈ విధంగా - కాలపురుషుడి మహా సంకల్పం ఇలా నెరవేరబోతున్నది. దుర్యోధనుడి తొడలు విరగ్గొడతాను -ఎవరు అడ్డమైనా తప్పదు. అందరూ వినండి. రాజ్య సంపద మదంతో కోమలి అయిన ద్రుపదాత్మజని చూసి తన తొడల మీదికి రమ్మని హీనంగా పిలిచిన ఈ దురాత్ముడైన దుర్యోధనుడికి నా గదాభిఘాతం చేత బుద్ధి చెప్తాను. ప్రచండమైన నా గదయొక్క దెబ్బలచేత ఇతడి తొడలు విరగకొడతాను. అదికూడా ఉగ్రమైన రణం చివర్లో -' అని అతి రౌద్రాకారంతో పళ్ళు పటపట కొరుకుతూన్న భీమసేనుణ్ణి భీష్మ విదుర ద్రోణాదులిప్పుడు కోపం వద్దు. లాభంలేదు. నిదానించు.' అని ప్రశాంత చిత్తుణ్ణి చేశారు. కనీసం ప్రయత్నించారు.

ధృతరాష్ట్రుడి పూజామందిరాన్నించీ నక్కలూ తోడేళ్ళూ అరిచినట్లు విన్పించింది. అగ్నులు అశుభసూచకంగా ఆరిపోయినాయి. భానుమతీ మొదలైన కౌరవ స్త్రీలు అప్పటికే రోదిస్తున్నవారు ఈ భీమప్రతిజ్ఞ విని ఘొల్లుమన్నారు. కౌరవుల శయ్యాగారాల్లో కాకులు, గుడ్లగూబలు వికృతంగా కూశాయి. ఒక మహాసాధ్వికి అవమానం జరిగితే జంతువులూ, పక్షులూ సహించలేకపోయి అశుభాన్ని, అరిష్టాన్ని సూచించాయి.

అప్పుడు లేచింది గాంధారి ఆసనం మీదనించీ. అంతవరకూ గోడుగోడున విలపించిన ద్రౌపదీ దేవి మొర ఇంత క్షోభం ఇదేమీ విననట్లే ఊరుకుంది. కానీ భీముడి భీష్మప్రతిజ్ఞకి భయపడింది. ధృతరాష్ట్రుడి దగ్గరికి వెళ్ళి ద్రౌపదీ పరాభవం, దుశ్శకునాలు కలగటం ఇవన్నీ చెప్పింది.

'అయ్యో! -అయ్యో! అలాగా ఎంత పని జరిగింది? పరమ పతివ్రతని, తపస్వినిని పాండవ ధర్మపత్నిని, అయోనిజని ప్రాకృత మానవకాంతగా భావించి ఇట్లా పిచ్చి చేష్టలు చెయ్యవచ్చా? చిన్నప్పట్నించీ దుష్టభావనతోనే పెరిగావురా దుర్యోధనా! నీ వల్ల పాండవులు ఎన్ని బాధలు పడ్డారు? ఇకనుంచైనా దురాగ్రహం తగ్గించుకో' అని కొడుకుని తిట్టి అందరికీ ఆమోదంగా ద్రౌపదిని రావించి ఇలా అన్నాడు ధృతరాష్ట్రుడు.

నా కోడళ్ళలో పూజనీయురాలివి, వివేకవతివి, శ్రమజీవివి నువ్వేనమ్మా పాంచాలీ! లోక పూజితుడైన ధర్మ తనయుడి దాస్యం నిర్మూలించండి - నా పెద్దబిడ్డ ప్రతివింధ్యుడిని దాసుడి కొడుకు అనకుండా వుంటారప్పుడు. ఇది నా ఇష్టం -' అన్నది ద్రౌపది సాలోచనగా -

'అలాగే ధర్మరాజుని దాస్య విముక్తుడిని చేశాను - ఇంకో వరం అడుగు తల్లీ! అన్నాడు ధృతరాష్ట్రుడు గాంధారి ద్రుపదరాజ తనూజని దగ్గరికి తీసుకుని తడుముకుంటూ ఆమె కన్నీళ్ళు తుడవటం మొదలుపెట్టింది.

ఈ మాత్రం తెలివితేటలూ, మంచితనమూ మొదట్లోనే గాంధారీ ధృతరాష్ట్రులు ప్రదర్శించి వుంటే కథ ఇంత దూరం వచ్చేదేకాదు- ఏదో తన కొడుకులు రాజ్యం గెలుచుకుంటున్నారు అని సంబరపడ్డాడు ధృతరాష్ట్రుడు - గాంధారీ ఆయనకు

వంతపాడి ఏం జరుగుతున్నా పట్టించుకోలేదు. గాంధారి పెద్ద కోడళ్ళిద్దరూ భానుమతీ విమలా మాటిమాటికీ సభాస్థానానికి పరుగోత్తుకు రాబోయినారు ద్రౌపదీ అవమానం నిరోధించాలని -కానీ ప్రతిసారీ ద్వారపాలకులు ఆపేశారు రాజాజ్ఞ అంటూ-

హుఁ మేమేం రాణులం - మాదేం బతుకు? సాటి స్త్రీకి అందునా తోటికోడలికి భయంకరావమానం జరుగుతుంటే కనీసం అడ్డుపడలేకపోయారు. గృహ నిర్బంధంలాగా అయింది. కేవలం ఆభరణాలు అలంకరించుకుని విలువైన వలువలు కటుటకుని సుగంధాలు పూసుకుని బొమ్మల్లాగా అంతఃపురాల్లో తిరగటానికి తప్ప రాణులు ఏం నోచుకోరా? పాండవులు మాత్రం భార్యల కెంత స్వేచ్ఛ ఇచ్చారు? ఇంటి వ్యవహారాలు నిర్వర్తించుకుంటే వనితలకెంత తృప్తి? భర్తకి ఉచితానుచితాలు చెప్ప గలిగితే ఎంత బావుంటుంది? పైగా ఎంత వ్యాయామం. కానీ ధర్మజ బావగారు అంత తెలివైన వాడంటారు- ఈ మాయా జూదం కనిపెట్టలేదా? ఒక్కోసారి దైవ ప్రేపరితమై పురుషుడి బుద్ధి పనిచెయ్యదేమో అనుకున్నారు కౌరవరాణులు. తమలో తాము వితర్కించుకున్నారు. వైశ్యరాణి ప్రతిమాదేవి కూడా వాళ్ళతో కలిసింది. ఇంక లాభంలేదు. త్వరపడాలి అక్కడేదో జరుగుతోంది. ఏం చేస్తారో మన భర్తలు. చూద్దాం ఏమైనా కానీ అనుకుని అందరు స్త్రీలూ సభకి బయలుదేరారు. కౌరవులు వందమందికీ ఒక్కొక్క భార్యే కాదు గదా - సుకేశినీ, నిరాలంబా, సిద్ధరూపీ, తేజోవతీ, కళావతీ, కామినీ, కుంతలా, ప్రవాదినీ, హస్త్రమా మొదలైన ప్రధమభార్యలు ముందు నడిచారు. భానుమతీ విమలతో కలిసి - మిగిలినవాళ్ళు కూడా కోపంతో కుతకుతలాడుతూ తోడు వచ్చారు - అమ్మగారూ! మా ద్రౌపదమ్మగారి ప్రియసఖినై వుండీ ఏం చెయ్యలేక నిస్సహాయంగా వుండిపోయినాను. నన్ను కూడా మీతో తీసుకెళ్ళండమ్మా' అని ప్రార్థించింది మందారిక. అలాగే అన్నారు వాళ్ళు. మిగిలిన కౌరవ పరిచారికా వర్గం అంతా ఆమెతో కదిలారు. ద్వారపాలకుల్ని తోసి పారేశారు. అందరు కౌరవ శుద్ధాంతకాంతలూ పరిచారకులూ కాళికల్లాగా అగ్నిశిఖల్లా గా మహా ప్రవాహంలాగా పరిగెత్తుకుంటూ మెట్లు దిగుతుంటే ఏ సైనికులు అడ్డగలరు? ఎవరాపగలరు? ఈ స్త్రీ చైతన్యం కలగటం అరుదు. కలిగితే ఆపటం కుదరదు.

తీరా అప్పటికి ధృతరాష్ట్రుడు రెండవ వరం అడుగుతున్నాడు' అరె అనవసరంగా భయపడి మల్లగుల్లాలు పడి ఇందాకట్నుంచీ రాకపోతిమే- అక్కని ఆదుకోకపోతిమే' అనుకుంటూ వచ్చి ద్రౌపది పక్కన నిలబడ్డారు.

'పర పురుషుల కంట పడడానికి మీకు లజ్జగా లేదూ సిగ్గూ శరాల్లేవూ? అంతఃపరజనాలు కాదూ - లోపలికి పొండి అని గద్దించాడు దుర్యోధనుడు.

ఎవరూ ఆయన మాట విన్లేదు కానీ భానుమతి అన్నది ద్రౌపది అక్కకూడా అంతఃపురకాంతే అని - కర్ణుడి భార్య విశాల భర్తవేపు అత్యంత నిరసనగా చూసింది.

సకల శుద్ధాంత జన పరివేష్టితురాలైన ద్రౌపది రెండవవరం ఇట్లా కోరింది.

'ధర్మజుడి తమ్ముళ్ళు నలుగురూ తమ తమ కవచాదుల తోడ, ఆయుధములతోడ దాస్యంనుంచీ విముక్తులై సకల హితంగా వర్ధిల్లాలి.'

తప్పకుండా పాండవులు దాస్య విముక్తులైనారు- ఇంకోవరం కోరుకోమన్నాడు ధృతరాష్ట్రుడు. గాజుల గలగలలు ఆభరణాల చప్పుళ్ళూ వంటి ఘుమ ఘుమలూ గుసగుసలూ విని ఆ రాజుకి తన కోడళ్ళందరూ 'ద్రౌపదికి బాసటగా నిలిచారని అర్థమైంది ఇక చేసేదేముంది?

'మహారాజా! వైశ్యసతికి ఒక్క వరమూ క్షత్రియ కాంతకి రెండు వరాలూ , శూద్ర స్త్రీకి మూడు వరాలూ, బ్రాహ్మణ స్త్రీకి నూరు వరాలూ కోరే అధికారం వుంది. ధర్మశాస్త్ర ప్రకారంగా - నా భర్తలు విముక్తులైనారు చాలు' అన్నది ద్రౌపది.

'అమ్మా! నువ్వు నిత్యం వృద్ధుల గురువుల సేవచేసి ఎల్ల ధర్మాల్నీ తెలుసుకున్నావు. నీ సంగతి తెలియక నా పెద్ద కొడుకు నిన్ను అవమానించాడు. తల్లీ! ద్రుపదపుత్రీ! యాజ్ఞసేనీ! ఈ అపచారం మన్నించు. క్షమించటం ఎంత గొప్పదో నీకు తెలుసు గదా! నువ్వు నా కొడుక్కి మయసభలో కొత్త బట్టలు కట్టుకోమని యిచ్చావు. ఈ నాడు నీ వస్త్రాలే లాగాడు నా కొడుకు - ఏం చెయ్యను - విధి విధానం ఎలా వుంటుందో? ' అని పాంచాలితో చెప్పి జాగ్రత్త పడ్డాడు ధృతరాష్ట్రుడు.

'ధర్మజా! నేను బుద్ధిలేక జూదాన్ని ఒప్పుకున్నాను - అల్ప బుద్ధి గల వాడిని, వృద్ధుణ్ణి నన్ను మన్నించు. నీ తల్లి అయిన గాంధారిని మన్నించు. దుర్యోధనాదులు చేసిన దార్ష్ట్యములను మనసులో పెట్టుకోవద్దేం నాయనా!' అని బతిమలాడాడు. ఏ ఎండకా గొడుగుపట్టాడు.

భర్తలకి ప్రీతితో రాజ్యం ఆర్జించి పెట్టింది ద్రౌపది. 'భార్యవల్ల రాజ్యం పొందడమేమిటి? కౌరవులందర్నీ చంపేస్తానని' భీముడు కోపంగా అన్నాడు. కాని ధర్మరాజు మాటలతో శాంతించాడు.

... ...

ద్వారకలో శ్రీకృష్ణుడు తన గుఱ్ఱాలని శైద్య, సుగ్రీవక, మేగపుష్ప, వలాహకములను కడుగుతున్నాడు ప్రేమగా - భద్రామిత్రవిందాకాళిందీ వచ్చారింతలోకి -

'ప్రభూ! దాణా మేము తీసుకురామా' అని అడిగారు -

'వద్దు - మీరా రాజకుమార్తెలు. అపురూపంగా పెరిగినవారు. మీ చేత ఇట్లా పనులు చేయించుకుంటానని మీ పుట్టిళ్ళల్లో తెలిస్తే ఇంకేమన్నా వుందా?'

'ఆహా - తెలిస్తే మిమ్మల్ని తిడతారా కొడతారా మా వాళ్ళు? భయం నటించడంలో ఊకు మీరే సాటి ప్రభూ!' అంది మిత్రవింద.

'నాటకాలాడ్డం, అబద్ధాలు చెప్పటం వీటిల్లో కూడానమ్మా చెల్లెలా!' అంటూ సత్యభామా జాంబవతీ వచ్చారు.

'నేనేం నాటకాలాడాను?'

అమాయకంగా చూశాడు గోపాలచక్రవర్తి.

'అబ్బో - మతి మరుపే నిజంగా - వెన్నపూస తినెయ్యడం , అందరిళ్ళల్లో పాలు తాగడం , స్నేహితులతో కలిసి పాలు పారబొయ్యటం, గోపకాంతలు మొత్తుకుంటే 'అబ్బే-నాకేం తెలీదే' అని ఇలాగే అమాయకంగా మొహంపెట్టడం -

'మట్టితిని యశోదమ్మ అత్తయ్యకి నోట్లో బ్రహ్మాండాలు చూపడం - మీ లీలలు ఎవరెరుగరు స్వామీ. జగన్నాటక సూత్రధారీ!' అన్నది జాంబవతి.

'అబ్బో అడవిపిల్లకే అందరికంటే నాగరికత, వాక్చమత్కారమూ ఎక్కువైనయ్యే' అన్నాడు మనోమోహనంగా నవ్వి కృష్ణుడు.

'అది సరే - కుచేలుడన్నయ్యగారికి ధనమిస్తున్నట్టు చెప్పారా? లేదే - ఊరికే పాపం ఆయన కొంగున మూట కట్టుకున్న అటుకుల్ని ఊడదీసి మరీ రెండు గుప్పిళ్ళు తినేశారే!' అంటూ వచ్చింది రుక్మిణీదేవి.

'ఔను- అంత బావున్నాయి కాబోలు ఆ అటుకులు - ఎలాగైనా గోపాలర ఇష్టాలు వేరుగా వుంటాయి సుమా' అంది సత్యభామ. 'ఏదీ ధూర్త గోపాలుర ఇష్టాలు, కదా! ' కృష్ణుడు ఓరగా చూశాడు.

'ఓహో ! పారిజాతం సంగతి గుర్తు చేస్తున్నారా?' సత్యభామ మొహం ఎర్రబడిపోయింది. జలజాతసనవాసవాది సుర పూజా భాజనంబై తనర్చు శ్రీ కృష్ణదేవుని శిరస్సుని తను ఎడమకాలితో తొలగద్రోస్తే అయ్యయ్యో నీ కాలుకి నెప్పెట్టిందేమో నా గరుకు ఒళ్ళు తగిలి ! అని పాదసంవాహనం చేయబోయిన యదు నందనుడు గుర్తుకొచ్చాడామెకి.

'అయితే ఏం అక్క నరకాసురుడిని జయించేటప్పుడు మీకు సహాయంగా వచ్చింది కదా ! ఎంచక్కా తన ధనుర్విద్యని ప్రదర్శించి మిమ్మల్ని 'ఔనూ - నన్ను మీ అక్క సత్యభామ కాపాడింది. ఒప్పుకున్నాను- అదుగో ఆ మెళ్ళో వేళ్ళాడే హారం దానికి సాక్ష్యం - పాపం రుక్మిణి ఎన్నోసార్లు ఆ హారం నా మెళ్ళో వున్నప్పుడు తనకిమ్మని ఎన్నిసార్లు అడిగిందో - అయినా ...'

'అయినా ఆ మీ హారం సత్యక్కకిచ్చానంటారు' లక్ష్మణ మేలమాడింది' నోచినవారి సొమ్ముల వినోమని వారికి వచ్చు నీ ధరన్' అని తేల్చేసింది.

నాగ్నజితి అందుకుని 'అదికాదు ప్రభూ! మీరు గనక కుచేలుడు అన్నగారి

దగ్గర్నుంచీ ఇంకో గుప్పెడు అటుకులు మళ్ళీ తినబోతే పెద్దక్క రుక్మిణికదా ఆపింది అన్నది.

'ఔను సుదంతా! స్వామివారు మూడో గుప్పెడు అటుకులు కూడా ఆరగిస్తే మనమంతా కూడా వెళ్ళి కుచేలుడన్నగారింట్లోనే వుండాల్సి వచ్చేది మరి. ప్రపంచంలోని ధనమంతా ఆ బ్రాహ్మడి ఇంట్లోనే వుండే దప్పుడు' అంది రుక్మిణీదేవి.

కాళింది అన్నది 'సత్యక్కా! శ్రీవారి మందిరంలో ఒకే ఒక్క చిత్రపటం వుంది - తెలుసుగా' అని -

సుదంత తెలిసే వుంటుందిలే కాళింది అక్కా! వేణిన్ బొళ్ళెముపెట్టి సంఘటితనీవీ బంధయై ఆయుధ శ్రేణిన్ దాల్చిచ పయ్యెద చక్కగా దోపుకుని - నారిసారిస్తున్న ధనుర్విద్యా నిపుణ అయిన సత్యాదేవి అక్కయ్యదే కదా!' అన్నది.

నాగ్నజిత నవ్వింది 'సత్యక్క నరకాసురుడితో యుద్ధం చేసిన విధానం స్వామి మనసులో ముద్రపడిందన్న మాటేగా - వీర నారులకు ఉదాహరణ సత్యక్క - అందుకే శ్రీవారు స్వయంగా ఆపటం చిత్రించి పెట్టుకున్నారు' అన్నది.

జాంబవతి కూడా నవ్వింది - నాకొక అనుమానం నాగ్నజితీ! భావి యుగంలో సత్యభామే నరకాసురుణ్ణి చంపిందని అనుకోరు గదా ! ' అంటూ-

'ఛ- ఎంత కలియుగమైనా అంత వెఱ్ఱివాళ్ళుంటారా? స్వామిని అలసట తీసుకోమని చెప్పి నేను కాస్పేను యుద్ధం కొనసాగించానంతే గదా ! 'ఔను జాంబవతీ! స్వామి రుక్మిణి అక్క గృహంలో స్వయంగా చిత్రించి పెట్టిన పటం ఏమిటో తెలుసా? కుచేల సంరక్షణం' అన్నది సత్యభామ- ' అంటే నీ చెలికత్తెలు చార చక్షువులు గనక నీకు తెలుస్తుంది. మాకెలా తెలుస్తుంది సత్యక్కా!' అన్నారు లీలగా అసూయగా కృష్ణుని ఇతరభార్యలు -

సంభాషణ వేరే వేపు మళ్ళిందింతలోకి రుక్మిణీ మార్చిందంటే బావుంటుంది- మొత్తానికి అంతా నవ్వుకున్నారు.

అష్టపట్ట మహిషులూ ఆనందంగా నవ్వుకున్నారు - అంతసేపూ కృష్ణుడు గుఱ్ఱాలసేవ చేస్తూనే వున్నాడు. దారుకుడాయన రథసారధి ఆయన గుఱ్ఱాలు మేఘ పుష్పవలాహకములనేవి.

శ్రీకృష్ణశ్శరణంమమ - శ్రీకృష్ణశ్శరణంమమ - అనే స్త్రీ దీనాలాపం వినిపించసాగింది శ్రీ కృష్ణుడికి - నిశ్చల సమాధిలోకి వెళ్ళిపోయినాడు ఆయన.

'ఏమైంది ప్రభూ? మా వల్ల అపచారమా? అని భయవిహ్వాలులై అడిగారు మిత్రవిందాదులు -

రుక్మిణీదేవి నోటిమీద వేలుంచుకుని వాళ్ళనెవర్నీ మాట్లాడవద్దని సైగ చేసింది. గుఱ్ఱాలు కూడా హేషలు మానేశాయి.

కొంచెంసేపట్లా వుండి తన పాంచజన్య శంఖం తీసి ఊదాడు ప్రభువు - అప్పుడాయన మొహం కోపంతో జేవురించి వుంది. ఎన్నడూ కృష్ణుణ్ణి అలా చూడలేదు ఆయన ప్రియభామలు. భయపడ్డారు.

రుక్మిణీదేవి కూడా ధ్యాన నిమగ్నురాలైంది ఒకింతసేపు. 'స్వామీ ఆలస్యం చెయ్యకండి. ద్రౌపదిని కాపాడండి ప్రభూ! ' సకలస్త్రీ జాతీ మీకు ఎప్పుడూ ఋణపడి వుంటుంది' అన్నది ఆవేశంతో.

నిర్ఘాంతపోయి చూస్తున్నారు మిగిలిన రాణులు. 'అక్షయ వస్త్ర ప్రాప్తిరస్తు' అని అభయం దయచేశాడు కృష్ణుడు.

కొంతసేపయ్యాక తేరుకున్నారు రుక్మిణీ కృష్ణుడూనూ - అంతవరకూ వింజామరలతో వాళ్ళిద్దరికీ వీస్తూన్న సప్త పట్ట మహిషులూ అమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు.

ఒకరు పరుగెత్తుకెళ్ళి మంచినీళ్ళు తెచ్చారు. ఒకరు రెండు పాత్రలతో పాలు తెచ్చారు. కొందరు వెళ్ళి దేవకీ వసుదేవుల్ని పిలుచుకొచ్చారు. కొందరు బలరాముణ్ణీ, రేవతినీ పిలుచుకొచ్చారు. పిల్లలంతా వాళ్ళతో పాటు పరుగెత్తుకొచ్చారు. బలరామ

రేవతుల కూతురు చిన్నారి శశిరేఖ వచ్చి చిన్నాన్న ఒళ్ళో కూచుంది.

అంతా కోలాహలంగా అయింది. ఆ గుజ్జాల శాల ప్రాంతం. కృష్ణుని నుదుటిని తన ఉత్తరీయంతో తుడిచాడు వసుదేవుడు. కాసిని పాలు తాగు నాయనా!' అంటూ దేవకి పాలపాత్ర చేతికిచ్చింది.

భగవంతుడైనా కృష్ణుడు లీలా మానుష విగ్రహంతో ఉన్నాడు గనుక ఆయన మానవదేహం కోపంతో ఊగిపోయింది.

'శాంతించు తండ్రీ! ' అంటూ దేవకీ వసుదేవులు కృష్ణుడి వీపు నిమిరారు.

చీమచిటుక్కుమనేటంత నిశ్శబ్దంగా వుందక్కడ. కృష్ణుడు తేరుకున్నాక రేవతి అడిగింది. 'మరిదీ! ద్రౌపదికేం అయిందయ్యా?' అని.

'నేను చెప్తాను రండి' అంటూ స్త్రీలని పక్కకి పిల్చి ద్రౌపదీ వస్త్రాపహరణ ప్రయత్నాన్ని కృష్ణుడు అడ్డుకున్నవైనం చెప్పింది. 'గండం గడిచింది' అన్నది రుక్మిణితో.

'అవ్వ- అవ్వ - ఆ కౌరవులకేం పొయ్యేకాలం వచ్చింది ఛీ - ఛీ - పాంచాల పుత్రికనింత పరాభవిస్తారా? అదే గాంధారినో భానుమతినో అయితే - - - 'దేవకితో సహా ఆడవాళ్ళంతా అల్లాడిపోయారు. నారాయణుడైన కృష్ణుడి చెవులకి ద్రౌపది దీనాలాపాలు ఇంకా వినపడుతూనే వున్నాయి. 'వరమున పుట్టాను. భరతవంశం మెట్టాను. అందులోనూ పాండురాజుగారి కోడలినైనాను. జనవంద్యులైన భర్తల్ని పొందాను. నీతి విక్రమస్థిరులగు పుత్రుల్ని కన్నాను- సరసి జనాభ! కృష్ణా! ఇంత ప్రశస్తికెక్కాను. జగన్నాథా! నువ్వు సొంత చెల్లెలైన సుభద్రకంటే నన్నెక్కువ స్నేహంతో, గౌరవంతో సంభావిస్తావు. అటువంటి నన్ను రాజసూయ యజ్ఞానంతర అవబృథ స్నానంతో పవిత్రమైన ఈ జుట్టుపట్టి ఒకడు నన్ను కౌరవ సభకి ఈడ్చుకువచ్చాడు. ఈ అయిదుగురు పతులు చూస్తూండగా కులసతిని ఇట్లా ఎవరన్నా చేస్తారా? నువ్వే కాపాడాలి అన్నా! వేరే దిక్కులేదు . సర్వస్య శరణాగతి చేస్తున్నాను.'

ద్రౌపది మనస్సు ఇలా తేటతెల్లమైపోతోందాయనకి. అచ్యుతః కల్పవృక్షశ్చ

ఆనందః కామధేనవః చింతామణిశ్చ గోవింద - నువ్వే దిక్కు అంటోంది.

ద్రౌపదికి అక్షయమైన చీరలిచ్చి గుజ్జాల శాల నుంచీ ఇవతలికి వచ్చాడు కృష్ణుడు.

'ప్రభూ! కౌరవులకీ బుద్ధి పుట్టిందేమిటి?' అన్నది రుక్మిణి బాధగా అందరూ ఉద్యానవనంలో ఉపవిష్టులై వుండగా - బలరాముడు సాలోచనగా 'కృష్ణా! ఇంక మటుకు ఎక్కువ పాండవులని గురించి పట్టించుకోవద్దు - పద్నాలుగేళ్ళ తర్వాత కౌరవపాండవ మహా సంగ్రామం జరుగుతుంది.

ద్రౌపది సంపాదించిన రాజ్యం రెండవసారి జూదంలో పోగొట్టుకుంటారు పాండవులు - ధర్మరాజు జూద వ్యసనం విడువడు. పదమూడు సంవత్సరాలు అరణ్యాల్లో వుండేటట్లూ, ఒకసంవత్సరం నగరంలో అజ్ఞాతవాసం చేసేట్లూ ఒడంబడిక - అందులో ఓడిపోయాడు ధర్మరాజు' అన్నాడు నిర్వేదంగా. అందరూ అయ్యో అయ్యో అన్నారు.

కృష్ణుడు చెప్పాడు. ' మా అత్త కుంతీదేవి వనవాస క్లేశం ఓర్వదు కనుక విదురుడామెను తన ఇంట్లో వుండమంటాడు. మనం రేపే బయల్దేరి వెళ్ళి సుభద్రనీ అభిమన్యుణ్ణీ ద్వారకకి తీసుకువద్దాం - మిగిలిన రాణులు ఎవరి పుట్టిళ్ళకి వారు వెళతారు. ద్రౌపదేయులైన ప్రతివింధ్యాదులైన అయిదుగురు పాండవ పుత్రుల్నీ ద్రుపదమహారాజూ కోకిలాదేవీ పాంచాలం తీసుకుని వెళతారు. ఒక్క ద్రౌపదీ పాండవులు అయిదుగురూ మటుకు వనవాసం వెళ్తారు.

అక్కడ కూడా మాటిమాటికీ పాండవుల్ని రెచ్చగొట్టి మనశ్శాంతి లేకుండా చేస్తుంటారు దుష్టచతుష్టయం. ఘోషయాత్రకి వెళ్ళి పాండవులని ఏడిపించి తమవైభవం చూపించి రావాలని దుర్యోధనాదులు ప్రయత్నిస్తారు. కానీ వాళ్ళే భంగపడి చిత్రరధుడనే గంధర్వుడి చేతిలో బంధింపబడి చివరికి పాండవుల శరణుకోరతారు. నలుగురు పాండవులూ ధర్మజుని ఆజ్ఞతో కౌరవుల్ని విడిపిస్తారు.

అప్పుడు బలరాముడు అందుకున్నాడు 'అప్పటినుంచీ నా శిష్యుడు దుర్యోధనుడు కఠోరగదా యుద్ధ పరిశ్రమ చేస్తాడు. పద్నాలుగేళ్ళు కష్టపడి గదా యుద్ధపు మెలకువలు

నేర్చుకోవటం వల్ల అడవిలో కాయకసరులు తిన్న భీముడి గదా యుద్ధ కౌశలం వెలవెల బోతుంది దుర్యోధనుడిముందు. ఆ మాట మర్చిపోవద్దు కృష్ణా!'

'మర్చిపోనన్నయ్యా. ఎక్కడికక్కడే, వేటికవే ఉపాయాలు ఉంటాయి అన్నయ్యా! అర్జునుడు ఇంద్రకీలాద్రిపై కఠినమైన తపస్సుచేసి ఇంద్రుడినీ తరువాత పరమేశ్వరుడినీ ప్రసన్నం చేసుకుంటాడు. స్వర్గంలో దేవేంద్రుడి సరసన అర్ధ సింహాసనం మీద కూచుని ఇష్టోపభోగాలు అనుభవిస్తాడు. ఊర్వశీశాపం అజ్ఞాతవాసంలో అర్జునుడికెంతో అక్కరకి వస్తుంది.' అన్నాడు కృష్ణుడు చిరునవ్వుతో.

'మా వదిన ద్రౌపది జాగ్రత్తండీ ఆర్యపుత్రా! అతి సుకుమారి. ఆ అడవిలో ఏం కష్టాలు పడుతుందో ' అన్నది రుక్మిణి.

మనం కూడా అప్పుడప్పుడు అరణ్యాలకి వెళ్ళి ద్రౌపది వదిననీ, పాండవుల్నీ చూసివద్దాం అంది సత్యభామ.

'తప్పకుండా వెళ్దాం' అన్నాడు జనార్ధనుడు.

'అబ్బాయి కృష్ణా! పాపం ద్రౌపది ఆగర్భ శ్రీమంతురాలు. ఆ అడవిలో వంట ఎలా చేస్తుంది? అంది దేవకి -

'అమ్మా! ద్రౌపదికి అక్షయవస్త్రాలే కాదు అక్షయపాత్ర కూడా యిస్తానమ్మా! సరేనా? ఎందరు వచ్చినా ఆ పాత్ర అన్నం సమకూర్చగలదు.

'కడిగాక కూడానా?' అన్నాడు వసుదేవుడు. 'ఊహూఁ కడిగాక మళ్ళీ అవసరం రానివ్వనుగా' అన్నాడు పరాత్పరుడు ఏదో ఆలోచిస్తూ-

'ఆ దుర్యోధనుడి సంగతి నాకు బాగా తెలుసును మరిదీ! పాండవులూ, అతిథులూ అంతా భోజనాలు చేశాక ద్రౌపది అక్షయపాత్ర కడిగేశాక ఏ దుర్వాసముని నో శిష్యులతో సహా భోజనాలకి పంపకుండా వుంటాడా?' అన్నది రేవతి భయంగా-

'ఆ అక్షయపాత్రలో ఏ చిన్న మెతుకైనా మిగిలితే చాలు' అన్నాడు కృష్ణుడు.

'ఇంకేం దొరవారు ఆ మెతుకుని భోంచేసి వస్తారు కాబోలు - ఇక్కడ స్వామి పొట్ట నిండగానే దుర్వాసాదుల పొట్ట నిండి అన్నం తినకుండా భుక్తాయాసం వస్తుందేమో పాపం' అంది మిత్రవింద నవ్వుతూ -

'ఎక్కడన్నా ఏ రాక్షసుడన్నా తారసపడితే' కాళింది భయంగా అడిగింది.

'భీమసేనుడు చూసుకోడుటమ్మా రాక్షసుడి సంగతి - ఆ భయం లేదులే అన్నాడు బలదేవుడు.

'పాంచాలి వదిన నడవలేక డస్సిపోయి ఎక్కడన్నా పడిపోకపోతే చాలు' అంది నాగ్నజితి -

పడిపోతే ధర్మరాజు ఆమె తలని ఒళ్ళో పెట్టుకుంటాడు. భీముడు మొహంపై నీళ్ళు చల్లి సేదదీరుస్తాడు. ఆహార పదార్థాలిస్తాడు. కవలు అంటే నకుల సహదేవులు ఆ దేవికాళ్ళు వత్తుతారు - ఇంకా ఏ సుగంధ పూరిత పుష్పమో కనబడితే ద్రౌపదికోసం ఓ బుట్టెడు పూలు తీసుకొచ్చి యిస్తాడు భీమసేనుడు రాక్షసులని చంపి మరీ' అన్నది రేవతి నవ్వుతూ - అంతా ముసి ముసిగా నవ్వారు.

'అంటే సత్యభామ అక్కకి శ్రీవారు పారిజాతం తెచ్చినట్లా?' భద్ర ప్రశ్నించింది ఓర దృక్కులతో కృష్ణుడిని చూస్తూ. సత్య కాస్త సిగ్గుపడింది.

రుక్మిణి మాత్రం ఆదుర్దాగా అడిగింది. 'స్వామీ! ఇందరు కురువృద్ధులున్న ఈ మహాసభలోనే ద్రౌపది వదినకెంత అవమానం జరిగింది? అక్కడ అడవిలో భర్తలు వేటకి వెళ్ళినప్పుడు ఒక్కతే పర్ణశాలలో వుంటే...'

'ఎవడో ఏ జయద్రథుడిలాంటి వాడో వచ్చి ద్రౌపది మహాసౌందర్యానికి అచ్చెరువు పడి రథంలో కూచోపెట్టుకుని తీసుకుపోతారంటావా? అయ్యో నేను దుస్సలకి వదినని నువ్వామెకి భర్తవి. అంటే సైంధవా? నువ్వు నాకు అన్నయ్యావి. అని ద్రౌపది ఏడుస్తుంటే ఆ (రక్త సంబంధంలేదు గదా నువ్వు నాకు చెల్లెలివేమిటి?' అని ధిక్కరిస్తాడంటావా రుక్మిణీ! కావచ్చు అప్పుడు నేను పాండవ కుల పురోహితుడైన ధౌమ్యుడిలో నా అంశ

నిలుపుతాను. కాకపోతే సామాన్య బ్రాహ్మణబలం ఎంతో అంతే బలం ఇస్తాను - ధౌమ్యుడు రథాన్ని పట్టుకుని వేలాడుతూనే వుంటాడు. కానీ వదలడు- పాండవులందర్నీ అరుస్తూ పిలుస్తూ వాళ్ళచేతే ద్రౌపదిని కాపాడునట్టు చేస్తాడు పురోహితుడు ధౌమ్యుడు.'

సరే ఇవన్నీ అడవిలో నరులకి తెలియకుండా ఎన్నో మాయల్ని పన్ని ద్రౌపదిని రక్షించటం - మరి ఒక సంవత్సరం అజ్ఞాతవాసంలో ఆ దేవి కేమన్నా అవమానం జరిగితే ఏం చేద్దామనుకుంటున్నారు?' అని అడిగింది జాంబవతి.

ఎక్కడుంటారో పాండవులు ఆ రాజుకి ఏ కీటకంలాంటి బావమరిదో వుండవచ్చు' అన్నాడు కృష్ణుడు.

'ప్రభూ! కీటకమంటే విషకీటకమేనా? ' అని అడిగింది భద్ర.

'ఔను దేవీ! పాంచాల రాజపుత్రిక పరమాహ్లాద సౌందర్యానికి ముగ్ధుడై వాడు ఆమె వెంటపడి అనేక విధాల వేధించే అవకాశం వుంది. ఈ అవమానానికి అంటే కౌరవసభలో జరిగిన అవమానానికి దాదాపు సరిపోల్చవచ్చు.

భీముడి యందు ఆవేశించి ద్రౌపదికోసం సంకేతస్థలంలో ఎదురుచూస్తున్న ఆ దుర్మార్గుడిని బయటకు చప్పుడు కాకుండా ముద్దచేసి చంపేస్తాను. వలలుడిగా వున్న భీముడిలో మళ్ళీ శక్తి ప్రవేశించాలంటే నేను పూనుకోవాలి గదా! ఆ సంహరించిన వాడి నూట ఎనిమిది మంది తమ్ముళ్ళూ నీ వల్లనే మా అన్నయ్య మరణించాడు నిన్నూ అతడితో పాటు స్మశానం దాకా తీసుకెళ్ళి కాల్చేస్తాం ' అని పాడెకట్టి ద్రౌపదినీ తీసుకెళ్తారు.

అందరితో ఆమె తనకి అయిదుగురు గంధర్వులు పతులని చెప్తుంది ఆశ్రయమిచ్చిన రాణితో.

పేరు పేరునా ఆ గంధర్వుల్ని పిలిచి ఆక్రోశించిన ద్రౌపదికి తోడునీడగా నిలుస్తాను. ఎక్కడెక్కడో ఏదో పనులు చేసుకుంటున్న అయిదుగురు పాండవుల్నీ ద్రౌపది పిలుపు ఉత్తేజితుల్ని చేసేటట్లు చేస్తాను అన్నాడు స్వామి.

మళ్ళీ భీముడే ఆ నూట ఎనిమిది మంది దుర్మార్గులనీ కూడా సంహరించి

వేస్తాడు. పాడెమీద నించీ ద్రౌపదీదేవిని దింపి కట్లు విప్పి అంతఃపురానికి పంపిస్తాడు. తర్వాత జరిగే ఘోరాహవంలో విపరీతమైన జననష్టం వాటిల్లుతుంది. ద్రౌపదీ దేవికీ పాండవులకీ ఏ విధమైన ఇబ్బందీ వుండదు -'వాళ్ళు సుఖంగానే వుంటారు. కల్యాణమస్తు అంది రుక్మిణి.'

కృష్ణపరమాత్మ భవిష్యత్తులో పాండవులకి తను అందించబోయే సహాయాలను గురించి ఆప్తులకి వివరంగా చెప్పాడు. ఉత్తరాఅభిమన్యుల కల్యాణం ఆయన మనసులో మెదిలింది. చివర ఏం జరుగుతుందో మటుకు చెప్పలేదు. మహాభీకర సంగ్రామం తరువాత పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం నశించాక దాదాపు పాండవులు తప్ప వేరెవరూ బతకని ఆ సందర్భంలో ఏం మిగులుతుంది?

సర్వ ప్రపంచానికీ సర్వ సమయాల్లోనూ సర్వయుగాలలోనూ అవసరమైన శాంతరసం ఒక్కటే మిగులుతుంది. నిర్వాణసంధాయకమై అంతే-

ఇక్కడ ద్వారకలోనూ అక్కడ ఇంద్రప్రస్థంలోనూ పుణ్యాకాంతలు, ధర్మాత్ములు కేలుమొగిడ్చి, తలలు వంచి ఇట్లా స్తుతించారు జనార్దనుడిని.

ఆర్తజనుల మమ్ము నరసి రక్షించు, మ
హాత్మ! భక్తజన భయాపహరణ !
నిన్ను మది నుతించి నీకు మ్రొక్కెదము నీ
చరణయుగము మాకు శరణమనఘ!

